'ఫ్రై'డే



అట్టుడికిన రాష్ట్రం

47.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు 2

మరో మూడు రోజులు గాడ్పుల తీవ్రత

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 4-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 18 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 8.39 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 10.07 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: ఉ. 5.58-7.26; దుర్ముహూర్తం: ఉ. 5.51-7.32; అమృతఘడియలు: మ. 2.46-4.14; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.32 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సొమ్మసిల్లిన అవ్వ ప్రాణం..



కర్నూలు జిల్లా వెల్దుర్తిలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధురాలు షేక్ మలాన్ బీ

పింఛన్‌కు వెళితే ప్రాణాలు పోయాయ్

జగన్ శవరాజకీయానికి అవ్వాతాతలు బలి

రాలిపోయిన మరో మూడు పండుటాకులు

రెండోరోజూ బ్యాంకుల వద్ద పడిగాపులు.. ఎండ, వడదెబ్బకు ప్రాణాలు విలవిల

పోలవరం/వెల్దుర్తి/పొన్నూరుటౌన్, మే 3: పింఛన్ తీసుకోవడం అవ్వాతాతలకు ప్రాణాంతకంగా మారింది. సీఎం జగన్ శవ రాజకీయాలతో వరుసగా రెండో రోజు కూడా పింఛన్ల పంపిణీ తీరు వృద్ధులకు నరకం చూపించింది. పింఛను తీసుకోవడానికి మండే ఎండలో బ్యాంకుల చుట్టూ తిరుగుతూ, వడదెబ్బకు గురై ముగ్గురు వృద్ధులు చనిపోయారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం పోలవరం పంచాయతీ బాపూజీ కాలనీకి చెందిన కట్టూరి కడమ్మ(65) బ్యాంకు ఖాతాకు జమ అయిన

మిగతా 11వ పేజీలో...

నేల చట్టంలో



నింగీ.. గాలి!

ల్యాండ్ టైటిల్ చట్టంలో చిత్రాలు

టెర్రస్, ఎయిర్ రైట్స్ క్లాజులు ఎందుకో?

ఆ హక్కులు ఎవరికి ఇస్తారో!

ల్యాండ్ అథారిటీ చేసేది వ్యాపారమే!

పన్నులు, ఫీజులు, రాయల్టీ వసూళ్లు

విరాళాలూ, గిఫ్టులూ తీసుకుంటుందట!

ఆ అధికారులకు కోర్టుల నుంచి రక్షణ

తప్పులు చేసినా వారినేమీ చేయలేరు

చట్టాన్ని పక్కన పెట్టిన రాజస్థాన్, మహారాష్ట్ర

ఏపీలో మాత్రం అత్యుత్సాహంతో అమలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒక రైతు పొలంలో చిన్న ఇల్లు కట్టుకున్నాడు! ఇంటి డాబా మీద ఉన్న స్థలం, ఇంటి పైన ఉండే గాలి ఎవరివి? వాటిపై హక్కు రైతుదా? ప్రభుత్వానిదా? ఇదేం పిచ్చి సందేహమంటారా? ఘనత వహించిన జగన్ సర్కారు తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంలో ఇలాంటి చిత్రాలు ఎన్నో ఉన్నాయి.

లేనిపోని వివాదాలకు తావిచ్చి.. రైతులకు భూమిపై హక్కులు దూరం చేసేలా రూపొందించిన ఈ చట్టంలో టెర్రస్ రైట్స్ (7డీ), ఎయిర్ రైట్స్ (7ఈ) అనే క్లాజులనూ చేర్చారు. స్థలం, స్థలంలోని నిర్మాణం ఒకరిదైనప్పుడు.. టెర్రస్ రైట్స్, ఎయిర్ రైట్స్ వేరొకరివి ఎలా అవుతాయో!? అసలు ఈ రైట్స్ ఎవరు ఎలా పొందాలన్నది చట్టంలో స్పష్టంగా పొందుపరచలేదు. భూమి హక్కుల చట్టానికి..

మిగతా 2వ పేజీలో...

నయ వంచనకు ప్రతిరూపం!

అమరావతిపై నాలుక వెయ్యి మడతలు

మాట తప్పే మనిషి ఎలా ఉంటారు?

మడమ తిప్పే నేతకు ఉదాహరణ ఎవరు?

గెలుపు కోసం అన్ని రకాల మాయలకు పాల్పడేదెవరు?

సూటిగా... నయవంచనా శిల్పం అంటే ఎలా ఉంటుంది?

ఈ ప్రశ్నలన్నింటికీ ఒకటే సమాధానం... వైఎస్ జగన్మోహన్ రెడ్డి!



12



13

అమరావతిపై వెయ్యి నాల్కలతో విషం చిమ్మి.. చివరికి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన నాయకుడు వైఎస్ జగన్! పైసా ఖర్చు లేకుండా చంద్రబాబు భూమిని సమీకరించి, రూ.10 వేల కోట్లకుపైగా ఖర్చు పెట్టి, కొన్ని భవనాలను 80-90 శాతం పూర్తి చేసి ఒక రూపునకు తెచ్చిన అమరావతిని జగన్ ధ్వంసం చేశారు.

కీలక నియోజక వర్గాలు, బిగ్ ఫైట్లు నేటి 'జన కేతనం'లో





శుక్రవారం రాత్రి నెల్లూరులో జరిగిన సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న చంద్రబాబు, పక్కన జనసేనాని పవన్, మాజీ మంత్రి నారాయణ

ఆ చట్టం రైతుకు ఉరితాడే

మేమొచ్చాక రద్దు.. రెండో సంతకం దానిపైనే: చంద్రబాబు

ఈ జగన్ ఫొటోల పిచ్చోడు.. జనం ముఖాలపైనా తన బొమ్మ వేయాలంటాడేమో

ఇళ్లకెళ్లి పింఛన్ ఎందుకివ్వరు?.. బ్యాంకుల చుట్టూ తిప్పుతూ ఇబ్బంది పెడుతున్నారు

వృద్ధుల మరణాలు ప్రభుత్వ హత్యలే.. సైకో, డ్రామాల సీఎంను సాగనంపాలి 14

మా గెలుపు అన్‌స్టాపబుల్.. వార్ వన్‌సైడే.. బందిపోటు అంతానికి జనం సిద్ధం: బాబు

జగన్ మళ్లీ వస్తే..

మన భూములన్నీ దోపిడీ

ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు అందుకే

ఆస్తి పత్రాలుగా జిరాక్స్ కాపీలా?

పైగా కోర్టులకు వెళ్లడానికీ లేదట

ఇలాంటి చట్టాలపై అసెంబ్లీలో చర్చించాలా వద్దా?.. పవన్ ధ్వజం



శ్రీసత్యసాయి జిల్లా పెద్దచీగుల్లరేవు వద్ద రీచ్‌లో యంత్రాలతో తవ్వకాలు

సుప్రీం చెప్పినా తవ్వేస్తున్నారు

వంశధార నుంచి పెన్నా వరకూ నదులన్నీ గుల్ల

అడ్డదారిలో తరలుతున్న వేల టన్నుల ఇసుక 11

నదిలోనే భారీ యంత్రాలతో, లారీల్లోకి లోడింగ్

కోర్టు ఆదేశాలు పట్టని అధికార యంత్రాంగం

మీకు ఓటు వేయం!

పులివెందులలో సీఎం సతీమణి భారతికి తేల్చి చెప్పిన మహిళలు



పులివెందుల మండలం ఎర్రబల్లెకొత్తపల్లెలో తమకు ఇంటి పట్టా ఇచ్చి తిరిగి తీసేసుకున్నారని భారతికి చెబుతున్న సావిత్రమ్మ

ఇంటి పట్టా ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి లాగేసుకున్నారు

నీటి సమస్యనూ పట్టించుకోరు 3

సమస్యలు ఏకరవు పెట్టిన మహిళలు

జగన్ ఇలా ఇలా.. జనం అలా అలా!

బాబుపై ఆరోపణలకు వంత పాడని జనం.. చేతులూపాలంటూ పదేపదే వేడుకున్న జగన్

కొత్త హామీలు, చేయబోయే పనుల ఊసే లేదు.. అవ్వని ప్రాజెక్టుల ప్రస్తావనే లేని ప్రసంగాలు 3

అయ్యో.. వివేకా!

రక్తసంబంధీకులకే పట్టని 'న్యాయం'.. నిందితులకే పలువురి వత్తాసు 2

అవినాశ్‌కు ఎంపీ టికెట్ ఇచ్చిన జగన్.. 'మంచి పిల్లోడు' అంటూ కితాబు

సోదరుల వారసులూ అటే.. ఒంటరిగా సునీత పోరాటం.. షర్మిల అండ

కొంగుచాపి న్యాయం కోసం వేడుకోలు.. అండగా నిలవని కుటుంబం




అబ్ కీ బార్?

దివ్యాంగులకు ప్రాతినిధ్యమేదీ?

న్యూఢిల్లీ, మే 3 :దేశంలో 2.68 కోట్ల మంది దివ్యాంగులున్నారు. కానీ వారికి లోక్‌సభలో ప్రాతినిధ్యమే లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో వారు 2.28% మంది ఉన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో దివ్యాంగులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోవడం వ్యవస్థ వైఫల్యమేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది వారి హక్కులు, భాగస్వామ్యాన్ని నిరాకరించడమేనని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికలపై ఏ విధమైన ప్రభావమూ చూపలేని వర్గంగానే దివ్యాంగులను రాజకీయ పార్టీలు పరిగణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అసమానతను సమాజం కల్పించిన వైకల్యంగా భావించాలని ప్రొఫెసర్ అనితా ఘై పేర్కొన్నారు.

గవర్నర్ లైంగికంగా వేధించారు!

- బెంగాల్ గవర్నర్‌పై రాజ్‌భవన్ ఉద్యోగిని ఫిర్యాదు
- నాపై మరో భయంకర కుట్ర: గవర్నర్ ఆనందబోస్



కోల్‌కతా, మే 3: తనపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్ తీవ్రంగా స్పందించారు. "మీ తదుపరి గ్రెనేడ్, దాచిపెట్టిన బుల్లెట్ల గురించి ఎదురుచూస్తున్నా. దయచేసి కాల్చండి" అని ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. గవర్నర్ బోస్ తనను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగిని గురువారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్యోగం విషయంలో ప్రయోజనాలు చేకూర్చుతానన్న నెపంతో గవర్నర్ తనను వేధించారని అందులో ఆరోపించారు. ఈ ఘటనపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. "సందేశ్‌ఖాలీలో మహిళా హక్కుల గురించి మాట్లాడిన వ్యక్తే ఇప్పుడు ఇలాంటి అవమానకరమైన చర్యకు పాల్పడ్డారు. గవర్నర్ పదవికి అప్రతిష్ఠ తెచ్చారు" అంటూ విమర్శలు గుప్పించింది. ప్రధాని మోదీ కోల్‌కతాలోని రాజ్‌భవన్ సందర్శనకు కొద్ది గంటల ముందు ఆమె గవర్నర్‌పై ఆరోపణలు చేయడం గమనార్హం. అయితే.. వీటిని తీవ్రంగా ఖండిస్తూ రాజ్‌భవన్ వెంటనే వరుస ట్వీట్లు చేసింది. ఈ అంశంపై శుక్రవారం గవర్నర్ బోస్ ఒక ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. "ప్రియమైన రాజ్‌భవన్ ఉద్యోగులారా.. రాజకీయ శక్తుల ప్రేరణతో నాపై చేస్తున్న నిరాధార ఆరోపణలను స్వాగతిస్తున్నా. ఇలాంటివి ఇంకా ఉంటాయన్న విషయం నాకర్థమైంది. కానీ, ఒక్కటి మాత్రం చెప్పదల్చుకున్నా. ఇలాంటి తెలివితక్కువ డ్రామాలు ఎన్ని చేసినా.. అవినీతిని, హింసను అరికట్టే విషయంలో నన్నెవరూ అడ్డుకోలేరు" అని బోస్ పేర్కొన్నారు. "నా దగ్గర ఓ ముఖ్యమైన సమాచారం ఉంది. రాజ్‌భవన్‌లో స్నేహితులు మరో భయంకరమైన కుట్రకు తెరలేపారు. దానికి ఎవరు బాధ్యులనేది కూడా నాకు తెలుసు" అని చెప్పారు. మరోవైపు బెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమ భట్టాచార్యకు కోల్‌కతా, డార్జిలింగ్, బారక్‌పోర్‌లలోని రాజ్‌భవన్ ప్రాంగణాల్లోకి ప్రవేశాన్ని నిషేధిస్తూ రాజ్‌భవన్ ఆదేశాలు జారీచేసింది. మహిళా ఉద్యోగిని గవర్నర్‌పై లైంగిక వేధింపులపై ఆరోపణలు చేయడాన్ని మంత్రి విలేకరులతో ప్రస్తావించారు. దీంతో 'పరువునష్టం కలిగేలా, రాజ్యాంగ వ్యతిరేక మీడియా ప్రకటనలు చేశారు' అని పేర్కొంటూ ఆమెకు రాజ్‌భవన్‌లోకి అనుమతి నిరాకరిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో రాజకీయ నేతల ఆదేశాలతో అనధికారికంగా విచారణలు జరుపుతున్నందున పోలీసులకు కూడా రాజ్‌భవన్‌లోకి ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్లు గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజ్వల్‌పై ఫిర్యాదు చేసిన బాధితురాలి కిడ్నాప్!

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వివాదంలో కీలకమైన పనిమనిషి, పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ కిడ్నాప్ కు గురయ్యారు. ఆమె కుమారుడు మైసూరు జిల్లా కేఆర్ నగర పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రజ్వల్‌తోపాటు ఆయన తండ్రి, ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపై గురువారం రాత్రి కిడ్నాప్ కేసు నమోదు చేశారు. తన తల్లి ఏప్రిల్ 29వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని బాధితురాలి కుమారుడు(20) పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2015 నుంచి ఆరేళ్లపాటు హొళెనరసీపురలోని రేవణ్ణ ఇంట్లో తన తల్లి పనిచేశారని, మూడేళ్ల కిందట పని మానేసి వచ్చారని, ఇక్కడే కూలి పనులు చేసుకుంటున్నారని వివరించారు. ఏప్రిల్ 29వ తేదీ రాత్రి 9 గంటలకు రేవణ్ణ అనుచరుడు సతీశ్‌బాబణ్ణ తమ ఇంటికి వచ్చి 'మీ తల్లిపై కేసు నమోదైంది. రేవణ్ణ పిలుస్తున్నారు' అని చెప్పి ఆమెను తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి తన తల్లి కనిపించడం లేదని వాపోయారు. మరోవైపు, ప్రజ్వల్ తల్లి భవాని రేవణ్ణకు సిట్ నోటీసులిచ్చింది. ఈ కేసులో రేవణ్ణ బెయిల్ పిటిషన్‌పై విచారణ శనివారానికి వాయిదా పడింది. కాగా, తాజాగా నమోదు చేసిన కిడ్నాప్ కేసు ఇంకా సిట్ దాకా చేరలేదు. ప్రజ్వల్‌పై శుక్రవారం మరో కేసు నమోదైంది. తనను గన్‌తో బెదిరించి, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని 44 ఏళ్ల మహిళ సీఐడీ సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రజ్వల్‌పై మరో కేసు నమోదు చేశారు.

పేరు ఒకేలా ఉన్నంత మాత్రాన పోటీ చేయొద్దనలేం

న్యూఢిల్లీ, మే 3: రాజకీయ నాయకుడి పేరు కలిగి ఉన్నంత మాత్రాన ఎన్నికల్లో పోటీ చేయకూడదంటూ ఏ వ్యక్తినీ నిలువరించలేమని శుక్రవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పేరును ఆధారం చేసుకొని ఎన్నికల్లో పోటీ చేసే హక్కును దూరం చేయలేమని పేర్కొంది. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థి పేరును పోలిన అభ్యర్థులు కేవలం నామమాత్రంగా పోటీలో ఉంటున్నారని ఇలాంటి వారిని నిలువరించాలని కోరుతూ సాబు స్టీఫెన్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఇది ఓటర్లలో గందరగోళం సృష్టించడానికి ప్రత్యర్థులు అవలంబించే పాత ట్రిక్ అని ఆరోపించారు. ఇలాంటి ఎత్తుగడల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, నామ మాత్ర అభ్యర్థులను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. "ఎవరైనా తల్లిదండ్రులు పిల్లలకు రాజకీయ నాయకుని పేరు పెడితే ఆ పిల్లలకు ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉండదా?" అని ప్రశ్నించింది.

ఓడ బందీలను విడుదల చేసిన ఇరాన్

న్యూఢిల్లీ, మే 3: రివల్యూషనరీ గార్డ్స్ గత నెల 13న స్వాధీనం చేసుకున్న కార్గో షిప్‌లోని మొత్తం 25 మంది సిబ్బందిని విడుదల చేసినట్టు శుక్రవారం ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సిబ్బందిలో మొత్తం 17 మంది భారతీయులు ఉన్నారు. పోర్చుగీస్ జెండాతో వెళ్తున్న ఎంఎస్‌సీ ఏరిస్ కార్గోషిప్‌ను హర్ముజ్ జలసంధి వద్ద రివల్యూషనరీ గార్డులు అదుపులోకి తీసుకున్నారు. ఇది ఇజ్రాయెల్ నౌక అని, సముద్రయాన చట్టాలను ఉల్లంఘించిందని పేర్కొంటూ స్వాధీనం చేసుకున్నారు.

భారత్‌లో 7 కోట్ల వాట్సాప్ ఖాతాలపై నిషేధం

- గతేడాది జనవరి-నవంబరు మధ్య మూసేసిన వాట్సాప్

న్యూఢిల్లీ, మే 3: గతేడాది జనవరి-నవంబరు మధ్యకాలంలో భారత్‌లో దాదాపు 7 కోట్ల ఖాతాలను నిషేధించినట్టు ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన నెలవారీ నివేదికలో వెల్లడించింది. భారత్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిబంధనలు-2021లోని రూల్ 4(1)(డి)కు కట్టుబడి ఉంటామని మెటా యాజమాన్యంలోని వాట్సాప్ చెబుతోంది. ఈ క్రమంలో అవకతవక ఖాతాలపై తీవ్రంగా దర్యాప్తు చేస్తోంది. ఐటీ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా నెలవారీ నివేదికలు వెల్లడిస్తోంది. వాట్సాప్ గ్రీవెన్స్ మెకానిజం ద్వారా భారత్‌లోని వినియోగదారుల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల ఆధారంగా.. భారత చట్టాలు, వాట్సాప్ నిబంధనలను ఉల్లంఘించిన ఖాతాలపై నిషేధం విధించినట్టు పేర్కొంది.

రాయ్‌బరేలీ నుంచి రాహుల్

అమేఠీ బరిలో స్థానిక సీనియర్ నేత, గాంధీ కుటుంబ విధేయుడు కిషోరీలాల్ శర్మ

- చివరి రోజున నామినేషన్ దాఖలు
- అమేఠీలో ఎన్నికలకు ముందే ఓటమిని కాంగ్రెస్ అంగీకరించింది
- కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ విమర్శ



రాయ్‌బరేలీ జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): యూపీలోని రాయ్‌బరేలీ, అమేఠీ సీట్లపై కొంతకాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు కాంగ్రెస్ పార్టీ తెరదించింది. రాయ్‌బరేలీ నుంచి ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని బరిలో దింపింది. అమేఠీ నుంచి అనూహ్యంగా గాంధీ కుటుంబానికి చెందిన వారిని కాకుండా, ఆ కుటుంబానికి విధేయుడిగా ఉన్న స్థానిక సీనియర్ నేత కిషోరీలాల్ శర్మను అభ్యర్థిగా ప్రకటించింది. నామినేషన్లకు శుక్రవారం చివరిరోజు కావటంతో రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీ జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయన తల్లి సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు ఖర్గే, ప్రియాంకా గాంధీ, ఆమె భర్త రాబర్ట్ వాద్రా కూడా రాహుల్ వెంట ఉన్నారు. అంతకుముందు వేలాది మంది కార్యకర్తలు రాయ్‌బరేలీలో రాహుల్‌కు స్వాగతం పలికారు. అమేఠీలో కిషోరీలాల్ శర్మ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రియాంకగాంధీ మాట్లాడుతూ.. శర్మను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను ప్రచారం చేస్తానన్నారు. అమేఠీ, రాయ్‌బరేలీ స్థానాలకు మే 20న పోలింగ్ జరగనుంది.

ప్రియాంకను ఒప్పించేందుకు విఫల యత్నం

గత ఐదు ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి సోనియా గాంధీ విజయం సాధించారు. ఈసారి సోనియా రాజ్యసభకు వెళ్లటంతో ప్రియాంకా గాంధీని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేయించాలన్న డిమాండ్ కాంగ్రెస్ శ్రేణుల నుంచి వచ్చింది. కానీ, పోటీకి ప్రియాంక అంగీకరించలేదని సమాచారం. ప్రియాంకను ఒప్పించటానికి రాహుల్‌గాంధీ కూడా ప్రయత్నించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్‌తోపాటు రాయ్‌బరేలీలో కూడా గెలిస్తే వయనాడ్ స్థానాన్ని వదులుకోలేనని.. కాబట్టి, రాయ్‌బరేలీ నుంచి పోటీ చేయాలని రాహుల్ చెప్పినప్పటికీ ప్రియాంక అంగీకరించలేదని పేర్కొన్నాయి. యూపీ నుంచి గాంధీ కుటుంబ సభ్యుల్లో ఎవరూ పోటీ చేయకపోతే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని, అమేఠీ కంటే రాయ్‌బరేలీ సురక్షితమైనదని పార్టీ నేతలు భావించడంతో రాహుల్ అక్కడి నుంచి పోటీకి అంగీకరించినట్లు తెలిపాయి. రాహుల్ నామినేషన్ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ.. పార్టీ నాయకత్వం విస్తృతంగా చర్చించిన మీదటే ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. మోదీ అబద్ధాలను దీటుగా ఎదుర్కోవటానికి వీలుగా ప్రియాంక దేశవ్యాప్తంగా ప్రచారంలో నిమగ్నమయ్యారని, అందుకే ఆమెను రాయ్‌బరేలీలో బరిలో దింపి ఆ నియోజకవర్గానికే పరిమితం చేయలేదన్నారు. తర్వాత ఏదైనా ఉప ఎన్నికలో ప్రియాంక పోటీ చేసి పార్లమెంటుకు వెళ్తారని జైరాం తెలిపారు. కాంగ్రెస్ నిర్ణయంపై అమేఠీ ఎంపీ, కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ స్పందిస్తూ.. ఎన్నికలు జరగకముందే కాంగ్రెస్ పార్టీ అక్కడ ఓటమిని అంగీకరించినట్లని వ్యాఖ్యానించారు.



కిషోరీలాల్ శర్మ

రాహుల్ ఆస్తులు రూ.20 కోట్లు

రాయ్‌బరేలీ నామినేషన్ పత్రాల్లో రాహుల్ తనకు రూ.20 కోట్ల ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారు. వీటిలో రూ.9.5 కోట్లు చరాస్తులు కాగా, రూ.11 కోట్లు స్థిరాస్తులు. గత ఆర్థిక సంవత్సరంలో తన ఆదాయం రూ.1.02 కోట్లు అని తెలిపారు.

50 ఏళ్ల అనుబంధం

రాయ్‌బరేలీకి తొలుత ఇందిరాగాంధీ భర్త ఫిరోజ్‌గాంధీ ప్రాతినిధ్యం వహించారు. ఆయన తదనంతరం 1967, 1971లలో ఇందిర పోటీ చేసి గెలిచారు. ఎమర్జెన్సీ తర్వాత 1977లో జరిగిన ఎన్నికల్లో రాజ్‌నారాయణ్ చేతిలో ఇందిర ఓడిపోయారు. మళ్లీ 1980లో జరిగిన ఎన్నికల్లో ఇందిర విజయం సాధించారు. 1996, 1998లో బీజేపీ నేత అశోక్ సింగ్ ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 1999 ఎన్నికల్లో గాంధీ కుటుంబ విధేయుడు కెప్టెన్ సతీష్ శర్మ గెలిచారు. సోనియా గాంధీ రాజకీయ రంగప్రవేశం తర్వాత 2004, 2006, 2009, 2014, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి నుంచి వరుసగా విజయం సాధిస్తూ వచ్చారు. రాయబరేలీని కాంగ్రెస్ కంచుకోటగా పరిగణిస్తారు.

అమేఠీలో 1998 తర్వాత తొలిసారిగా 'ఇతరులకు'

యూపీలోని అమేఠీని గాంధీ కుటుంబానికి పెట్టని కోటగా భావిస్తారు. 1980లో ఇందిర తనయుడు సంజయ్ గాంధీ, 1981, 1984, 1989, 1991 ఎన్నికల్లో మరో తనయుడు రాజీవ్ గాంధీ ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. రాజీవ్ మరణానంతరం 1991, 1996లలో జరిగిన ఎన్నికల్లో రాజీవ్ సన్నిహిత మిత్రుడు సతీష్‌శర్మ గెలుపొందారు. 1998 ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. 1999లో సోనియా గాంధీ ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2004 నుంచి ఆమె రాయ్‌బరేలీకి మారగా, 2004, 2009, 2014 ఎన్నికల్లో రాహుల్ పోటీ చేసి విజయం సాధించారు. 2019లో రాహుల్‌పై బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ 55 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు.

రాహుల్ పారిపో..



కోల్‌కతా, మే 3 : కేరళలోని వయనాడ్ సీటు ఓడిపోతుండటంవల్లనే, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ యూపీలోని రాయ్‌బరేలీకి తరలిపోయారని ప్రధాని మోదీ అన్నారు. 'పారిపో రాహుల్ పారిపో..భయపడొద్దు' అంటూ ఎద్దేవాచేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లు కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా కష్టమేనని ఆయన వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్‌లోని బర్ధమాన్-దుర్గాపూర్, కృష్ణనగర్ లోక్‌సభ నియోజకవర్గాల్లో శుక్రవారం బీజేపీ అభ్యర్థుల తరఫున మోదీ ప్రచార సభల్లో పాల్గొన్నారు. అమేఠీలో 2019లో ఓటమి తర్వాత 'యువరాజు' వయనాడ్‌కు మారారు. ఈ ఎన్నికల్లో అక్కడ ఓడిపోతారని ఆయనకు తెలుసు. అలాగని అమేఠీలో పోటీచేసి గెలిచే ధైర్యం లేదు. అందువల్ల ఆయన రాయ్‌బరేలీకి తరలిపోయారు. కాంగ్రెస్ నాయకుల్లోని ఓటమి భయానికిదే నిదర్శనం" అని మోదీ విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలపై ఆయన విరుచుకుపడ్డారు. సీఎం మమతబెనర్జీ ఏలుబడిలో హిందువులు బెంగాల్‌లో రెండో తరగతి పౌరులుగా జీవించాల్సి వస్తోందని మోదీ ఆరోపించారు. అవినీతి పాలన, రాజకీయ బుజ్జగింపులతో ప్రజాస్వామ్యాన్ని తృణమూల్ సమాధి చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నుంచి రిజర్వేషన్లను లాగేసుకుని 'జిహాద్ ఓటు బ్యాంకు'కు కట్టబెడుతుందని మరోసారి ధ్వజమెత్తారు. ఇండియా కూటమి 'ఓటు జిహాద్'కు మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. కాగా, రాయ్‌బరేలీలో రాహుల్ అక్కడి బీజేపీ అభ్యర్థి చేతిలో భారీ తేడాతో ఓడిపోవడం ఖాయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు.

కేజ్రీవాల్‌కు 'బెయిల్' పరిశీలిస్తాం

న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్ అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీం కోర్టు తెలిపింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ సుప్రీం కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు విచారించింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ దాఖలు చేసిన కేసు విచారణకు సమయం పట్టే అవకాశం ఉందని, కానీ ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తాము వ్యతిరేకిస్తామని ఈడీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ధర్మాసనానికి స్పష్టం చేశారు. దీంతో.. ఇరువురి వాదనలు విన్న తర్వాత బెయిల్ ఇవ్వాలా? లేదా? అనేది ధర్మాసనం నిర్ణయిస్తుందని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఈ నెల 7న ఇరు వాదనలు వింటామని చెప్పారు.

నేల చట్టంలో నింగీ, గాలి!

(మొదటి పేజీ తరువాయి)

టెర్రస్ రైట్స్, ఎయిర్ రైట్స్‌తో సంబంధం ఏంటి? ఆకాశం, గాలితో వ్యాపారం చేయాలని సర్కారు భావించి చట్టంలో చేర్చిందా? అని రెవెన్యూ నిపుణులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. సాగు భూములపై రైతులకు, ఇంటి స్థలాలు, ఆస్తులపై యజమానులకు హక్కులు కల్పించాలి కానీ... టెర్రస్, ఎయిర్ రైట్స్‌తో సర్కారుకు ఏం పని? అన్నదే పెద్ద ప్రశ్న!

భూ సేవ కాదు... వ్యాపారం

రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములు, ఆస్తులను అమ్మాలని జగన్ 2021లో 'మిషన్ బిల్డ్' అనే స్కీమ్‌ను తీసుకొచ్చి ఆ సంస్థను ఏర్పాటు చేశారు. అమ్ముకునేందుకు ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పర్యాటక, పోలీసు, పంచాయతీరాజ్ తదితర శాఖల భూములు, ఆస్తులను సిద్ధం చేశారు. కోట్ల విలువైన భూములు, ఆస్తులు అమ్మాలని విఫల ప్రయత్నాలు చేశారు. బహిరంగ వేలంలో ఆ భూములను తన మనుషులకే అమ్మించి, ఆర్థిక వనరులు సమకూర్చుకున్నామని నమ్మించాలనుకున్నారు. ఇందుకు విజయవాడ, విశాఖ, రాజమండ్రి, కాకినాడ, గుంటూరులోని అత్యంత ఖరీదైన స్థలాలు, ప్రభుత్వ ఆస్తులను గుర్తించి కేంద్ర సంస్థ ఎన్‌బీసీసీ ద్వారా అమ్మించాలని ప్రయత్నించగా.. దీనికి హైకోర్టు బ్రేక్‌లు వేసింది. దీంతో విలువైన ప్రభుత్వ భూములు మిగిలిపోయాయి. ఇది విఫలమైన నాటి జగన్ మిషన్. ఈసారి టైటిల్ చట్టం రూపంలో మరో సరికొత్త మిషన్ తీసుకురాబోతున్నారు. టైటిల్ చట్టం పేరిట సర్వం తన నియంత్రణలోకి తీసుకునేలా సిద్ధం చేశారు. భూమితో ముడిపడిన ఏదైనా అథారిటీ కిందకు రావాల్సిందే. భూమిపై ఉన్న గాలితో సహా! స్థానిక సంస్థలు సైతం దీని పరిధిలోకి రానున్నాయి. సకల హక్కులతో ల్యాండ్ అథారిటీ చేసేది భూ సేవ కాదు, పక్కా వ్యాపారమే. చట్టంలోని అనేక క్లాజులు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. భూమి హక్కులు ఇచ్చేందుకు ప్రభుత్వం టైటిల్ చట్టం ప్రకారం ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేయనుంది. అథారిటీ తాను అందించే సేవలకు ఫీజులు వసూలు చేయనుంది. ఇక భూములు, ఆస్తుల రికార్డులన్నీ అథారిటీ కిందే ఉంటాయి. ఎవరైనా ఏదైనా డాక్యుమెంట్ కావాలన్నా ఫీజు కట్టి పొందాల్సిందే. లైసెన్స్‌లు, పత్రాల జారీ, ఫీజుల వసూళ్లు ఈ సంస్థ చేపట్టనుంది. ఈ సంస్థ ఇంకా ఆర్థిక సహాయాలు స్వీకరించనుంది. ప్రజల నుంచి చందాలు, కానుకలు, ఎండోమెంట్స్ వంటివి కూడా తీసుకుంటుందట! భూములపై హక్కులు కల్పించేందుకు పని చేసే సంస్థ ప్రజల నుంచి విరాళాలు, గిఫ్టులు తీసుకోవడమేమిటి? తీసుకుని ఏం చేస్తుంది? అలాగే... భూమి సేవలకు సంబంధించి మీ-సేవ చేసే పనులు కూడా ఇకపై ల్యాండ్ అథారిటీనే చేయవచ్చు. భూమి సంబంధిత రెవెన్యూ ఆన్‌లైన్ సేవలను అథారిటీ పరిధిలోకి తీసుకొచ్చేలా చట్టం ఉంది. అథారిటీనే భూమి సంబంధిత పన్నులు, ఫీజులు, సొమ్ము వసూలు చేసేలా చట్టంలో క్లాజులు పొందుపరిచారు. ఇక స్థానిక సంస్థల పరిధిలో ఉండే రెవెన్యూ సేవలు కూడా అథారిటీ పరిధిలోకే తీసుకువస్తారు. ఈ సంస్థే ఫీజులు వసూలు చేసి, తన అవసరాలకు పోను మిగిలినవి ఆయా సంస్థలకు సర్దుబాటు చేస్తుంది.

ఆ రాష్ట్రాలు వెనక్కి..

టైటిల్ చట్టం తీసుకురావాలని రాజస్థాన్ తొలుత ప్రయత్నించింది. అర్బన్ ఏరియాలోని భూములు, ఆస్తులకు టైటిల్ ఇవ్వాలని 2016లో ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. కానీ అమలు చేయలేదు. దానంతట అదే ల్యాప్స్ అయిపోయింది. మంచి కన్నా చెడు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉందని భావించి చట్టం చేయలేదు. ఆ తర్వాత 2018లో మహారాష్ట్ర ముసాయిదా టైటిల్ బిల్లును తయారు చేసింది. దాన్నే నీతి ఆయోగ్ పరిశీలన చేసి ఇతర రాష్ట్రాలకు నమూనా కింద పంపించింది. అయితే.. మహారాష్ట్ర ప్రభుత్వం చట్టమే చేయలేదు. ఈ చట్టం ద్వారా రైతులు ఇబ్బంది పడతారని బిల్లును పక్కన పడేసింది. కానీ జగన్ మాత్రం 2019 జూలైలో బిల్లును తయారు చేశారు.

రిటైర్డ్ ఐఏఎస్‌లకు పునరావాసం

టైటిల్ చట్టంతో రిటైర్డ్ ఐఏఎస్‌లకు పునరావాసం దక్కనుంది. ల్యాండ్ టైటిల్ అప్పిలేట్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్‌లను నియమించవచ్చని చట్టంలో పేర్కొన్నారు. సర్వీసులో ఉన్నవారిని కూడా నియమించవచ్చునని చెప్పారు. కానీ... వీరు తక్కువగా ఉన్నందున ఎక్కువగా రిటైర్డ్ వారినే ఎంచుకునే అవకాశం ఉంది. అప్పిలేట్ అధికారిగా సర్వీసులో ఉన్నవారిని నియమిస్తే సేవల్లో ఏవైనా తప్పు జరిగితే చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కానీ రిటైర్డ్ అధికారిని నియమిస్తే వారిపై ఏం చర్యలు తీసుకోగలరు? పైగా అధికారంలో ఉన్న నేతలు అస్మదీయులనే ఆ పోస్టులో నియమించే అవకాశం ఉంది. టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి, టైటిల్ అప్పిలేట్ అధికారులు విధి నిర్వహణలో తీసుకునే నిర్ణయాలు లోపభూయిష్టంగా ఉన్నా, ఒకరికి కొమ్ముకాసేలా ఉన్నా కోర్టులు జోక్యం చేసుకోరాదని టైటిల్ చట్టం చెబుతోంది. వారి నిర్ణయాలను సివిల్ కోర్టులు సమీక్షించడానికి వీల్లేకుండా చట్టంలో ఉంది. దీంతో ఆ అధికారులు తీసుకునే నిర్ణయాలను కోర్టులు ప్రశ్నించే పరిస్థితి ఉండదు.

'ఫ్రై'డే అట్టుడికిన రాష్ట్రం

- 47.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- కోస్తాలో వడగాడ్పుల ప్రభావం

అమరావతి, విశాఖపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపానికి రాష్ట్రం అట్టుడికింది. ఎండ తీవ్రత, వడగాలి, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. రాత్రి పూట కూడా సెగ తగ్గలేదు. ఈ వేసవిలోనే ఇప్పటి వరకు అత్యధికంగా శుక్రవారం నంద్యాల జిల్లా గోస్పాడు, బండిఆత్మకూరులలో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 15 జిల్లాల్లో 44 డిగ్రీల కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా అర్ధవీడులో 47.3, కడప జిల్లా చిన్నచెప్పలిలో 47.2, నెల్లూరు జిల్లా వేపినాపి అక్కమాంబపురంలో 47.1, తిరుపతి జిల్లా పెద్దకన్నాలిలో 46.9, కర్నూలు జిల్లా పంచలింగాలలో 46.8, చిత్తూరు జిల్లా తవణంపల్లె, పల్నాడు జిల్లా రావిపాడులో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 6 డిగ్రీలు, రాత్రి కనీస ఉష్ణోగ్రతలు కూడా 3 నుంచి 5 డిగ్రీలు ఎక్కువగా నమోదవున్నాయి. శనివారం వివిధ ప్రాంతాల్లో 37నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల సంస్థ హెచ్చరించింది.

రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బకు ఐదుగురి మృతి

మంత్రాలయం, రుద్రవరం, దాచేపల్లి, ఓబుళదేవరచెరువు, మే 3: రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఐదుగురు మృతి చెందారు. కర్నూలు జిల్లాలో వడదెబ్బకు అన్నదమ్ములు మృతి చెందారు. మంత్రాలయం మండలంలోని మాదవరానికి చెందిన బోయ పెద్ద సుంకన్న(60), బోయ ఆంజనేయ(52), నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని యల్లావత్తుల గ్రామానికి చెందిన పెద్దకుళ్లాయి(25) వడదెబ్బతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. శ్రీసత్యసాయి జిల్లా కొండకమర్ల పంచాయతీ బత్తినపల్లికి చెందిన ఉబిచెర్ల క్రిష్టప్ప(53) వడదెబ్బతో గురువారం రాత్రి మృతిచెందారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో సైకిల్ మెకానిక్ సర్వేపల్లి నాగేశ్వరరావు(72) వడదెబ్బతో మృతి చెందారు.



అయ్యో.. 'వివేకా'!

- రక్తసంబంధీకులకే పట్టని 'న్యాయం'
- పైగా నిందితులకే చాలా మంది వత్తాసు

(కడప-ఆంధ్రజ్యోతి)

రాయలసీమలో ఒకప్పటిలా ఫ్యాక్షన్ గొడవలు, ప్రతీకార చర్యలు ఇప్పుడు లేవు. కానీ ఓ కుటుంబంలో ఎవరికైనా హాని జరిగితే న్యాయం కోసం అంతా కలసికట్టుగా పోరాడుతారు. కేసులు, కోర్టుల వ్యవహారంలో సాయంగా ఉంటారు. అయితే మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరుడు, ప్రస్తుత సీఎం జగన్ బాబాయ్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విషయంలో వైఎస్ ఫ్యామిలీ నిలువునా చీలిపోయింది. వివేకా రక్తం పంచుకుని పుట్టిన సోదరులు, సోదరితో పాటు వారి వారసులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పైగా చాలామంది వివేకా హత్య కేసులో నిందితులకు మద్దతుగా ఉంటున్నారు. న్యాయం కోసం కేవలం వివేకా కుమార్తె సునీత పోరాడుతుండగా, వైఎస్ కుమార్తె షర్మిల ఆమెకు అండగా ఉంటున్నారు. రాజకీయంగా ఎంతో పేరున్న వైఎస్ కుటుంబం నేడు రోడ్డున పడింది. పులివెందుల అంటే వెంటనే వైఎస్ కుటుంబం గుర్తుకొస్తుంది. ఆ కుటుంబానికి అంతటి పేరు రావడానికి రాజశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డిలే కారణం. వైఎస్ రాజారెడ్డికి జార్జిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, సుధీకర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, విమలమ్మ సంతానం. రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించగా, వివేకా హత్యకు గురయ్యారు. వీరిద్దరూ బతికున్న రోజుల్లో ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అలాగే తమ సోదరి విమలమ్మను ఆప్యాయంగా చూసేవారు. వైఎస్ కుటుంబ వ్యవహారాలను వివేకా చక్కబెట్టేవారు. వారి ద్వారా ఇతర కుటుంబ సభ్యులు ఆర్థికంగా లబ్ధిపొందారని చెబుతుంటారు. అలాంటిది.. వివేకా తమ కంచుకోట అయిన పులివెందులలో, సొంత ఇంట్లో దారుణహత్యకు గురైతే.. కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడం స్థానికులకు, వైఎస్ అభిమానులకు విస్మయం కలిగిస్తోంది. ఈ కేసులో న్యాయం చేయాలంటూ సునీత, షర్మిల మాత్రమే పోరాడుతున్నారు. వీరికి మిగతా కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి మద్దతు లేదు. సీఎం జగన్ తన బాబాయ్ హత్య కేసులో నిందితులకే వత్తాసు పలుకుతున్నారు. వివేకా సోదరుడు జార్జిరెడ్డి కొడుకులు అనిల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, మరో సోదరుడు రవీంద్రనాథరెడ్డి ఇద్దరు కొడుకులు.. జగన్ అండ్ కోతో ఉన్నారు. ఇక విమలమ్మ ఈ కేసు విషయంలో తన మేనకోడళ్లు షర్మిల, సునీతనే విమర్శిస్తున్నారు.

నిందితులకే జగన్ అండ

బాబాయ్ వివేకా హత్యకు గురైతే నిందితులకు శిక్షపడేలా చేయాల్సిన సీఎం జగన్ వారికే అండగా ఉంటున్నారు. గత ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి కోసం 'నారాసుర రక్తచరిత్ర' అంటూ సొంత రోత పత్రికలో రాయించిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక వివేకా కేసులో సీబీఐ నిందితులుగా చేర్చిన కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని వెనకేసుకొస్తున్నారు. పైగా ఈ కేసులో న్యాయం కోసం పోరాడుతున్న చెల్లెళ్లపై అభాండాలు వేస్తున్నారు. "అవినాశ్‌రెడ్డి చిన్నపిల్లోడు. అమాయకుడు.. ఆయన పొలిటికల్ జీవితం నాశనం చేసేందుకు కుట్రపన్నుతున్నారు" అని పులివెందులలో జగన్ చెప్పుకొచ్చారు. అవినాశ్‌రెడ్డికే మళ్లీ కడప ఎంపీ టికెట్ ఇవ్వడం, జిల్లాలోని ప్రతి సభలోనూ 'నా తమ్ముడు, పసిపిల్లోడు మంచిపిల్లోడు' అంటూ అవినాశ్‌ను వెనకేసుకు రావడం వైసీపీ కేడర్‌కే నచ్చడంలేదు. అంతేగాక వివేకా వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేలా రెండో పెళ్లి ప్రస్తావన తెస్తున్నారు.

ఆడబిడ్డల పోరాటం

వివేకా కేసులో న్యాయం కోసం ఆడబిడ్డలు సునీత, షర్మిల రోడ్డెక్కి ఊరూరా తిరుగుతున్నారు. వీరిని చూసి పార్టీలకతీతంగా అయ్యో రాజన్న, వివేకమన్న బిడ్డలకు ఎంత కష్టమొచ్చిందంటూ బాధపడుతున్నారు. 'వివేకా కేసులో నిందితులకు శిక్ష పడడం కోసం కొంగుచాపి అడుగుతున్నాం.. న్యాయం చేయండి' అంటూ వారు అడుగుతున్న తీరు సామాన్యులను కలిచివేస్తోంది.

నిందితులు.. భారతికి దగ్గర

వివేకా హత్య కేసులో సీబీఐ అభియోగాలు మోపిన వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి... వీరిద్దరూ జగన్ సతీమణి భారతికి దగ్గరి బంధువులు. భాస్కర్‌రెడ్డి స్వయానా భారతికి మేనమామ. వివేకాకు దాయాది అవుతారు. వివేకా, జగన్‌కు సొంత బాబాయ్. సీఎం జగన్ తన సతీమణి భారతి చెప్పినట్టు వింటారనే ఆరోపణలున్నాయి.

లోకం తీరు





తిరుమలలో భారీ వర్షం

తిరుమల, మే 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షానికి పలు ప్రదేశాల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండ కాసినప్పటికీ 12 గంటల తర్వాత వాతావరణం మారిపోయింది. నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి. ఆ తర్వాత సుమారు గంటన్నర పాటు వర్షం కురిసింది. వర్షంతో సాయంత్రానికి తిరుమలలో చలి తీవ్రత పెరిగింది. ఈదురుగాలులకు కౌస్తుభం, డీటైప్ క్వార్టర్స్, రింగ్ రోడ్డు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి.

మీకు ఓటు వేయం!

- ఇంటి పట్టా ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి లాగేసుకున్నారు
- నీటి సమస్యనూ పట్టించుకోరు
- పులివెందులలో సీఎం సతీమణి భారతికి తేల్చి చెప్పిన మహిళలు
- మీడియా రాకుండా అడ్డంకులు

కడప, మే 3(ఆంధ్రజ్యోతి): సీఎం వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల. ఇక్కడ ఎలాంటి సమస్యలు ఉండవని అందరూ అనుకుంటారు. తాగేందుకు నీరు, తిరిగేందుకు రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, పేదలందరికీ ఇళ్లు, జనం బటన్ నొక్కుడు పించన్లు ఇలా అన్నీ అందరికీ అందుతాయని భావిస్తారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం దీనికి భిన్నంగా ఉంది. సీఎం జగన్ విజయం కోసం ఆయన సతీమణి వైఎస్ భారతి పులివెందుల నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆమెకు మహిళల నుంచి ఊహించని నిరసన ఎదురవుతోంది. శుక్రవారం పులివెందుల మండలంలోని ఎర్రబల్లెకొత్తపల్లెలో భారతి చేపట్టిన ప్రచారంలో అడుగడుగునా సమస్యలు స్వాగతం పలికాయి. పది ఇళ్ల ప్రచారం చేస్తే ఆరు ఇళ్లలోని మహిళలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఒకరిద్దరైతే.. ఏకంగా 'మీకు ఓటేయం' అని భారతికే తేల్చి చెప్పేశారు. "నాకు ఇంటి పట్టా ఇచ్చారు. ఇల్లు ఉందని మరలా పట్టా తీసేసుకున్నారు. మేం ఉండే ఇల్లు ఇదే. మాకెందుకు ఇంటి పట్టా ఇవ్వరు" అని సావిత్రి అనే మహిళ భారతిని ప్రశ్నించారు. దీంతో పక్కనే ఉన్న కొందరు నేతలు.. ఈసారి ఇల్లు ఇప్పిస్తామని సావిత్రమ్మకు సర్దిచెప్పే యత్నం చేశారు. అయితే, ఆమె మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. "మీకు ఎన్నిసార్లు చెప్పినా న్యాయం జరగలేదు. కనీసం ఆమెకన్నా చెప్పుకొంటే న్యాయం జరుగుతుందని చెబుతున్నా" అని అన్నారు. అనంతరం, భారతి మరో ఇంటికి వెళ్లారు.. అక్కడ ఓ మహిళ మాట్లాడుతూ.. "మా ఇంట్లో ఐదు ఓట్లు ఉన్నాయి. మాకు పథకాలు రాలేదు. మీకు ఓటు వేయం" అని భారతికి తేల్చి చెప్పారు. మరికొందరు తాగునీటి సమస్య ఉందని, పించను రాయలేదని, ఇళ్లు లేవని సమస్యలను వివరించారు. దీంతో భారతి అవాక్కయ్యారు. "పులివెందుల నియోజకవర్గానికి వేల కోట్లు కేటాయిస్తున్నాం. ఇళ్లు ఇస్తున్నాం. ఇంకా ఏంది సమస్యలు" అని పార్టీ నేతల వద్ద భారతి వాపోయినట్టు సమాచారం. కాగా.. భారతి ప్రచార కార్యక్రమానికి మీడియా రాకుండా పోలీసులతో పాటు స్థానిక నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా "మీ ఆంధ్రజ్యోతిలో ఎందుకబ్బా, సమస్యలన్నీ రాస్తారు, లేనిపోని సమస్యలు వస్తాయి" అంటూ వైసీపీ నేతలు అన్నారు.

మన సీఎం చంద్రబాబునాయుడు!

- జగన్ సభలో మాజీ ఎమ్మెల్యే కదిరి తడబాటు
- ఇంకా.. బాబుపై అభిమానం పోలేదన్న జనం



మాజీ ఎమ్మెల్యే కదిరికి.. 'సీఎం పేరు జగన్' అని చెప్తున్న దద్దాల

కనిగిరి, మే 3: 'మన సీఎం చంద్రబాబునాయుడు' అంటూ మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు చేసిన వ్యాఖ్య అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన సీఎం జగన్ పాల్గొన్నారు. ఈ సభలో కదిరి ప్రసంగిస్తూ.. ఓ సామాన్య వ్యక్తి అయిన దద్దాల నారాయణయాదవ్‌ను 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు' కనిగిరి అసెంబ్లీ అభ్యర్థిగా ఎంపిక చేశారు' అని అన్నారు. దీంతో పక్కనే ఉన్న అభ్యర్థి దద్దాల కలగజేసుకుని.. 'మన ముఖ్యమంత్రి జగన్' అని చెవిలో ఊదటంతో నాలుక కరుచుకున్న కదిరి.. అప్పుడు జగన్ పేరును ప్రస్తావించారు. 'చంద్రబాబుపై, సైకిల్‌పై అభిమానం పోలేదు. అయినా ఆయనకు ఈ పొరపాట్లు.. గ్రహపాట్లు కొత్తేమీ కాదు. పాపం కదిరి'.. అంటూ జనం మాట్లాడుకోవడం కొసమెరుపు!

మేడ ఎక్కితే కేసు

- చేతిలో కర్ర కనిపించినా నేరమే.. దుకాణదారుల ఆధార్‌లు పరిశీలన
- నేడు జగన్ పర్యటన సందర్భంగా హిందూపురంలో పోలీసుల 'అతి'



రైల్వే స్టేషన్ రోడ్డు దిగ్బంధం

హిందూపురం, మే 3: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో సీఎం జగన్ పర్యటన సందర్భంగా పోలీసులు భారీగా ఆంక్షలు విధించారు. గులకరాయి దాడి నేపథ్యంలో ఆయన పర్యటించే ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇళ్ల యజమానుల ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్లు ఇంట్లో ఉన్నవారి వివరాలు, దుకాణాలలో పనిచేసే వారి వివరాలను సేకరించారు. పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో హెలిప్యాడ్ నుంచి రిలయన్స్ పెట్రోల్‌బంక్, గురునాథ్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ వరకు జగన్ వాహనంలో వెళ్లనున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మేడలపైకి ఎవరైనా ఆ సమయంలో ఎక్కితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారని దుకాణదారులు తెలిపారు. చేతుల్లో కర్రలు, ఇతర వస్తువులు పట్టుకోకూడదని, ఎవరైనా అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారని తెలిసింది. ఈ నిబంధనలు శనివారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమలులో ఉంటాయట. అయితే సీఎం జగన్ శనివారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు మాత్రమే హిందూపురంలో పర్యటిస్తారు. దీనికోసం శుక్రవారం సాయంత్రం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. పోలీసులు ఎన్టీఆర్, గాంధీసర్కిల్, అంబేడ్కర్, గురునాథ్ సర్కిళ్లలో బారికేడ్లు అడ్డు పెట్టి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. ఒక రోజు ముందుగానే హడావుడి చేసి తమను ఇబ్బంది పెట్టడం ఏమిటని వాహనదారులు మండిపడ్డారు.

జగన్ ఇలాఇలా... జనం అలాఅలా!



నరసాపురంలో సీఎం ప్రసంగిస్తుండగా వెళ్లిపోతున్న జనం

- బాబుపై ఆరోపణలకు వంత పాడని జనం
- చేతులూపాలంటూ పదేపదే వేడుకున్న జగన్
- నరసాపురం, కనిగిరిలో సీఎం ప్రచార సభలు

నరసాపురం/నరసాపురం టౌన్, కనిగిరి, మే 3: వైసీపీ మేనిఫెస్టో ఊసులేదు. అధికారంలోకి తిరిగి వస్తే కొత్తగా ఏం ఇస్తారనే హామీలూ లేవు. గతంలో తాను చేసిన వేల కోట్ల శంకుస్థాపన పనుల ప్రస్తావన లేదు. పరనిందలతోనే సీఎం జగన్ ప్రసంగమంతా సాగిపోయింది.. చంద్రబాబు తన హయాంలో ఏమీ చేయలేదని... ఇలా ఇలా చేతులు ఊపి చెప్పండి అని జగన్ చెప్పినా, జనం పట్టించుకోలేదు.. రివర్స్‌లో అలా అలా.. అక్కడి నుంచి చిన్నగా సర్దుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన సభల్లో జగన్ పాల్గొన్నారు. వలంటీర్లను నిలిపివేయించి పెన్షన్‌దారులను కష్టాలపాల్జేశారంటూ చంద్రబాబుపై విసుర్లు విసిరారు. మేనిఫెస్టోలు ప్రకటించడమే కానీ వాటిని బాబు అసలు అమలుచేయరన్న జగన్.. తాను చేస్తానన్న మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, ఇస్తానన్న మెగా డీఎస్సీలపై మాత్రం నోరు విప్పలేదు. కనిగిరిలో అరగంటలోపే ప్రసంగం ముగిస్తే, నరసాపురంలో 15 నిమిషాలు మాట్లాడి తిరిగి బస్సులోకి వెళ్లి కూర్చున్నారు. నరసాపురానికి షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.30 గంటలకు రావాల్సి ఉండగా, 11.50 గంటలకు టేలర్ హైస్కూల్ హెలిప్యాడ్‌కు వచ్చారు. ముఖ్యమంత్రి షెడ్యూల్ సమయానికే వస్తారన్న ఉద్దేశంతో ఉదయం 8.30కే జనాన్ని తీసుకొచ్చారు. కనీసం తాగునీటిని కూడా సక్రమంగా అందించలేకపోయారు. వేదిక వద్ద ఎండ వేడికి తలదాచుకునేందుకు సరైన ప్రదేశాలు లేకపోవడంతో దుకాణాల మెట్లపైనే జనం కూర్చోవాల్సి వచ్చింది. సీఎం రాగానే జనమంతా స్టీమర్‌రోడ్‌కు చేరుకున్నారు. మండుటెండలో ఎక్కువ సేపు నిలవలేక చాలా మంది వృద్ధులు, మహిళలు ఎండ వేడికి సొమ్మసిల్లిపోయారు. దీన్నిచూసి జనం కూడా మెల్లగా జారుకున్నారు.

డివైడర్లు ధ్వంసం

ముఖ్యమంత్రి సభ కోసం స్టీమర్‌రోడ్‌లోని డివైడర్లను గురువారం అర్ధరాత్రి జేసీబీ సాయంతో 20 మీటర్ల మేర ధ్వంసం చేశారు. సభకు అడ్డు వస్తుందన్న ఉద్దేశంతో సెంట్రల్ లైటింగ్ పోల్స్‌ను కట్ చేశారు. ప్రస్తుతం సీఎం సభ జరిగిన ప్రదేశంలోనే చంద్రబాబు మీటింగ్ జరిగింది. అప్పుడు అడ్డురాని లైటింగ్ స్తంభం, డివైడర్లు ఇప్పుడు అడ్డొచ్చాయా అని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఏం చేసైనా గెలవాల్సిందే!.. ఎంత ఖర్చయినా సరే!!

- నిఘా, ఐ-ప్యాక్ సర్వేలతో జగన్ ఆందోళన
- నరసాపురం సభకు ముందు ముఖ్య నేతలతో ప్రత్యేక భేటీ?
- ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై ప్రజలకు నచ్చజెప్పాల్సిందే
- ఈ పది రోజులూ అత్యంత కీలకం
- కూటమికి పట్టున్న 50 స్థానాలపై ఫోకస్
- కడప లోక్‌సభను గెలిచి తీరాలి
- ఇందుకోసం కార్యాచరణ అమలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏం చేసైనా.. ఎంత ఖర్చయినా సరే.. ఎన్నికల్లో గెలవాల్సిందేనని వైసీపీ ముఖ్య నేతలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పార్టీ విజయావకాశాలపై ఐ-ప్యాక్ బృందం ఇస్తున్న సర్వే నివేదికలు ఆయన్ను స్థిమితంగా ఉంచడం లేదని.. ఆ వివరాలు చదివి, నిఘా విభాగం సమాచారం తెలుసుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఐ-ప్యాక్, నిఘా వర్గాల సూచనల మేరకు శుక్రవారం నరసాపురం సభ జరగడానికి ఓ గంట ముందు.. కీలక నేతలు.. ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులతో జగన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు (ఎల్‌టీఏ) అమలుపై ప్రజల్లో ఉన్న భయాందోళనలు అధికారపక్షం తలరాతనే మార్చేసేలా ఉందన్న భయం సీఎంలో కనిపించింది. అసలీ చట్టమే లేదని మంత్రి బొత్స సత్యనారాయణ.. ఇది కేంద్రం తెచ్చిన చట్టమని ఇంకో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ చట్టాన్ని జగన్ అమలుచేసి తీరతారని మరో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేయడంతో.. తమ భూములను వైసీపీ నేతలు స్వాహా చేస్తారని.. హక్కులన్నీ కోల్పోతామన్న భయం జనంలో మరింత పెరిగింది. ఇదే ఇప్పుడు వైసీపీకి పెనుముప్పు కానుందని నిఘా వర్గాల ద్వారా జగన్‌కు తెలిసింది. ఇది ఎన్నికల ఫలితాలను తారుమారు చేస్తుందని ఆయన కలవరపడుతున్నారు. దీంతో.. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అమలు చేయబోవడం లేదంటూ ప్రజలకు నచ్చజెప్పాలని.. ఈ పది రోజులూ ఇదే పనిగా పెట్టుకోవాలని అభ్యర్థులకు, కిందిస్థాయి నేతలకు జగన్ ఆ భేటీలో సూచించారు. ఈ ఎన్నికలు తనకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైనవని.. ఏం చేసైనా విజయం సాధించాల్సిందేనని ఆయన ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు.. హోరాహోరీ పోటీ నెలకొన్న 50 నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ముఖ్య నేతలను నిర్దేశించారు. రాయలసీమ జిల్లాల్లోనూ ప్రజా వ్యతిరేకత నెలకొందని.. అక్కడ కూడా అభ్యర్థులు విజయం కోసం నిరంతరం శ్రమించాలన్నారు. ఆ ప్రాంతంలోని 52 అసెంబ్లీ స్థానాల్లో కనీసం 40 చోట్ల గెలిచేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా కడప లోక్‌సభ స్థానంపై ఫోకస్ చేయాలన్నారు. ఇక్కడ వైసీపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డిపై జగన్ సొంత చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. ఈమెతోపాటు మరో చెల్లెలైన వివేకా కుమార్తె సునీతారెడ్డి విస్తృతంగా చేస్తున్న ప్రచారం ప్రభావం వైసీపీపై తీవ్రంగా పడుతుండడంతో.. ఇక్కడ విజయం సాధించేందుకు నిర్దిష్ట వ్యూహంతో వెళ్లాలని కడప జిల్లా నేతలకు జగన్ స్పష్టం చేశారు.

కూటమి మేనిఫెస్టోపై బెంగ!

సామాజిక పింఛన్లను 2029 నాటికి రూ.3,500 చేస్తానంటూ జగన్ తన మేనిఫెస్టోలో పేర్కొంటే.. అధికారంలోకి వచ్చిన నెల నుంచే రూ.4,000 అందిస్తామని టీడీపీ కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ, ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి గ్యారెంటీలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని నిఘావర్గాలు సీఎంకు నివేదికలిచ్చాయి. సోషల్ మీడియా సర్వేల్లోనూ ఇదే తేలుతుండడంతో జగన్ ఆందోళన చెందుతున్నారు. చంద్రబాబుకు విశ్వసనీయత లేదంటూ ప్రచారం చేయాలని ముఖ్య నేతలను ఆదేశించారు. వైసీపీ అభ్యర్థులకు ప్రతికూలత ఉన్న స్థానాల్లో కూడా కూటమి అభ్యర్థులకు భారీ మెజారిటీ రాకుండా అడ్డుకట్ట వేయాలన్నారు.

నాన్నను జగన్ పావులా వాడుకుంటున్నారు

- ముద్రగడ కుమార్తె క్రాంతి సంచలన ఆరోపణ
- పవన్‌పై ముద్రగడ వ్యాఖ్యలను తప్పుబట్టిన క్రాంతి
- జనసేనాని గెలుపు కోసం కృషి చేస్తానని వెల్లడి



క్రాంతి

పిఠాపురం, మే 3: వైసీపీ నేత ముద్రగడ పద్మనాభానికి ఆయన కుమార్తె క్రాంతి షాకిచ్చారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ముద్రగడ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. 'మా నాన్నను జగన్ పావులా వాడుకుంటున్నారు' అని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన వీడియోలో క్రాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్‌కల్యాణ్‌ను ఓడించేందుకు వైసీపీ పలురకాల కుట్రలు చేస్తోందని ఆమె ఆరోపించారు. పవన్‌పై ముద్రగడ చేసిన చాలెంజ్ బాధాకరమని తెలిపారు. పవన్‌ను పిఠాపురంలో ఓడించి తన్ని తరిమివేస్తానని అనడం, లేకుంటే తన పేరు పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని చెప్పడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముద్రగడ లాజిక్, కాన్సెప్ట్ ఏమిటో తనకు అర్థం కావడం లేదని, ఈ ప్రకటన ఆయన అభిమానులకే నచ్చలేదని తెలిపారు. వంగా గీతను గెలిపించడానికి కష్టపడవచ్చు కానీ.. పవన్‌ను, ఆయన అభిమానులను కించపరిచేలా కామెంట్స్ చేయడం తగదని అన్నారు. పవన్‌ను తిట్టేందుకే జగన్ తన తండ్రిని వాడుకుంటున్నారని చెప్పారు. ఎన్నికల తర్వాత ముద్రగడను జగన్ ఎటూకాకుండా వదిలివేయడం పక్కా అని స్పష్టం చేశారు. పవన్ విషయంలో తన తండ్రిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. పవన్ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

మా ఇద్దరి మధ్య చిచ్చు పెట్టాలని చూశారు: ముద్రగడ

క్రాంతి చేసిన వ్యాఖ్యలపై వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం స్పందించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ... 'నా కుమార్తె ప్రస్తుతం నా ప్రాపర్టీ కాదు. పెళ్లి కాక ముందు ఆమె నా ప్రాపర్టీ. ఇప్పుడు పెళ్లయింది కాబట్టి అత్తవారి ప్రాపర్టీ. నా కూతురు చేత కావాలనే వీడియో రిలీజ్ చేయించారు. అటువంటి వాటికి భయపడను' అన్నారు. ఎవరు బెదిరించినా భయపడిపోనని, జగన్‌కు సేవకుడిగా ఉంటానని స్పష్టం చేశారు. వైసీపీలో చేరాను, ఇక పక్కచూపులు చూసే ప్రసక్తి లేదన్నారు. తనకూ, తన కుమార్తెకు మధ్య చిచ్చుపెట్టాలని చూశారని ఆరోపించారు. ఇటువంటి వాటికి బెదరనని, తన మార్గంలో తాను వెళ్తానని స్పష్టం చేశారు.

పోలీసులూ... మీరు మారరా?

- మార్ఫ్‌డ్ న్యూడ్ ఫొటోలపై మహిళలు ఫిర్యాదు చేస్తే అరెస్టు చేయరా..?
- నిందితుల్ని అడ్డంగా నరికేస్తే... ఎఫ్ఐఆర్ కడతారా?
- టీడీపీ నేత ఆనం వెంకట రమణారెడ్డి ఫైర్.. సీఈవో మీనాకు ఫిర్యాదు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): 'నలుగురు టీడీపీ మహిళల న్యూడ్ మార్ఫింగ్ ఫొటోలు ఎక్స్‌లో పెడితే.. నేరస్తులను అరెస్టు చేయరా? కనీసం బాధిత మహిళల ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయరా? పోని నిందితుల్ని అడ్డంగా నరికేస్తే.. ఎఫ్ఐఆర్ కడతారా? టీడీపీ మహిళల కుటుంబాల పరువు ఎంత దిగజారుస్తారు? మీరు మారరా?' అంటూ టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి మండిపడ్డారు. టీడీపీకి చెందిన నలుగురు మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేసి, వారిని మానసికంగా హింసిస్తున్న వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను తక్షణమే అరెస్ట్ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను శుక్రవారం ఆయన కోరారు. అమరావతి సచివాలయంలో సీఈవోను ఆయన కలసి, టీడీపీ మహిళలను అవమానిస్తున్న తీరు, పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న టీడీపీ ఆడబిడ్డల ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి, వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. నలుగురు మహిళల న్యూడ్ ఫొటోలు ఎక్స్‌లో పెట్టి 10 రోజులైంది. బాధిత మహిళలు తెనాలి, ఏలూరు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినా, నిందితుల్ని అరెస్టు చేయలేదు. కనీసం ఫొటోలను కూడా డిలీట్ చేయించలేదు. రాష్ట్రంలో అసలు పోలీస్ శాఖ ఉందా? వాసిరెడ్డి పద్మ గతంలో రోజాపై తాము తప్పుగా మాట్లాడామని, ఎగిరెగిరిపడ్డారు. తమిళనాడు, కర్ణాటక, నార్త్ ఇండియా నుంచి సినిమా యాక్టర్లతో మాట్లాడించారు. మరి ఇప్పుడు పద్మ ఏమీ మాట్లాడరే? వీళ్లు ఆడపిల్లలే. వీళ్లకూ పెళ్లిళ్లు అయ్యాయి. పిల్లలున్నారు. మీకో న్యాయం? మాకో న్యాయమా? టీడీపీలోని ఆడ పిల్లలు ఆడ పిల్లలు కాదా? ఈ విషయాన్ని ఎన్నికల పరిశీలకునికి దృష్టికి తీసుకెళ్లా. ఇలాంటి వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి అని చెప్పారు. సీఈవో మీనా కూడా డీజీపీకి లేఖ రాశారు. పోస్టులు పెట్టిన వారిని అరెస్ట్ చేయాలని సీఈవో చెప్పినా.. ఇప్పటికీ అరెస్టులు, ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. ఇక్కడ పోలీస్ లేదు. వైసీపీ పోలీసే ఉంది. ఈ ఫిర్యాదులు నమోదు చేయించగలిగే ఏకైక వ్యక్తి మా వైఎస్ భారతక్క మాత్రమే చేయగలరు. భారతక్కను అడుగుతున్నాం.. 'నీకూ ఇద్దరు కూతుళ్లున్నారు. నాకూ ఇద్దరు కూతుళ్లున్నారు. మనం రాజకీయం చేసుకుందాం. అంతే కానీ ఆడబిడ్డల న్యూడ్ ఫొటోలు ఇలా పెట్టొద్దు. నీ పరపతి ఉపయోగించి వెంటనే ఫొటోలు డిలీట్ చేయించు, చాలు' అని కోరారు. సీఈవోకి ఫిర్యాదు చేసిన ఫొటో ఆడ పిల్లలు ఎక్స్‌లో పెడితే రామ్‌గోపాల్ వర్మ తమ నాయకుల గురించి తప్పుడు కామెంట్లు చేశాడన్నారు.

ప్రజల ఆస్తులు కొట్టేసేందుకు జగన్ కుట్ర

- రాష్ట్రంతో మూడు ముక్కలాట ఆడారు
- కులం, మతం పేరుతో చెత్త రాజకీయాలు
- కూటమి మేనిఫెస్టో ప్రజలను గట్టెక్కిస్తుంది
- నంద్యాల యువగళం సభలో లోకేశ్



నంద్యాలలో యువగళం సభకు హాజరైన యువత, ప్రసంగిస్తున్న లోకేశ్

నంద్యాల, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తులను కొట్టేసేందుకు జగన్ పెద్ద కుట్ర చేశాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆరోపించారు. తాతముత్తాతలు ఇచ్చిన ఆస్తుల పాసుబుక్కులపై జగన్ ఫొటో వేయించుకుని, ఆస్తులు కొట్టేసేందుకే ల్యాండ్ టైటిల్ యాక్ట్ తెచ్చాడని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులమయం చేసి ప్రభుత్వ స్థలాలు, సచివాలయాలు, అసెంబ్లీ, చివరికి మనం నడిచే రోడ్లను కూడా జగన్ తాకట్టు పెట్టేశాడన్నారు. శుక్రవారం నంద్యాలలో నిర్వహించిన 'యువగళం' సభకు లోకేశ్ హాజరయ్యారు. ఈ సభకు యువతీ యువకులు భారీగా తరలివచ్చారు. యువతతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. యువత అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టీడీపీ అధికారంలో ఉన్నపుడు ప్రతిరోజూ పెట్టుబడుల వార్తలు కనిపించేవి. కానీ ఒక్క అవకాశం అంటూ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఉద్యోగాలు, ఉపాధి పూర్తిగా కరువయ్యాయి. రాష్ట్రాన్ని అప్పులమయం చేశాడు. ప్రభుత్వానికి చెందిన స్థలాలు, సచివాలయాలు, అసెంబ్లీ, చివరికి మనం నడిచే రోడ్లను కూడా తాకట్టు పెట్టేశాడు' అని మండిపడ్డారు. వైసీపీ పాలనలో రాష్ట్రం గంజాయి వనంలా తయారైందని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయిని అరకులో పండించి వీధివీధినా అమ్ముతున్నారని, ఆ సొమ్మంతా తాడేపల్లి కొంపకు వెళ్తోందన్నారు. తాను పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి చంద్రబాబు, పవనన్నకు చెబితే.. ప్రజలను ఆదుకునేందుకు కూటమి మేనిఫెస్టోను తెచ్చారన్నారు. రాష్ట్రంతో మూడు ముక్కలాట ఆడిన జగన్‌ను ఇంటికి పంపించాలని, ఆంధ్రులంతా మేలుకోవాలన్నారు. 'యువగళం' సభలో భాగంగా యువతపై లోకేశ్ వరాలజల్లు కురిపించారు. విశాఖకు ఐటీ పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. పాత ఫీజు రీయింబర్స్‌మెంటు విధానాన్ని అమలు చేసి, విదేశీ విద్యా దీవెన పథకాన్ని మళ్లీ తీసుకువస్తామన్నారు. అన్ని రంగాల్లో కలిపి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. ఐదేళ్లలో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని లోకేశ్ యువతకు హామీనిచ్చారు.

మేనిఫెస్టోపై వైసీపీ తప్పుడు ప్రచారం

'కూటమి మేనిఫెస్టోకు బీజేపీ అనుమతి లేదని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. జాతీయ స్థాయిలో బీజేపీకి మేనిఫెస్టో ఉంటుంది. ఎన్డీయే మిత్రపక్షాలు ఉన్నచోట్ల ప్రత్యేక మేనిఫెస్టో ఉంటుందని బీజేపీ అగ్రనేతలు ఇప్పటికే ప్రకటించారు. కూటమి మైనారిటీలకు అనుకూలంగా ఉండదని కూడా వైసీపీ ప్రచారం చేస్తోంది. వాజ్‌పేయి హయాంలో, 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న సమయంలో కూడా మైనార్టీలకు టీడీపీ అనేక పథకాలు తీసుకువచ్చింది. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనార్టీల మీద దాడులు పెరిగిపోయాయి. టీడీపీ అధికారంలోకి వచ్చాక జగన్ చేసిన తప్పులను సరిదిద్దుతాం. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తాం. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బైరెడ్డి శబరి, ఎన్ఎండీ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

మోసకారి జగన్‌ను గద్దె దించుతాం

- రాష్ట్రంలో ఉద్యోగాల్లేక యువత ఆత్మహత్యలు
- డీఎస్సీపై తొలి సంతకమన్న బాబుకే మద్దతు
- మంగళగిరిలో కదం తొక్కిన నిరుద్యోగులు



మంగళగిరి అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న నిరుద్యోగులు

మంగళగిరి సిటీ, మే 3: అయిదేళ్ల పాటు ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువత ఆత్మహత్యలకు కారణమైన సీఎం జగన్‌ను గద్దె దించేందుకు 40 లక్షల మంది నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని నిరుద్యోగ జేఏసీ నేతలు పేర్కొన్నారు. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు 1,800 కిలోమీటర్ల మేర చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్ర శుక్రవారం మంగళగిరికి చేరుకుంది. స్థానిక తాలూకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తానన్న చంద్రబాబును గెలిపించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనరు షేక్ సిద్ధిఖ్ మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోలో యువతకు పెద్దపీట వేశారని చెప్పారు. గత ఎన్నికల ముందు జగన్ అధికారంలోకి రాగానే 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తానని, ఏటా జాబ్ కేలెండర్ విడుదల చేస్తానని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చే విధంగా అసెంబ్లీలో చట్టం చేస్తామని చెప్పిన జగన్ ఆ హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు.

జగన్‌కు ముస్లిం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఏది?

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): జగన్‌కు ముస్లిం రిజర్వేషన్ల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదని, అందుకే ఆర్ కృష్ణయ్య వేసిన పిటిషన్ వెనక్కి తీసుకోలేదని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆరోపించారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'టీడీపీ హయాంలో సమర్థవంతమైన న్యాయవాదులను పెట్టి ముస్లిం రిజర్వేషన్లు చంద్రబాబు కాపాడారు. పేదరికం, ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ప్రాతిపదిక రిజర్వేషన్లు కల్పించారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అంశం ఆర్టికల్ 16 ప్రకారం రాష్ట్ర పరిధిలోనిది. ముస్లింలకు మత ప్రాతిపదికన ఇచ్చిన రిజర్వేషన్లు రద్దు చేయాలంటూ సుప్రీం కోర్టులో పిటీషన్ వేసింది వైసీపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య కాదా? ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ అనేది సుప్రీం కోర్టు స్టేలో నడుస్తోంది. ముస్లింలను ఓబీసీలుగా పరిగణించి ఆ నాలుగు శాతం రిజర్వేషన్ ఇవ్వలేదు' అన్నారు.

ఓటుతో రోజాను తరిమికొట్టండి

- అవినీతి, అక్రమాలకు ఆమె కేరాఫ్ అడ్రస్
- వైసీపీ కోసం ఎంత కష్టపడినా గుర్తింపు లేదు
- నగరిలోని 50 మంది కీలక నాయకుల ప్రకటన
- పార్టీకి రాజీనామా చేసి.. టీడీపీలో చేరుతున్నట్టు వెల్లడి



రాజీనామాను ప్రకటిస్తున్న శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి తదితరులు

తిరుపతి విశ్వవిద్యాలయాలు, మే 3: రాష్ట్ర మంత్రి ఆర్కే రోజాకు నియోజకవర్గంలోని వైసీపీ ప్రముఖ నాయకులు ఝలక్ ఇచ్చారు. శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డితోపాటు 50 మంది కీలక నాయకులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతిరాజు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో రోజా సోదరుల పెత్తనం విపరీతంగా పెరిగిందని, దీంతో ప్రజలు, వైసీపీ నాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా అవినీతి, అక్రమాలకు రోజా కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని విమర్శించారు. తీవ్ర ఆవేదనతో ఐదు మండలాలకు చెందిన వైసీపీ ఇన్‌చార్జిలు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. వైసీపీ కోసం ఎంత కష్టపడినా గుర్తింపు, ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఐఐసీ భూముల్లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వడమాలపేట టోల్ గేట్ వద్ద స్థలాలను రోజా కబ్జా చేయడాన్ని ప్రశ్నించినందుకే తమపై కక్ష కట్టారని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్‌లోనూ రోజా కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. చంద్రముఖిలా మారిన రోజాను ఓటు అనే ఆయుధంతో నగరి నుంచి తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తామంతా ఈ నెల 5వ తేదీన టీడీపీలో చేరుతున్నట్టు ప్రకటించారు.

ప్రజాకంటక రాక్షస పాలనను సాగనంపాలి: పురందేశ్వరి



చాగల్లులో రోడ్‌షోలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తున్న పురందేశ్వరి, ముప్పిడి వెంకటేశ్వరరావు. చిత్రంలో టీడీపీ సీనియర్ నాయకుడు అచ్చిబాబు

చాగల్లు, మే 3: ఓటు అనే ఆయుధంతో వైసీపీ ప్రభుత్వం ప్రజాకంటక రాక్షస పాలనను సాగనంపాలని రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలసి ఆమె తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలటూరులో ఆమె మాట్లాడారు. 'విద్వేషం, విధ్వంసం తప్ప రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదు. గోదావరిలో ఇసుకను అక్రమంగా తవ్వి పర్యావరణానికి ఇబ్బంది కలిగించడంతో పాటు ఉభయ గోదావరి జిల్లాలను కలిపే వంతెనలకు ప్రమాదాలను తెచ్చిపెట్టారు. ప్రతి పనిలోను అవినీతి పెరిగిపోయింది. గ్రామాల్లో పర్యటిస్తుంటే రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రజల కనీస అవసరాలు, వారి సమస్యలను కూడా తీర్చలేని అసమర్థ ప్రభుత్వాన్ని గద్దె దించి అభివృద్ధి, మెరుగైన పాలన కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలి' అని పురందేశ్వరి కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆరని అగ్ని!

మణిపూర్‌లో హింస చెలరేగి మే 3వ తేదీకి ఏడాది అయింది. సుదీర్ఘ కాలం సాగిన ఆ హింస కారణంగా అధికారిక లెక్కల ప్రకారం 227మంది మరణించారు, డెబ్బయ్‌వేలకుపైగా నిరాశ్రయులైనారు. మీతీలకూ, కుకీ–జో తెగలకు మధ్య రేగిన ఆ చిచ్చు ఇప్పటికీ రాష్ట్రాన్ని వదలకుండా ఉన్నది. ఎడతెరిపిలేని ఘర్షణలతో ఆయా తెగలవారు ప్రశాంతంగా ఉండగలిగే పరిస్థితులు పూర్తిగా మాయమైనాయి. వారంక్రితం కూడా రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలు జరిగాయి. ఈ ఏడాది కాలంలో ప్రధానంగా వచ్చినమార్పు ఒకటే. మీతీల ఆధిపత్యం ఉన్న ఇంఫాల్ లోయలో కుకీ–జో తెగకు చెందిన ఒక్కరు కూడా ఉండటం లేదు. అలాగే, కుకీ–జో ఆధిపత్యం ఉన్న కొండప్రాంతాల్లో ఒక్క మీతీకూడా మిగల్లేదు. ప్రజల మధ్య అపనమ్మకాలు, అనుమానాలు తప్ప పలకరింపులు కూడా మాయమైపోయాయి. విభజన రేఖలు గీయడంలో రాష్ట్ర పాలకులు విజయం సాధించారు.

ఒక భయానక ఘటన జరిగింది కనుక మే 3, 2023చరిత్రపుటల్లోకి ఎక్కింది కానీ, మణిపూర్ హింసకు పునాదులు అంతకుముందే పడ్డాయి. అప్పటికే బీరేన్‌సింగ్ ప్రభుత్వం మీద కుకీ–జో తెగల్లో అవిశ్వాసం తీవ్రస్థాయిలో ఉంది. ఆ తెగలవారు మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు కారణమని, నల్లమందు, గసగసాలు ఇత్యాది పంటలు పండిస్తున్నారని, అత్యధికులు అక్రమంగా వలసవచ్చినవారే తప్ప స్థానికులు కారని ఏవేవో వాదనలతో బీరేన్‌సింగ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది, వేట ఆరంభించింది. వారు తరతరాలుగా సేద్యం చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకొని, గ్రామాలను ఖాళీచేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, ఈ తెగల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. భూములు కోల్పోతామన్న భయంలో ఈ తెగలున్న తరుణంలోనే, మీతీలను ఎస్టీలుగా గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా రాష్ట్రప్రభుత్వాన్ని అక్కడి హైకోర్టు ఆదేశించింది. ఏకపక్షం, చట్టవ్యతిరేకం, పరిధుల అతిక్రమణ, అనవసరపు చొరవ ఇత్యాది తీవ్రపదజాలంతో సుప్రీంకోర్టు అనంతరకాలంలో ఈ ఆదేశాలను తీవ్రంగా తప్పుబట్టి, పక్కనబెట్టిన మాట అటుంచితే, మీతీలకు ఎస్టీ హోదా అన్న హైకోర్టు మాటలు పాతగాయాలను రేపి, ఆరనిమంటలు సృష్టించాయి. కొండప్రాంతాలకు చెందిన నాగా, కుకీ–జోల కంటే ఇంఫాల్‌లోయలో ఉండే మీతీలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెంది రాజకీయంగానూ ఆధిపత్య స్థానంలో ఉన్నారు. ఎక్కువమంది మంత్రులు, ముఖ్యమంత్రులు, చివరకు బీరేన్‌సింగ్ కూడా మీతీయే. కోర్టు ఆదేశాల వెనుక బీరేన్ కుట్ర ఉన్నదని, మీతీలకు ఆదివాసీ హోదా దక్కితే తమ భూములు వారి వశమైపోతాయని ఆదివాసులు భయపడ్డారు. కొండప్రాంతాల్లోని భూములకు రాజ్యాంగపరమైన ప్రత్యేక రక్షణలు ఉన్నందున, వాటిని వశం చేసుకోవడానికే ఆదివాసీయేతరులైన మీతీలు ఆదివాసీలుగా మారుతున్నారని ఈ తెగలు విశ్వసించాయి. మే 3న గిరిజన తెగలన్నీ కలసికట్టుగా అతిపెద్ద నిరసన సభ నిర్వహించడం, అది ముగియగానే మీతీలకూ, ఆదివాసీ తెగలకు మధ్య ఘర్షణలు రేగి, హింసాత్మక ఘటనలకు దారితీయడం తెలిసినవే.

హింసను అదుపుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని మొదట్లో అనుకున్నప్పటికీ, బీరేన్‌సింగ్ ప్రభుత్వం హింసను ప్రోత్సహించిందని ఆ తరువాత చాలా నివేదికలు ఆరోపించాయి. మీతీ యువకులకు పోలీసులే అండదండలు అందించారని, ఆయుధాగారాలు దోచుకొనేందుకు అనుమతించారని విమర్శలువచ్చాయి. రెండునెలలపాటు రాష్ట్రం తగలబడుతున్నా, తప్పుడు సమాచారంతో, వాదనలతో పాలకులు కాలాన్ని నెట్టుకుంటూ వచ్చారు, ప్రధానమంత్రి ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోగా నోరువిప్పకూడదని కూడా నిర్ణయించుకున్నారు. కానీ, మీతీయువకులు కొందరు ఇద్దరు కుకీమహిళలను నగ్నంగా ఊరేగించి, అనంతరం అత్యాచారం చేసిన ఘటనలకు సంబంధించిన వీడియో ఒకటి జులైలో బయటకు వచ్చి దేశాన్ని కుదిపేయడంతో, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని సంఘటనలతో కలిపి ప్రధాని ఈ దారుణాన్ని మాటమాత్రంగా ప్రస్తావించి వదిలేశారు. ఇంతజరిగినా బీజేపీ పెద్దలు ముఖ్యమంత్రిని మార్చకపోవడం విశేషం. సరైన సమయంలో, సరైన చర్యలతో తమ ప్రభుత్వం హింసను చక్కగా అదుపుచేసిందని ఇటీవలి ఎన్నికల ప్రచారం సందర్భంగా నరేంద్రమోదీ ప్రకటించారు. గత పక్షంరోజుల్లోనే కనీసం నాలుగు హింసాత్మక ఘటనలు జరిగిన విషయాన్ని అటుంచితే, మానసికంగా ఎప్పుడో విడిపోయిన మణిపూర్ ఇప్పుడు స్వయం పాలిత ప్రాంతాల డిమాండ్‌తో చీలిపోవడానికి సిద్ధంగా ఉంది.

బీజేపీ అబద్ధాలు... కాంగ్రెస్ సత్యాలు

గత ఐదేళ్ల నుంచీ రూపకల్పనలో ఉన్న ఉత్కృష్ట సంకల్ప పత్రమే 2024 లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో. కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా రాహుల్ గాంధీ చరిత్రాత్మక పాదయాత్ర నిర్వహించారు. యాత్ర పొడుగునా ప్రజల చింతలు, కలతలు, ఆందోళనలను ఆయన తెలుసుకున్నారు. ప్రజలు ఎటువంటి పరిస్థితులలో నివసిస్తున్నారో ఆయన ప్రత్యక్షంగా చూశారు. వివిధ సమస్యలపై వారితో సంభాషించారు. సామాన్యుల ఆకాంక్షలు ఏమిటో తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఉదయ్‌పూర్‌లో సమావేశమై దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటికి సంభావ్య పరిష్కారాల గురించి మూడు రోజుల పాటు విపులంగా సమాలోచనలు చేశారు. రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ ప్లీనరీ వివిధ అంశాలపై అనుసరించవలసిన విధానాలను ఆమోదించింది. అవి సమగ్రమైనవి, విశ్వసనీయమైనవి. రాష్ట్ర, జాతీయ ఎన్నికలలో బీజేపీని దీటుగా ఎదుర్కొనే లక్ష్యంతో ఆ విధానాలను రూపొందించారు. 'నవ్ సంకల్ప్ ఎకనామిక్ పాలసీ'ని ఉదయ్‌పూర్ సమావేశంలో రూపొందించగా రాయ్‌పూర్‌లో దానిని విస్తృతంగా చర్చించి ఆమోదించారు.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

కాంగ్రెస్ మేనిఫెస్టో 'న్యాయ్ పత్ర'ను ఏప్రిల్ 5న విడుదల చేశారు. 46 పేజీల ఆ మేనిఫెస్టోను 'జస్టిస్' (న్యాయం) అనే భావన ప్రాతిపదికన రూపొందించారు. దండలో దారం ఆ భావన, న్యాయ్ పత్రలోని అన్ని అంశాలకు ప్రాతిపదికగా ఉన్నది. దేశంలోని అత్యధిక ప్రజలకు నిరాకరిస్తున్న 'న్యాయ్'ను అందరికీ సమకూర్చేందుకు కాంగ్రెస్ సంకల్పించింది. 'జస్టిస్' అనే భావనలో సోషల్ జస్టిస్, జస్టిస్ ఫర్ యూత్, జస్టిస్ ఫర్ ఉమెన్, జస్టిస్ ఫర్ ఫార్మర్స్, జస్టిస్ ఫర్ వర్కర్స్ అనే భావాలన్నీ మిళితమై ఉన్నాయి. కోట్లాది ప్రజలు ఇప్పటికీ వివక్షకు గురవుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ (శీఘ్ర లేదా మందకొడి) అభివృద్ధిలో పాలుపంచుకునే అవకాశాన్ని కోట్లాది ప్రజలకు ఇప్పటికీ నిరాకరిస్తున్నారు. సమాన హక్కులు, సమాన అవకాశాలు అనేవి మాటలుగానే మిగిలిపోయాయి. 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' అనే మాటల వెనుక ఉన్న కపటత్వాన్ని కాంగ్రెస్ మేనిఫెస్టో ఎండగట్టింది. దేశ పాలకులు వల్లిస్తున్న ఆదర్శాలు డొల్లమాటలు మాత్రమేనని స్పష్టం చేసింది ప్రత్యామ్నాయ అభివృద్ధి దార్శనికతను ప్రజలకు నివేదించింది. కనుకనే కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 సార్వత్రిక ఎన్నికల హీరో అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ ప్రస్తుతించారు.

నరేంద్ర మోదీ, బీజేపీ తొలుత కాంగ్రెస్ మేనిఫెస్టోను నిర్లక్ష్యం చేయాలని నిర్ణయించుకున్నారు. మీడియా సైతం 'న్యాయ్ పత్ర'ను పూర్తిగా ఉపేక్షించింది. అయితే దేశ భాషలలోకి కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికను అనువదించి రాష్ట్రాలలోని అభ్యర్థులు, ప్రచారకర్తలకు అందుబాటులో ఉంచడం జరిగింది. ఫలితంగా 'న్యాయ్ పత్ర' మారుమూల గ్రామాలలోని ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అందులోని అంశాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కాంగ్రెస్ హామీలను వారు విశ్వసించారు. కాంగ్రెస్ సందేశం అందరికీ చేరింది. దేశవ్యాప్తంగా ప్రజల మాటా మంతీ, పిచ్చా పాటీలో కాంగ్రెస్ న్యాయ్ పత్ర ఒక ప్రధాన భాగమయింది. విద్యాధికులతో పాటు నిరక్షరాస్యులు కూడా న్యాయ్ పత్రలోని అంశాలను చర్చించుకోసాగారు.

ఏప్రిల్ 5 తరువాత తొమ్మిది రోజులకు బీజేపీ తన ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. ఎవరూ దానిని పట్టించుకోనేలేదు. 'మోదీకి గ్యారంటీ' పేరుతో ఉన్న ఆ మేనిఫెస్టోలోని గుణ విశేషాలను నరేంద్ర మోదీ సైతం మెచ్చుకోలేదు. ఏప్రిల్ 19న 102 నియోజకవర్గాలలో మొదటి దశ పోలింగ్ జరిగింది. గూఢచార నివేదికలు బీజేపీకి చేదు సత్యాలను నివేదించాయి. కాంగ్రెస్‌కు దాని మిత్రపక్షాలకు ఓటు వేసినవారు 'న్యాయ్ పత్ర'లోని హామీలకు వేశారన్న విషయం బీజేపీకి స్పష్టమయింది. కర్ణాటక, తెలంగాణలలో 'గ్యారంటీ'లకు ఓటు వేసినట్టుగానే లోక్‌సభ ఎన్నికలలో 'న్యాయ్ పత్ర'లోని హామీను విశ్వసించి కాంగ్రెస్‌కు, 'ఇండియా' కూటమికి ఓటు వేశారని స్పష్టమయింది. ఈ సత్యం నరేంద్ర మోదీకి కోపం తెప్పించింది. చిరాకు కలిగించింది. ఏప్రిల్ 21నే ఆయన ప్రచార సరళి మారిపోయింది. కొత్త ప్రచార సరళిపై భారతీయ జనతా పార్టీ తన నాయకులకు, కార్యకర్తలకు చేసిన నిర్దేశాలను చూసి నాజీ నాయకుడు గోబెల్స్ సైతం గర్వించి ఉండేవాడు ప్రచారమంతా అబద్ధాలు, మరిన్ని అబద్ధాలు, ఇంకా అబద్ధాలతో నిండిపోవాలని బీజేపీ నాయకులకు నిర్దేశించారు. సత్యం అబద్ధాన్ని ఖండిస్తే ఆ సత్యాన్ని పూర్తిగా ఉపేక్షించాలి.

గత 14 రోజులుగా ఎన్నికల ప్రచారంలో బీజేపీ చెప్తున్న అబద్ధాలు ఏమిటో చూడండి :

అబద్ధం: కాంగ్రెస్ మేనిఫెస్టో అంతటా ముస్లిం లీగ్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. సత్యమేమిటి? '46 పేజీల కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎక్కడా 'ముస్లిం' అనే పదం లేనే లేదు. మైనారిటీలను భాషాపరమైన, మతపరమైన మైనారిటీలుగా కాంగ్రెస్ మేనిఫెస్టో నిర్వచించింది. భాషాపరమైన, మతపరమైన మైనారిటీలకు మానవ హక్కులు, పౌర హక్కులను భారత రాజ్యాంగం కల్పించింది. కాంగ్రెస్ పార్టీ ఆ హక్కులు పూర్తిగా సమర్థిస్తోంది మైనారిటీలకు ఆ హక్కులు సంపూర్ణంగా దక్కేందుకు కాంగ్రెస్ హామీ పడుతోంది'. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సంబంధించి అనేక ప్రస్తావనలు ఉన్నాయి. ఏ మత సమూహానికి సంబంధించి ఎటువంటి ప్రస్తావన లేదు.

అబద్ధం: కాంగ్రెస్ అధికారానికి వస్తే షరియా చట్టాన్ని మళ్లీ తీసుకువస్తుంది. సత్యమేమిటి? కాంగ్రెస్ మేనిఫెస్టో ఇలా పేర్కొంది. 'మత చట్టాలను సంస్కరించడాన్ని మేము ప్రోత్సహిస్తాం. అటువంటి సంస్కరణలను, సంబంధిత మత సమూహపు సంపూర్ణ అంగీకారం, క్రియాశీల భాగస్వామ్యంతో మాత్రమే తీసుకురావాలి'.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అబద్ధాలు చెప్పారు; కాంగ్రెస్ మేనిఫెస్టో 'న్యాయ్ పత్ర'లోని సత్యాలు ఎన్నికల ప్రచారంలో ప్రధాన చర్చనీయాంశాలు కావడానికి దోహదం చేశారు; ఈ వాద ప్రతివాదాలలో బీజేపీ మేనిఫెస్టో 'మోదీకి గ్యారంటీ'ని ప్రస్తావించనే లేదు... తద్వారా కాంగ్రెస్ మేనిఫెస్టోపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ ప్రశంసాపూర్వక వ్యాఖ్యను మోదీ సమర్థించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 లోక్‌సభ ఎన్నికల నిజమైన హీరో అని నరేంద్ర మోదీ ఒప్పుకున్నారు.

అబద్ధం: కాంగ్రెస్ మేనిఫెస్టో మార్కిస్ట్, మావోయిస్ట్ ఆర్థిక సిద్ధాంతాలను సమర్థిస్తుంది. సత్యమేమిటి? పది పేజీల 'ఆర్థిక వ్యవస్థ' భాగానికి రాసిన పరిచయంలో కాంగ్రెస్ ఇలా పేర్కొంది : 'కాంగ్రెస్ ఆర్థిక విధానం దేశ ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యాన్ని ఇస్తోంది. 1991లో సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టి, శీఘ్రగతిన ఆర్థిక పురోగతికి కాంగ్రెస్ విశేషంగా దోహదం చేసింది. ఆ విధానాల కారణంగానే ఇతోధికంగా సంపద సృష్టి జరిగింది. మధ్యతరగతి వర్గం అభివృద్ధి చెందింది. లక్షలాది కొత్త ఉద్యోగాల సృష్టి జరిగింది, విద్యారంగం, ఆరోగ్య, భద్రత రంగాలలో పెను మార్పులు సంభవించాయి. ఎగుమతులు బాగా పెరిగాయి. కోట్లాది ప్రజలు పేదరికం నుంచి విముక్తమయ్యారు స్వేచ్ఛా విపణి వ్యవస్థకు మేము కట్టుబడి ఉన్నాము. ప్రైవేట్ రంగం ఆర్థికాభివృద్ధికి చోదక శక్తిగా ఉంటుంది. ప్రైవేట్ రంగానికి సంపూరకంగా ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధిపరుస్తాము'.

అబద్ధం: కాంగ్రెస్ అధికారానికి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు స్వస్తి చెబుతుంది. సత్యమేమిటి? కాంగ్రెస్ మేనిఫెస్టో ఇలా పేర్కొంది: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై పరిమితిని 50 శాతానికి మించి పెంచేందుకు రాజ్యాంగ సవరణ తీసుకువస్తామని కాంగ్రెస్ హామీ ఇస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాలలో కేటాయించిన 10 శాతం రిజర్వేషన్లను అన్ని కులాల వారికీ ఎటువంటి వివక్ష లేకుండా అమలుపరుస్తాము. కేంద్ర ప్రభుత్వంలో భర్తీకాకుండా మిగిలిపోయిన ఉద్యోగ ఖాళీలను అధికారానికి వచ్చిన ఏడాదిలోగా భర్తీ చేస్తాము'. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యున్నతికి కాంగ్రెస్ ఇంకా పలు హామీల నిచ్చింది.

అబద్ధం: కాంగ్రెస్ ప్రభుత్వం వారసత్వ సంపదపై పన్ను విధిస్తుంది. సత్యమేమిటి? పన్నుల విధానం, పన్నుల సంస్కరణలకు సంబంధించిన 12 అంశాలలో భాగంగా ప్రత్యక్ష పన్నుల కోడ్‌ను తీసుకువస్తామని, వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లను ఐదేళ్ల పాటు నిలకడగా ఉంచుతామని, సెస్‌లను 5 శాతానికి మించి పెంచమని, రెండో జీఎస్టీని రూపొందించి అమలుపరుస్తామని, ఎంఎస్‌ఎంఈలు, కిరాణా వ్యాపారాలపై పన్నుల భారాన్ని తగ్గిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. న్యాయ్ పత్రలో ఎక్కడా వారసత్వ పన్ను గురించిన ఊసే లేదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అబద్ధాలు చెప్పారు; కాంగ్రెస్ మేనిఫెస్టో 'న్యాయ్ పత్ర'లోని సత్యాలు ఎన్నికల ప్రచారంలో ప్రధాన చర్చనీయాంశాలు కావడానికి దోహదం చేశారు; ఈ వాద ప్రతివాదాలలో బీజేపీ మేనిఫెస్టో 'మోదీకి గ్యారంటీ'ని ప్రస్తావించనే లేదు.. తద్వారా కాంగ్రెస్ మేనిఫెస్టోపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ ప్రశంసాపూర్వక వ్యాఖ్యను మోదీ సమర్థించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 లోక్‌సభ ఎన్నికల నిజమైన హీరో అని నరేంద్ర మోదీ ఒప్పుకున్నారు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అరాచకమా, అభివృద్ధా.. తేల్చుకోవాలి

విశాలమైన సముద్రతీరం, పుష్కలమైన వనరులు, అపారమైన మేధోసంపత్తి, కష్టపడే తత్వం ఆంధ్రప్రదేశ్ సొంతం. అయినా అడుగడుగునా వెనుకబాటుతనం రాష్ట్రాన్ని పట్టిపీడిస్తోంది. రాజధాని ఏదంటే చెప్పుకోలేని దౌర్భాగ్యస్థితి, ఉద్యోగాల కోసం, పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రాలకు తరలి వెళ్లాల్సిన దీనస్థితి. కేంద్రప్రభుత్వం చూపే సవతితల్లి వైఖరి దీనికి కొంత కారణమయితే రాష్ట్ర ప్రజలుగా మనకు మనం చేసుకున్న ద్రోహమే అన్నింటికన్నా ఎక్కువని చెప్పాలి. కులాలకుళ్లు, మతాలమత్తులో తూగుతూ ఎంతకాలం వంచన చేసుకుంటూ గడుపుదాం? దుర్మార్గపాలకులు పడేసే ముష్టి కోసం, వాళ్ళిచ్చే చిన్నాచితక ఉద్యోగాల కోసం ఎంతకాలం మనస్సాక్షిని మోసం చేసుకుందాం? ఎంతకాలం వాళ్లు చెప్పే కట్టుకథలు నమ్ముతూ వత్తాసు పలుకుదాం? కుల, మత, ప్రాంతపరమైన భావనలను పక్కనపెట్టి ప్రస్తుత కీలకదశలో, ఇప్పటిదాకా జరిగిన కుట్రలను, తప్పిదాలను అందరం ఆత్మావలోకనం చేసుకోవాలి.

నిజంగా సదుద్దేశంతోనే మూడు రాజధానులు ఏర్పాటు చేయాలనుకునే నాయకుడు అమరావతిలో వేలకోట్లు ఖర్చు చేసి కట్టిన కట్టడాలను, రోడ్లను ఎందుకు గాలికి వదిలేస్తాడు? తాను వల్లించే మూడు రాజధానుల్లో ఒకటైన అమరావతిని అడవిలా ఎందుకు మారుస్తాడు? అసలు రాష్ట్రాభివృద్ధిని కోరుకునే నేతే అయితే శరవేగంగా రూపుదిద్దుకుంటున్న ఒక మహానగరాన్ని ఎందుకంత నిర్దాక్షిణ్యంగా నామరూపాలు లేకుండా చేయాలని చూస్తాడు? కోట్లు ఖర్చు చేసి కట్టిన ప్రజావేదిక లాంటి ప్రభుత్వ భవనాల్ని కుంటిసాకులతో ఎందుకు కూలుస్తాడు? అమరరాజా, లూలూ లాంటి కంపెనీలను రాష్ట్రం నుంచి ఎందుకు తరిమేస్తాడు? యువతకు ఉద్యోగాలు రాకుండా, రాష్ట్రానికి పెట్టుబడులు దక్కకుండా ఎందుకు అడ్డుకుంటాడు? ఇలా చెప్పుకుంటూ పోతే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాజకీయకక్షతో చేసిన విధ్వంసం, అరాచకాలు ఎన్నో. రాజకీయ ప్రత్యర్థి మీద అక్కసుతో కోట్లు వెచ్చించి కట్టిన టిడ్కో ఇళ్లను పేదలకు కేటాయించకుండా పాడు చేయడం వాస్తవం కాదా? పేదల ఆకలి తీర్చే అన్నక్యాంటీన్లు మూసేయడం నిజం కాదా? పంతం పట్టి వాటిని మరుగుదొడ్లుగా మార్చడం నిజం కాదా? నాయకులు అహంకారంతో ప్రజాధనాన్ని, రాష్ట్రవనరులను చిత్తం వచ్చినట్లు నాశనం చేస్తుంటే, మన కులస్థుడని, మన మతస్థుడని, మనకు తాయిలాలు ఇచ్చాడని చూస్తూ ఊరుకుందామా?



ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి రాజకీయ ప్రత్యర్థుల మీద కక్ష సాధించడం కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఇంతగా పణం పెట్టడం చరిత్రలో ఎప్పుడైనా జరిగిందా? ఒక వ్యక్తి చర్యల వల్ల ఈ రాష్ట్రం ఎంత సంపద కోల్పోయింది? ఎందరు విద్యావంతులు ఉద్యోగాలు లేక పరాయిప్రాంతాలకు వలసవెళ్లారు? ఎంతమంది కార్మికులు ఇక్కడ పనులు దొరక్క పొట్టకూటి కోసం పరాయిపంచన చేరారు? అనే అంశాల గురించి ప్రజలందరూ చిత్తశుద్ధితో ఆలోచించాలి.

గత ప్రభుత్వ హయాంలో 70 శాతం పూర్తైన పోలవరం ప్రాజెక్టు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సారథ్యంలో కొంచెం కూడా ముందుకు కదలక పోవడం ఆయన అసమర్థత అనుకోవాలా లేక చంద్రబాబు మీద అక్కసుతో తొక్కిపెట్టాడనుకోవాలా? ఆయన తీరు చూస్తుంటే, మూడు రాజధానుల బిల్లు మాదిరిగానే ఆ ప్రాజెక్టును కూడా మట్టుపెట్టే అవకాశం ఉంది. మూడు పోలవరాల బిల్లో, మరొకటో తెచ్చి మూడుప్రాంతాల్లో మూడు పిల్ల కాలువలు తవ్వి పోలవరం ప్రాజెక్ట్ వికేంద్రీకరణ అంటూ తన అనుయాయులతో ఉద్యమాలు చేయించినా చేయించొచ్చు. ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి రాజకీయ ప్రత్యర్థుల మీద కక్ష సాధించడం కోసం రాష్ట్రప్రయోజనాలను ఇంతగా పణం పెట్టడం చరిత్రలో ఎప్పుడైనా జరిగిందా? ఒక వ్యక్తి చర్యల వల్ల ఈ రాష్ట్రం ఎంత సంపద కోల్పోయింది? ఎందరు విద్యావంతులు ఉద్యోగాలు లేక పరాయిప్రాంతాలకు వలసవెళ్లారు? ఎంత మంది కార్మికులు ఇక్కడ పనులు దొరక్క పొట్టకూటి కోసం పరాయిపంచన చేరారు? అనే అంశాల గురించి ప్రజలందరూ చిత్తశుద్ధితో ఆలోచించాలి. ముఖ్యమంత్రి నిర్హేతుకచర్యల వల్ల ఈ రాష్ట్రానికి జరిగిన నష్టానికి ఎవరు జరిమానా కట్టాలి? ఇంత విధ్వంసం చేసి కూడా 'వై నాట్ 175' అంటుండడం విస్మయం కలిగిస్తోంది.

ఇక పథకాల విషయానికి వస్తే... నిత్యావసరాల రేట్లు పెంచి, అప్పులు తెచ్చి, ఆస్తులు తాకట్టుపెట్టి తాయిలాలు ఇవ్వడం సరైన పనేనా? సంపద సృష్టించి, రాష్ట్ర ఆదాయాన్ని పెంచి సంక్షేమపథకాలు అమలు చేస్తే అదికదా సమర్థత, గొప్పతనం. ఉచితాలను, సంక్షేమపథకాలను ఆశించేవారు ఈ నిజాన్ని గ్రహించకపోతే తాము కూర్చున్న కొమ్మను తామే నరుక్కున్నవాళ్ళవుతారు.

ప్రభుత్వభవనాల పేర్లు మార్చి, రంగులు వేసినంత మాత్రాన అది అభివృద్ధి కాబోదు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయానికి, కోడెల శివప్రసాదరావు చొరవతో కట్టిన ఆసుపత్రికి తండ్రిపేరు పెట్టుకోవడం, ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేసుకోవడం వగైరా చర్యలను అభివృద్ధి అనగలమా? విజ్ఞులు ఆలోచించాలి. పరిశ్రమలు వస్తే, పెట్టుబడులు వెల్లువెత్తితే, ఉద్యోగాలు లభిస్తే, ఆదాయం పెరిగితే, మౌలిక సదుపాయాలు మెరుగుపడితే... అదీ అసలైన అభివృద్ధి.

కులం ఉచ్చులో, మతం ఉచ్చులో పడి మళ్ళీ మోసపోయి అరాచకనేతలను తిరిగి అందలం ఎక్కిస్తే రాష్ట్రం పతనం అంచుకు చేరుతుంది. అభివృద్ధికాముకలకు అధికారం అప్పగిస్తే రాష్ట్రానికి మళ్ళీ ప్రపంచపటంలో స్థానం లభిస్తుంది. రాష్ట్రప్రజానీకమంతా మళ్ళీ తలెత్తుకుని తిరగగలుగుతుంది.

• డా. గోనుగుంట్ల శ్రీనివాసరావు
నరసరావుపేట

ప్రత్యర్థికి విరాళం!

అవి 1955 మధ్యంతర ఎన్నికలు ఆంధ్రాలో జరిగే రోజులు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున జవ్వాది లక్ష్మయ్య, కమ్యూనిస్టు పార్టీ తరఫున వంక సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. పోటీ హోరాహోరీగా సాగుతోంది. కమ్యూనిస్టు పార్టీ ఒక కారు సంపాదించి ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకోమని సత్యనారాయణకి పంపించింది. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు పెట్రోలుకు కూడా డబ్బులు లేని సత్యకాలం అది. సత్యనారాయణ తన ప్రత్యర్థి లక్ష్మయ్య దగ్గరకెళ్లి విషయం చెప్పి విరాళం అడిగారట. నాపై పోటీ చేస్తూ నన్ను విరాళం అడుగుతున్నావా? అంటే... అది మా పార్టీ నిర్ణయం సార్ అన్నారట సత్యనారాయణ. నీకు డబ్బులుగా ఇస్తే అల్లరవుతుంది కానీ నాకు మార్టేరులో పెట్రోల్ బంకు ఉంది. అక్కడ వెయ్యి రూపాయల పెట్రోలు ఉచితంగా కొట్టమని చెప్తాను, వెళ్లండి అని చెప్పారట లక్ష్మయ్య. ఎలక్షన్ కాలానికంతా ఆ పెట్రోలు సరిపోయిందని వంకా తన ఆత్మకథ తొమ్మిదిపదుల్లో రాసుకున్నారు.

– చెరుకూరి సత్యనారాయణ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

కన్నీరు–పన్నీరు

ఓ ఓటరు మహాశయులారా!
మీ సౌఖ్యమే కాదు
లోక హితం, సమాజశ్రేయస్సు
మనందరి బాధ్యతని గుర్తెరిగి
అభివృద్ధి నిరోధకులను
ఓడించడానికి ఏకంకండి.

ఉద్యోగం రాక, ఉపాధి లేక
జీవనం అంధకారబంధురమై
నైరాశ్యంలో నలిగిపోయే భావితరాలకు
భవితనిచ్చుటకై
అభివృద్ధికి శరాఘాతాలైన
ఉచితాలపై
చండప్రచండులై విజృంభిద్దాం,
వ్యవస్థలోని అవస్థలను ప్రశ్నించి
అభివృద్ధికి ఆకాశమే హద్దు చేసేద్దాం.
రండీ! కదలిరండి ఓట్ల పండుగకు.

ఓ ఓటరా!
త్యాగమూర్తుల చేతులు
భరతమాత నుదుట దిద్దిన వీరతిలకం
దశదిశలా ప్రకాశింపచేసిన
ప్రభాత అరుణిమ ఈ నేల,
విద్యలతో విలసిల్లిన వేదభూమి ఇది.
అంత ఘన చరిత్ర ఉన్న ఈ గడ్డని
తమ స్వార్థ రాజకీయాలకు
బలి చేసేస్తున్నారు
నేటి తరం రాజకీయ నాయకులు,
తమ అనాలోచితచర్యలతో
మరో నైజీరియాలా చెయ్యబోతున్నారు.

అందుకే ప్రస్తుతపు ఎన్నికల పండుగ
నీ జీవితానికి వికాశం!
అవకాశాన్ని చేజార్చుకుంటే కన్నీరు!
ఒడిసిపట్టుకుంటే పన్నీరు!
చేసుకుంటే సద్వినియోగం
చేసినట్టే అశ్వమేధ యాగం!
ఆలోచించి ఉత్తములను ఎన్నుకో,
నీ పురిటిగడ్డను నీవే కాపాడుకో.

– వేమూరి శ్రీనివాస్

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై జగన్‌రెడ్డి కన్నెర్ర..!

హుద్‌హుద్ తుపానుతో విశాఖ నగరం చివురుటాకులా వణికిపోయినప్పుడు ప్రజలు తిండికీ, తాగునీటికీ అవస్థలు పడ్డారు. వారం రోజుల పాటు బస్సులో ఉంటూ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిస్థితిని చక్కదిద్దారు. చివరి బాధితుడికి కూడా సహాయం అందించిన తర్వాతే తిరిగి వెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి మాత్రం నా తల్లిని ఓడించినందుకే విశాఖకు ఈ పరిస్థితి దాపురించిందని హేళన చేశారు. అలాంటి వ్యక్తి ఉత్తరాంధ్రకు, విశాఖ నగరానికి మేలు చేస్తాడంటే ఇక్కడి ప్రజలు ఎందుకు నమ్ముతారు? 2019 ఎన్నికల సమయంలో ఇక్కడ వచ్చిన ఫలితాలు అందుకు నిలువెత్తు సాక్ష్యం. రాష్ట్రమంతా వైసీపీ హవా ఉన్నా కూడా నగరంలోని నాలుగు స్థానాల్లో జనం టీడీపీకి అండగా నిలిచారు. తర్వాత కాలంలో విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా, ఐటీ హబ్‌గా మార్చేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేశారు. పెట్టుబడి సదస్సులు పెట్టి ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. ఐటీ హిల్స్, డేటా సెంటర్, ప్రపంచంలోనే టాప్ 5 సాఫ్ట్‌వేర్ కంపెనీలుగా పిలుచుకునే ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి సంస్థల్ని విశాఖలో స్థాపించేందుకు సన్నాహాలు చేశారు.

సీఐఐ సదస్సులు, పెట్టుబడిదారుల రాకపోకలతో కళకళలాడుతున్న విశాఖ నగరాన్ని, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని జగన్‌రెడ్డి వచ్చాక ఉన్మాదానికి, వికృత చేష్టలకు నిలయంగా మార్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి నిత్యం మాట్లాడే ముఖ్యమంత్రి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మద్దతుగా నిలుస్తున్నారు. గంగవరం పోర్టు ప్రైవేటుపరం చేశారు. రైల్వే జోన్ గాలికొదిలేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి మేలు చేసే ప్రాజెక్టులు, సంస్థల్ని తరిమేసి ఈ ప్రాంతాన్ని ఉద్ధరిస్తాను, ఇక్కడే మకాం వేస్తానని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదం.

2024లో ప్రభుత్వం మారాక విశాఖలో పరిస్థితులు కూడా మారిపోయాయి. పాలకుల ప్రాధాన్యతలు మారిపోయాయి. మూడు రాజధానుల్లో ఒక రాజధానిని విశాఖలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకు విశాఖ అభివృద్ధి కోసం గానీ, రాజధాని కోసం గానీ ఇటుక రాయి కూడా వేయలేదు. పైగా ఉత్తరాంధ్రకు తలమానికమైన రుషికొండకు బోడిగుండు కొట్టారు. రూ.5వేల కోట్ల విలువైన దసపల్లా భూముల్ని వైసీపీలో నెం.2గా ఉండే ఒక ఎంపీ తన బినామీలతో కబ్జా చేశారు. రుషికొండ ఐటి హిల్ దగ్గర ఎన్‌సీసీకి ఇచ్చిన 65 ఎకరాలు అదే ఎంపీ తన అల్లుడి సంస్థకి కట్టబెట్టారు. బీచ్ రోడ్డులోని బే పార్కులో 9 ఎకరాలు హెటిరోకి సమర్పించారు. రుషికొండ ఐటి హిల్ వద్ద రేడియంట్ డెవలపర్‌కి ఇచ్చిన 52 ఎకరాలు సిండికేట్ అయ్యి లాక్కున్నారు. ఆర్.కె. బీచ్ రోడ్డులో లులూ కోసం సేకరించిన 5 ఎకరాల ప్రైవేటు భూమి, ఏపీఐఐసీకి సంబంధించిన 8 ఎకరాలూ వెనక్కి లాక్కుని అమ్ముకున్నారు. షీలానగర్ వద్ద వైసీపీ ఎంపీకి 28 ఎకరాలు కారు చౌకగా కట్టబెడితే అక్కడ 800 అపార్ట్‌మెంట్లు, 100 విల్లాలు నిర్మించారు. కార్తీక వనాన్ని వాటాలు వేసి పంచుకున్నారు. గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టి కమిషన్లు పొందారు. చివరికి విశాఖకు తలమానికంగా నిలిచిన విశాఖ ఉక్కు భూముల్ని కూడా దోచేసేందుకు ప్రైవేటీకరణకు తలూపారు.

తెలుగుదేశం ప్రభుత్వం మూడు అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక సదస్సులను నిర్వహించి రూ.15.45 లక్షల కోట్ల పెట్టుబడులు, 32 లక్షల ఉద్యోగాలు కల్పించేలా వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. రూ.5 లక్షల కోట్లు విలువైన 39,450 పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటై 5,13,351 ఉద్యోగాలు కల్పించినట్లు అసెంబ్లీ సాక్షిగా నాటి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి ప్రకటించారు. కానీ జగన్‌రెడ్డి వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే పారిశ్రామికవేత్తలు వణికిపోయే పరిస్థితి నెలకొంది. విదేశీ పెట్టుబడులు లేక, స్వదేశీ పెట్టుబడుల రాక, ఉద్యోగాలు లేక చదువుకున్న యువత రోడ్డున పడ్డారు. పక్కనున్న తెలంగాణకు రూ.46 వేల కోట్ల పెట్టుబడులొస్తే.. ఏపీకి వచ్చింది కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమేనంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



చంద్రబాబు అధికారంలో ఉన్నపుడు ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి చేశారు. శ్రీకాకుళంలో ఐఐటి, భావనపాడు ఓడరేవు, డయాలసిస్ కేంద్రాలు, కిడ్నీ ఆస్పత్రి, వంశధార–బాహుదా అనుసంధానం, వంశధార రిజర్వాయర్ పూర్తి, ఆఫ్‌షోర్ రిజర్వాయర్, విజయనగరంలో ట్రైబల్ యూనివర్సిటీ, భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, తోటపల్లి రిజర్వాయర్, పతంజలి ఫుడ్ పార్క్, ఐఐఎం, పెట్రోలియం యూనివర్సిటీ, ఫిన్‌టెక్ వ్యాలీ, మిలీనియం ఐటీ టవర్స్ ప్రణాళికలు రచించారు. యన్‌ఏడి ఫ్లై ఓవర్ పూర్తి చేశారు. మూడు సీఐఐ సదస్సులతో రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు, 30 లక్షల ఉద్యోగాలకు ఎంవోయు కుదుర్చుకున్నారు. హుద్‌హుద్ తుపాను వల్ల దెబ్బతిన్న విశాఖ పునరుద్ధరణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సీఐఐ సదస్సులు, పెట్టుబడిదారుల రాకపోకలతో కళకళలాడుతున్న విశాఖ నగరాన్ని, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని జగన్‌రెడ్డి వచ్చాక ఉన్మాదానికి, వికృత చేష్టలకు నిలయంగా మార్చారు. ఆ విషయాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాదరావు బయటపెట్టారు. ఉత్తరాంధ్రపై విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి పెత్తనమేంటని ప్రశ్నించారు.

మరోవైపు పులివెందుల పంచాయతీలు, గంజాయి, డ్రగ్స్‌కు ఈ ప్రాంతం కేంద్రంగా మారిపోయింది. విశాఖ అభివృద్ధిలో కీలకమైన రైల్వే జోన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించక పోవడం వల్లే పనులు జరగడం లేదని కేంద్ర మంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మెట్రో ఏమైందో తెలియదు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి ప్రశ్నించిన దాఖలాలే లేవు. భోగాపురం ఎయిర్‌పోర్టు, ట్రైబల్ యూనివర్సిటీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లున్నాయి. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, లులూ సంస్థలను పొరుగు రాష్ట్రాలకు తరిమేశారు. ఆంధ్ర యూనివర్సిటీని రాజకీయాలతో కలుషితం చేశారు. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు రూ.1,590 కోట్లు ఖర్చు చేయగా, జగన్‌రెడ్డి ఖర్చు చేసింది రూ.498 కోట్లేనని ఆ పార్టీ వారే అసెంబ్లీ సాక్షిగా బయటపెట్టారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి నిత్యం మాట్లాడే జగన్‌రెడ్డి.. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మద్దతుగా నిలుస్తున్నారు. మరో నాలుగేళ్లలో ప్రభుత్వం చేతుల్లోకి రావాల్సిన గంగవరం పోర్టు ప్రైవేటుపరం చేశారు. రైల్వే జోన్ గాలికొదిలేశారు. విశాఖ–చెన్నై పెట్రోలియం కారిడార్ పూర్తి చేయలేదు. రూ.80 వేల కోట్ల పెట్టుబడితో వచ్చిన అదానీ డేటా సెంటర్‌ను తెలంగాణకు తరిమేశారు. మిలీనియం టవర్స్ ఖాళీ చేయించారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి మేలు చేసే ప్రాజెక్టులు, సంస్థల్ని తరిమేసి ఈ ప్రాంతాన్ని ఉద్ధరిస్తాను, ఇక్కడే మకాం వేస్తానని ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదం. అసలు ఉత్తరాంధ్ర అభివృద్ధికి గానీ, ఇక్కడి ప్రజల ఆత్మాభిమానం కాపాడడానికి గానీ ఏనాడూ చొరవ చూపని వ్యక్తిని నమ్మేదే లేదని ప్రజలు తేల్చి చెబుతున్నారు.

▪ ఎం.శ్రీభరత్
విశాఖపట్నం, పార్లమెంటు అభ్యర్థి

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

భూస్వామ్య విధానాన్ని రద్దు చేసి, దున్నేవానికి భూమి పంచినప్పుడు, తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ప్రజలకు ప్రజాస్వామిక హక్కులు గ్యారంటీ చేసినప్పుడు, అమెరికా అగ్రరాజ్య ప్రభావం నుంచి బయటపడి, స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించినప్పుడు మాత్రమే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయి. అంటే భూమి, ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం కోసం చేసే పోరాటం ద్వారా మాత్రమే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయి. ఈ లక్ష్యాలను సాధించడానికి భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (యుసిసిఆర్ఐ–ఎం.ఎల్) విప్లవ ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి కృషి చేస్తున్నది.

భారతదేశం 'క్వాడ్' నుంచి బయటకు రావాలి. ఇండో–పసిఫిక్ వ్యూహాన్ని తిరస్కరించాలి. అమెరికా అనుకూల విదేశాంగ విధానం నుంచి బయటపడి, మనదేశ నిజమైన జాతీయ ప్రయోజనాలకు, శాంతికి, అభివృద్ధికి తోడ్పడే స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించాలి. యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించాలి. అమెరికా వ్యూహానికి సేవచేసేది కాకుండా స్వతంత్ర ఆర్థిక విధానం అనుసరించాలి.

జాతీయ పరిశ్రమలకు, ప్రత్యేకించి తెలుగు జాతీయ పరిశ్రమలకు రక్షణ కల్పించాలి. కార్మికుల, మధ్యతరగతి వర్గాల పని పరిస్థితులను మెరుగుపరచాలి, వారి జీతాలను పెంచాలి. భూస్వామ్య విధానం రద్దు చేయాలి, దున్నేవానికి భూమిని పంచాలి. ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక విద్యా సంస్కృతులను అభివృద్ధి చేయాలి. ప్రత్యేకించి తెలుగు ప్రజల జాతీయ ఐక్యతను, తెలుగు సంస్కృతి, భాషల సర్వతోముఖాభివృద్ధి సాధించాలి. అన్ని నిర్బంధాలను రద్దు చేయాలి. జాతీయ, ప్రజాస్వామిక, విప్లవ శక్తులందరికీ సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని గ్యారంటీ చేయాలి.

ఈ నినాదాలతో తెలంగాణలో 11 లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్‌లో 4 లోక్‌సభ, 12 అసెంబ్లీ స్థానాల్లో యుసిసిఆర్ఐ (ఎం.ఎల్) పోటీ చేస్తూ పాలకవర్గాల ప్రజావ్యతిరేక, అభివృద్ధి నిరోధక విధానాలను ఎండగడుతుంది.

– జి. వినోద్
కార్యదర్శి, యుసిసిఆర్ఐ(ఎం.ఎల్)

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వేసవి పానీయం... 'రసాల'

భీముడు చేసిన పానీయం...

'రసాల' పానీయానికి కనీసంలో కనీసం రెండు వేల సంవత్సరాల ప్రాచీనత ఉంది. వాతాన్ని, పైత్యాన్ని, రక్తస్రావాన్ని అరికట్టే ఔషధంగా ఈ 'రసాల' పానీయాన్ని ఇవ్వాలని ఆయుర్వేద సంహితా గ్రంథాలు పేర్కొన్నాయి. దాని అర్థం... ఆ వ్యాధులున్నవారికే అని కాదు! సమస్త మానవాళికీ సర్వ వేళలా తీసుకోదగిన గొప్ప పానీయం అని. దీన్ని భీముడు అరణ్యవాస సమయంలో ఎండన పడివచ్చిన కృష్ణుడి కోసం స్వయంగా తయారు చేశాడని 'భావప్రకాశ' గ్రంథం పేర్కొంది. 'భావప్రకాశ'లో చెప్పిన శ్లోకమే 'క్షేమకుతూహలం' లోనూ ఉంది. దీన్నే 'శిఖరిణీ' అని కూడా పిలుస్తారు. తెలుగువాళ్ల 'సిగరి' అన్నారు.

రసాల అనగానే ఎవరికైనా 'బాలరసాల సాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్' అనే పోతనగారి పద్యం గుర్తుకొస్తుంది. తన ఆంధ్ర మహాభాగవత కృతిని గున్నమామిడి చెట్టు లేత చిగురులా కోమలమైనదని భావించాడు పోతన మహాకవి. ఈ పద్యంలో 'రసాల' అంటే మామిడి అని! మామిడి పండు రసంలా తియ్యగా ఉండే పానీయం కాబట్టి.. తియ్యటి పెరుగుతో చేసిన పానీయాన్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో 'రసాల' అనే పానీయంగా పేర్కొన్నాడు.

'రసాల'... తయారీ ఇలా...

కొద్దిగా పులిసిన గట్టి గేదె పెరుగును ఒక కప్పు కొలతలో మట్టి లేదా పింగాణీ పాత్రలోకి తీసుకోండి. అందులో సగం అంటే, అర కప్పు పంచదార, రెండు కప్పుల నీళ్లు కలిపి బాగా చిలకాలి. ఏలకుల పొడి, లవంగాలపొడి, పచ్చకర్పూరం, మిరియాల పొడి తగుమాత్రంగా కలపండి. చిటికెడంత ఉప్పు వేస్తే ఎలక్ట్రొలైట్ బ్యాలెన్స్ ఇస్తుంది. జీలకర్ర కూడా కలపవచ్చు. ఉత్తరాదివాళ్లు నల్ల ఉప్పు, జీలకర్ర, పంచదార కలిపితే 'నమ్కీన్ లస్సీ' అని, అల్లం, కారం, జీడిపప్పు వగైరా కలిపితే 'మసాలా లస్సీ' అని, పంచదార, కొన్ని సుగంధ ద్రవ్యాలు కలిపితే 'మీఠీ లస్సీ' అని... ఇలా అనేక లస్సీలు ఉత్తరాదిలో బాగా ప్రసిద్ధి.

ఇంట్లో చేసుకునేప్పుడు కొద్ది నిమిషాలు చల్లదనం కలిగేంతవరకూ దీన్ని ఫ్రిజ్జులో ఉంచొచ్చు. అతిగా చల్లదనం ఉండకూడదు. బజార్లో ఐస్ ముక్కలు కలుపుతారు. ఆ ఐస్ మానవ వినియోగం కోసం లైసెన్స్ పొందినది కాకపోవచ్చు. అందుకని బజార్లో దొరికే 'రసాల' పానీయాన్ని తాగేట్లయితే ఐస్ ముక్కల్లేకుండా తీసుకోండి.

రసాల అంటే లస్సీయేనా?

ఆధునిక కాలంలో దీన్ని లస్సీ అంటున్నారు. 'లస్సీ' అనేది పంజాబీ పదం. పెరుగులో నీళ్లు, సుగంధ ద్రవ్యాలు కలిపి చిలికిన మజ్జిగ అని దీని భావం. లస్సీ అంటే పంచదార లేదా ఉప్పు కలిపిన మజ్జిగ అని మన హోటళ్లవాళ్ల అభిప్రాయం. లస్సీ తెమ్మంటే స్వీటా? సాల్టా? అనడుగుతారు. లస్సీలో స్వీటు సాల్టుతో పాటు సుగంధ ద్రవ్యాలు కూడా ఉంటాయి. సాధారణంగా బయట మనం తాగేది నిజమైన లస్సీ కాదు.

ప్రయోజనాలెన్నో...

గ్రీష్మే తథా శరది యే రవిశోషితాంగా యే చ ప్రమత్తవనితాసు రతాతిస్విన్నాః!



యే చాపి మాథపరిసర్పణస్విన్నగాత్రా స్తేషామియం వపుషి పోషణమాశు కుర్యాత్!

ఈ ఎండాకాలం ప్రతిరోజూ ఒక గ్లాసుడు 'రసాల' తాగితే ఎండబాధ నుంచి బయటపడవచ్చు. స్థూలకాయం, షుగరు, కఫ వ్యాధులతో బాధపడేవారికి తప్ప అందరికీ ఇది మంచిదే! అలసటను నివారిస్తుంది. పోషణనిస్తుంది. స్త్రీ, పురుషులకు మంచిది.

రసాలా శుక్రలా బల్యా రోచనీ వాతజిత్సరా!
దీపనీ బృంహణీ స్నిగ్ధా మధురా శిశిరా సరా!
రక్తపిత్తం తృషాం దాహం ప్రతిశ్యాయం చ నాశయేత్!

రోజూ 'రసాల' తాగితే పురుషుల్లో జీవకణాలు పెరుగుతాయి. బలకరం. నోటికి రుచి తెలుస్తుంది. వాతాన్ని జయిస్తుంది. కీళ్ల వాతం, నడుంనొప్పి, మైగ్రేన్ తలనొప్పి సహా వాతవ్యాధులన్నింటిలోనూ మేలు చేస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. కడుపు నిండుగా ఉంటుంది. వేసవి కాలానికి అనువైనది. 'సరగుణం'.. అంటే శరీరం అంతా వ్యాపించే గుణం కలిగి ఉంటుంది. ఏదైనా ఔషధాన్ని వేసుకుని అనుపానంగా ఈ 'రసాల'ను తాగితే చాలా త్వరగానూ, శక్తివంతంగానూ పని చేస్తుంది. బీపీ తగ్గిస్తుంది. రక్తస్రావాన్ని అరికడుతుంది. దప్పిక తీరుస్తుంది. న్యూరైటిస్ లాంటి నరాల జబ్బుల్లో బాగా పని చేస్తుంది. అరికాళ్లలో, అరిచేతుల్లో మంటల్ని తగ్గిస్తుంది. పడిసె భారాన్ని, ఎన్నటికీ వదలని జలుబునీ తగ్గిస్తుంది. చిక్కిపోతున్నవాళ్లకు, శుష్కింపచేసే వ్యాధులు, కీళ్లవాతంతోనూ, రక్తస్రావం బీపీ, గుండె జబ్బులతోనూ బాధపడేవారికి ఇది మంచి ఔషధం. చలవనిస్తుంది. వడదెబ్బ నుంచి రక్షిస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

మామిడి పండ్ల రసంతో కూడా...

ముఖ్యంగా వేసవి పానీయంగా 'రసాల'ను తయారు చేసుకోవటం ఒక అవసరం. ఈ ఏడాది అసాధారణ వేసవి అంటున్నారు కాబట్టి, దీని అవసరం ఇంటిల్లిపాదికీ ఉంటుంది. ఎటుతిరిగీ మావిడిపండ్ల సీజనే కాబట్టి 'రసాల' అనే పేరుని సార్థకం చేస్తూ పెరుగుకు సమానంగా తియ్య మావిడి రసం కలిపి, బాగా చిలికి, అందులో సుగంధద్రవ్యాలు, చిటికెడంత ఉప్పు చేర్చుకుని తాగితే వడదెబ్బ మన జోలికి రాదు.

పప్పులో ఏముందీ? అనుకోకండి. బోలెడన్ని ప్రొటీన్లు ఉన్నాయి. నాన్‌వెజ్ తినని వారు తరచుగా పప్పుతో సావాసం చేస్తే సరి... తప్పకుండా గట్టిగా ఉంటారు. ఎప్పుడు చేసినా పప్పులో ఏదో కొత్తదనం ఉంటుంది. చామకూర, చామగడ్డ, చింత చిగురుతో పప్పు వండుకోండిలా..

వంటిల్లు



అన్నమేసి... ఇంత పప్పేసి!

చింతచిగురు పప్పు

కావాల్సిన పదార్థాలు:
చింతచిగురు- 1 కప్పు, కందిపప్పు- 1 కప్పు, పచ్చిమిర్చి- 5, ఉల్లిపాయ- 1, పసుపు- పావు టీస్పూన్, ఉప్పు- తగినంత, నూనె- 3 టీస్పూన్లు, నెయ్యి- 1 టీస్పూన్, ఎండుమిర్చి- 2, ఆవాలు- పావు టీస్పూన్, జీలకర్ర- పావు టీస్పూన్, ఇంగువ- చిటికెడు, కరివేపాకు- 2 రెబ్బలు, వెల్లుల్లి- 4 రెబ్బలు

తయారీ విధానం:
కందిపప్పు కడిగి నీళ్లు పోసి సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, పసుపు, అరచెంచా నూనె వేసి ఉడికించాలి. పప్పు సగం ఉడికిన తర్వాత చింత చిగురు అరచేతులతో నలిపి పప్పులో వేసి తగినంత ఉప్పు వేసి కలిపి ఉడికించాలి. పప్పు, చింతచిగురు ఉడికిన తర్వాత దింపేయాలి. చిన్న గిన్నెలో నూనె, నెయ్యి కలిపి వేడి చేసి ఇంగు వేయాలి. అది కరిగిన తర్వాత జీలకర్ర వేయాలి. అవి చిటపటలాడతుండగా ఎండుమిర్చి, కరివేపాకు, నలక్కొట్టిన వెల్లుల్లి రెబ్బలు వేసి కొద్దిగా వేపి ఉడికిన పప్పులో వేసి మూత పెట్టాలి. ఈ పప్పువేడి అన్నంలో కలిపి తింటే రుచిగా ఉంటుంది.



చింతకాయ పప్పు

కావాల్సిన పదార్థాలు:
పచ్చి చింతకాయలు- 100 గ్రాములు, కందిపప్పు- 200 గ్రాములు, ఉల్లిపాయ- 1, పచ్చిమిర్చి-3, కొత్తిమీర- కొద్దిగా, కరివేపాకు- 2 రెబ్బలు, కారంపొడి- 1 టీస్పూన్, పసుపు- పావు టీస్పూన్, ఉప్పు- తగినంత, ఆవాలు- పావు టీస్పూన్, జీలకర్ర- పావు టీస్పూన్, నూనె- 3 టీస్పూన్లు

తయారీ విధానం:
కందిపప్పు కడిగి నీళ్లు పోసి కొంచెం నూనె, పసుపు వేసి ఉడికించాలి. చింతకాయ దంచి కప్పు నీళ్లు పోసి అరగంట నానబెట్టాలి. తర్వాత పావుకప్పు పులుసు తీసి పెట్టుకోవాలి. పులుపు ఎక్కువగా కావాలనుకుంటే కొంచెం ఎక్కువ వేసుకోవచ్చు. పప్పు సగం ఉడికిన తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి వేసి కలపాలి. ఐదు నిముషాల తర్వాత కారంపొడి, చింతకాయ పులుసు, ఉప్పు వేసి ఐదు నిముషాల పాటు ఉడకనివ్వాలి. పప్పును గరిటెతో మెదిపి దింపేయాలి. చిన్న గిన్నెలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేయాలి. అవి చిటపటలాడుతుండగా కరివేపాకు వేసి పప్పులో కలపాలి. ఇందులో కారంపొడి బదులు మొత్తం పచ్చిమిర్చి కూడా వేసుకోవచ్చు.



చామకూర సెనగ పప్పు

కావాల్సిన పదార్థాలు:
చేమకూర ఆకులు- 8 పెద్దవి, సెనగపప్పు- 250 గ్రాములు, చింత పండు- నిమ్మకాయంత, పచ్చిమిర్చి- 6 లేదా 8, పసుపు- పావు టీస్పూన్, ఉప్పు- తగినంత, కరివేపాకు- 2 రెబ్బలు, ఎండుమిర్చి- 3, ఆవాలు, జీలకర్ర- పావు టీస్పూన్, వెల్లుల్లి- 6 రెబ్బలు, నూనె- రెండున్నర పావు టీస్పూన్, నెయ్యి- 1 టీస్పూన్

తయారీ విధానం:
సెనగపప్పు కడిగి తగినన్ని నీళ్లు పోసి అరచెంచా నూనె, పసుపు వేయాలి. చామకూర ఆకులు కడిగి సన్నగా తరిగి వేసి ఉడికించాలి. పప్పు ఉడికిన తర్వాత సన్నగా తరిగిన పచ్చిమిర్చి, చింతపండులోని నార తీసి చిన్న ముక్కలుగా చేసి వేయాలి. తగినంత ఉప్పు వేసి మరికొద్ది సేపు ఉడికించాలి. ఇంకో చిన్న గిన్నెలో నూనె, నెయ్యి కలిపి వేడి చేసి ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి వేసి కాస్త వేగిన తర్వాత వెల్లుల్లి, పొట్టు తీసి నలక్కొట్టి వేయాలి. కాస్త ఎర్రబడ్డాక ఉడికిన పప్పులో వేసి కలిపి మూత పెట్టాలి.

చామకూర కందిపప్పు

కావాల్సిన పదార్థాలు:
కందిపప్పు- 100 గ్రాములు, చామ ఆకులు- 6, ఉల్లిపాయ- 1 చిన్నది, పచ్చిమిర్చి- 4, కరివేపాకు- 1 రెమ్మ, పసుపు- పావు టీస్పూన్, చింత పండు- చిన్న నిమ్మకాయంత, ఉప్పు- తగినంత, నూనె- 1 టీస్పూన్, నెయ్యి- 1 టీస్పూన్, వెల్లుల్లి- 3 రెబ్బలు, ఆవాలు- పావు టీస్పూన్, జీలకర్ర- పావు టీస్పూన్, ఇంగువ- చిటికెడు

తయారీ విధానం:
కందిపప్పు కడిగి నీళ్లు పోసి అరగంట నానబెట్టాలి. తర్వాత పసుపు, కొంచెం నూనె, సన్నగా తరిగిన ఉల్లిపాయ, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి వేసి ఉడికించాలి. పప్పు సగం ఉడికిన తర్వాత కడిగి సన్నగా తరిగిన చామకూర, నార, గింజలు తీసిన చింతపండు రెక్కలు, తగినంత ఉప్పు వేసి ఉడికించాలి. పప్పు ఉడికిన తర్వాత మెదపాలి. చిన్న గిన్నెలో నూనె, నెయ్యి వేడి చేసి ఇంగువ వేయాలి. అది కరిగిన తర్వాత ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడుతుండగా పొట్టు తీసి నలక్కొట్టిన వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు వేసి కొద్దిగా వేగిన తర్వాత పప్పులో వేసి కలిపి మూతపెట్టాలి.



చామగడ్డ పప్పు

కావాల్సిన పదార్థాలు:
కందిపప్పు- 200 గ్రాములు, ఉల్లిపాయ-1, చామగడ్డలు- 200 గ్రాములు, పచ్చిమిర్చి- 1, కరివేపాకు-2 రెబ్బలు, కొత్తిమీర- కొద్దిగా, గరం మసాలా పొడి- పావు టీస్పూన్, పసుపు- అర టీస్పూన్, కారం పొడి- 1 టీస్పూన్, అల్లం వెల్లుల్లి ముద్ద- 1 టీస్పూన్, ఆవాలు- పావు టీస్పూన్, జీలకర్ర- పావు టీస్పూన్, టమాటా-1, చింత పండు పులుసు- పావు కప్పు, ఉప్పు- తగినంత, నూనె- 3 టీస్పూన్లు

తయారీ విధానం:
కందిపప్పు కడిగి నీళ్లు పోసి సగం పసుపు కొంచెం నూనె వేసి ఉడికించాలి. చామగడ్డలు పొట్టు తీసి ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. గిన్నెలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడాక సన్నగా తరిగిన ఉల్లిపాయ, కరివేపాకు వేసి మెత్తబడేవరకూ మూతపెట్టాలి. చామగడ్డలు కొద్దిగా వేగిన తర్వాత సన్నగా తరిగిన టమాటా వేసి ఇందులో చింతపండు పులుసు, అరకప్పు నీళ్లు కలిపి మూతపెట్టి ఉడికించాలి. చామగడ్డలు మెత్తబడ్డ తర్వాత ఉడికించిన కందిపప్పు, తగినంత ఉప్పు వేసి కలిపి మరికొద్ది సేపు ఉడికించాలి. చివరలో గరం మసాలా పొడి, కొత్తిమీర వేసి కలిపి దింపేయాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gBsiuHdలో చదవండి.

'స్మార్ట్' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FqyANIY లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

దాసరి వ్యక్తి కాదు వ్యవస్థ

• నేడు దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి
• డైరెక్టర్స్ డేగా పాటిస్తున్న తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం


సినిమా అనేది ఒక కళ. ఈ రంగంలో రాణించాలంటే ముందుగా అవకాశాలు రావాలి. కానీ అతి సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వారికి అవకాశాలు దొరకడం చాలా కష్టం. అయినా మనిషికి సంకల్పం ఉంటే అదేమీ అసాధ్యం కాదని తెలుగు సినీ రంగంలో అనేక మంది నిరూపించారు. అలాంటి వారిలో అగ్రగణ్యులు, దర్శక దిగ్గజం, దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణ రావు. దర్శకుడిగా, రచయితగా, నిర్మాతగా, రాజకీయ నాయకుడిగా, పత్రికాధిపతిగా ఇలా అన్నింట్లోనూ తన దైన ముద్ర వేశారు.

జీవితంలో ఫలానా స్థాయిలో ఉండాలనీ, లేదంటే ఒక గోల్ పెట్టుకొని దాన్ని సాధించాలని గానీ దాసరి నారాయణరావు ఎప్పుడూ అనుకోలేదు. పదో ఏటనే ఆయనకు నాటకరంగంపై ఆసక్తి ఏర్పడింది. రంగస్థలంలో ఉద్యోగం చేయడానికి 60వ దశకంలోనే హైదరాబాద్‌లో అడుగుపెట్టిన ఆయన రవీంద్రభారతి, గాంధీభవన్‌లో నాటకాలు వేస్తుండేవారు. అక్కడ దాసరిని చూసిన వైవీ కృష్ణయ్య అనే దర్శకుడు తన సినిమాలో కమెడియన్ వేషం ఆఫర్ చేయగా, దానికి దాసరి ఇష్టపడలేదట. 'నేను స్టేజ్ డైరెక్టర్‌ను, రైటర్‌ను, గోల్డ్‌మెడలిస్టును ఈ పాత్ర ఎందుకు చేయాలి' అనుకున్నారట. కానీ ఆయన స్నేహితులు మాత్రం ఇది చాలా మంచి అవకాశం అన్నారట. చివరికి మద్రాసు, వాహినీ స్టూడియోలో అడుగుపెట్టిన తొలిరోజునే మేకప్ వేసుకుని షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇలా సినిమా రంగంలో ఎవరికీ జరగలేదని, తనకు మాత్రమే ఆ అవకాశం వచ్చిందని ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు.

కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా వాళ్ల తండ్రి పిల్లలను బాగా చదివించారట. స్కూల్ అయిపోయిన తర్వాత తన ఖర్చుల కోసం అరటిపళ్లు అమ్మానని ఆయన చెప్పారు. అలా పేదరికం, ఆకలి తెలిసిన దాసరి తర్వాత సినిమా రంగంలో పనిచేసే కార్మికులు, చిన్న నటీనటుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. భారీ బడ్జెట్ సినిమాలు అవసరమే కానీ అదే సమయంలో చిన్న సినిమాలు బతికితే వాటి ద్వారా ఎక్కువ మందికి ఉపాధి దొరుకుతుందని చాలా సందర్భాల్లో చెప్పారు.

తెలుగు సినిమా అంటే రాంగోపాల్ వర్మకు ముందు తర్వాత అంటారు. అలాంటిది ఒక సందర్భంలో దాసరి, ఆయన దర్శకత్వం వహించిన 'శివరంజని' సినిమా లు దర్శకుడిగా తనను ఎంతగానో ప్రభావితం చేశాయని రామ్‌గోపాల్ వర్మ స్వయంగా చెప్పారు. ఆ సినిమాలో మోహన్‌బాబు, జయసుధ పాత్రలను మలిచిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. దాసరి గారి క్యారెక్టరైజేషన్స్ బాగా స్టడీ చేయడం వల్లే రియలిస్టిక్ పాత్రలను సృష్టించగలిగాను అని వర్మ చెప్పారు. అందుకే దాసరి అంటే వ్యక్తి కాదు వ్యవస్థ, సినిమా పాఠశాల.

చాలామంది సినీ నటులను దాసరి తయారుచేశారు. చాలా మంది టెక్నీషియన్స్ ఆయన స్కూల్‌నుంచి వచ్చారు. అందుకే హీరో, హీరోయిన్ల వల్లే సినిమా ఆడుతుందంటే ఆయన అంగీకరించలేదు. దర్శకులు, ప్రొడక్ట్ ప్రొడ్యూసర్, ఆ సినిమాకు పని చేసిన మొత్తం టీం వల్లే సినిమా విజయవంతం అవుతుందని అని అనేక సందర్భాల్లో కుండబద్దలు కొట్టారు. సినిమాలకు ఇచ్చే రాయితీలు లాంటివి చిన్న నిర్మాతలకు, చిన్న సినిమాకు ఎప్పటికీ అందుబాటులో ఉండాలనేవారు. తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో చిన్న సినిమాలను ప్రోత్సహించడానికి రాయితీలు ఇస్తున్నారనీ, అలాంటి ప్రోత్సాహకాలు మన దగ్గర కూడా కావాలన్నారు. సినిమాకు కెప్టెన్ దర్శకుడే. సినిమాలోని



పాత్రలు, సన్ని వేశాలు, పాటల చిత్రీకరణ, కామెడీ ఇలా అన్నీ దర్శకుడి విజన్ నుంచే పుట్టుకొస్తాయి. దర్శకుడికి ఉండే అభిరుచితోనే మంచి సాహిత్యం, సంగీతంతో పాటు విజువల్‌గానూ సినిమా బాగున్నదనే ప్రశంసలు వస్తాయి. దాని వెనుక దర్శకుడి కృషి ఎంతో ఉంటుంది. దర్శకుడు ఒక ప్రేక్షకుడిగా మారి, తన హీరో ఎలా ఉండాలి, తన సినిమాలో పాత్రలు ఎలా ఉంటే అవి ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయి అన్న అంశాలపై చాలా ఆలోచించి రాసుకొని, వాటిని చిత్రీకరిస్తాడు. అందుకే దర్శకత్వం అనేది చాలా బాధ్యతతో కూడుకున్న పని.

మనం ఇవాళ గొప్పగా చెప్పుకుంటున్న మలయాళ సినిమాల కంటే దశాబ్దాల ముందే దాసరి మధ్య తరగతి సినిమాను తీసుకొచ్చి తన మార్క్‌ను చూపెట్టారు. కమర్షియల్ సినిమాతో పాటు దాసరి నారాయణరావు అందించిన స్ఫూర్తితో చిన్న సినిమాలతో జాతీయ స్థాయిలో తెలుగు సినిమాకు మంచి కథలు రాసి, సినిమాలు చేయాలి. అదే దాసరి గారికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

44 ఏళ్ల పాటు చిత్ర పరిశ్రమలో కొనసాగి ఎంతోమందికి సినీ జీవితాన్ని ప్రసాదించడంతో పాటు పరిశ్రమకు పెద్దదిక్కుగా కొనసాగిన దాసరి నారాయణరావు జయంతి (మే - 04)ని డైరెక్టర్స్‌డేగా తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘం నిర్ణయించి, సెలబ్రేట్ చేస్తోంది.

• **కుమారస్వామి (అక్షర),** సెన్సార్ బోర్డ్ సభ్యులు

వర్క్ పూర్తి చేసిన అక్షయ్



డాక్టర్ మోహన్ బాబు, మోహన్‌లాల్, ప్రభాస్, శరత్‌కుమార్ వంటి మేటి నటులతో రూపుదిద్దుకొంటున్న 'కన్నప్ప' చిత్రంలో విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కోసం ఇటీవల వచ్చిన బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ తన సన్నివేశాలకు సంబంధించిన వర్క్ పూర్తి చేశారు. ఈ విషయాన్ని మంచు విష్ణు సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. 'అక్షయ్‌కుమార్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైంది' అని పేర్కొన్నారు విష్ణు. ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది.

పడుచు గుండె చప్పుడు



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేశ్ మేనల్లుడు అశోక్ గల్లా నటిస్తున్న రెండో చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. ఆధ్యాత్మిక అంశాలు కలిగిన ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ చిత్రం నుంచి 'ఏమయిందే' అంటూ సాగే లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. సురేశ్ గంగుల రాసిన ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. హీరోయిన్ పై హీరోకు ఉన్న ప్రేమను, పడుచు గుండె చప్పుడుని చాలా అందంగా, అద్భుతంగా ఈ పాటలో చూపించారు. రసూల్ ఎల్లోర్ విజువల్స్ పాటకు ప్రాణం పోశాయి. నల్లపనేని యామిని సమర్పణలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది.

పొలిటికల్ సెటైర్

ఓటర్లే వారి ఓటుకు ఓ రేటు నిర్ణయించేసుకుని రాజకీయ నాయకులను ముప్పుతిప్పలు పెట్టే కథాంశంతో రూపొందిన 'లక్ష్మీ కటాక్షం' చిత్రం ఈ నెల పదిన విడుదల కానుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల హోరు వినిపిస్తుంటే పొలిటికల్ సెటైరికల్‌గా రూపొందిన 'లక్ష్మీ కటాక్షం' చిత్రం ఆ ఎన్నికలకు సరిగ్గా మూడు రోజుల ముందు విడుదలవుతుండడం గమనార్హం. డ్రామా, హాస్యం కలగలసిన ఈ చిత్రంలో సాయికుమార్, వినయ్, అరుణ్, దీప్తి వర్మ, చరిష్మా శ్రీకర్, హరిప్రసాద్, సాయికిరణ్ ఏడిద తదితరులు నటించారు. యు.శ్రీనివాసుల రెడ్డి, బి.నాగేశ్వరరెడ్డి, వహీద్ షేక్, కె.పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ సినిమాకు రచన, దర్శకత్వం: సూర్య.



7 అదానీ కంపెనీలకు సెబీ షోకాజ్ నోటీసులు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లోని 7 లిస్టెడ్ కంపెనీలకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నుంచి షోకాజ్ నోటీసులు అందాయి. లిస్టింగ్ నిబంధనలను పాటించకపోవడంతో పాటు రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్ నియమావళి ఉల్లంఘనకు సంబంధించి జనవరి-మార్చి త్రైమాసికంలో సెబీ ఈ నోటీసులు జారీ చేసిందని అదానీ గ్రూప్ కంపెనీలు విడివిడిగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించాయి. మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం, 2023-24 ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాలతో పాటు ఈ విషయాన్ని తెలిపాయి. గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ సహా అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ విల్మర్ ఈ జాబితాలో ఉన్నాయి. అయితే, తామెలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని, సెబీ నోటీసులతో ఎలాంటి ప్రభావం ఉండబోదంటూ అన్ని కంపెనీలూ ఒకే తీరుగా స్పందించాయి. కానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ విల్మర్ మినహా మిగతా నాలుగు కంపెనీల ఆడిటర్లు మాత్రం సెబీ దర్యాప్తు ఫలితం భవిష్యత్‌లో కంపెనీలపై ఆర్థికంగా ప్రభావం చూపించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. కాగా, సెబీ నుంచి తమకెలాంటి నోటీసులందలేదని అదానీ గ్రూప్‌నకు చెందిన లిస్టెడ్ సిమెంట్ కంపెనీలైన ఏసీసీ, అంబుజా సిమెంట్ స్పష్టం చేశాయి.

గ్రూప్ మీడియా సంస్థ ఎన్‌డీటీవీ మాత్రం ఈ విషయంపై ఏ విధంగానూ స్పందించలేదు. కాగా, హిండెన్‌బర్గ్ ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమిత కమిటీ క్లీన్‌చిట్ ఇచ్చిందంటూ అదానీ గ్రూప్‌తో పాటు బీజేపీ చేసిన తప్పుడు దావాను సెబీ షోకాజ్ నోటీసులు తేటతెల్లం చేశాయని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది.

అదానీ గ్రూప్ చాలాకాలంగా అకౌంటింగ్ మోసాలకు పాల్పడటంతోపాటు అనుచిత పద్ధతుల్లో గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందని అమెరికన్ మార్కెట్ రీసెర్చ్, షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ 2023 జనవరి 24న ఆరోపించిన విషయం తెలిసిందే. దాంతో అదానీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీతో పాటు చిన్న మదుపరులు భారీగా నష్టపోయారు. ఈ విషయంపై దర్యాప్తు చేయాలని సెబీని ఆదేశించడంతో పాటు గత ఏడాది మార్చి 2న సుప్రీంకోర్టు ఓ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ దర్యాప్తులో భాగంగానే అదానీ కంపెనీలకు సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

ఈ నోటీసులపై కంపెనీలిచ్చే వివరణ ఆధారంగా సెబీ వాటిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలా..? వద్దా..? అనే విషయంపై ఓ నిర్ణయానికి రానుంది. సాధారణంగా ఈ ఉల్లంఘనల తీవ్రత ఆధారంగా జరిమానా విధింపు లేదా సంస్థ యాజమాన్యాన్ని క్యాపిటల్ మార్కెట్ నుంచి కొంత కాలం పాటు నిషేధించే అవకాశాలుంటాయి.

అరబిందో ఫార్మాకు జీఎస్‌టీ నోటీసు

హైదరాబాద్: తప్పుడు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ క్లెయిమ్ అభియోగంపై అరబిందో ఫార్మాకు జీఎస్‌టీ అధికారుల నుంచి వడ్డీ, పెనాల్టీ సహా రూ.13 కోట్ల డిమాండ్ నోటీసు అందింది. హైదరాబాద్‌లోని పంజాగుట్ట డివిజన్ డిప్యూటీ కమిషనర్ (ఎస్‌టీ) ఎస్‌టీయూ-1 నుంచి ఈ పన్ను నోటీసు అందినట్టు అరబిందో ఫార్మా రెగ్యులేటరీ సంస్థలకు పంపిన ప్రకటనలో తెలిపింది.

రూ.6,54,50,645 ఐటీసీ రివర్సల్‌తో పాటు వడ్డీగా రూ.5,92,20,900, పెనాల్టీగా రూ.65,51,354 చెల్లించాలని ఆ నోటీసులో ఆదేశించినట్టు పేర్కొంది. దీనిపై అప్పిలేట్ యంత్రాంగం ముందు అప్పీల్ చేయనున్నట్టు కూడా తెలియచేసింది. తమ ఆర్థిక వ్యవహారాలపై గాని, కంపెనీ కార్యకలాపాలపై గాని దీని ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది.

రూ.2.25 లక్షల కోట్లు ఆవిరి

- భారీగా తరిగిన మార్కెట్ సంపద
- సెన్సెక్స్ 733 పాయింట్లు పతనం
- 74,000 దిగువ స్థాయికి సూచీ
- 22,500 కిందికి జారిన నిఫ్టీ-50

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో భారీ నష్టాలను చవిచూశాయి. చాలా కంపెనీల షేర్లు చాలా అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో మదుపరులు పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. శుక్రవారం ఆరంభ ట్రేడింగ్‌లో 484 పాయింట్ల వరకు పెరిగి 75,000 ఎగువ స్థాయికి చేరిన సెన్సెక్స్.. కొద్దిసేపటికే నష్టాల్లోకి మళ్లింది. క్రమంగా నష్టాలు పెరుగుతూ వచ్చాయి. ఒక దశలో సూచీ 1,147 పాయింట్ల మేర క్షీణించి 73,467.73 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో కాస్త కోలుకుని 732.96 పాయింట్ల నష్టంతో 73,878.15 వద్ద ముగిసింది. నిఫ్టీ విషయానికొస్తే, ప్రారంభ ట్రేడింగ్‌లో 146.5 పాయింట్ల వృద్ధితో 22,794.70 వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసిన సూచీ.. చివరికి 172.35 పాయింట్ల నష్టంతో 22,475.85 వద్ద క్లోజైంది. అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.25 లక్షల కోట్లు పతనమై రూ.406.24 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నేలచూపులు చూశాయి

మరింత తగ్గిన ఫారెక్స్ నిల్వలు: వరుసగా మూడో వారమూ విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు క్షీణించాయి. గతనెల 26తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు మరో 241.2 కోట్ల డాలర్లు తగ్గి 63,792.2 కోట్ల డాలర్లకు పడిపోయాయని ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. అంతక్రితం వారంలో నిల్వలు 228 కోట్ల డాలర్ల మేర తగ్గాయి. కాగా, ఏప్రిల్ 5తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 64,856.2 కోట్ల డాలర్లకు పెరిగాయి.

సిగ్నిటీలో మరో 26% కొనుగోలుకు కోఫోర్జ్ ఓపెన్ ఆఫర్

సిగ్నిటీ టెక్నాలజీస్ పబ్లిక్ షేర్‌హోల్డర్ల నుంచి 26 శాతం వాటా కొనుగోలుకు కోఫోర్జ్ శుక్రవారం ఓపెన్ ఆఫర్‌ను ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన ఐటీ సేవల కంపెనీ సిగ్నిటీ టెక్నాలజీస్ ప్రమోటర్లు, ఎంపిక చేసిన వాటాదారుల నుంచి 54 శాతం వరకు వాటా కొనుగోలు చేస్తున్నట్లు, ఒక్కో షేరుకు రూ.1,415 చొప్పున చెల్లించనున్నట్లు గురువారం ప్రకటించిన కోఫోర్జ్.. సెబీ నిబంధనల ప్రకారంగా ఈ ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించింది. ఓపెన్ ఆఫర్‌లోనూ ఒక్కో షేరుకు రూ.1,415 చొప్పున చెల్లించనున్నట్లు తెలిపింది. ఆఫర్‌లో భాగంగా 26 శాతం వాటాకు సమానమైన 71.62 లక్షల షేర్ల కొనుగోలుకు కోఫోర్జ్ రూ.1,013 కోట్లు వెచ్చించనుంది.

మార్కెట్లోకి బజాజ్ పల్సర్ ఎన్ఎస్ 400

- ఇప్పటి వరకు 1.8 కోట్ల పల్సర్ బైక్స్ విక్రయం
- కంపెనీ ఎండీ రాజీవ్ బజాజ్



ధర రూ.1.85 లక్షలు

పుణె: ద్విచక్ర వాహన దిగ్గజం బజాజ్ ఆటో మార్కెట్లోకి సరికొత్త పల్సర్ ఎన్ఎస్ 400జీ మోటార్‌సైకిల్‌ను విడుదల చేసింది. ఈ బైక్ ధర రూ.1,85,000 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). శుక్రవారం పుణెలో జరిగిన కార్యక్రమంలో బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ ఈ బైక్‌ను లాంఛనంగా మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్సర్ ఎన్ఎస్ 400తో స్పోర్ట్స్ బైక్ విభాగంలో కంపెనీ స్థానం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఈ కొత్త బైక్‌ను రూ.5,000 చెల్లించి బుక్ చేసుకోవచ్చని, అయితే ఈ ఆఫర్ పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉంటుందని చెప్పారు. 373 సీసీ ఇంజన్, 6 స్పీడ్ గేర్‌బాక్స్, బ్లూటూత్ కనెక్టివిటీతో కలర్ ఎల్‌సీడీ స్పీడోమీటర్, నాలుగు రకాల రైడ్ మోడ్స్ ఈ బైక్ ప్రత్యేకతలు. కాగా ఇప్పటి వరకు 1.8 కోట్ల పల్సర్ బైక్స్‌ను విక్రయించినట్లు రాజీవ్ బజాజ్ తెలిపారు. స్పోర్ట్స్, కమ్యూటర్ బైక్స్, త్రిచక్ర వాహనాల మార్కెట్లో మరింత పట్టును చేజిక్కించుకునేందుకు ద్విముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 125 సీసీ బైక్స్ విభాగంలో కంపెనీకి ఇప్పటికే 32 శాతం మార్కెట్ వాటా ఉందని, దీన్ని మరింతగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజీవ్ బజాజ్ చెప్పారు.

జూన్‌లో సీఎన్‌జీ మోటార్‌సైకిల్: కాగా ఈ ఏడాది జూన్ 18న ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్‌ను ఆవిష్కరించనున్నట్లు రాజీవ్ బజాజ్ వెల్లడించారు. పెట్రోల్ ధరలు భారీగా పెరిగిపోయిన పరిస్థితుల్లో వాహనదారులకు ఊరటనిచ్చే ఉద్దేశంతో ఈ బైక్‌ను రూపకల్పన చేసినట్లు తెలిపారు.

పన్నుల మోతతోనే అధిక ధరలు: దేశీయంగా వాహన పరిశ్రమపై ఉన్న అతి నియంత్రణలతోనే వాహన ధరలు గణనీయంగా పెరిగిపోయాయని రాజీవ్ బజాజ్ వ్యాఖ్యానించారు. బ్రెజిల్ వంటి దేశాల్లో మోటార్‌సైకిల్స్‌పై పన్నులు 8-14 శాతం శ్రేణిలో ఉండగా భారత్‌లో మాత్రం జీఎస్‌టీ ఏకంగా 28 శాతం ఉందని ఆయన తెలిపారు. దీంతో వాహనాల ధరలను తగ్గించే పరిస్థితి ఉండటం లేదన్నారు. ప్రభుత్వం జీఎస్‌టీని 12-18 శాతానికి తగ్గిస్తే వినియోగదారులతో పాటు ఆటోమొబైల్ పరిశ్రమకు మేలు చేకూరుతుందని రాజీవ్ అన్నారు.

సెలెక్ట్ మొబైల్స్ 6వ వార్షికోత్సవ ఆఫర్లు



హైదరాబాద్: సెలెక్ట్ మొబైల్స్ 6వ వార్షికోత్సవ ఆఫర్లను ప్రకటించింది. ఈ నెల 3 నుంచి జూన్ 4 వరకు ఈ వార్షికోత్సవ మెగా సేల్ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని సెలెక్ట్ సీఎండీ వై గురు వెల్లడించారు. వార్షికోత్సవ ఆఫర్లలో భాగంగా ప్రతి మొబైల్ కొనుగోలుపై ఉచిత బహుమతులతో పాటు సరికొత్త స్మార్ట్‌ఫోన్స్‌పై ప్రత్యేక ఆఫర్లను ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే ల్యాప్‌టాప్, యాక్సెసరీస్‌కు కూడా ఈ ఆఫర్లను అందిస్తున్నట్లు గురు తెలిపారు. మొబైల్ కొనుగోలుపై స్మార్ట్ టీవీ, కూలర్, ఫ్రంట్‌లోడ్ వాషింగ్ మెషిన్ లాంటి బహుమతులను ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్లపై 60 శాతం వరకు డిస్కౌంట్, ఎస్‌బీఐ కార్డ్‌పై 7.5 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్, బజాజ్ ఫైనాన్స్ ద్వారా చేసే కొనుగోలుపై రూ.4,000 వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌ను వినియోగదారులకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక ఆఫర్లు అన్ని సెలెక్ట్ మొబైల్స్ స్టోర్లలో అందుబాటులో ఉంటాయని గురు తెలిపారు.

ఫీనిక్స్ నుంచి కార్యాలయ స్థలం కొనుగోలు : క్లింట్

హైదరాబాద్: ఫీనిక్స్ గ్రూప్ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిర్మిస్తున్న 25 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు క్యాపిటాల్యాండ్ ఇండియా ట్రస్ట్ (క్లింట్) ప్రకటించింది. ఈ ప్రదేశాన్ని నిర్మాణం పూర్తయిన అనంతరం తాము కొనుగోలు చేయనున్నట్టు తెలిపింది. ఈ ఒప్పందం కింద ఫీనిక్స్ గ్రూప్ అధిక వడ్డీకి తీసుకున్న రుణం రీఫైనాన్స్ కోసం క్లింట్ రూ.215 కోట్లు అందిస్తుంది. ఆ తర్వాత కూడా భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ ముందస్తు కొనుగోలు హైదరాబాద్‌లో తమ స్థానాన్ని పటిష్ఠం చేస్తుందని క్యాపిటాల్యాండ్ ఇండియా ట్రస్ట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ సంజీవ్ దాస్ గుప్తా తెలిపారు. కాగా అవాన్సే హైదరాబాద్, సైబర్‌పెరల్, ఇంటర్నేషనల్ టెక్ పార్క్ హైదరాబాద్ ఇప్పటికే క్లింట్ పోర్టుఫోలియోలో ఉన్నాయి.

యాపిల్ ఇండియా ఆదాయంలో కొత్త రికార్డు

భారత్‌లో యాపిల్ మార్చి త్రైమాసికాదాయంలో కొత్త రికార్డు నమోదు చేసింది. స్థూలంగా ఆదాయాల్లో 4% క్షీణత ఏర్పడినప్పటికీ భారత్‌లో బలమైన రెండంకెల వృద్ధిరేటును సాధించింది. ఈ త్రైమాసికంలో కంపెనీ 908 కోట్ల డాలర్ల ఆదాయం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 4% తక్కువ. త్రైమాసికంలో ఐఫోన్ అమ్మకాలు 10.4%తగ్గి 459 కోట్ల డాలర్లకే పరిమితం అయ్యాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	87,200 ▲
ముంబై	71,191 ▼	65,211 ▼	79,989 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	450
వరంగల్	447	గోదావరి	450
చిత్తూరు	523	విశాఖపట్నం	460
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	గోదావరి	137
వరంగల్	129	విజయవాడ	137
కరీంనగర్	129	గుంటూరు	137
మహబూబ్‌నగర్	129	ఒంగోలు	137
కర్నూలు	129	చిత్తూరు	132
విశాఖపట్నం	129		

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: బెంగళూరు

బెంగళూరు X గుజరాత్

కోల్‌కతా కమాల్

ముంబై అవకాశాలు దాదాపు గల్లంతు

- అదరగొట్టిన బౌలర్లు
- పేసర్ స్టార్క్‌కు నాలుగు వికెట్లు
- రాణించిన వెంకటేశ్ అయ్యర్



స్టార్క్ (4/33)

వెంకటేశ్ అయ్యర్ (70)

2 ఐపీఎల్‌లో 2 వేల రన్స్, 100+ వికెట్లు తీసిన రెండో ప్లేయర్‌గా రస్సెల్. గతంలో జడేజా ఈ ఫీట్ సాధించాడు.

2 ఐపీఎల్‌లో ఎక్కువ వికెట్లు (184) తీసిన రెండో బౌలర్‌గా పీయూష్ చావ్లా. చాహల్ (200) ముందున్నాడు.

4 ఐపీఎల్ మ్యాచ్‌లో ఇరుజట్లు ఆలౌటవడం ఇది నాలుగోసారి.

ముంబై: ఒకటి కాదు.. రెండు కాదు.. 12 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వాంఖడే మైదానంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజయం రుచి చూసింది. ఓ దశలో 57/5 స్కోరుతో ఇబ్బంది పడినా, వెంకటేశ్ అయ్యర్ (52 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 70) కీలక ఇన్నింగ్స్‌తో కేకేఆర్ కోలుకుంది. ఆ తర్వాత స్వల్ప లక్ష్యాన్ని కాపాడే క్రమంలో బౌలర్లు ఆరంభం నుంచే ముంబై బ్యాటర్లను కట్టడి చేశారు. పేసర్ స్టార్క్ (4/33) స్థాయికి తగ్గ బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 24 రన్స్‌తో నెగ్గిన కేకేఆర్ 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అటు ముంబైకిది వరుసగా నాలుగో ఓటమి. కేవలం 6 పాయింట్లతో ఉన్న ఈ జట్టు ఇక ముందుకెళ్లడం అసాధ్యమే. ముందుగా కోల్‌కతా 19.5 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. మనీశ్ పాండే (31 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 42) సహకరించాడు. బుమ్రా, తుషారలకు మూడేసి వికెట్లు, హార్దిక్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 18.5 ఓవర్లలో 145 పరుగులకు ఆలౌటైంది. సూర్యకుమార్ (56) ఒక్కడే రాణించాడు. స్పిన్నర్లు నరైన్, వరుణ్.. పేసర్ రస్సెల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వెంకటేశ్ నిలిచాడు.

బౌలర్ల హవా: ఓ మాదిరి ఛేదనలో ముంబై ఇన్నింగ్స్ కూడా తడబడుతూనే సాగింది. స్పిన్నర్లు నరైన్, వరుణ్‌ల ధాటికి పవర్‌ప్లేలోనే ఇషాన్ (13), నమన్ (11), రోహిత్ (11)ల వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత మధ్య ఓవర్లలో రస్సెల్.. ఆఖర్లో స్టార్క్ కీలక వికెట్లతో దెబ్బతీశారు. ఓవైపు సూర్యకుమార్ నిలిచినా.. మరో ఎండ్‌లో అతడికి సహకరించేవారు కరువయ్యారు. మధ్య ఓవర్లలో తిలక్ (4), నేహల్ వధేరా (6), హార్దిక్ (1)ల వికెట్లు కోల్పోవడంతో 71/6 స్కోరుతో ముంబై ఓటమి దిశగా పయనించింది. కానీ 14వ ఓవర్‌లో సూర్య చెలరేగి 4,6,4,4తో 20 రన్స్ సాధించడంతో పాటు 30 బంతుల్లో ఫిఫ్టీ కూడా పూర్తి చేశాడు. చివరి 30 బంతుల్లో 51 రన్స్ అవసరమైన వేళ మ్యాచ్ ముంబై వైపు తిరిగింది. కానీ 16వ ఓవర్‌లో సూర్యను రస్సెల్ అవుట్ చేయడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్టయ్యింది. ఇక 19వ ఓవర్‌లో టిమ్ డేవిడ్ (24), చావ్లా (0), కొట్జీ (8)లను స్టార్క్ పెవిలియన్‌కు చేర్చి 7 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకున్న వెంకటేశ్-మనీశ్ పాండే: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఆరంభం పేలవంగా ఉన్నా.. ఇన్నింగ్స్‌ను గౌరవప్రదంగానే ముగించింది. దీనికి వెంకటేశ్ అయ్యర్-మనీశ్ పాండే అందించిన భాగస్వామ్యమే కారణం. కానీ డెత్ ఓవర్లలో తిరిగి పుంజుకున్న ముంబై బౌలర్లు కేకేఆర్‌ను భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. పేసర్ తుషార తొలి మూడు ఓవర్లలోనే మూడు వికెట్లు తీసి కేకేఆర్ వెన్నువిరిచాడు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ సాల్ట్ (5)ను తొలి ఓవర్‌లోనే అవుట్ చేయగా.. తన మరో ఓవర్‌లో రఘువంశీ (13), కెప్టెన్ శ్రేయాస్ (6)ల పనిబట్టాడు. ఇంకో ఓపెనర్ నరైన్ (8)ను హార్దిక్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. రింకూ సింగ్ (9) కూడా నిరాశపరిచి చావ్లాకు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ దెబ్బకు 57/5 స్కోరుతో కేకేఆర్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో వెంకటేశ్, ఇంపాక్ట్ ప్లేయర్ మనీశ్ పాండే మధ్య ఓవర్లలో అండగా నిలిచారు. వికెట్ కాపాడుకునేందుకు ఆరంభంలో నెమ్మదిగానే ఆడినా.. పదో ఓవర్‌లో పాండే ఫోర్‌తో స్కోరులో కాస్త కదలిక వచ్చింది. ఇక 12వ ఓవర్‌లో వెంకటేశ్ 4,6తో 15 రన్స్ అందించగా, స్కోరు కూడా వంద పరుగులు దాటింది. అటు బుమ్రా ఓవర్‌లో పాండే 4,6తో ఆకట్టుకున్నాడు. 36 బంతుల్లో వెంకటేశ్ హాఫ్‌సెంచరీ పూర్తయ్యింది. అంతా సజావుగా సాగుతున్న వేళ చివర్లో జట్టు ఒక్కసారిగా తడబడింది. 17వ ఓవర్‌లో హార్దిక్ 20 పరుగులిచ్చుకున్నా ముంబైకి కావాల్సిన బ్రేక్ ఇచ్చాడు. పాండే వికెట్ తీయడంతో ఆరో వికెట్‌కు 83 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. అదే ఓవర్‌లో సమన్వయలోపంతో రస్సెల్ (7) రనౌట్ కావడం జట్టు భారీ స్కోరుపై ప్రభావం పడింది. తర్వాతి ఓవర్‌లోనే రమణ్‌దీప్ (2), స్టార్క్ (0)లను బుమ్రా పెవిలియన్‌కు చేర్చాడు. ఆఖరి ఓవర్‌లో వెంకటేశ్‌ను కూడా బుమ్రా బౌల్డ్ చేయడంతో మరో బంతి ఉండగానే కేకేఆర్ ఇన్నింగ్స్ ముగిసింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	10	8	2	0	16	0.622
కోల్‌కతా	10	7	3	0	14	1.098
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
హైదరాబాద్	10	6	4	0	12	0.072
చెన్నై	10	5	5	0	10	0.627
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
పంజాబ్	10	4	6	0	8	-0.062
గుజరాత్	10	4	6	0	8	-1.113
ముంబై	11	3	8	0	6	-0.356
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) తిలక్ (బి) తుషార 5, నరైన్ (బి) హార్దిక్ 8, రఘువంశీ (సి) సూర్యకుమార్ (బి) తుషార 13, శ్రేయాస్ (సి) డేవిడ్ (బి) తుషార 6, వెంకటేశ్ (బి) బుమ్రా 70, రింకూ (సి అండ్ బి) చావ్లా 9, మనీష్ పాండే (సి/సబ్) బ్రేవిస్ (బి) హార్దిక్ 42, రస్సెల్ (రనౌట్) 7, రమణ్‌దీప్ (సి) కొట్జీ (బి) బుమ్రా 2, స్టార్క్ (బి) బుమ్రా 0, వైభవ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.5 ఓవర్లలో 169 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-7, 2-22, 3-28, 4-43, 5-57, 6-140, 7-153, 8-155, 9-155, 10-169; **బౌలింగ్:** తుషార 4-0-42-3, బుమ్రా 3.5-0-18-3, కొట్జీ 2-0-24-0, హార్దిక్ 4-0-44-2, నమన్ ధిర్ 3-0-25-0, పీయూష్ 3-0-15-1.

ముంబై: ఇషాన్ (బి) స్టార్క్ 13, రోహిత్ (సి) మనీష్ (బి) నరైన్ 11, నమన్ ధిర్ (బి) వరుణ్ 11, సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) రస్సెల్ 56, తిలక్ (సి) నరైన్ (బి) వరుణ్ 4, వధేరా (బి) నరైన్ 6, హార్దిక్ (సి) మనీష్ (బి) రస్సెల్ 1, టిమ్ డేవిడ్ (సి) శ్రేయాస్ (బి) స్టార్క్ 24, కొట్జీ (బి) స్టార్క్ 8, పీయూష్ (సి) నరైన్ (బి) స్టార్క్ 0, బుమ్రా (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 18.5 ఓవర్లలో 145 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-16, 2-38, 3-46, 4-61, 5-70, 6-71, 7-120, 8-144, 9-144, 10-145; **బౌలింగ్:** వైభవ్ 3-0-35-0, స్టార్క్ 3.5-0-33-4, వరుణ్ చక్రవర్తి 4-0-22-2, నరైన్ 4-0-22-2, రస్సెల్ 4-0-30-2.

అన్నీ అనుకున్నట్టు జరగవుగా!

ముంబై కెప్టెన్సీపై రోహిత్



ముంబై: ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కి ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మ తాజా సీజన్‌లో హార్దిక్ నేతృత్వంలో ఆడుతున్నాడు. అయితే జట్టు కెప్టెన్సీ మార్పు అభిమానులకు ఏమాత్రం రుచించని విషయం తెలిసిందే. అటు ఈ పరిణామంపై రోహిత్ తొలిసారి స్పందించాడు. 'ఇదంతా జీవితంలో భాగంగా అనుకోవాలి. అన్నీ మనం అనుకున్నట్టు జరగవు. గతంలో కూడా నేను చాలామంది కెప్టెన్ల ఆధ్వర్యంలో ఆడాను. ఇప్పుడు కొత్తగా వచ్చిన మార్పేమీ లేదు' అని రోహిత్ తేల్చాడు.

జ్యోతికి క్రీడాశాఖ చేయూత



న్యూఢిల్లీ: తెలుగు స్ప్రింటర్ యర్రాజి జ్యోతికి కేంద్ర క్రీడా శాఖ ఆధ్వర్యంలోని ఎంఓసీ (మిషన్ ఒలింపిక్ సెల్) చేయూతనిచ్చింది. జ్యోతితో పాటు లాంగ్ జంపర్ శైలీ సింగ్, పలువురు షట్లర్లు, టేబుల్ టెన్నిస్ ప్లేయర్లకు కూడా నిధులు మంజూరు చేసింది. శుక్రవారం జరిగిన మిషన్ ఒలింపిక్స్ సెల్ సమావేశంలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే క్రమంలో పలు పోటీల్లో పాల్గొనాల్సిన జ్యోతి, శైలి పెట్టిన అర్జీలకు ఆమోదం లభించింది. జ్యోతి యూరప్‌లో ఆరు అంతర్జాతీయ పోటీల్లో తలపడాల్సి ఉంది. ఇందుకయ్యే ఖర్చులను భరించేందుకు ఎంఓసీ ముందుకొచ్చింది. ఇక, టార్గెట్ ఒలింపిక్స్ పోడియం (టాప్స్) స్కీమ్ కోర్ గ్రూప్‌లోకి కొత్తగా షట్లర్లు అశ్వినీ పొన్నప్ప, తనీషా, షూటర్ మహేశ్వరీ చౌహాన్, రోవర్ బాల్‌రాజ్ పన్వర్‌ను తీసుకున్నారు.

ఫైనల్స్‌లో మనోళ్లు ఏడుగురు

ఆసియా బాక్సింగ్

అస్తానా (కజకిస్థాన్): ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మరో ఏడుగురు భారత బాక్సర్లు ఫైనల్స్ చేరి సంచలనం సృష్టించారు. దీంతో ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇప్పటివరకు 22 పతకాలు ఖాయమయ్యాయి. ఇందులో 12 పతకాలు మహిళా బాక్సర్లకు దక్కనున్నాయి. శుక్రవారం జరిగిన 48 కిలోల విభాగంలో బ్రిజేష్ 5-0తో తాలైబక్ ఇయానూర్ (మంగోలియా)పై, 60 కి. కేటగిరీలో సాగర్, 75 కి. కేటగిరీలో రాహుల్, 92 కి. విభాగంలో ఆర్యన్ విజయం సాధించారు. వీరితో పాటు యశ్వర్ధన్ సింగ్ (63.5 కి.), ప్రియాన్షు (71 కి.), ఫైనల్స్‌లో ప్రవేశించారు. కాగా సుమిత్ (67 కి.), సాహిల్ (80 కి.) కాంస్య పతకాలు సాధించారు.

బంగ్లాదేశ్ బోణీ

చట్టోగ్రామ్ (బంగ్లాదేశ్): జింబాబ్వేతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ తొలి టీ20లో బంగ్లాదేశ్ బోణీ చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఎనిమిది వికెట్లతో ప్రత్యర్థిని చిత్తు చేసింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 124 పరుగులకే కుప్పకూలింది. క్లైవ్ మదండే (43), మసకద్జ (34) మాత్రమే రాణించారు. టస్కిన్, సైఫుద్దీన్ చెరో మూడు, మెహ్దీ హసన్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బంగ్లాదేశ్ 15.2 ఓవర్లలో 126/2 స్కోరు చేసి గెలుపొందింది. తన్జిద్ హసన్ (67 నాటౌట్) హాఫ్ సెంచరీ చేయగా తౌహిద్ (33 నాటౌట్) సత్తా చాటాడు.

నరైన్.. మా సూపర్‌మ్యాన్

షారుక్ ప్రశంసల జల్లు

ముంబై: ఈసారి ఐపీఎల్‌లో అదరగొడుతున్న తమ ఆల్‌రౌండర్ సునీల్ నరైన్‌ను కేకేఆర్ ఫ్రాంచైజీ యజమాని షారుక్ ఖాన్ ఆకాశానికెత్తేశాడు. నరైన్‌ను తమ జట్టు సూపర్‌మ్యాన్‌గా అభివర్ణించాడు. ఈ సీజన్‌లో జట్టు సాధిస్తున్న విజయాలలో ప్రధాన భూమిక అతడిదేనని పేర్కొన్నాడు.

ఒకే వేదికలో ఆరు మ్యాచ్‌లు

భారత్-దక్షిణాఫ్రికా మహిళల సిరీస్

బెంగళూరు: దక్షిణాఫ్రికాతో భారత మహిళల జట్టు పూర్తి స్థాయి సిరీస్‌లో తలపడనుంది. జూన్, జూలై నెలల్లో జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్లు ఓ టెస్ట్, మూడేసి వన్డే, టీ20 మ్యాచ్‌లు ఆడతాయి. ఈ ఏడు మ్యాచ్‌ల్లో ఆరు బెంగళూరులోనే జరుగుతాయి. జూన్ 16 నుంచి జరిగే వన్డే సిరీస్‌కు బెంగళూరు ఆతిథ్యమివ్వనుంది. అదే నెల 28 నుంచి చెన్నైలో టెస్ట్ మ్యాచ్ జరగనుంది. అనంతరం జూలై 5, 7, 9 తేదీల్లో బెంగళూరులోనే టీ20లు నిర్వహించనున్నారు.

భారత్ వెనక్కి.. ఆసీస్ ముందుకి..

టెస్టు ర్యాంకింగ్స్
టీ20, వన్డేల్లో నెం.1 పదిలం

దుబాయ్: ఐసీసీ పురుషుల తాజా టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్, వన్డే, టీ20 ఫార్మాట్లలో తన అగ్రస్థానాన్ని మరోసారి నిలబెట్టుకోగా, టెస్టుల్లో మాత్రం భారత్‌ను వెనక్కినెట్టి, ఆస్ట్రేలియా టాప్ ర్యాంక్‌ను చేజిక్కించుకుంది. శుక్రవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత్ టీ20ల్లో 264 పాయింట్లతో, వన్డేలో 122 పాయింట్లతో టాప్‌లో నిలవగా, టెస్టుల్లో 120 పాయింట్లతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. టెస్టుల్లో ఆస్ట్రేలియా 124 పాయింట్లతో తిరిగి ప్రథమ స్థానానికి ఎగబాకగా, ఇంగ్లండ్ 105 పాయింట్లతో మూడో స్థానంలో నిలకడగా కొనసాగుతోంది. వన్డేలో భారత్ తర్వాత ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, పాకిస్థాన్, న్యూజిలాండ్ తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. టీ20లో భారత్ తర్వాతి స్థానంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, న్యూజిలాండ్ ఉన్నాయి.

పొవెల్‌కే పగ్గాలు

విండీస్ వరల్డ్‌కప్ జట్టు



పోర్టాఫ్ స్పెయిన్: టీ20 ప్రపంచ కప్‌కోసం ప్రకటించిన వెస్టిండీస్ జట్టులో పలువురు ఐపీఎల్ స్టార్లకు చోటు కల్పించారు. ప్రస్తుత కెప్టెన్ రోవ్‌మన్ పొవెల్‌కే సారథ్య బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో సంచలన పేసర్ షమార్ జోసెఫ్‌కు తొలిసారి టీ20 జట్టులో స్థానం దక్కింది. అల్జారి జోసెఫ్ వైస్-కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆండ్రీ రస్సెల్, రూథర్ ఫోర్డ్, నికోలస్ పూరన్, హెట్‌మయెర్, హోప్, రొమారియో షెఫర్డ్ తదితర స్టార్లు చోటు దక్కించుకున్నారు.

వరల్డ్‌కప్ మ్యాచ్ అఫీషియల్స్‌గా శ్రీనాథ్, నితిన్ మీనన్

దుబాయ్: వచ్చే నెల వెస్టిండీస్, యూఎస్ఏలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌లో మ్యాచ్ అఫీషియల్స్‌గా భారత్ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. వీరిలో రెఫరీ జవగళ్ శ్రీనాథ్, అంపైర్లు నితిన్ మీనన్, జయరామ్ మదనగోపాల్ ఉన్నారు. ఈ మెగా టోర్నమెంట్‌లో పాల్గొనే 26 మంది మ్యాచ్ అధికారుల జాబితాను ఐసీసీ శుక్రవారం వెల్లడించింది. ఇందులో ఆరుగురు రెఫరీలు, 20 మంది అంపైర్లున్నారు.

మల్లవల్లి.. విషంచల్లి..


మల్లవల్లిలోని ఇండస్ట్రియల్ ఏరియా

పారిశ్రామిక ప్రాంతంలో ఐదేళ్లుగా వైసీపీ విధ్వంసం

టీడీపీ హయాంలో మెగా పారిశ్రామికీకరణకు శ్రీకారం

- అశోక్ లేల్యాండ్, మోహన్ స్పిన్‌టెక్స్‌ల రాక
- 600కు పైగా ఎంఎస్ఎంఈలకు భూ కేటాయింపులు
- వైసీపీ వచ్చాక మారిపోయిన పరిస్థితి
- వరుస నోటీసులతో పరిశ్రమలకు చుక్కలు
- వందలాది సంస్థలకు భూ కేటాయింపులు రద్దు
- భూమి ధర పెంచేసి.. డబ్బు చెల్లించాలని వేధింపులు
- అనాథగా మిగిలిన ఇండస్ట్రియల్ ప్రాంతం
- బాధిత రైతులకు నష్టపరిహారంలోనూ తాత్సారం


అశోక్ లేల్యాండ్ పరిశ్రమ

భారీ పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, మెగా ఫుడ్‌పార్కులతో గత టీడీపీ ప్రభుత్వంలో మల్లవల్లి కళకళలాడుతూ ఉండేది. వైసీపీ ఇలా వచ్చిందో లేదో ఆ పరిశ్రమలన్నీ నాశనమయ్యాయి. మెగా పారిశ్రామిక ప్రాంతం అనాథగా మిగిలిపోయింది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని పారిశ్రామికంగా వృద్ధి చెందాలనే తలంపుతో రాయితీలు కల్పించి టీడీపీ ప్రభుత్వం పరిశ్రమలు తీసుకురాగా, ఆ రాయితీలన్నీ తీసేసి వచ్చిన పరిశ్రమలన్నింటినీ సాగనంపింది వైసీపీ ప్రభుత్వం. చివరకు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం కూడా ఇవ్వకపోవడంతో పారిశ్రామికీకరణ ఐదేళ్లుగా ఒక్క అడుగు ముందుకు కదిలింది లేదు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి/హనుమాన్ జంక్షన్ రూరల్

మెగా ఫుడ్ పార్కును గాలికొదిలేశారు

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెగా ఫుడ్‌పార్కును 100 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. 58 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఫుడ్‌పార్క్ ఏర్పాటు చేయగా, 42 ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం తమ బాధ్యతగా స్టేట్ మెగాపార్కును ఏర్పాటు చేసింది. ఇందులో పరిశ్రమల స్థాపన కోసం వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తప్ప కొత్తగా ఒక్కటంటే ఒక్క పరిశ్రమ రాలేదు.

మల్లవల్లి రైతుల ఉసురు తీశారు..!

భూముల విలువను అమాంతంగా పెంచిన వైసీపీ ప్రభుత్వం మల్లవల్లి రైతులకు నష్టపరిహారం మాత్రం ఇవ్వలేదు. మాయ జీవోలతో కాలం గడుపుతూ, చివరకు పక్కన పెట్టేసింది. దీంతో గత సంవత్సరం ఇదే సమయంలో మొదలైన మల్లవల్లి బాధితుల పోరాటం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సూచనలతో పోలీసులు మహిళా రైతులను అరెస్టులు కూడా చేసింది. ఒకానొక సమయంలో సంయమనం కోల్పోయిన రైతులు వీరవల్లి పోలీస్‌స్టేషన్ ముందు పురుగుమందు డబ్బాలతో ధర్నాకు దిగినా, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినా లాభం లేకుండాపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం మారితే పరిశ్రమలు పెరగడంతో పాటు నష్టపరిహారం చెల్లిస్తారని భూనిర్వాసితులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

టీడీపీ హయాంలో పరిశ్రమలొచ్చే..

రాష్ట్ర విభజన తర్వాత అమరావతి రాజధాని ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో కిందటి టీడీపీ హయాంలో మల్లవల్లిలో ఇండస్ట్రియల్ పార్కును నెలకొల్పారు. అప్పట్లో హైదరాబాద్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేసిన కృష్ణాజిల్లాకు చెందిన వారితో పాటు ఏపీకి చెందినవారికి ఆహ్వానం పలికారు. భారీ పరిశ్రమలే కాకుండా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వంటి వాటిని కూడా ఆహ్వానించారు. ఇందుకు మల్లవల్లిలో అనువైన భూములను గుర్తించారు. భూ సేకరణ విధానంలో మొత్తం 1,200 ఎకరాలు సేకరించారు. ఇందులో 1,000 ఎకరాల విస్తీర్ణంలో మోడల్ ఇండస్ట్రియల్ పార్కు(ఐపీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మెగా ఫుడ్ పార్కును కేటాయించింది. దీనిని మల్లవల్లిలో ఏర్పాటు చేయాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. లే అవుట్, మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టింది. పారిశ్రామికవేత్తలను ఆహ్వానించటం కోసం ఎకరం రూ.కోటి విలువచేసే భూములను రూ.16 లక్షలకే ఇవ్వాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అశోక్ లేల్యాండ్, మోహన్ స్పిన్‌టెక్స్ వంటి సంస్థలు బస్‌బాడీ ప్లాంట్, టెక్స్‌టైల్ పార్కులను ఏర్పాటు చేశాయి. ఈ రెండు సంస్థలే స్థానికంగా దాదాపు 2 వేల మందికి ఉపాధి కల్పించటానికి ముందుకొచ్చాయి. దాదాపు 600 మందికి పైగా ఎంఎస్ఎంఈ యూనిట్లను ఏర్పాటు చేయటానికి ఎంవోయూ చేసుకున్నారు. అప్పటి ఏపీఐఐసీ అధికారులు మౌలిక సదుపాయాల కల్పన పనులను కూడా అంతే స్థాయిలో చేపట్టారు. ఈలోపు 2019 ఎన్నికలు వచ్చాయి.

వైసీపీ వచ్చాక అన్నీ పాయె..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మల్లవల్లిలో అన్యాయాలు జరిగిపోయాయంటూ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ పరిణామంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఖిన్నులయ్యారు. విజిలెన్స్ విచారణను తమకు నచ్చినట్టుగా తెప్పించుకుని, పురోగతిలో ఉన్న పనులను పట్టించుకోకుండా, యూనిట్లు ఏర్పాటు చేయలేదన్న వాదనలు తీసుకొచ్చి నోటీసులు ఇచ్చారు. తమ ఇబ్బందులు చెప్పుకోనివ్వకుండా ఆయా సంస్థలకు కేటాయించిన భూములను రద్దు చేశారు. దీంతో పరిశ్రమల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోర్టు సూచించినా వైసీపీ పట్టించుకోలేదు. ఇప్పటికీ ఆ సమస్య అపరిష్కృతంగానే ఉంది. ఈ క్రమంలో వైసీపీ భూముల ధరలను రెండు రెట్లు పెంచేసింది. ఎకరం రూ.16 లక్షలు ఉన్న భూమిని రూ.అరకోటికి చేర్చింది. ఫైనల్ అగ్రిమెంట్లు చేసుకోలేదంటూ వారందరికీ పెంచిన రేట్ల ప్రకారం భూములకు ధర చెల్లించాలని పేర్కొంది. దీంతో ఆయా సంస్థలు తీవ్ర ఆందోళన చెందాయి. మిగిలిన యూనిట్లను కూడా బలవంతంగా సాగనంపటానికే వైసీపీ ప్రభుత్వం చూసింది. మల్లవల్లిలో ఏర్పాటుచేసిన భారీ పరిశ్రమలకు ఊతం ఇవ్వకపోగా, వాటికి నోటీసుల మీద నోటీసులు ఇస్తూ కక్ష సాధించింది. కరోనా అనంతర సంక్షోభ పరిస్థితుల్లో ఎలక్ట్రికల్ వాహనాల ఆర్డర్లు లేక అశోక్ లేల్యాండ్ ఉత్పాదకత నిలిచింది. ఆ సంస్థతో సంప్రదింపులు జరిపి, దాని ఇబ్బందులను గుర్తించి, పరిష్కరించని వైసీపీ నోటీసులు మాత్రం ఇచ్చింది.

మనోవేదనతో నా భర్త చనిపోయాడు

భూమికి సంబంధించిన రశీదులున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. భూమి సాగులో లేదని నష్టపరిహారం విషయంలో తప్పుదోవ పట్టించారు. ప్రభుత్వం మారాక మా వద్ద ఉన్న రశీదులను అధికారులకు, ప్రజాప్రతినిధులకు చూపించినా ఫలితం కనిపించలేదు. ఈ మానసిక వేదనతో నా భర్త మృతిచెందాడు. **- నాగమణి, మల్లవల్లి బాధితురాలు**

పండుటాకులపై పైశాచికం



రాజకీయ వికృత క్రీడలో పండుటాకులు ఎండిపోతున్నారు. పెన్షన్ కోసం ఆడుతున్న ప్రభుత్వ పైశాచికానందంలో ముదుసలులు మాడిపోతున్నారు. ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. పైపులరోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 11.30 గంటలకు కూడా వృద్ధులను లోపలకు పోనివ్వకుండా గేటు బయటే ఆపేశారు. అదేమని అడిగితే లోపల రద్దీ ఉందని గేటుకు అడ్డంగా సెక్యూరిటీని పెట్టారు. వచ్చీచెడి లోపల వరకూ వెళ్తే సుమారు గంటపాటు క్యూలైన్‌లో నిలబెట్టి.. ఆ తరువాత అయినా పెన్షన్ ఇచ్చారా అంటే.. అదీ లేదు. ఒక చిన్న పేపర్ ముక్క ఇచ్చి.. రోడ్డుకు అవతలవైపున కస్టమర్ కేర్‌లో డబ్బు తీసుకోమని చెప్పారు. ఇన్ని కష్టాలు పడి స్లిప్పు సాధిస్తే, రోడ్డు దాటుకుని వెళ్లి, సదరు కస్టమర్ కేర్ వద్ద డబ్బు తీసుకోవడానికి ముచ్చెమటలు పట్టించారు. గంటలకొద్దీ నిలబెట్టారు. అక్కడ మరో గంటపాటు యుద్ధం చేశాక పెన్షన్ చేతికందడానికి సుమారు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటలైంది. 42 డిగ్రీలున్న ఆ ఎండలోనే కొందరు వృద్ధులు బతుకుజీవుడా.. అంటూ ఇళ్లకు వెళ్లగా, ఇంకొందరు సొమ్మసిల్లి అక్కడే కూలబడిపోయారు.

కన్నుగప్పి కబ్జా..!

అంబాపురంలో వైసీపీ నేత వల్లభనేని వంశీ అనుచరుల అక్రమాలు


సర్వే నెం 94/2లో ప్రభుత్వ బోర్డు తొలగింపు


సర్వే నెం 97/2 కామన్ స్థలంలో అక్రమ నిర్మాణం

'ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదు.. అందినకాడికి దోచేసుకుందాం..' అనుకున్నారో ఏమో గన్నవరం వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ అనుచరులు దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టేస్తున్నారు. అధికారులు, ప్రతిపక్షాలు ఎన్నికల హడావిడిలో ఉండగా, అదునుచూసి విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో కబ్జాలకు తెగబడుతున్నారు. తమ నాయకుడి అండతో కామన్ సైట్లు ఎక్కడుంటే అక్కడ వాలిపోయి, అమ్మకాలకు పెట్టేస్తున్నారు.

- రూ.10 కోట్ల విలువైన మూడు స్థలాల ఆక్రమణ
- అందరూ ఎన్నికల హడావిడిలో ఉండగా విక్రయాలు
- ఫిర్యాదులు ఉన్నా వెనక్కి తగ్గని కబ్జాసురులు

విజయవాడ రూరల్ : రెండు వారాల్లో ఎన్నికలు.. అధికార యంత్రాంగమంతా ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమై ఉంది. ప్రతిపక్షాలు ఎన్నికల పనుల్లో తనమునకలై ఉన్నాయి.. ఇదే సరైన తరుణం అనుకున్నారేమో అంబాపురం వైసీపీ నేతలు. అందరూ ఎన్నికల హడావిడిలో ఉండగా గ్రామ వైసీపీ నేతలు మాత్రం తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు. గ్రామ పరిధిలోని పంచాయతీ కామన్ స్థలాలను కబ్జా చేసేస్తున్నారు. మూడుచోట్ల ఒకేసారి భూకబ్జాలకు దిగారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అండతో సుమారు రూ.10 కోట్ల విలువైన పంచాయతీ భూములను కాజేసే ప్రణాళిక వేసుకున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఫెన్సింగ్ వేసి అమ్మకాలకు పెట్టేశారు. ఈ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని గతంలో ఫిర్యాదులు ఉన్నా.. ఏమీ పట్టకుండా తమ పని తాము చేసుకుపోతున్నారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డును ఆనుకుని రూ.6 కోట్ల స్థలం

పైపులరోడ్డు సెంటర్ నుంచి మిల్క్‌ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని అంబాపురం పంచాయతీ 11వ లైన్‌లో సర్వే నెంబర్ 96/2బీలో 2 వేల గజాల కామన్ స్థలం ఉంది. ఈ స్థలం కబ్జా చేసేందుకు గతంలో వైసీపీ గ్రామ నేతలు ప్రయత్నించారు. అప్పట్లో ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వెనక్కి తగ్గారు. మరోసారి కబ్జాకు ప్రయత్నించగా, స్థానిక ఎమ్మార్వో విచారణ చేపట్టి, అధికారుల నుంచి ఫిర్యాదు తీసుకుని సదరు స్థలంలోకి ఎవరూ వెళ్లకూడదని ఆదేశించారు. అయితే, రెండు రోజులుగా వైసీపీ నేతలు సదరు పంచాయతీ కామన్ స్థలంలోకి చొరబడి 2 వేల గజాలను మూడు భాగాలుగా విభజించి కొలతలు వేసినట్టు తెలుస్తోంది. అంతేకాదు.. ఫెన్సింగ్ రాళ్లను కూడా తరలించారు. రేపోమాపో పాగా వేసేందుకు సిద్ధమవుతున్నారు. పనిలో పనిగా సదరు స్థలాన్ని అమ్మకానికి కూడా పెట్టేశారు.

పలగాని రోడ్డులో రూ.3 కోట్ల స్థలం

ఇన్నర్ రింగ్‌రోడ్డును ఆనుకుని పైపులరోడ్డు నుంచి మిల్క్‌ప్రాజెక్టుకు వెళ్లే దారిలోని పలగాని రోడ్డులో సర్వే నెంబర్ 94/2లో రూ.3 కోట్ల విలువైన వెయ్యి గజాల స్థలం కూడా కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో సదరు స్థలం కబ్జాదారుల పాలవుతుందన్న విషయాన్ని గమనించి అధికారుల ఫెన్సింగ్‌తో పాటు బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. అయితే, రెండు నెలల క్రితం ఆ స్థలంలోకి చొరబడిన కబ్జాదారులు బోర్డులను తొలగించారు. ఫెన్సింగ్ రాళ్లపై అధికారులు రాయించిన పెయింటింగ్‌లపై ఎర్రరంగు పులిమి తుడిపేశారు.

రూ.కోటి విలువైన స్థలం

అంబాపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 97/2లో రూ.కోటి విలువైన 370 గజాల కామన్ స్థలాన్ని కూడా వైసీపీ నేతలు కబ్జా చేశారు. సదరు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి విక్రయాలు జరుపుతున్నా అధికారులు నోరు మెదపట్లేదు.




గురునానక్ కాలనీలో పట్టాభిపై వైసీపీ మూకల దాడి (ఇన్‌సెట్‌లో) చెన్నుపాటి గాంధీపై దాడిలో కన్ను పోగొట్టుకుని.. (ఫైల్)

80వ దశకం నాటి పరిస్థితులు బెజవాడను మళ్లీ భయపెడుతున్నాయా..? కాలగర్భంలో కలిసిపోయిన రౌడీ రక్తచరిత్ర మళ్లీ రాజ్యమేలుతోందా..? ఈ ఐదేళ్ల కాలంలో తూర్పు నియోజకవర్గంలో జరిగిన దాడులు, ఘర్షణలు, కొట్లాటలు, హత్యలు చూస్తే అవుననే అనిపిస్తుంది. టీడీపీ నాయకులను టార్గెట్ చేసుకుని ఈ ఐదేళ్లలో జరిగిన దాడులు అన్నీ ఇన్నీ కావు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడిలోనైనా.. టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపై విరుచుకుపడినా.. పట్టాభిపై పగబట్టి ఇంటిని ధ్వంసంచేసినా.. చెన్నుపాటి గాంధీ కన్ను పొడిచేసినా.. ఇదేమని ప్రశ్నించిన మహిళల కళ్లలో కారం వేసి, రాళ్లతో కొట్టినా.. అన్నింటిలో తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాశ్, ఆయన అనుచరులదే ప్రధాన పాత్ర అయినా.. పోలీసులు పట్టనట్టుగానే వ్యవహరించారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

ఐదేళ్ల అవినాశనం



బెజవాడకు మళ్లీ 80వ దశకం నాటి రక్తచరిత్ర

- ఈ ఐదేళ్లలో పేట్రేగిపోయిన వైసీపీ రౌడీమూకలు
- టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి మొదలు
- చెన్నుపాటి గాంధీపై దాడి.. కన్ను పోగొట్టారు
- పట్టాభి ఇంట్లో రణరంగం.. తీవ్ర గాయాలు
- పెన్షన్ కావాలన్న మహిళ కళ్లలో కారం వేసి, రాళ్లతో కొట్టి..
- అన్నింటా దేవినేని అవినాశ్, అనుచరులదే ప్రధాన పాత్ర
- పూర్తిగా సహకరించిన పోలీస్ యంత్రాంగం

టీడీపీ నేత పట్టాభి ఇంటిపై..

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌పై 2021, ఫిబ్రవరి 2న దాడి జరిగింది. వైసీపీ మద్దతుదారులు ఐరన్ రాడ్లు, కర్రలు, రాళ్లతో గురునానక్ కాలనీలోని పట్టాభి ఇంటిపైకి దాడికి తెగబడ్డారు. ఉదయం 10.30 గంటల సమయంలో ఈ దాడి జరిగింది. పట్టాభి తన కారులో ఇంటి నుంచి బయటకు రాగానే దాడి చేశారు. దాడిలో పట్టాభికి తీవ్ర గాయాలయ్యాయి. కారు పూర్తిగా ధ్వంసమైంది. అదే ఏడాది అక్టోబరు 19న మరోసారి పట్టాభి ఇంటిపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారు. ఆయన ఇంట్లోకి చొరబడి భార్య, కూతురు సమక్షంలోనే సామానును ధ్వంసం చేసి సుమారు అరగంటపాటు వీరవిహారం చేశారు. పట్టాభి పదేళ్ల కూతురు ముందే దుండగులు బీభత్సం సృష్టించారు. ఈ ఘటనలో మరో 10 మందిని అరెస్టు చేశారు. వీరంతా కూడా దేవినేని అవినాశ్ అనుచరులే. వీరిలో బచ్చు మాధవి దేవినేని కుటుంబానికి అత్యంత సన్నిహితురాలు.

టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై 2021, అక్టోబరు 20న దాడి జరిగింది. ఈ దాడిలో పాల్గొంది విజయవాడకు చెందినవారే. 18వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ అరవ వెంకట సత్యనారాయణ అలియాస్ అరవ సత్యంతో పాటు వైసీపీ నాయకులు జోగరాజు (గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్నారు), బచ్చు మాధవి (దుర్గగుడి పాలకమండలి సభ్యురాలిగా ఉన్నారు) తదితరులు ఈ దాడిలో పాల్గొన్నారు. వీరంతా తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాశ్‌కు అత్యంత సన్నిహితులు. వీరి ప్రమేయంపై అన్ని ఆధారాలు ఉన్నా, వారిని సైడ్ చేసి కేవలం కిందిస్థాయి కార్యకర్తలను బలి చేశారు.

దాడి చేసి.. కన్ను పొడిచేసి..

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీపై పటమటలంకలో 2022, సెప్టెంబరు 3వ తేదీ సాయంత్రం దాడి జరిగింది. పదునైన వస్తువుతో దాడి చేయడంతో ఆయన కుడికన్ను తీవ్రంగా గాయపడింది. ఆ తర్వాత కన్ను తొలగించారు. ఇంత జరిగినా నిందితులపై తూతూమంత్రంగా సెక్షన్లు 326, ఐపీసీ 506 కింద కేసు నమోదు చేసి చేతులు దులిపేసుకున్నారు. వైసీపీ నాయకుడు గద్దె కల్యాణ్ తదితరులు దాడి చేశారని ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నా పోలీసులు నుంచి పెద్దగా స్పందన లేదు. గాంధీ, వైసీపీ నాయకుడి నడుమ పరస్పర దూషణలు జరిగి అనుకోకుండా దాడి చేశారని పోలీస్ కమిషనర్ రాణా అప్పట్లో చెప్పడం తీవ్ర వివాదాస్పదమైంది. వాస్తవానికి ఈ దాడిలో అవినాశ్ సన్నిహితుడు, వైసీపీ నాయకుడు గద్దె కల్యాణ్ ప్రధాన పాత్రధారి. స్కూటర్ తాళంతో గాంధీ కంట్లో పొడిచారు. ఈ దాడిలో గాంధీ కుడికన్నును కోల్పోయారు. రాజకీయ ఒత్తిళ్లతో నిందితులపై కేవలం బెయిల్‌బుల్ సెక్షన్లు నమోదు చేసి మమ.. అనిపించారు.


కళ్లల్లో కారం కొట్టి రాళ్లతో దాడి

17వ డివిజన్ తారకరామానగర్‌లో 2023, జనవరి 10న గడప గడపకు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డితో పాటు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించడం లేదని, తనకు పింఛన్ రావడం లేదని షేక్ రమీజా అనే మహిళ వైసీపీ నాయకులను నిలదీసింది. ఈ మొత్తం వ్యవహారాన్ని స్థానిక మహిళ ఒకరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. దీంతో అవినాశ్ అనుచరగణం రెచ్చిపోయింది. మరుసటి రోజు ప్రశ్నించిన మహిళ ఇంటిపైకి సుమారు 15 మంది వైసీపీ నాయకులు వెళ్లి దాడికి పాల్పడ్డారు. స్థానిక కార్పొరేటర్ రామిరెడ్డి, మాజీ కార్పొరేటర్ దామోదర్, చిన్నారి, మాధవి తదితరులు ఈ దాడిలో పాల్గొన్నారు. షేక్ రమీజా ఇంటిపై దాడి చేసి, ఇంట్లో వస్తువులు ధ్వంసం చేయడంతో పాటు కారం కళ్లలో చల్లి అమానుషంగా ప్రవర్తించారు. చుట్టుపక్కల మహిళలు అడ్డు రాగా, వారిపై కూడా వైసీపీ మహిళా కార్యకర్తలు దాడి చేశారు. ఇంత చేసినా బాధిత మహిళలను పోలీసుస్టేషన్‌కు పిలిచి సుమారు 10 గంటల పాటు అక్కడే కూర్చోబెట్టారు.


ప్రశ్నించిన ఓ మహిళపై వైసీపీ మహిళా నేతల దాడి (ఫైల్)

8న నగరంలో ప్రధాని రోడ్ షో

కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడి



కృష్ణలంక, మే 3 : ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ నగరంలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సంబంధిత జిల్లా కలెక్టర్లు, పోలీస్, ఇతర అధికారులతో వర్చువల్ విధానంలో సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాల మేరకు ప్రధాని పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వివరణ ఇస్తూ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8వ తేదీ బుధవారం సాయంత్రం 6.25 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన బయల్దేరి సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు నగరంలో రోడ్ షో నిర్వహిస్తారని, అనంతరం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీకి బయల్దేరి వెళ్తారని పేర్కొన్నారు.

మళ్లీ రెచ్చిపోయారు!

- కృష్ణా జిల్లాలో టీడీపీ మైనారిటీ నేత ఇంటిపై వైసీపీ మూకల దాడి
- తీవ్రంగా గాయపడిన టీడీపీ నేత కొడుకు, మనవరాలు
- వంశీ ప్రచారం ముగించిన 10 నిమిషాలకే కుటుంబంపై దాడి
- కేసు నమోదు చేసిన వీరవల్లి పోలీసులు



షేక్‌నసీమా మీర్జావలి చేతులకు గాయాలు



హనుమాన్ జంక్షన్ రూరల్, మే 3 : కృష్ణా జిల్లాలో మరోసారి వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. టీడీపీ మైనారిటీ నేత ఇంటిపై దాడిచేసి ఆయన కుమారుడు, 16 ఏళ్ల మనవరాలిని తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం కొత్త మల్లవల్లిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కొత్త మల్లవల్లికి చెందిన టీడీపీ మైనారిటీ నేత షేక్‌జాన్ బాషా, ఆయన కుమారుడు మీర్జావలి టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నారు. గురువారం ఉదయం కొత్త మల్లవల్లి చెంతనే ఉన్న నూజివీడు నియోజకవర్గం మీర్జాపురానికి నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారధి వచ్చారు. ఆయన్ను కలిసేందుకు కొత్తమల్లవల్లికి చెందిన మీర్జావలి వెళ్లారు. అక్కడే ఆలీ అనే వైసీపీ కార్యకర్త ఉండటంతో మీర్జావలి అతని గురించి.. అలీ గన్నవరం నియోజకవర్గంలో వైసీపీకి, నూజివీడు నియోజకవర్గంలో టీడీపీకి పనిచేస్తున్నారని సారథికి ఫిర్యాదు చేశారు. తనపై ఫిర్యాదు చేశాడనే విషయాన్ని మనసులో పెట్టుకుని గురువారం రాత్రి కొత్తమల్లవల్లిలో గన్నవరం వైసీపీ అభ్యర్థి వంశీతోపాటు ప్రచారానికి వచ్చిన అలీ, మరో 50 మంది మీర్జావలి కుటుంబంతో ఘర్షణకు దిగారు. అలీతోపాటు బాపులపాడు మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, రఫీ, ముంతాజ్ తదితరులు మీర్జావలి, ఆయన తండ్రి షేక్ జాన్ బాషా ఇతర కుటుంబసభ్యులపై కర్రలతో దాడి చేశారు. మీర్జావలిపై బీరు సీసాతో దాడి చేయగా చేతికి గాయమై నరం తెగింది. గురువారం రాత్రి వంశీ ఎన్నికల ప్రచారం ముగించిన 10 నిమిషాలకే ఈ ఘర్షణ చోటుచేసుకోవడం గమనార్హం. గొడవను సెల్ ఫోన్‌లో చిత్రీకరిస్తున్న షేక్ జాన్ బాషా మనవరాలు (16) నసీమాపైనా కర్రతో దాడి చేయడంతో ఆమె చెయ్యి విరిగింది. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్టు ఎస్సై చిరంజీవి తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం పోలీసులు కేసు నమోదు చేశారు. రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి యార్లగడ్డ వెంకట్రావును అతిథిగా పిలిచినప్పటి నుంచి కక్షగట్టి తమను దుర్భాషలాడుతున్నారని, వంశీ అండ చూసుకుని గురువారం అర్ధరాత్రి దాడికి తెగబడ్డారని షేక్ జాన్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలపై భౌతికదాడులు ఆటవికచర్య : యార్లగడ్డ

ప్రజావ్యతిరేక విధానాలు, అరాచకపాలనకు వ్యతిరేకంగా శాంతియుతంగా పోరాడుతున్న టీడీపీ మైనారిటీ నేతల ఇళ్లపై దాడులకు తెగబడటంతో పాటు మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడటం ఆటవిక చర్య అని యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తమల్లవల్లి వైసీపీ మూకదాడిలో గాయపడి నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మీర్జావలిని శుక్రవారం యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ స్థానిక టీడీపీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ బాధితుడితో ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దాడిచేసిన వారిని వదిలిపెట్టి బాధితుడిపైనే కేసు నమోదు చేయడం పట్ల టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని సతీష్, టీడీపీ నేతలు భరోసా కల్పించారు. మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, యనమదల వెంకయ్యారావు, అలూరి సురేశ్, అక్కినేని ధర్మరాజు, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికళ్యాణి, తుమ్మల ఉదయ్, మండాది రవీంద్ర, మేడేపల్లి రమ, అక్కినేని కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.



మీర్జావలిని పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

సంక్షేమానికి చిరునామా టీడీపీ



తూర్పు నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో నందమూరి రామకృష్ణ

జగన్ ప్రతీ పథకంలో స్కామ్..

- నందమూరి రామకృష్ణ

పటమట, మే 3 : జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం పేరుతో అమలు చేసిన ప్రతీ పథకంలోనూ స్కామ్ ఉందని, ప్రజా సంక్షేమ పథకాలకు చిరునామా టీడీపీయేనని ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 10వ డివిజన్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా జగన్మోహన్‌రెడ్డి రాక్షసపాలన చూశామని, ఆయన వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశాడని విమర్శించారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్కరికీ రక్షణ లేదన్నారు. ఎన్టీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశం మొత్తం అమలు చేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వంలో విద్యుత్, బస్సు చార్జీలు, ఇంటి పన్నులు పెంచారని, ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. జగన్ పాలనకు అంతం పలకాలంటే ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని శివనాథ్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని రామకృష్ణ ఓటర్లను కోరారు. జనసేన, బీజేపీ బలపర్చిన కూటమి అభ్యర్థులు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)లను గెలిపించాలని గద్దె రామ్మోహన్ ప్రజలను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లతో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి వారి అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం సరఫరా చేసిన కల్తీ మద్యం తాగి ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు మరణించారని ఆరోపించారు. పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా అటకెక్కిందని, చదువు పూర్తి అయిన విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల బీరువాల్లో ఉన్నాయన్నారు. ఓటర్లను అయోమయం చేయడానికి నియోజకవర్గంలో జనసేన ఎన్నికల గుర్తు గాజుగ్లాసును కూడా బ్యాలెట్ పేపర్లో పెట్టించారని, ఓటర్లు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేయాల్సిందిగా గద్దె కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవినేని అపర్ణ, పొన్నం శ్రీనివాస్, పోతంశెట్టి నాగేశ్వరరావు, ముమ్మనేని ప్రసాద్, పొలగాని జగన్మోహన్‌రావు, జయప్రకాష్, రాజేంద్రలు పాల్గొన్నారు.



అధర్మ పాలకుడు జగన్

టీడీపీలో చేరిన మైనార్టీ, బీసీ విద్యార్థి నాయకులతో కేశినేని చిన్ని

- ఆయనను ఓడించి ఇంటికి సాగనంపుదాం: కేశినేని చిన్ని

విద్యాధరపురం: "రాష్ట్రంలో ఐదేళ్లపాటు జగన్ అధర్మ పాలన చేశారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనుడాయన. రాష్ట్రం, ప్రజల తలరాతలు మారుస్తాడని నమ్మి ఒక్క చాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని దోచి తన బినామీల తలరాతలను మార్చారు. ఎన్నికల్లో అధర్మపాలన చేస్తున్న జగన్‌ను ఓడించి ఇంటికి సాగనంపుదాం." అని ప్రజలకు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) పిలుపు నిచ్చారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం పశ్చిమ నియోజకవర్గం నుంచి దాడి మురళీకృష్ణ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వైసీపీ మైనార్టీ సిటీ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఇంతియాజ్‌తో పాటు 55, 53, 51, 45, 50, 54, 55వ డివిజన్లకు చెందిన వైసీపీ యూత్ ప్రెసిడెంట్స్, బీసీ నాయకులు భారీ సంఖ్యలో టీడీపీలో చేరిన సందర్భంగా వారందరికీ కేశినేని చిన్ని కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ మేనిఫెస్టోలో జగన్ మూడు రాజధానులుంటాయని చెప్పడంతో రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే అనేక మంది వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక యువత వేరే రాష్ట్రాలకు వలస వెళ్లారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి అధికారంలోకి రాగానే మైనార్టీ సంక్షేమం కోసం చంద్రబాబు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. మైనార్టీ నాయకులు షేక్ గప్ఫార్, షేక్ ఏసుబ్, మహ్మద్ ఫయాజ్, మహ్మద్ అయాజ్, షేక్ అల్లాభక్షు, సలీమ్, బీసీ నాయకులు రామ్ కిషోర్, సురేష్, నక్కా అరవింద్, యశ్వంత్, ప్రసాద్, దాడి కుమార్, నక్కా రమేష్, దాస్, జోసఫ్, యూత్ వింగ్స్ ప్రెసిడెంట్స్ రసూల్, తేజ, సమీర్, హరి, నాగరాజు, మోహిత్, వీర్ల దినేష్, అదిల్, వారికి మద్దతుగా స్నేహితులు, కుటుంబసభ్యులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎస్ బేగ్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, ఎస్సీ సెల్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు పేటేటి రాజమోహన్, టీడీపీ నాయకులు నహీద్ అంజుమ్, పలెవెల బుజ్జి, పైడముక్కల రాజు, దాడి గంగాధర్, పైడముక్కల సుధీర్, హుజూర్ సునీల్ పాల్గొన్నారు.

మైలవరం అభివృద్ధికి జగన్ పైసా విదల్చలేదు

- అమరావతిని, చింతలపూడిని ఆపేశారు : వసంత కృష్ణప్రసాద్



ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న వసంత కృష్ణప్రసాద్

మైలవరం రూరల్, మే 3: మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి ఈ ఐదేళ్లలో జగన్ ఒక్క పైసా కూడా విదల్చలే దని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మైలవరం అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని మొర్సుమిల్లి, అనంతరం, పొందు గల, వెల్వడం, చంద్రాల, కీర్తిరాయునిగూడెం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. "ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగపడే చింతలపూడి ఎత్తిపోతల పథకానికి టీడీపీ హయాం లో రూ.4,100 కోట్లు ఖర్చు చేశారు. ఐదేళ్లలో జగన్ ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. ఈప్రాంతంపై ద్వేషంతో అమరావతిని నాశనం చేశారు. పైగా మళ్లీ తానే అధికారంలోకి వస్తానని కలలు కంటున్నారు. వైజాగ్‌లో ప్రమాణస్వీకారం అంటూ కోతలు కోస్తు న్నారు." అని జగన్‌పై వసంత ఆగ్రహం వ్యక్తం చేశారు. "మైలవరం నియోజకవర్గంలోని 10 చెరువులను రిజర్వాయర్లుగా మార్చి రైతు లకు సాగునీటి ఇబ్బంది లేకుండా చేయాలని సీఎంకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. మొర్సుమల్లి, చంద్రగూడెం లలోని చెరువులకు నిధులు మంజూరు చేయాలని కోరినా పైసా ఇవ్వలేదు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సంక్షేమ పథకాలను నమ్ముకుని జగన్ బటన్ నొక్కుతున్నారు. గతంలో సీఎంలు అభి వృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలించారు." అని కృష్ణప్రసాద్ అన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి తనను ఎమ్మెల్యేగా, విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)ని గెలిపించాలని ఆయన కోరారు. మాజీ మంత్రి కొత్తపల్లి శ్యామ్యూల్ జవహర్, తాతా పోతురాజు, చల్లా సుబ్బారావు, బొండలపాటి సుధాకర్, బూదేటి రామారావు, డేలా నాయక్, మొతళ్ల వెంకట సుబ్బారావు, ఉప్పు రాజగోపాల్, నాగేశ్వరరావు, గురిజాల శ్రీను పాల్గొన్నారు.



రెడ్డిగూడెం ఎంపీపీ రామినేని దేవిప్రవీణ తదితరులను టీడీపీలో చేర్చుకుంటున్న వసంత కృష్ణప్రసాద్

టీడీపీలోకి రెడ్డిగూడెం ఎంపీపీ, ఆమె భర్త

మైలవరం / రెడ్డిగూడెం: రెడ్డిగూడెం వైసీపీ ఎంపీపీ రామినేని దేవీప్రవణ్య, ఆమె భర్త రామినేని వీరాస్వామినాయుడు, రామినేని బుజ్జి, రామినేని వెంకటేశ్వరరావు, బొల్లారెడ్డి అంజిరెడ్డి, ఆకుల సుబ్రహ్మణ్యం, బలుసు శ్రీను, కూరెళ్ల మాధవాచారి, జల్లి సుబ్బారావు, పొన్నూరు సుబ్బారావు, పొన్నూరు వెంకటేశ్వరరావు, కందుల రామారావుతో పాటు మరో 60 కుటుంబాలకు పైగా మైలవరంలోని టీడీపీ కార్యాలయంలో మాజీమంత్రి కొత్తపల్లి జవహర్, కూటమి మైలవరం అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరారు. కండువాలు కప్పి వారిని టీడీపీలోకి జవహర్, వసంత సాదరంగా ఆహ్వానించారు. జగన్ నియంతృత్వ పోకడలు నచ్చక టీడీపీలో చేరామని వైసీపీని వీడిన నేతలు తెలిపారు. వైసీపీలో ప్రజా ప్రతినిధులను ఉత్సవమూర్తుల్లా జగన్ వాడుకుంటారన్నారు. కె.విజయబాబు, ముప్పిడి నాగేశ్వరరెడ్డి, పాలంకి మోహన్ మురళీరెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రా హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్యం

మాచవరం, మే 3 : ఆంధ్రా హాస్పిటల్, హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే ఛారిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 4000 మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్టు ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్, ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. సూర్యారావుపేటలోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పిటల్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంలో డాక్టర్ పీవీ రామారావు మాట్లాడుతూ, గత నెల 29వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకు ఆంధ్రా హాస్పిటల్‌లో హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే ఛారిటీ సౌజన్యంతో 29 మంది చిన్నపిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేసినట్టు తెలిపారు. విదేశీ వైద్య బృందం డాక్టర్ ఆండ్రూపారి, పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ బ్రిస్టల్ యూకే, డాక్టర్ జోరోతి లిడ్ బెటర్, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ ఒరిజిత్ బెనర్జీ, కొచురని సెబాస్టియన్, హెలీ ఫిట్జ్ పాట్రిక్, అలెగ్జాండర్ టైలర్ తదితరులు హాస్పిటల్‌కు వచ్చి ఆసుపత్రి కార్డియాక్ సర్జన్ డాక్టర్ సాయిరాంతో కలిసి 15 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు నిర్వహించారని తెలియజేశారు. అత్యంత క్లిష్టమైన గుండె జబ్బులు ఐయోర్టపల్మనరి విండో విత్ ఇంటేర్రప్టెడ్ అయోర్టిక్ ఆర్చ్, అబ్స్ట్రక్టివ్ టోటల్ అనోమలొస్‌పల్మనరీ వేనస్ కనెక్షన్స్(టీఏపీవీడీ), మైట్రల్ వాల్వ్(పారాష్యూట్) రిపేర్, టెట్రాలజీ ఆఫ్ ఫాలో, పీఏ బాండింగ్ ఇతర క్లిష్టమైన గుండె ఆపరేషన్లు ఈ క్యాంపులో నిర్వహించారన్నారు. గత ఎనిమిదేళ్లుగా ఇప్పటి వరకు 29 సార్లు ఆంధ్ర హాస్పిటల్స్‌కు వచ్చి పిల్లలకు గుండె సర్జరీలు విజయవంతంగా చేశారని వివరించారు. సమావేశంలో డాక్టర్లు విక్రమ్, నాగేశ్వరరావు, సాయిరామ్, శ్రీమన్నారాయణ, రమేష్, రేవంత్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

ఫెసిలిటేషన్ కేంద్రాల్లో మూడు రోజుల పాటు పోలింగ్ ● ఎన్టీఆర్ జిల్లాలో ఓటేయనున్న 21,532 మంది ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సార్వత్రిక ఎన్నికల్లో అంతర్భాగంగా శనివారం నుంచి ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా ఈనెల 4, 5, 6 తేదీల్లో మూడురోజుల పాటు ఎన్నికల నిర్వహణలో పాల్గొంటున్న ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 21,532 మంది ఉద్యోగులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయనున్నారు. తిరువూరు నియోజకవర్గం పరిధిలో 2,604 మంది ఉద్యోగులు, విజయవాడ పశ్చిమలో 1,990, సెంట్రల్‌లో 2,402, తూర్పులో 3,362, మైలవరంలో 2,331, నందిగామలో 1,963, జగ్గయ్యపేటలో 1,988 మంది ఉద్యోగులు ఓటేయనున్నారు. పోలింగ్ ఆఫీసర్లు(పీవో), సహాయ పోలింగ్ ఆఫీసర్లు (ఏపీవో), ఇతర పోలింగ్ అధికారులు (ఓపీవో)లు కలిపి జిల్లా వ్యాప్తంగా 5,115 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా తిరువూరులో 1,280 మంది, విజయవాడ పశ్చిమలో 1,017, సెంట్రల్‌లో 1,089, నందిగామలో 1,380, జగ్గయ్యపేటలో 1,425 మంది ఉన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, బీఎల్వోలు, డ్రైవర్లు జిల్లా వ్యాప్తంగా 5,115 మంది ఓటేయనున్నారు. నియోజకవర్గాల వారీగా తిరువూరులో 652 మంది, విజయవాడ పశ్చిమలో 190, సెంట్రల్‌లో 224, తూర్పులో 2,000, మైలవరంలో 1,711, నందిగామలో 138, జగ్గయ్యపేటలో 200 మంది ఓటేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 231 మంది మైక్రో అబ్జర్వర్లలో తిరువూరులో 12 మంది, విజయవాడ పశ్చిమలో 112, సెంట్రల్‌లో 30, తూర్పులో 26, మైలవరంలో 7, నందిగామలో 20, జగ్గయ్యపేటలో 27 మంది పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,304 మంది పోలీసులు, 452 మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎక్స్ సర్వీస్ మెన్‌కు చెందిన వారు ఓటేయ నున్నారు. ఇతర జిల్లాల్లో ఓటున్న 2,641 మంది ఇక్కడే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ దిల్లీరావు తెలిపారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో హోమ్ ఓటింగ్ నిర్వ హిస్తామని, హోమ్ ఓటింగ్‌పై 4, 6 తేదీల్లో పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.



పోస్టల్ బ్యాలెట్ నమూనాను చూపుతున్న కలెక్టర్ దిల్లీరావు, పక్కన పరిశీలకులు నీనా నిగం, నరీందర్‌సింగ్‌బాలి

ఫెసిలిటేషన్ కేంద్రంలో పారదర్శక సేవలందించాలి

కృష్ణలంక: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని కేంద్రీకృత ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశామని, ఈ కేంద్రాల్లోని అధికారులు, సిబ్బంది పారదర్శకంగా సేవలందించి, అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ దిల్లీరావు సూచించారు. కేంద్రీకృత ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి కలెక్టర్ దిల్లీరావు శుక్రవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. పోలింగ్ అధికారులకు నిర్దేశించిన విధులపై అవగాహన కల్పించారు. డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ విజయవంతం

కృష్ణలంక, మే 3: విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి ఈవీఎంల తొలి సప్లిమెంటరీ ర్యాండమైజేషన్(బ్యాలెట్ యూనిట్లు), రెండో ర్యాండమైజేషన్(బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు) ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంలో శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.దిల్లీరావు ఆధ్వర్యంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. మధ్యాహ్నం జనరల్ అబ్జర్వర్లు మంజూ రాజ్ పాల్, నరీందర్ సింగ్ బాలిలతో పాటు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బీయూ, సీయూ, వీవీ ప్యాట్ల రెండో ర్యాండమైజేషన్ నిర్వహించారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గంలో 17 మంది పోటీలో ఉన్నారని, దీంతో రెండో బ్యాలెట్ యూనిట్ అవసరమైందని సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టి, విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ఒక బ్యాలెట్ యూనిట్‌లో 15 మంది, ఒక నోటా బటన్‌కు మాత్రమే వీలుంటుందన్నారు. 2,147 అదనపు బీయూల కేటాయింపునకు ఈ సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించామన్నారు. ఈవీఎంలను పోలింగ్ స్టేషన్లకు అనుసంధానించేందుకు రెండో ర్యాండమైజేషన్ కూడా చేపట్టినట్లు తెలిపారు. 4,294 బీయూలు, 2,147 సీయూలు, 2,324 వీవీ ప్యాట్లకు ప్రక్రియ నిర్వహించినట్లు కలెక్టర్ వివరించారు.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో భాగస్వాములు కండి

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యాక జనరల్ అబ్జర్వర్లు మంజూరాజ్‌పాల్, నరీందర్‌సింగ్ బాలిలు విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గంలో పోటీలో నిలిచిన అభ్యర్థులు, అభ్యర్థుల ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికల నిర్వహణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఉల్లంఘనలపై తమకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎన్నికలసెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా వేలేరులో రైతు సంఘాల నాయకుల ధర్నా

టైటిల్ యాక్ట్‌తో ఆస్తులకు ఎసరు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 3: సొంత ఆస్తులపై ప్రజలకు హక్కు లేకుండా చేసి స్థిరాస్తులను లాగేసుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చిందని రైతు నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వేలేరులోని పేద రైతు అయిల్‌పామ్‌తోటలో రాష్ట్ర రైతు సంఘాల ఆధ్వర్యంలో రాజకీయాలకతీతంగా శుక్రవారం వారు ధర్నా నిర్వహించారు. బాపులపాడు మండలంలోని కానుమోలు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసును మోడల్‌గా ప్రకటించిన నేపథ్యంలో ఈ ధర్నా చేశారు. రీసర్వే చేయడం ద్వారా ఆస్తులను క్రమద్ధీకరిస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రజలను భాగస్వాములను చేయకుండా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. టైటిలింగ్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు అపరిమిత అధికారాలివ్వడం ప్రజల ఆస్తులను వైసీపీ నాయకులకు కట్టబెట్టేందుకేనన్నారు.



చెయ్యి, కాలు విరిగి చికిత్స పొందుతున్న కార్మికురాలు

ఎన్టీటీపీఎస్‌లో లోకో ట్రైన్ ఢీకొని కార్మికురాలికి తీవ్ర గాయాలు

ఇబ్రహీంపట్నం, మే 3 : ఎన్టీటీపీఎస్‌లో కార్మికుల ప్రాణాలకు ఏమాత్రం భద్రత లేకుండా పోయింది. ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నా, క్షతగాత్రులవుతున్నా అధికారులు భద్రతా చర్యలు చేపట్టడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కోల్ ప్లాంట్‌లో లోకో ట్రైన్ జూపూడికి చెందిన కాంట్రాక్టు కార్మికురాలు సునావత్ కోటేశ్వరి (34)ని ఢీకొట్టింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. రెండు కాళ్లు, ఒక చెయ్యి విరిగిపోయింది. ప్రమాద విషయం గుత్తేదారుతో కుమ్మక్కై ఎన్టీటీపీఎస్ అధికారులు గోప్యంగా ఉంచారు. బాధితురాలిని ప్రయివేటు వైద్యశాలలో ఉంచి రహస్యంగా చికిత్స చేయిస్తున్నారు.

బాధితురాలికి న్యాయం చేయాలి : టీడీపీ

ఎన్టీటీపీఎస్‌లో ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి.. అధికారులు, గుత్తేదారులు కాంట్రాక్టు కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుడుతున్నారు.. శుక్రవారం జరిగిన ప్రమాదంలో బాధితురాలు పూర్తిగా అంగవైకల్యం పొందింది. ప్రమాదానికి కారణమైన వ్యక్తులపై చర్యలతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ) డిమాండ్ చేశారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు

తిరువూరు, మే 3 : మండలంలోని అక్కపాలెం గ్రామంలో గడ్డివాములో దాచిన తెలంగాణకు చెందిన 480 మద్యం బాటిళ్లను ఎస్ఈబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఈబి స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం, అక్కపాలెం గ్రామానికి చెందిన నెక్కళపు శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో ఎన్నికల్లో పంచేందుకు మద్యం నిల్వచేసిన సమాచారంతో దాడిచేశామన్నారు. తెలంగాణకు చెందిన 480 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని, నెక్కళపు శ్రీనివాసరావు, దినేష్‌గౌడ్‌లను అదుపులోకి తీసుకోవడం జరిగిందని, రేలుపడికి చెందిన కిలారు రమేష్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. దాడిలో ఎస్సైలు రఘు, జగ్గరావు సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం, అదుపులోకి తీసుకున్న నిందితులతో ఎస్ఈబీ అధికారులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	142, 151, 162
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.40

జయ విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం

గవర్నర్‌పేట, మే 3: 23వ డివిజన్ సూర్యారావుపేట చిలుకు దుర్గయ్య వీధిలోని శ్రీ జయ విఘ్నేశ్వర ఆలయం 30వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి స్వామిని దర్శించుకుని పేదలకు భోజనం పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు రమేష్, వాసు, సురేష్, సాయి, బాజీ, చింతా దుర్గారావు పాల్గొన్నారు.



ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న బాలస్వామి

కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి

వన్‌టౌన్, మే 3: ఎన్‌డీఏ కూటమిని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని కూటమి బలపరచిన విజయవాడ పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న నివాసంలో శుక్రవారం డివిజన్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, సుజనా చౌదరిలు పాల్గొన్నారు. ప్రతి డివిజన్‌లోని ఏరియా కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి ఒక్క ఓటరును వ్యక్తిగతంగా కలుసుకోవాలన్నారు. కూటమి గెలుపే లక్ష్యంగా బీజేపీ-టీడీపీ-జనసేన శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధిని, జగన్ ఐదేళ్ళ పాలనలో జరిగిన విధ్వంసాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు.

జగన్ పనైపోయింది : బుద్దా వెంకన్న

వైసీపీ ప్రజాదరణ కోల్పోతోందని, పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు కూటమిలో చేరుతున్నారని బుద్దా వెంకన్న అన్నారు. విద్యాధరపురం 39వ డివిజన్‌లోని వన్‌టౌన్ శివాలయం ట్రస్ట్‌బోర్డు మెంబర్ నాగమణితో పాటు రెండు వందల మంది కార్యకర్తలు బుద్దా వెంకన్న నివాసంలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రేగళ్ళ లక్ష్మణరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి సుజనా చౌదరి, కొనకళ్ల నారాయణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, 39వ డివిజన్ టీడీపీ అధ్యక్షురాలు పద్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుజనా చౌదరి

సైనికుడిలా పనిచేస్తా ..ఆశీర్వదించండి: సుజనా చౌదరి

ప్రజలు ఆశీర్వదిస్తే సైనికుడిలా పనిచేసి పశ్చిమను అభివృద్ధి పథంలోకి తీసుకువస్తానని బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కంచంపల్లి హరి నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 53వ డివిజన్‌లో బీజేపీ కార్యాలయాన్ని శుక్రవారం సుజనా చౌదరి ప్రారంభించారు. ఎన్నికల్లో ప్రజలందరూ తనకు ఓటు వేసి గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసీపీకి ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల గోవిండ్, 53వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి భాస్కర్, మహదేవ్ సురేష్, 52వ డివిజన్ అధ్యక్షుడు పగడాల లక్ష్మణ్, డివిజన్ అధ్యక్షురాలు ఒమ్మి అన్నపూర్ణ, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగమణికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుజనా చౌదరి, కొనకళ్ల నారాయణ

కార్మికులకు అండగా టీడీపీ

● పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు మాధవ

వన్‌టౌన్, మే 3: కార్మికులకు ప్రతినిత్యం టీడీపీ అండగా ఉంటుందని పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ అన్నారు. శుక్రవారం ఆయన తెలుగు యువత నాయకులతో కలిసి విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిలను గెలిపించాలని కోరుతూ వన్‌టౌన్ తారాపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి దుకాణానికి వెళ్లి జగన్ రెడ్డి చేసిన అరాచకాలను వివరించి టీడీపీ ప్రభుత్వం హయాంలో వ్యాపారస్తులకు, కార్మికులకు ఏవిధంగా అండగా ఉందో వివరించారు. ఈ సందర్భంగా ఆయన సూపర్ సిక్స్ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. పశ్చిమ తెలుగు యువత నాయకులు బి.కల్యాణ్, బాలసాయి, శశి, గౌరిశంకర్, చంటి, నాని, దిలేష్, సాయి, ఆర్.శ్రీకాంత్, దుర్గారావు పాల్గొన్నారు.



తారాపేటలో తెలుగు యువత నాయకుడు మాధవ ప్రచారం

కూటమి అభ్యర్థులను మెజారిటీతో గెలిపిద్దాం

విద్యాధరపురం, మే 3: విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిలను భారీ మెజారిటీతో గెలిపిద్దామని 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చినవెంకట సుబ్బయ్య అన్నారు. శుక్రవారం ఆయన 19, 26, 27, 29 బూత్ ఇన్‌చార్జులతో కలిసి గాంధీబొమ్మ రోడ్డు, హనుమయ్య వీధి, పోకూరి వారి వీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా బూత్ ఇన్‌చార్జులు ఎం.నారాయణరావు, పి.వెంకటాద్రి, ఏ. వెంకటేశ్వర్లు, దేవినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.



40వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డివిజన్ నాయకులు

కూటమితోనే మాదిగల ఏబీసీడీ వర్గీకరణ సాధ్యం

● ఎమ్మార్పీఎస్ సెంట్రల్ ఇన్‌చార్జ్ నూకపోగు ఏసు



పాయకాపురం, మే 3 : మాదిగ ఉప కులాల ఏబీసీడీ వర్గీకరణ ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని ఎమ్మార్పీఎస్ సెంట్రల్ ఇన్‌చార్జ్ నూకపోగు ఏసు అన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నేతలు 61వ డివిజన్ శాంతినగర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని, టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావులను గెలిపించాలని కోరారు. నేతలు లింగాల నరసింహులు, కాంపాటి వెంకటేశ్వరరావు, చప్పిడి కాశీ, కత్తుల దుర్గారావు, ప్రభాకర్, నాగేశ్వరరావు, కొండ పాల్గొన్నారు.

ఏకలవ్యనగర్‌లో విదేశీ సిగరెట్లు పట్టివేత

ఇద్దరిపై కేసు

విద్యాధరపురం, మే 3: ఏకలవ్యనగర్‌లోని ఏటీసీ ట్రాన్స్‌పోర్ట్ గోడౌన్‌లో భారీగా నిల్వఉంచిన విదేశీ సిగరెట్లను గురువారం రాత్రి విజిలెన్స్ అధికారులు పట్టుకుని భవానీపురం పోలీసులకు అప్పగించారు. శుక్రవారం భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన గొబ్బిల శ్రీనివాసరావు ఆరు నెలల క్రితం ఏకలవ్యనగర్‌లో ఓ గోడౌన్‌ను అద్దెకు తీసుకుని ఏటీసీ ట్రాన్స్‌పోర్ట్ నిర్వహిస్తున్నాడు. ఇతను ప్రతిరోజూ ఉదయం గుంటూరు నుంచి వచ్చి ట్రాన్స్‌పోర్ట్‌లో సరుకుల ఎగుమతి, దిగుమతి పనులు చూసుకుంటుంటాడు. ఇతను ట్రాన్స్‌పోర్ట్‌లో ఇతర రాష్ట్రాల నుంచి విదేశీ సిగరెట్లు బండిల్స్ తెస్తూ ఉంటాడు. ఇక్కడ గోడౌన్ నుంచి మినీ వాహనాల ద్వారా సిగరెట్ బండిల్స్ ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటాడు. ఈ సమాచారం విజిలెన్స్ అధికారులకు తెలియడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గురువారం ట్రాన్స్‌పోర్టులో భారీ స్థాయిలో విదేశీ సిగరెట్ బండిల్స్ లోడ్ దిగుమతి అయ్యాయని విజిలెన్స్ అధికారులకు తెలిసింది. దీంతో వారు గోడౌన్‌పై దాడి చేశారు. గోడౌన్ యాజమానురాలిని ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుల వివరాలు అడిగి తెలుసుకుని అతనిని అక్కడకు పిలిపించి గోడౌన్‌ను తెరిపించి తనిఖీ చేశారు. సుమారు రూ.76,800 వేల విలువ చేసే విదేశీ సిగరెట్ బండిల్స్‌ను విజిలెన్స్ అధికారులు పట్టుకుని భవానీపురం పోలీసులకు అప్పగించారు. అయితే వీటి విలువ మార్కెట్‌లో సుమారు రూ.38 లక్షలు ఉంటుందని విజిలెన్స్ అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది. విజిలెన్స్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గొబ్బిల శ్రీనివాసరావుతో పాటు అతని వద్ద పనిచేసే కిషోర్‌పై కేసు నమోదు చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

అజిత్‌సింగ్‌నగర్, మే 3 : రానున్న ఎన్నికల్లో వైసీపీ అంతం రాష్ట్రంలోని ఎస్సీల పంతం అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గం మాల, మాదిగ, అంబేడ్కర్ యువజన సంఘాల జేఏసీల ఆధ్వర్యంలో టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శుక్రవారం ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముందుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో దళిత వర్గాల ఆర్థికాభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నేతలు దాసరి జయరాజు, కార్యంశెట్టి లూర్దురాజు, మద్దాలి రుక్మిణి, తేళ్ల భవాని, డేవిడ్, వేల్పుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వద్దు బాబోయ్ వైసీపీ అంటున్న ప్రజలు

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

భారతీనగర్, మే 3: ఐదు సంవత్సరాల జగన్మోహన్‌రెడ్డి పాలనను చూసిన రాష్ట్ర ప్రజలు వద్దు బాబోయ్ వైసీపీ పాలన అంటున్నారని కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాష్ట్రాన్ని, రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేసుకుంటామని ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. శుక్రవారం తూర్పు నియోజకవర్గం 4వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ, వెటర్నరీ కాలనీలలో కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, గద్దె రాజేష్, గద్దె క్రాంతి కుమార్‌లు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, బీజేపీ బలపరిచిన తూర్పు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గద్దె అనురాధ కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసే సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి ఆమె వివరించారు.



ఎన్టీఆర్ కాలనీలో కరపత్రాలను ఇస్తున్న గద్దె అనురాధ

● ఎన్నికల ప్రచారంలో భాగంగా సాయంత్రం 4వ డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో కూటమి అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని చిన్నిల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరిని పిలిచి రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, తుమ్మల కృష్ణారావు, నలిమిశెట్టి రాజామణి, చిగురుపాటి యుగంధర్, స్వర్ణ, ఆంజనేయులు, ఎస్.వెంకటరత్నం నాయుడు, కడియాల దుర్గాభవాని, పి.రత్నశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు

41వ డివిజన్‌లో విస్తృత ప్రచారం

భవానీపురం, మే 3 : కేంద్రం,రాష్ట్రంలోను ఎన్డీఏ కూటమి విజయం అనివార్యమని, జగన్ అరాచక పాలనను అంతమొందించడానికి ఎంపీగా కేశినేని శివనాథ్‌ను, ఎమ్మెల్యేగా సుజనా చౌదరిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. 41వ డివిజన్‌లో శుక్రవారం పలు బూత్‌ల్లో స్థానిక నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు.

● 41వ డివిజన్‌లోనే పత్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బేతపూడి అరుణకుమారి వీధిలో ఎన్డీఏ డివిజన్ కూటమి కార్యాలయాన్ని సీనియర్ టీడీపీ నాయకుడు గుంటుపల్లి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఓటర్ల స్లిప్పుల పంపిణీ, బూత్‌ల వారీ ఓట్ల వెరిఫికేషన్ వివరాలపై చర్చించారు. పెద్ది సతీష్, నాగభూషణం, ఆనంద్‌లు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేస్తాం

పాయకాపురం, మే 3 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును మళ్లీ సీఎం చేయడానికి రాష్ట్ర ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అమ్మ వికలాంగుల సంక్షేమం ఆధ్వర్యంలో 64వ డివిజన్ కండ్రికలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విభిన్న ప్రతిభావంతులకు అందజేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి చేస్తామని అలాగే సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. నేతలు పరుచూరి ప్రసాద్, వింజమూరి సతీష్, ఎస్వీఆర్ నాగరాజు, నరసింహారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులతో మాట్లాడుతున్న బొండా ఉమా

● 62వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

62వ డివిజన్ పటేల్‌నగర్‌లో టీడీపీ నేతలు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొండా ఉమా మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, ఈ సైకోని తరిమికొడదామా అని ప్రజలందరూ ఎదురు చూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నేతలు పైడి శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, మే 3: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దార్థ నగర్(1 నుంచి 5రోడ్డుల వరకు), మోడరన్ సూపర్ మార్కెట్ ఏరియా, సిద్ధార్థ కాలేజీ జంక్షన్, నవోదయా కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ, సున్నపుబట్టీల సెంటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆటోనగర్‌లో చెట్లను కాపాడుకుంటాం

● ఐలా సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు సుంకర దుర్గాప్రసాద్



మొక్కలకు, చెట్లకు నీళ్లు పోయిస్తున్న ఐలా ప్రతినిధులు

ఆటోనగర్(పెనమలూరు), మే 3: ఆటోనగర్‌లోని ప్రతి చెట్టును, మొక్కను కాపాడుకొని పర్యావరణాన్ని నెలకొల్పుతామని ఐలా సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు సుంకర దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఎండల తీవ్రత అధికమవడంతో అధికారులు పట్టించుకోకపోయినా ఆటోనగర్‌లో గతంలో నాటిన, పెంచిన మొక్కలు, చెట్లకు శుక్రవారం నుంచి నీళ్లు పోయడం ప్రారంభించామని తెలిపారు. ఇక రోజూ మొక్కలకు, చెట్లకు నీళ్లు పోస్తామని తెలిపారు. శుక్రవారం ఐలా ప్రతినిధులు ట్యాంకరుతో నీటిని తెప్పించి మొక్కలకు, చెట్లకు నీళ్ల సరఫరా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో క్లస్టరు ఎండీ అన్నే శివనాగేశ్వరరావు, డాక్టర్ అబ్దుల్ కలాం, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, కత్తిక శివనాగేశ్వరరావు, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి ,షేక్ బాజీ షరీష్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్, మే 3 : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వస్వామి ఆలయంలోని నిర్వహిస్తున్న బ్రహోత్స వాల్లో భాగంగా శుక్రవారం కన్నుల పండువగా శ్రీవారికి ఆలయ నిర్వాహకులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయం నుంచి బయలుదేరిన గ్రామోత్సవం జంక్షన్ నాలుగు రోడ్లలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. కార్యక్రమాన్ని ఆలయ ట్రస్టీ కాకాని అరుణబాబు, తవ్వా పూర్ణచంద్రరావు, ఈవో వై.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

యార్లగడ్డ జ్ఞానేశ్వరి ప్రత్యేక పూజలు

గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి గురువారం రాత్రి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి ఆశీస్సులు అందజేశారు. ఆమె వెంట టీడీపీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, జిల్లా అధికార ప్రతినిధి వడ్డిల్లి లక్ష్మి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్, టీడీపీ కార్యకర్తలు, తెలుగు మహిళలు, జనసేన వీరమహిళలు పాల్గొన్నారు.

వ్యాపారులకు, ముఠా కార్మికులకు అండగా ఉంటా

మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్‌లో పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనాచౌదరి

గొల్లపూడి, మే 3: మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ మార్కెట్ వ్యాపారులకు, ముఠా కార్మికులకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి భరోసా ఇచ్చారు. మార్కెట్‌లోని వ్యాపారులు, ముఠా కార్మికుల సమస్యలను శుక్రవారం అడిగి తెలుసు కున్నారు. ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలన జరిగిందన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఉద్యోగ, వ్యాపార రంగాలన్నింటినీ అధోగతి పాలు చేశాడని దుయ్యబట్టారు. అనుభవం లేని నాయకుడికి అవకాశం ఇస్తే ఏం చేశాడో రాష్ట్ర ప్రజలం దరూ చూశారన్నారు. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, వెలగపూడి శంకర్‌బాబు, వక్కలగడ్డ భాస్కరరావు, బొమ్మసాని సుబ్బారావు, బాడిత శంకర్, పైలా సోవినాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ముఠా కూలీలతో మాట్లాడుతున్న సుజనా

వేసవి క్రికెట్ శిక్షణ ప్రారంభం

జగ్గయ్యపేట, మే 3: పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాన్ని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంరవికుమార్, అసిస్టెంట్ ఎంవీఐ పీజే సురేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ నెల 31 వరకు శిబిరాన్ని నిర్వహిస్తామని, రెండు నెట్ల ద్వారా ప్రాక్టీస్ చేయిస్తామని కోచ్ రాజేంద్ర తెలిపారు. క్రికెటర్లు జానీ, సుధీర్, అనురాగ్ పాల్గొన్నారు.



'కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు, మహిళలు ఇలా ప్రతి ఒక్కరూ నేనే గెలవాలని కోరుకుంటున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వివిధ వర్గాలు చవిచూస్తున్న భారాలు.. వారిలో తీవ్ర వ్యతిరేకతను కలిగిస్తున్నాయి. నేను ఈసారి 30 వేల మెజారిటీకి తగ్గకుండా గెలుస్తా. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో మరోమారు పసుపు జెండా ఎగురవేస్తా' అని విజయవాడ తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం అనంతరం భోజన విరామ సమయంలో గద్దె రామ్మోహన్ తో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడారు. నియోజకవర్గం ప్రజలకు ఇస్తున్న హామీలు, ప్రచార సరళి, కూటమి భాగస్వామ్య పక్షాల సహకారం, నియోజకవర్గంలో ప్రత్యర్థుల సాగించిన వ్యవహారాలు, నియోజకవర్గ ప్రధాన సమస్యలపై తన వైఖరిని గద్దె చెప్పారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

తూర్పున జెండా ఎగరేస్తాం..



తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్

- మెజారిటీ 30 వేలకు తగ్గదు. మా వాళ్ల లెక్కలయితే 60 వేలు
- తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- కొండ ప్రాంతాల్లో నిరవధికంగా 5 గంటల పాటు తాగునీరు
- శాశ్వత ప్రాతిపదికన మెట్లు, రెయిలింగ్, సిమెంట్ రోడ్ల నిర్మాణం
- కృష్ణలంకలో ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణ, పక్కా ఇళ్ల నిర్మాణం చేపడతా
- సామాజికవర్గాలు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఉద్యోగులు నా వెంటే ఉన్నారు

ప్రచారం ఎలా జరుగుతోంది? ఓటర్ల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది?

నేను ఏడు ఎన్నికలను చూశాను. ఆయా ఎన్నికల ప్రచారాల్లో ఎన్నడూ చవిచూడని రుచిని ఆస్వాదిస్తున్నాను. ప్రచారంలో నేను, నా సతీమణి, మా అబ్బాయిలు ఉన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన అనూహ్యంగా ఉంది. ఉద్యోగులు, వ్యాపారాలు నన్ను ఆశీర్వదిస్తున్నారు. ప్రజలు ఇంతగా బ్రహ్మరథం పట్టడం మునుపెన్నడూ లేదు. ఈ ఎన్నికల ప్రచారం నా జీవితంలో మరిచిపోనిది.

నియోజకవర్గ ప్రజలకు మీరు ఎలాంటి హామీలు ఇస్తున్నారు ?

మేము అధికారంలోకి రాగానే రోజుకు 5 గంటల పాటు నిరవధికంగా నీళ్ల వచ్చేలా చేస్తాను. **గుణదల** కొండ ప్రాంతాలకు శాశ్విత ప్రాతిపదికన మెట్ల నిర్మాణం చేపడతాను. పెద్దవాళ్లకు ఇబ్బంది లేకుండా ఉండటానికి ఆ మెట్లకు రెయిలింగ్ కూడా ఏర్పాటు చేస్తాం. **కృష్ణలంకలో** కృష్ణానదీ తీరాన ఉన్న కచ్చా, రేకుల ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించాలన్నది నా ఆలోచన. దీని కోసం కేంద్ర ప్రభుత్వ సహాయం కూడా తీసుకుంటాం. ఈ ప్రాంతంలో ఉంటున్న వారి ఇళ్ల పట్టాలను రెగ్యులర్ చేసిన తర్వాత అందులో పక్కా ఇళ్ల కోసం చర్యలు తీసుకుంటాను. **పటమటలో** అండర్ డ్రైనేజీ గ్రౌండ్ వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఇళ్లలోని మురుగు రోడ్లమీదకు వస్తోంది. ఈ సమస్యను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టేసింది. టీడీపీ హయాంలో స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ పనుల కోసం ఎల్అండ్‌టీకి పనులు అప్పగించాం. వైసీపీ ప్రభుత్వం ఆ సంస్థను పంపేసింది. అధికారంలోకి మళ్లీ స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ పనులు ప్రారంభించేలా చేస్తాం.

ప్రచారానికి మోదీ, పవన్ వస్తారు

ఈ నెల 8వ తేదీన ప్రధాని మోదీ విజయవాడ తూర్పు నియోజకవర్గంలో రోడ్డు షో నిర్వహిస్తారు. పవన్‌కల్యాణ్‌ను కూడా ఒకరోజు తూర్పులో పాల్గొనటానికి రావాల్సిందిగా ఆహ్వానించాం. వంగవీటి రాధాకృష్ణ శనివారం నుంచి ప్రచారం నిర్వహిస్తున్నారు. దర్శిపేట నుంచి క్రీష్ణలంక ప్రాంతం ప్రచారంలో పాల్గొంటున్నారు.

మీ కూటమి భాగస్వామ్య పక్షాలు మీకు సహకరిస్తున్నాయా?

జనసేన, బీజేపీల నుంచి నాకు పూర్తి సహకారం ఉంది. జనసేనకు చెందిన నాయకులు నా వెంటే నడుస్తున్నారు. పెద్ద సంఖ్యలోని వారి కార్యకర్తలు నా ప్రచారంలో ర్యాలీ అవుతున్నారు. బీజేపీకి చెందిన మొత్తం కార్యకర్తలు నా ప్రచారంలో పాల్గొంటున్నారు.

మీ ప్రత్యర్థి దేవినేని అవినాష్ బలం, బలహీనతలు తెలుసుకుని వ్యూహాలు అమలు చేస్తున్నారా?

నా ప్రత్యర్థి బలవంతుడేమీ కాదు. ప్రజల్లో చాలా బలహీనుడు. తూర్పు నియోజకవర్గ ప్రజలు శాంతిని కోరుకుంటున్నారు. కోరి రౌడీ మూకలను గెలిపించుకోవాలనుకోవటం లేదు. మా పార్టీ నాయకుడు చెన్నుపాటి గాంధీపై కూడా దాడి చేసి కన్ను పోగొట్టారు. ఎక్కడపడితే అక్కడ వైసీపీ నాయకులు దందాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వారిని దగ్గర పెట్టుకున్న వ్యక్తిని ప్రజలు గెలిపించాలనుకోవటం లేదు. నా పని నేను చేసుకుని వెళుతున్నా.

ఆటోనగర్‌ను తరలించాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారు కదా! ఈ సమస్యపై మీరు ఎలాంటి హామీ ఇస్తారు?

ఆటోనగర్ సంఘాల అభీష్టం మేరకు, స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండే మార్గం ఏమైనా ఉంటే అదే చేస్తాను. వైసీపీ ప్రభుత్వంలో ఆటోనగర్‌ను తరలించేస్తామన్నారు. సగం డబ్బులు కట్టమన్నారు. దీనికి సంఘాలు వ్యతిరేకించాయి. ఆటోనగర్‌లోకి వాహనాలు వెళ్లడం, ట్రాఫిక్ ఇబ్బందులు కూడా సమస్యగానే ఉంది. అది సంఘాలకు కూడా తెలుసు. ఆటోనగర్ సంఘాలు ఏవైనా ప్రణాళికలతో వస్తే మా ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తాను. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా మాత్రం చేయం.

విజయవాడ - మచిలీపట్నం ఆరు వరసల విస్తరణ పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు? దీనికి మీరిచ్చే పరిష్కారం ఏమిటి?

విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిని ఇప్పటికే నాలుగు వరసలుగా విస్తరించారు. విజయవాడలో బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు ఆరు వరసలకు అనుగుణంగానే ఉంది. ఇప్పటికిప్పుడు ఏమీ చెప్పలేను కానీ.. అది డీపీఆర్ పూర్తి చేసుకున్న తర్వాత ప్రజలకు నష్టం లేకుండా ఏం చేయాలన్నదానిపై ఆలోచన చేస్తాం.

అర్ధ రూపాయి ఇచ్చి.. రూపాయి భారం మోపారు..

ఈ ప్రభుత్వం పథకాల గురించి చెప్పుకుంటోంది. పథకాల కోతల వల్ల ఎందరో బాధితులుగా మారారు. పథకాల రూపంలో అర్ధరూపాయి ఇస్తే పన్నులు రూపంలో రూపాయి లాక్కుంది. చెత్త పన్ను, కరెంట్ చార్జీల పెంపు అత్యంత కీలకమైనవి. వీటి వల్ల జనం ఆగ్రహంతో రగిలిపోతున్నారు.


మీ ప్రత్యర్థి దేవినేని అవినాష్ మిమ్మల్నే టార్గెట్ చేసి విమర్శలు ఎక్కుపెడుతున్నారు? నియోజకవర్గంలో అధికారంలో లేకపోయినా సర్వీసు చేస్తున్నానని అంటున్నారు. మీరేమంటారు?

ఏం చేశాడని నేను ప్రశ్నిస్తున్నా. యూజీడీ వ్యవస్థను బాగు చేశాడా? ఇళ్లలో నీరు రోడ్ల మీదకు వస్తున్న దౌర్భాగ్యం నెలకొంది. ఈ వేసవిలో గత 20 రోజులుగా కొండ ప్రాంతాలకు మంచినీరే రావటం లేదు. మంచినీళ్ల ఇప్పించాడా? వర్షం కురిస్తే రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రెయినేజీ పూడికలు తీయించాడా? మా ప్రభుత్వం విజయవాడలో అన్నీ సిమెంటు రోడ్లు వేయాలని రూ.1600 కోట్లు ఇస్తే.. సిమెంట్ రోడ్లు వేయించాడా? ఆ డబ్బులు ఏమయ్యాయో కూడా తెలియదు. రీ టెయినింగ్ వాల్‌ను మొదలు పెట్టిందే నేను. సగం రీ టెయినింగ్ వాల్ పనులు మా ప్రభుత్వ సహాయంతో నేనే చేయించాను. మిగిలిన కొద్ది భాగం పూర్తి చేయటానికి ఈ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. పంటకాల్వ రోడ్డు విస్తరణ పనులను కూడా చేయించాను. ఇలా దూరదృష్టితో ఎన్నో పనులు చేశాను. నా మీద విమర్శలు ఎక్కుపెట్టినంత మాత్రాన అవన్నీ నిజమైపోవు. నేనేమిటో, తనేమిటో ప్రజలకు బాగా తెలుసు.

ఎన్నికల్లో మీ గెలుపు లెక్కలేమిటి? హ్యాట్రిక్ కొట్టబోతున్నారా?

కచ్చితంగా. ఇక్కడ పసుపు జెండా ఎగురవేయటం ఖాయం. నా వరకు 30 వేల మెజారిటీ తక్కువ రాదని అనుకుంటున్నాను. మా నాయకులు, కార్యకర్తలు అయితే 60 వేల వరకు వస్తుందని లెక్కలు వేస్తున్నారు. నేనైతే ఒకటే చెబుతున్నాను. ఈసారి రికార్డు స్థాయి మెజారిటీతో తూర్పున జెండా ఎగరవేయబోతున్నాం.

మన ఓటు... మన ఆత్మగౌరవం!



ఎన్నికలు అంటే ఏమిటి? ఎందుకు అవసరం? పుస్తకం



దేవినేని మధుసూదనరావు

ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలమది. మధ్యాహ్నం డిల్లీ రాజమార్గంలో తన కాన్వాయ్‌తో కారులో వెళ్తున్నారు. ఇంతలో దూరంగా మండుటెండలో ఆట బొమ్మలు అమ్ముకుంటున్న తొమ్మిదేళ్ల పాపపై ఇందిరాగాంధీ దృష్టి పడింది. కాళ్లకు చెప్పులు లేకుండా ఆ చిన్నారి దూది బొమ్మలు అమ్ముకుంటున్న తీరు ప్రధాని హృదయాన్ని కదిలించింది. చిన్నారిని ప్రధాని అంతటి మనిషి పిలుస్తున్నా తనను కాదనుకొని చిన్నారి ప్రతిస్పందించలేదు. తానే ఆ చిన్నారిని పలకరించేందుకు వెళ్లారు. 'నేను అంతగా పిలుస్తున్నా పలకకుండా వెళ్లిపోతున్నావేం పాపా' అంటూ తలపై నిమురుతూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు ప్రధాని. 'నువ్వు ఎక్కడ ఉంటావు' అంటూ ఆరా తీశారామె. 'ఇంట్లో అమ్మ, అక్కయ్యలు బొమ్మలు చేసి ఇస్తే, నేను ఇలా బజారులో అమ్ముతూ ఉంటానమ్మా.. ఇంట్లో అమ్మా, నాన్న, నేను, ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెళ్లు. తొమ్మిది మందికి ఈ బొమ్మల నుంచి వచ్చిన ఆదాయమే ఆధారం. రోజంతా అమ్మితే రూ.20 - రూ.30 లాభం ఉంటుంది' అని చెప్పి అమ్ముకోవడానికి వెళ్లిపోసాగింది ఆ చిన్నారి. ఆ పాప కుటుంబ ఆర్థిక స్థితిగతులు ప్రధానికి అర్థమయ్యాయి. వెంటనే తన చేతి సంచిలో నుంచి రూ.500 తీసి పాప చేతిలో ఉంచారు. ఆ పాప ప్రధాని కళ్లలోకి చూస్తూ 'అమ్మా నేనేం.. బిచ్చగత్తెను కాను' అంది. ఒక్కక్షణం ఆలోచనలో పడ్డారు ప్రధాని. ఆ పాప అంత సులువుగా డబ్బులు తీసుకోదని అర్థమైంది. 'అమ్మా మా ఇంట్లో చిన్నపిల్లలు లేకపోయినా నీలాంటి చిన్న పిల్లలు చాలా మంది కలుస్తుంటారు. వారికి ఆడుకోవడానికి ఈ బొమ్మలు బహుమతిగా ఇద్దామనుకుంటున్నారు. ఇప్పటికైనా ఈ వంద రూపాయలు తీసుకొని బొమ్మలు అమ్ముతావా' అని వంద రూపాయలు నోటు ఆ పాపకు ఇచ్చారు ప్రధాని. ఆ తొమ్మిదేళ్ల పాప ఆత్మగౌరవాన్ని ప్రధాని తన డైరీలో రాసుకోవడమే కాదు. ఎంతో మంది ప్రముఖులకు ఉదాహరణగా చెప్పేవారు. ఉచితాలను ఆశించని ఆ చిన్నారి భారతీయ ఆత్మగౌరవానికే ప్రతీక అని కొనియాడేవారు. అయాచితంగా వచ్చిన దాన్ని భారతీయలు స్వీకరించరనీ, ఒకరి దయాదాక్షిణ్యాలపై బతికే అలావాటు భారతీయులకు లేదనీ భారతీయతత్వాన్ని ఈ ఉదంతం ఎన్నికల సందర్భంగా మరోమారు గుర్తు చేస్తుంది. మన ఓటు మన ఆత్మగౌరవం. ఓటును అమ్ముకుంటే ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నట్టే అని, డబ్బులు, మద్యం, తాయిలాలకు లొంగొద్దని, ఉచితాలకు ఆశపడి ఓటును వృథా చేయొద్దని తెలుపుతూ పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దేవినేని మధుసూదనరావు, జయశ్రీ. ఈ చిన్నారి కథనం కూడా ఈ పుస్తకం లోనిదే. ఎన్నికల సమయంలో ప్రజలు తప్పటగులు వేస్తుంటారని, సరైన సమయంలో సరైన వ్యక్తిని ఎన్నుకోవాలని చెబుతూ 'ఎన్నికలు అంటే ఏమిటి? ఎందుకు అవసరం?' అనే పుస్తకాన్ని ముద్రించి పంపిణీ చేస్తున్నామని వారు చెబుతున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ వంతుగా ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎవరికి కావాలన్నా ఉచితంగా పంపిస్తామని, 99890 51200 నంబరుకు సంప్రదించవచ్చు అని వారు తెలిపారు. - కంకిపాడు

చట్టం కాదు 'భూ'తం!

- భూ యాజమాన్య హక్కు చట్టం-2022పై రైతుల ఆగ్రహం

కంచికచర్ల, మే 3 : వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం - 2022 (ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్టు) వల్ల గ్రామీణ ప్రాంత రైతుల్లో తీవ్ర అలజడి ఏర్పడింది. ఈ చట్టంపై గ్రామాల్లో ఎక్కడికక్కడ రైతుల్లో చర్చలు సాగుతున్నాయి. తరతరాలుగా తమ కుటుంబాలకు ఆధారంగా ఉంటున్న భూములపై వారసత్వంగా వస్తున్న హక్కులను కాలరాయటం పట్ల ఆందోళన చెందుతున్న రైతులు, దుర్మార్గంగా వ్యవహరిస్తున్న వైసీపీ పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో పటిష్ఠంగా ఉన్న ఆర్ఓఆర్ - 1971 (రికార్డ్స్ ఆఫ్ రైట్స్) చట్టాన్ని ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు.

చట్టాన్ని రద్దుచేయాలి



రైతుల హక్కులను హరించేలా వైసీపీ తెచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం -2022ను తక్షణమే రద్దు చేయాలి. రైతుల జీవితాలతో ఆటలాడుకునే దుర్మార్గపు చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించకూడదు. జగన్ బొమ్మలతో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను రద్దు చేసి, ప్రభుత్వ ఖర్చుతో రైతులకు కొత్త పుస్తకాలు ఇవ్వాలి. సర్వే రాళ్ల కూడా తొలగించి, కొత్త రాళ్ల వేయాలి.

- మాగంటి నరసింహారావు (బాబు), రైతు నాయకుడు, నక్కలంపేట

ఆర్ఓఆర్ ప్రకారమే పాస్‌పుస్తకాలివ్వాలి



ఆర్ఓఆర్ చట్టం ప్రకారమే రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. రైతుల ఆస్తులకు చెందిన ఈ పుస్తకాలపై జగన్ బొమ్మలు ముద్రించటం దారుణం. పైగా రెవెన్యూ రికార్డుల వివరాలను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించటం వల్ల ఆస్తుల భద్రతకు రక్షణ లేకుండా పోయింది. ఆస్తులను కొల్లగొట్టడం కోసమే వైసీపీ పెద్దలు ఒక పథకం ప్రకారం ల్యాండ్ టైటిల్ యాక్టును తీసుకువచ్చారు.

- దిగుమర్తి శ్రీనివాసరావు, లింగాలపాడు

రైతుల హక్కులకు భంగం



వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టం 2022 వల్ల రైతుల హక్కులకు భంగం కలుగుతుంది. భూ వివాదాలేర్పడినపుడు సివిల్ కోర్టులను ఆశ్రయించటానికి వీలు లేకుండా చేసి, న్యాయానికి సంకెళ్లు వేస్తున్నారు. న్యాయం కోసం కోర్టులకు వెళ్లకుండా బాధితులు పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సి ఉంటుంది. జిరాక్స్ రిజిస్ట్రేషన్ల వల్ల ఆస్తుల వివాదాలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది.

- అత్తలూరి భూపతిరావు, పరిటాల

గత ఎన్నికల ప్రచారంలో..

తోట్లవల్లూరు మండలంలో టీడీపీ నేతలు ఇసుకను దోచుకుతింటున్నారు. నేను అధికారంలోకి వస్తే అవినీతిని అరికడతా. ఇసుకను పారదర్శకంగా ప్రజలకు అందిస్తా.

- ప్రతిపక్ష నేతగా 2019 పాద యాత్రలో పామర్రు వచ్చినప్పుడు జగన్ చెప్పిన మాటలివి.

వైసీపీ అధికారంలోకొచ్చాక..

ఇసుక అక్రమ తవ్వకాలకు అంతులేదు. అమ్మకాలకు అడ్డులేదు. వైసీపీ నేతలు దోచుకుతినేటట్టు చేశారు. ఇసుక ధరను భారీగా పెంచేశారు. సామాన్యుడికి ఇసుక ధర అందనంత ఎత్తుకు తీసుకెళ్లారు. క్వారీల్లో యంత్రాలను ప్రవేశపెట్టి ఇసుక క్వారీలపైనే ఆధారపడిన 5వేల మంది కార్మికుల జీవనోపాధిని దెబ్బతీశారు.



టీడీపీ హయాంలో ఉచిత ఇసుక పథకంలో ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేస్తున్న కార్మికులు (ఫైల్)



వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేసి కేవలం యంత్రాలతోనే చేస్తున్న ఇసుక లోడింగ్ (ఫైల్)

ఇసుక కార్మికుల కడుపు కోత

- టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా ఇసుక
- లోడింగ్‌తో కార్మికులకు ఉపాధి
- రోజుకి రూ.1,500 కార్మికుల సంపాదన
- రోజూ 2వేల మందికి ఉపాధి
- వైసీపీ ప్రభుత్వంలో యంత్రాలతోనే ఇసుక లోడింగ్
- క్వారీలకు పూర్తిగా దూరమైన కార్మికులు

తోట్లవల్లూరు : టీడీపీ ప్రభుత్వంలో ఉచిత పథకంలో తోట్ల వల్లూరు నుంచి ఒక ట్రాక్టర్ ఇసుకను ఉయ్యూరు తీసుకెళ్లి రూ.1,500కు విక్రయించేవారు. వినియోగదారులకు చాలా తక్కువ ధరకు లభించటంతో నిరుపేదలు సైతం భవన నిర్మాణాలు సాగించేవారు. జగన్ పాలనలో ట్రాక్టర్లకు ఇసుక పోయటం ఆపేసి పదిటైర్ల లారీల్లో యంత్రాలతో లోడింగ్ చేయిస్తున్నారు. దీంతో అదే ట్రాక్టర్ ఇసుక ఉయ్యూరులో కొనాలంటే బ్లాక్‌లో రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ముట్టజెప్పాల్సి వస్తోంది. ఇసుక రవాణా అవకాశం లేక పోవటంతో కిస్తీలు కట్టలేక చాలామంది ట్రాక్టర్లను అమ్మేసుకున్నారు.

టీడీపీ హయాంలో కార్మికులకు మేలు

టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక పథకంలో 2019 మే వరకు మూడు టన్నుల ఇసుకను రూ.300కు కార్మికులు ట్రాక్టర్‌లోకి లోడింగ్ చేసేవారు. తోట్లవల్లూరు మండలం నుండే కాకుండా ఉయ్యూరు, పామర్రు, కంకిపాడు, మచిలీపట్నం, పమిడిముక్కల, మొవ్వ తదితర మండలాల నుంచి రోజూ 2వేల మంది కార్మికులు తోట్లవల్లూరు వచ్చి ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేసేవారు. రోజుకి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు సంపాదించుకునేవారు. ఇలా ఒక కార్మికుడు నెలలో 15 రోజులు పనిచేసి నెలకు రూ.30 వేల వరకు సంపాదించుకునేవారు.

జగన్ పాలనలో యంత్రాలతోనే పనులు

వైసీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం జగన్ తాను ప్రతిపక్షనేతగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలోతొక్కి, కొత్త పాలసీ పేరుతో ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేశారు. కొత్త పాలసీలో సొంత ఏజెన్సీలకు ఇసుకను అప్పగించి టన్ను ఇసుకకు రూ.450 ధరను నిర్ణయించి యంత్రాలతోనే లోడింగ్ జరిగేటట్టు చేశారు. దీంతో వేలాది మంది కార్మికుల కడుపుమీద దెబ్బకొట్టినట్టయింది. క్వారీల్లో ఇసుక లోడింగ్ జీవనోపాధి కల్పించాలని కార్మికులు అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అర్పించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. మాట తప్పం మడమ తిప్పం అంటు గొప్పలు చెప్పుకునే సీఎం జగన్ ఇసుక విషయంలో మాటతప్పి మడమ తిప్పారు.

కార్మికులు తీవ్రంగా నష్టపోయారు



జగన్ పాలనలో ఇసుక కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. కేవలం ఇసుక పని తప్ప మరో పని చేతగాని వందలమంది కార్మికులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు గురికావలసి వచ్చింది. ఇసుక లోడింగ్ పనితో ప్రతిరోజూ రూ.1,500 వరకు ఒక వ్యక్తి సంపాదించుకునేవాడు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

- ఉయ్యూరు చిట్టిబాబు, ఇసుక కార్మికుడు, తోట్లవల్లూరు

ప్రభుత్వ క్వారీ తెరుస్తామన్న హామీ నెరవేరలేదు



ప్రభుత్వ ఇసుక క్వారీ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పిస్తామని గతంలో జాయింట్ కలెక్టర్ మాధవీలత రొయ్యూరు కార్మికులకు హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వ విధానంతో ప్రభుత్వ క్వారీలు తెరవలేదు. ప్రభుత్వం ప్రైవేటు వ్యాపారస్తులకు క్వారీలను అప్పగించటంతో వేలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది.

- బండెల కోటేశ్వరరావు, ఇసుక కార్మికుడు, రొయ్యూరు



సుప్రీం చెప్పినా...

దర్జాగా ఇసుక దందా!





- వంశధార నుంచి పెన్నా వరకూ నదులన్నీ గుల్ల
- అడ్డదారిలో తరలుతున్న వేలాది టన్నుల ఇసుక
- నదిలోనే భారీ యంత్రాలతో, లారీల్లోకి లోడింగ్
- కోర్టు ఆదేశాలు పట్టని అధికార యంత్రాంగం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నదుల్లో యంత్రాలతో ఇసుక తవ్వడానికి వీల్లేదని, పర్యావరణ అనుమతులు లేని రీచ్‌లలో తవ్వకాలు వెంటనే నిలుపుదల చెయ్యాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చినా ఇసుక దందాకు అడ్డుకట్ట పడటం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ ఇసుకాసురులు నిరాటంకంగా తమ పని కానిస్తున్నారు. శ్రీకాకుళం, అనంతపురం, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో దర్జాగా ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని అఖండ గోదావరిలో వందలాది డ్రెడ్జింగ్ యంత్రాలతో గోదావరిని కుళ్లబొడిచి, రోజూ వేలాది టన్నుల ఇసుక దోచుకుపోతున్నారు. రూ.కోట్లు గడిస్తున్నారు. జిల్లా యంత్రాంగం కానీ, ఇసుక అక్రమాలు నిలపడానికి ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్ గానీ, మైనింగ్, ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. రాజమహేంద్రవరంలోని గాయత్రీ, కాతేరు. వెంకటనగర్, కోటి లింగాలరేవుతో పాటు కడియం, సీతానగరం మండలాల్లో, కొవ్వూరు డివిజన్‌లోని కొవ్వూరు, కొవ్వూరు రూరల్, తాళ్లపూడి, నిడదవోలు, పెరవలి మండలాల్లో ఇసుక అక్రమాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. కాగా, శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలం డొంపాకలోని వంశధార నదిలో జేసీబీలతో తవ్వి వందలాది లారీలతో ఇసుకను తరలించుకుపోతున్నారు. పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం నివగాంలో ఇసుక రీచ్‌కు అనుమతి ఉంది. కానీ అక్కడ కాకుండా అంగూరు వద్ద వంశధార నదిలో యంత్రాలు పెట్టేసి పెద్దపెద్ద లారీలతో ఇసుకను తరలిస్తున్నారు. నరసన్నపేట మండలం మడపాం వద్ద వంశధారలో, ఎచ్చెర్ల మండలం పొన్నాడ వద్ద నాగావళి నదిలో ఇసుకను యంత్రాలతో తోడేస్తున్నారు. దీనికి ఏజెన్సీలు కూడా రశీదులు కూడా ఇచ్చేస్తున్నాయి. జలుమూరు, కొత్తూరు మండలాల్లో ప్రతిమ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ రశీదులు ఇచ్చి పెద్ద లారీలతో ఇసుకను విశాఖకు తరలిస్తోంది. ఇక గుంటూరు జిల్లా కొల్లిపర మండలం బొమ్మువానిపలెం-14, 15 రీచ్‌లకు, మున్నంగి రీచ్, తాడేపల్లి మండలంలోని గుండిమెడ రీచ్‌కు మైనింగ్ శాఖ ఒకేసారి అనుమతులిచ్చింది. ఒక్కో రీచ్‌లో కేవలం 12 ఎకరాల్లో సుమారు 48వేల క్యూబిక్ మీటర్ల చొప్పున ఇసుక పరిమాణానికి రెండేళ్ల కాలపరిమితితో అనుమతినిచ్చారు. అంటే 10 టైర్ల లారీకి కంపెనీ ఇస్తున్న పరిమాణం 18 క్యూబిక్ మీటర్ల సామర్థ్యమే అయినా ఇసుక మాత్రం 25 నుంచి 30 క్యూబిక్ మీటర్ల వరకు ఎత్తి పోస్తున్నారు. నిబంధనల ప్రకారం 2,700 లారీల వరకు ఇసుక నింపుకునే అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ నిత్యం 100 నుంచి 200 లారీల వరకు ఇసుక తరలిపోతోంది. అంటే పక్షం రోజుల్లోనే వీరికి అనుమతి ఇచ్చిన పరిమాణం పూర్తవుతుంది. ఈ రీచ్‌లలో భారీ యంత్రాలతో పరిమితికి మించి పది నుంచి 15 అడుగుల లోతులో ఇసుక తవ్వేస్తున్నారు. నదికి ఆనుకుని ఉన్న కొల్లిపర మండలంలోని గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి తాగడానికి గుక్కెడు నీరులేక జనం అల్లాడుతున్నా పట్టకుండా ఇసుకను నీటితో సహా తోడేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ దిగువన గుంటూరు జిల్లా పరిధిలోని ప్రాతూరు, చిర్రావూరు, పెదకొండూరు, అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, అన్నవరం, అటు బాపట్ల జిల్లాలో కొల్లూరు మండలం చిలుమూరు, గాజుల్లంక, పెదలంక, జువ్వలపాలెం, భట్టిప్రోలు మండలం ఓలేరు ప్రాంతాల్లో నిత్యం దొంగ ఇసుక రవాణా సాగిపోతూనే ఉంది. అలాగే, శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు, పెద్దచీగుళ్లరేవు గ్రామాల సమీపంలో చిత్రావతి నది నుంచి ఇసుకను భారీ యంత్రాలతో తవ్వి తరలిస్తున్నారు. హిందూపురం మండలం సంతేబిదనూరు వద్ద పెన్నా నదిలో యంత్రాలతో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. పెద్దచీగుళ్లరేవు వద్ద ప్రతిమ కంపెనీ పేరిట బిల్లులు ఇస్తున్నారు. ఇక్కడ ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనుచరులు తవ్వకాలు జరుపుతున్నారు. బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలలో ఆరుగురు వైసీపీ నేతలు (కేతిరెడ్డి అనుచరులు) ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. సంతేబిదనూరు వద్ద హిందూపురం వైసీపీ అభ్యర్థి దీపిక అనుచరులు తవ్వకాల వెనుక ఉన్నారు.



ఇచ్చింది తీసుకుని ఫ్లెక్సీలు వేయండి

- సమాచార అధికారి జగన్ భక్తి
- యాడ్ ఏజెన్సీ ప్రతినిధులతో భేటీ
- మళ్లీ గెలిచాక చూస్తామని హామీ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ భక్త అధికారులు ఇంకా తమ తీరు మార్చుకోవడం లేదు. ఎన్నికల ముందు కూడా వీర భక్తి ప్రదర్శించుకుంటూ... బెదిరింపులకు దిగుతున్నారు. ఐదేళ్లపాటు జగన్ మీడియాకు అడ్డగోలుగా ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చి... జనం సొమ్ము దోచిపెట్టిన సమాచార శాఖ అధికారి ఒకరు తాజాగా మరో దందాకు తెరలేపారు. అధికార పార్టీకి హోర్డింగులను గుండుగుత్తగా రాసివ్వాలని ప్రైవేటు యాడ్ ఏజెన్సీలను బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో జగన్ విపరీతంగా ప్రకటనలు ఇస్తున్నారు. అందులో భాగంగా తొలుత రాష్ట్రమంతా 'సిద్ధం' పోస్టర్లతో నింపేశారు. ఇప్పుడు మరోసారి పోలింగ్ ముందు రోజు వరకూ రాష్ట్రమంతా పోస్టర్లు వేయించేందుకు వైసీపీ సమాయత్తమైంది. దీనికోసం వైసీపీ తరఫున సమాచార శాఖలో కీలక అధికారి ఒకరు రంగంలోకి దిగారు. యాడ్ ఏజెన్సీ ప్రతినిధులతో భేటీ అయ్యారు. 'ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు సంబంధించిన ఫ్లెక్సీల ఏర్పాటుకు ఎంత తీసుకుంటారు?' అని అడిగారు. హోర్డింగ్ ఉన్న ఊరు, స్థలం, సైజు, ఫ్లెక్సీ నాణ్యతను బట్టి... ధర ఉంటుందని వారు చెప్పారు. గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు వసూలు చేస్తామన్నారు. దీంతో అధికారి బెదిరింపు స్వరంతోనే బేరాలకు దిగారు. "అంత సాధ్యం కాదు. మూడు లక్షలిస్తారు.. లేదంటే నాలుగిస్తారు.. వేయండి!" అంటూ వైసీపీ ఫ్లెక్సీల గురించి చెప్పారు. అలాగైతే తాము నష్టపోతామని, ఆ రేటుకు చేయలేమని కొందరు చేతులెత్తేశారు. దీంతో ఆయన 'క్విడ్ ప్రో కో' ఆఫర్ ఇచ్చారు. "ఇప్పుడు తక్కువకు ఫ్లెక్సీలు వేయండి. మళ్లీ వైసీపీ అధికారంలో వస్తుంది. అప్పుడు ఇంతకు రెట్టింపు ఇప్పిస్తా. ఇప్పుడు వైసీపీ వాళ్లు ఇచ్చింది తీసుకుని ఫ్లెక్సీ వేయండి' అని నవ్వుతూనే గట్టిగా చెప్పారు. దీంతో చేసేదిలేక కొందరు సరేనన్నట్లు సమాచారం.

సునీల్ యాదవ్, ఉదయ్‌రెడ్డికి ఎదురుదెబ్బ

- వివేకా హత్య కేసులో బెయిల్ పిటిషన్‌లు కొట్టివేత
- అనారోగ్యం వల్ల భాస్కర్‌రెడ్డికి షరతులతో బెయిల్
- అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలన్న దస్తగిరి పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ బాబాయి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో 2వ నిందితుడు సునీల్ యాదవ్, 6వ నిందితుడు గజ్జల ఉదయ్‌కుమార్ రెడ్డిలకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వారి బెయిల్ పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. ఇదే కేసులో 7వ నిందితుడిగా ఉన్న వైఎస్ భాస్కర్‌రెడ్డికి అనారోగ్య కారణాలు వల్ల బెయిల్ ఇస్తున్నట్టు పేర్కొంది. మరో వైపు 8వ నిందితుడు, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని.. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తున్నాడని పేర్కొంటూ 4వ నిందితుడు (అప్రూవర్) దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. దస్తగిరి ఆరోపణలకు ఆధారాలు లేవని పేర్కొంది.

ఏ ఊర్రా మీది? మీ కులమేంటి?

- ఇక్కడకొచ్చి ప్రచారం చేస్తారా?
- ధర్మవరంలో రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు
- బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ అనుచరులపై దాడి



వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ అనుచరులు

ధర్మవరం, మే 3: "ఏ ఊర్రా మీది? మీ కులమేంటి? ఇక్కడకొచ్చి ప్రచారం చేస్తారా? ఎంత ధైర్యం?" అంటూ శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ అనుచరులపై వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. అంతేకాదు.. వారి సెల్‌ఫోన్లు ధ్వంసం చేసి భౌతిక దాడికి దిగారు. శుక్రవారం రాత్రి జరిగిన దాడి స్థానికంగా ఉద్రిక్తతలకు దారితీసింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు. కదిరికి చెందిన శ్రీనివాసులు, హైదరాబాద్‌కు చెందిన భాను స్థానికంగా సత్యకుమార్ తరఫున ప్రచారం చేస్తున్నారు. బీజేపీ కార్యాలయంలో ఉంటూ రోజూ ప్రచారంలో పాల్గొంటున్నారు. వారిద్దరూ ధర్మవరం మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఓ కేఫ్ వద్ద ఉండగా అటువైపు వైసీపీ వర్గీయులు వచ్చారు. శ్రీనివాసులు, భానులను చూసి.. 'ఏ ఊర్రా మీది? మీ కులమేంటి' అని ప్రశ్నించారు. తాము బీసీలమని చెప్పగా.. 'ఏరా.. బీసీ అభ్యర్థి వచ్చాడని బలిసిందా? ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తున్నారు' అంటూ దాడి చేశారు. వారి సెల్‌ఫోన్‌ను పగులగొట్టారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు. సత్యకుమార్ పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని బాధిత యువకులను పరామర్శించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రం జగన్!

- ఆయన ముఖ్యమంత్రి కాదు..ముఖ్య కంత్రీ
- స్వర్ణాంధ్ర సాకార యాత్రలో బాలకృష్ణ ధ్వజం



బాలకృష్ణకు యాపిల్స్ దండ వేసిన కార్యకర్తలు

విశాఖపట్నం(ఆంధ్రజ్యోతి), శృంగవరపుకోట, మే 3: 'వైఎస్ జగన్ రాష్ట్రానికి పట్టిన దరిద్రం. కుంభకోణాల కీచకుడు. ప్రజల ధన, ప్రాణాలను లాగేసే రావణ పాలకుడు. ఈ జగన్ ముఖ్యమంత్రి కాదు. ముఖ్య కంత్రీ' అంటూ సినీనటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరుతో ఆయన చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా శుక్రవారం విశాఖ నగరం, విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గం కొత్తవలసలో రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ సభల్లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనతో రాష్ట్రాన్ని వందేళ్ల వెనక్కి నెట్టిన ఘనుడు జగన్ అని విమర్శించారు. రాష్ట్రంలోని పరిశ్రమలు పారిపోయేలా చేసిన జగన్.. గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా మార్చేశాడని, యువతను వాటికి బానిసలుగా చేశాడని విమర్శించారు. తల్లికి, చెల్లికి, ప్రభుత్వ ఉద్యోగులకు, రాజధాని రైతులకు, యువతకు సమాధానం చెప్పేందుకు సిద్ధమా? అని బాలకృష్ణ ప్రశ్నించారు. వైసీపీ నాయకులు పోరంబోకు, సీఆర్‌జెడ్, ఎండోమెంట్, అసైన్డ్ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. అప్పులు చేస్తేనేగానీ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకువెళ్లారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కొట్టేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. వైసీపీ రాక్షస పాలనను అంతం చేయడానికే రాష్ట్రంలో కూటమిగా ఏర్పడినట్టు బాలకృష్ణ చెప్పారు. పాస్‌బుక్‌లపై జగన్ ఫొటో దేనికని ప్రశ్నించారు.

పింఛన్‌కు పోతే ప్రాణాలు పోయాయ్

(మొదటి పేజీ తరువాయి)



కట్టూరి కడమ్మ



గూడవలి యహోషోవా

పెన్షన్ సొమ్ములు తీసుకోవడానికి ఉదయం ఇంటి నుంచి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. ఎట్టకేలకు పెన్షన్ సొమ్ములు తీసుకుని బయటకు వచ్చి కొంతదూరం నడిచి...వడదెబ్బకు కుప్పకూలిపోయింది. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరు శివారు చిల్లేవారిపాలెంకు చెందిన ఇంజేటి తాయారు (69)...భర్త మసేన్ రావు ఇప్పటికే మరణించారు. ప్రస్తుతం ఆమె చినమల్లంలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటుంది. పింఛన్ కోసం తయారు వల్లూరులోని బ్యాంక్‌వద్దకు వెళ్లింది. అధికారులు మరునాడు రావాలని చెప్పడంతో తిరిగి వెళుతూ వడగాల్పులకు తట్టుకోలేక మరణించింది. గుంటూరు జిల్లా నిడుబ్రోలు 12వ వార్డుకు చెందిన గూడవలి యహోషోవా (54) మత్స్యకార పెన్షన్ పొందుతున్నాడు. శుక్రవారం పెన్షన్ నగదు కోసం నిడుబ్రోలులోని బ్యాంక్ వద్ద 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండలో నిలబడ్డాడు. మరునాడు రావాలని అధికారులు చెప్పడంతో వెనుదిరిగారు. అన్నిగంటలపాటు ఎండలో పడిగాపులు కాయడం వల్ల బాగా నీరసపడిన యహోషోవా.. బ్యాంక్ వద్దే స్పృహతప్పి పడిపోయాడు. ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

సొమ్మసిల్లిన అవ్వ ప్రాణం...

కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు పింఛన్ కోసం మండుటెండలో వెళ్లి బ్యాంకు వద్దే సొమ్మసిల్లిపడిపోయింది. వెల్దుర్తిలోని 8వ వార్డులో నివాసం ఉంటున్న షేక్ మలాన్ బీ పింఛన్ తీసుకోవడానికి శుక్రవారం బ్యాంకుకు వెళ్లారు. లావాదేవీలు లేని కారణంగా బ్యాంకు అకౌంటు మనుగడలో లేదని, ఈ-కేవైసీ చేయాలని సిబ్బంది తెలిపారు. అయితే, అప్పటికే క్యూ లైన్‌లో గంటల కొద్ది నిలబడి ఉండటంతో షేక్ మలాన్ బీ నీరసించి సొమ్మసిల్లి అక్కడే కింద పడిపోయారు. ఆందోళనకు గురైన సిబ్బంది.. షేక్ మలాన్ బీకి సపర్యలు చేసి, ఈకేవైసీ అప్‌లోడ్ చేయించి పింఛన్ సొమ్మును ఇచ్చి పంపించారు.

రాజమండ్రి డీఎస్పీపై సీఈవోకు టీడీపీ ఫిర్యాదు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. రాజమండ్రి డీఎస్పీ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, టీడీపీ నాయకులను ఇబ్బంది పెడుతున్నారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఈవో మీనాను టీడీపీ నేత మన్నవ సుబ్బారావు తదితరులు కలిసి, పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం సుబ్బారావు మాట్లాడుతూ 'మే1న గుంటూరులో చంద్రబాబు రోడ్‌షో నిర్వహించగా, మంత్రి రజిని కార్యాలయం వద్ద వైసీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా.. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. ప్రత్తిపాడులో డీజే సౌండ్ పెట్టించారని టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుపై కేసు పెట్టారు. రోడ్లు దిగ్బంధం చేసిన వైసీపీ వాళ్లని పోలీసులు ఒక్క మాటా అనలేదు. గుంటూరు ఘటనపై తాము చేసిన ఫిర్యాదును డీజీపీకి సీఈవో పంపగా, ఎస్పీ దర్యాప్తులో పూర్తిగా తప్పుదోవపట్టించారు' అని ఆరోపించారు.

పుంగనూరు ఘటనపై బీసీవై ఫిర్యాదు


పుంగనూరు నియోజకవర్గంలో గత నెల 29న మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు తమ పార్టీ శ్రేణులపై దాడి చేసిన ఘటనపై బీసీవై పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం యాదవ్ సీఈవోకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్ ముందు పెట్టిన బీసీవై పార్టీ ప్రచార రథాన్ని కూడా పెట్రోల్ పోసి, తగలబెట్టారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఆ ఘటనపై విచారణ జరిపి, అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామని సీఈవో చెప్పినట్లు ఆయన మీడియాకు చెప్పారు.

వృద్ధుల మరణాల్లో

ఏ 1 జగన్.. ఏ 2 సీఎస్

జవహర్‌రెడ్డికి టీడీపీ అధినేత చంద్రబాబు ఘాటు లేఖ

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): 'సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముందు సామాజిక పెన్షన్ల లబ్ధిదారుల్ని వేధించి, అధికార పార్టీకి లబ్ధి చేకూరేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా మీరు వ్యవహరించడం బాధాకరం' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఆయన ఈమేరకు శుక్రవారం సీఎస్ జవహర్‌రెడ్డికి లేఖ రాశారు. 'ప్రజల కోసం పనిచేయాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారి మీరు. ప్రజలకు మేలు చేసే అవకాశాలను కనీసం కూడా ఆలోచించకుండా ఒక రాజకీయ పార్టీకి కొమ్ముకాసేలా, ప్రజల్ని ఇబ్బందులకు గురిచేసేలా నిర్ణయాలు తీసుకోవడం అభ్యంతరకరం, దుర్మార్గం. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర పెన్షన్‌దారులు ఇబ్బందులు పడకుండా పెన్షన్ పంపిణీ సకాలంలో జరగాలని ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 2 ఇచ్చిన మెమోలో పేర్కొంది. ఆ ఉత్తర్వులని తుంగలో తొక్కుతూ గత నెలలో సచివాలయాల వద్ద బారులు తీరేలా చేసి, 33 మంది ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారు. ఈ నెల కూడా అదే విధంగా పెన్షన్‌దారులను రోడ్లపై మండుటెండల్లో బ్యాంకుల చుట్టూ తిరిగేలా చేసి నరకయాతనకు గురిచేస్తున్నారు. ఒక్క రోజులో పెన్షన్ల పంపిణీ పూర్తి చేసేంత వ్యవస్థ గ్రామస్థాయిలో ఉన్నప్పటికీ, ఇళ్ల వద్ద ఇవ్వకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. పైగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం, వెళ్లి తీసుకోండంటూ సచివాలయ ఉద్యోగులను ఇళ్లకు పంపించి చెప్పిస్తున్నారు. అలా చెప్పే సమయంలో పెన్షన్ల పంపిణీ పూర్తి చేసే అవకాశం ఉన్నా.. అలా చేయకుండా రాజకీయ కుట్రలకు ప్రాధాన్యమివ్వడం దుర్మార్గం. రాజకీయంగా అధికారపార్టీ నాయకులు చేస్తున్న కుట్రలో భాగమై పెన్షన్ నగదును బ్యాంకుల్లో జమ చేయడం వల్ల పెన్షన్ సొమ్ము తీసుకోవడానికి వృద్ధులు ముప్పుతిప్పలు పడుతున్నారు. చాలా కాలంగా బ్యాంకు ఖాతాల నిర్వహణ లేకపోవడంతో లక్షలాది ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయి. మరో వైపు బ్యాంకులకు వెళ్లిన వారికి కేవైసీ పేరుతో బ్యాంకు సిబ్బంది ఆధార్, పాన్ కార్డు తీసుకురమ్మని చెబుతున్నారు. వాటికోసం మండుటెండలో లబ్ధిదారులు రోడ్లపై తిరగాల్సి వస్తోంది. మరో వైపు జాయింట్ ఖాతాలు, వ్యక్తిగత ఖాతాలు రెండూ ఉన్న వారికి ఏ ఖాతాలో నగదు జమ అయిందో తెలియక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆడుతున్న రాజకీయ పైశాచిక క్రీడలో ప్రభుత్వ అధికారిగా ఉన్న మీరు భాగస్వామి కావడంగా మీ పక్షపాత వైఖరికి నిదర్శనం. ఎక్కడో మండల కేంద్రాల్లో ఉన్న బ్యాంకుల చుట్టూ తిప్పుతూ దాదాపు 65 లక్షల మందిని అవస్థలకు గురిచేస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న మీకు ఇవేవీ కనిపించకపోవడంలో అంతర్యమేమిటి? గతనెల 33మంది చనిపోతే, ఇప్పుడు ఒక్క రోజే దాదాపు ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ మారణ హోమానికి ఏ 1 జగన్ అయితే, ఏ 2 మీరే. తక్షణమే ప్రతి లబ్ధిదారుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటింటికీ పెన్షన్లు అందించాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.



ఆలోచించండి... సరైన నిర్ణయం తీసుకోండి

- కౌన్సెలింగ్‌తో ఉద్యోగుల గౌరవాన్ని పెంచాను..ఆర్థిక ఇబ్బందుల్లోనూ ఒకటో తేదీ జీతాలిచ్చాం
- 2015లో అత్యధికంగా 43% ఫిట్మెంట్ ఇచ్చా..రాష్ట్ర పూర్వ వైభవానికి కలసికట్టుగా పనిచేద్దాం

ఉద్యోగులకు చంద్రబాబు బహిరంగ లేఖ

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, పెన్షనర్లు ఆలోచించి ఓట్లు వేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఉద్యోగులకు బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలో.. 'నాడు ప్రభుత్వ ఉద్యోగులు తమ పోస్టింగ్‌లు, బదిలీల కోసం రాజకీయ నాయకుల చుట్టూ తిరగకుండా, వారి గౌరవాన్ని పెంచేందుకు రాష్ట్రంలో మొదటిసారిగా టీడీపీ కౌన్సిలింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించేందుకు వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేశాం. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగ ఖాళీలను కూడా భర్తీ చేశాం. అంగన్వాడీ ఉద్యోగుల జీతాలను రూ.4,200ల నుంచి రూ.10,500లకు పెంచింది, ఉద్యోగులకు పండుగ అడ్వాన్సు అందించి, ఉద్యోగ సంఘ నాయకులతో స్నేహపూర్వక చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించింది మా ప్రభుత్వమే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నప్పటికీ రాష్ట్ర భవిష్యత్ కోసం కష్టపడి పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులను నిరాశపరచకూడదని 2015 వేతన సవరణలో 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చాం. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్నీ ఆర్థిక ప్రయోజనాల్ని ఏనాడూ వెనుకాడకుండా సకాలంలో అందించిన విషయం మీకందరికి తెలుసు. ఎంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 1వ తేదీన జీతాలు ఇవ్వడంలో ఏనాడూ వెనుకాడలేదన్నారు. గత ఐదు సంవత్సరాలుగా మీరు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను, మీ ఇబ్బందులను నేను కళ్లారా చూశాను. నెలల తరబడి జీతాలు రాక, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్యలు చేసుకున్న ఉద్యోగ కుటుంబాల దీనగాథలు చూసి చలించిపోయాను. జీవితాంతం కష్టపడి దాచుకున్న డబ్బులు చేతికందక ఎందరో ఉద్యోగుల పిల్లల చదువులు, పెళ్లిళ్లు ఆగిపోవడం వంటి కన్నీటి గాథలు, తమ హక్కుల కోసం ఉద్యమించిన వారిపై పగబట్టి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చూసి సహించలేకపోయాను. వైసీపీ ప్రభుత్వం ఐఆర్ కన్నా ఫిట్‌మెంట్ తగ్గించి ఉద్యోగుల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రివర్స్ పీఆర్సీ ప్రకటించింది. వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఆ హామీని తుంగలో తొక్కి ఉద్యోగులను మోసగించడమే కాకుండా వారి ఆత్మహత్యలకు కారణమైంది. విద్యారంగంలో జీఓ నం.117 తీసుకొచ్చి పాఠశాలల విలీనంతో ఉపాధ్యాయ పోస్టులు రద్దు చేసి 12,600 పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చింది. తద్వారా విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసి విద్యా ప్రమాణాల స్థాయిని దిగజార్చింది. పదవీ విరమణ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలన్నింటినీ 2029లో చెల్లిస్తామని, పెన్షనర్లు ఎంతగానో వేచిచూసే గ్రాట్యుటీ అందుకోకుండా జీఓ ఇచ్చింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశామంటూ వారిని గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ అందించి, సకాలంలో జీతాలు, పెన్షన్లు, ఇతర అన్నీ ఆర్థిక ప్రయోజనాలను చెల్లించే ఏర్పాటు చేస్తుంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వైసీపీ నాయకులు అవమానపరుస్తున్నారు. మేం వచ్చాక వారి గౌరవాన్ని కాపాడుతాం. ఓటు వేసే ముందు ఒక క్షణం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోండి' అని చంద్రబాబు ఆ లేఖలో ఉద్యోగులను కోరారు.



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనా

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించండి

- భారత ఎన్నికల సంఘం సీనియర్ డీఈసీ నితీష్ వ్యాస్
- ఎన్నికల అధికారులు, ఎస్పీలకు ఆదేశాలు

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయ పార్టీలనూ సమానంగా పరిగణిస్తూ నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను, ఎస్పీలను భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ ఆదేశించారు. ఈ నెల 13న రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు ఎన్నికల సాధారణ, పోలీస్ వ్యయ పరిశీలకులతో న్యూఢిల్లీ నిర్వచన్ సదన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో చేస్తున్న ఎన్నికల ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎంతో సునిశితమైన రాష్ట్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఇలాంటి సమయంలో అధికారులంతా ఎంతో అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల నిర్వహణలో ఎటువంటి హింసకు, అల్లర్లకు తావులేకుండా చూడాలన్నారు. ఇందుకోసం భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పటిష్ఠంగా అమలు పర్చాలన్నారు. 'సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఆయా కేంద్రాల్లో జరిగే ఎన్నికల సరళిని వెబ్‌కాస్టింగ్ ద్వారా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లలో నిరంతరం పర్యవేక్షించాలి. ఓటర్లను ప్రభావితం చేసే నగదు, లిక్కర్, డ్రగ్స్, ప్రెషస్ మెటల్స్, ఉచితాల అక్రమ రవాణాను నియంత్రించాలి' అని చెప్పారు. అదేవిధంగా ఎన్నికలను పటిష్ఠంగా నిర్వహించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సమావేశంలో ఆయన సమీక్షించారు.

సమస్యాత్మక నియోజకవర్గాల్లో వెబ్ క్యాస్టింగ్

రాష్ట్రంలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలను కేంద్ర ఎన్నికల సంఘం సమస్యాత్మక నియోజకవర్గాలుగా ప్రకటించింది. ఈ నియోజకవర్గాల్లో మే 13వ తేదీన పోలింగ్ రోజు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం వెబ్‌కాస్టింగ్ చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు ముకేష్‌కుమార్ మీనా...కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. పల్నాడుజిల్లాలో పెదకూరపాడు, వినుకొండ, గురజాల, మాచర్ల, ప్రకాశం జిల్లాలో ఒంగోలు, నంద్యాలజిల్లాలో ఆళ్లగడ్డ, తిరుపతి జిల్లాలో చంద్రగిరి, తిరుపతి, ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ సెంట్రల్, చిత్తూరు జిల్లాలో పుంగనూరు, పలమనేరు, అన్నమయ్య జిల్లాలో పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లిలో వంద శాతం వెబ్‌కాస్టింగ్ చేయాలని ఆదేశించారు.

దళితులను దగా చేసిన జగన్

- ఎన్నికల్లో ఓడించండి: మాదిగ జేఏసీ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాదిగ జేఏసీ ప్రతినిధులు

వేమూరు, మే 3: ఎస్సీ, ఎస్టీలకు చెందిన 27 పథకాలను రద్దు చేసి దళితులను దగా చేసిన ముఖ్యమంత్రి జగన్‌ను ఎన్నికల్లో ఓడించాలని మాదిగ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా వేమూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా సబ్‌ప్లాన్ నిధులను సీఎం జగన్ దారిమళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టి రాజు మాట్లాడుతూ దళితులపై దాడుల ఘటనల్లో నేరస్థులకు కొమ్ముగాస్తూ దళితులకు ద్రోహం చేస్తున్న వ్యక్తి జగన్మోహన రెడ్డి అని తీవ్రంగా విమర్శించారు. జగన్ పాలనలో విద్యా, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాలలో దళితులకు అన్యాయం జరిగిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దళితులంతా ఏకమై జగన్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. నవ్య మాదిగ చర్మకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేజేండ్ల సుబ్బారావు, బేడ, బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్నికల ప్రత్యేకం-2024

ప్రజా అజెండా

జన చేతనం

ఆంధ్రజ్యోతి

శనివారం ◇ 4-5-2024



అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..

కౌంట్ డౌన్ 9 రోజులు

● అసెంబ్లీ సాక్షిగా జగన్ మాట

'అమరావతిలో కేపిటల్ సిటీ పెట్టడాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం. మన రాష్ట్రం ఇప్పటికే 13 జిల్లాల చిన్న రాష్ట్రమైంది. ఈ చిన్న రాష్ట్రంలో ఒక ప్రాంతానికీ మరో ప్రాంతానికీ మధ్య చిచ్చు పెట్టడం ఇష్టం లేదు. కేపిటల్ సిటీని మీరు ఎక్కడన్నా పెట్టండి... కానీ కనీసం 30 వేల ఎకరాలైనా ఉండాలని మేం మొదటి నుంచీ చెబుతున్నాం!'

- 2014 సెప్టెంబరు 4న అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా జగన్ చేసిన వ్యాఖ్యలివి.

● ఎన్నికల ముందు జగన్ మాట

'అమరావతిలో ఇల్లు కట్టుకున్నాను. ఇక్కడే నివాసం ఉంటాను. అమరావతినే రాజధానిగా కొనసాగిస్తాం. చంద్రబాబు ఇక్కడ శాశ్వత ఇల్లు నిర్మించుకోలేదు'

- గత ఎన్నికల ప్రచారంలో జగన్ చెప్పిన మాటలివి.

● సీఎం అయ్యాక జగన్ మాట

'దక్షిణాఫ్రికాకు మూడు రాజధానులున్నాయి. మనకూ మూడు ఉంటే తప్పేంటి? అమరావతిలో శాసన రాజధాని, విశాఖలో పరిపాలన రాజధాని, కర్నూలులో హైకోర్టు పెట్టుకోవచ్చు!'

- 2019 డిసెంబరు 17న ముఖ్యమంత్రి హోదాలో జగన్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలివి.



అమరావతిలో ఉన్నదెవరు?

అమరావతి ఒక 'సామాజిక వర్గం' కోసమేనంటూ.. జగన్ కుల ముద్ర కూడా వేశారు. కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేశారు. వాస్తవానికి రాజధాని అమరావతిలో అన్ని కులాల వారూ ఉన్నారు. అత్యధికంగా ఎస్సీ, బీసీ, మైనారిటీలే 75% ఉన్నారు. మొత్తం 29కిగాను 15 పంచాయతీలలో కాపులు గణనీయంగా ఉన్నారు. రెడ్డి, కమ్మ వర్గీయులు దాదాపు సమానం! విజయవాడ, గుంటూరులో బ్రాహ్మణ, వైశ్య, ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలు గణనీయంగా ఉన్నారు. ఇవన్నీ తెలిసే చిచ్చు పెట్టారు. ఎందుకంటే.. జనం మనసుల్లో విష బీజాలు నాటడమే జగన్ ఉద్దేశం!

భూములు ఇచ్చిన వారిలో..

ఎస్సీ, ఎస్టీ రైతులు -	32 శాతం
రెడ్లు -	23 శాతం
కమ్మ -	18 శాతం
బీసీలు -	14 శాతం
కాపులు -	9 శాతం
మైనారిటీలు -	3 శాతం
ఇతరులు -	1 శాతం

అమరావతి 'కొంప' ముంచిన ప్యాలెస్



తాడేపల్లిలో జగన్ ప్యాలెస్



నయ వంచనకు ప్రతిరూపం!

మాట తప్పి.. మడమ తిప్పే నైజం

అమరావతిపై నాలుక వెయ్యి మడతలు

- మనస్ఫూర్తిగా స్వాగతించి..
- ప్యాలెస్ పేరుతో వంచించి..
- చివరికి మూడు ముక్కలాట
- రాజధాని రైతులకు నమ్మకద్రోహం
- నిర్మాణాలు ఆపి 'నగరం' నాశనం
- ఎన్నికలప్పుడే అమరావతిపై విషం
- ఎడారి, శ్మశానం అంటూ నీచ ప్రచారం
- ఒక్క ఇటుకా పడలేదని గుడ్డి మాటలు



అమరావతికి మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన

ఒక నగరం సృష్టికి శ్రీకారం

అన్నీ హైదరాబాద్‌లో వదిలేసి... రాజధాని లేని రాష్ట్రంగా నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడింది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలున్న రాష్ట్రాలతో పోటీ పడాలంటే, తలెత్తుకు నిలబడాలంటే 'ఒక వినూత్నమైన, భారీ ప్రణాళిక' అవసరమని నాటి సీఎం చంద్రబాబు ఆలోచించారు. ఆ ఆలోచన నుంచే 'అమరావతి' పుట్టుకొచ్చింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ సమదూరంలో ఉండేలా... కృష్ణా నది ఒడ్డున... గుంటూరు-విజయవాడ మధ్య ఒక నవ నగర నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. రైతులను ఒప్పించి శరవేగంగా భూములను సమీకరించారు. సింగపూర్ ప్రభుత్వ సహకారం, ఇతర ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థల భాగస్వామ్యంతో చకచకా అమరావతి నిర్మాణం కొనసాగింది. అమరావతి ప్రకటన నుంచి ఎన్నికల ముందుదాకా ఏ దశలోనూ జగన్ అమరావతిని వ్యతిరేకించకపోవడం గమనార్హం. పైగా... 'దీనిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం' అని అసెంబ్లీలో ప్రకటించారు. జగన్ అధికారంలోకి వస్తే అమరావతి ఆగిపోతుందనే అనుమానాలు బలపడటంతో.. 'ఇక్కడే ఇల్లు కూడా కట్టుకున్నా! అమరావతిని కొనసాగిస్తా' అని నమ్మబలికారు. అధికారంలోకి వచ్చాక ఆయన నిజస్వరూపం బయటపడింది.

రాజధానికి భూములిచ్చిందిలా

భూమి (ఎకరాలలో)	రైతులు	సేకరించిన విస్తీర్ణం
ఎకరా లోపు	20,490	10,035
1-2 లోపు	5,227	7,466
2-5 లోపు	3, 337	10,104
5-10 లోపు	668	4,421
10-20 లోపు	142	1,877
20-25 లోపు	12	269
25 కంటే ఎక్కువ	5	151
మొత్తం	29,881	34,323

ఎన్నికల వేళ విష ప్రచారం..

ఒకవైపు అమరావతిని కొనసాగిస్తామని చెబుతూనే... మరోవైపు నవ నగరంపై విషం చిమ్మడమనే వ్యూహాన్ని జగన్ అమలు చేశారు. నిర్మితమవుతున్న నిలువెత్తు భవనాలు కనిపిస్తున్నా... విశాలమైన సీడ్ యాక్సెస్ రోడ్‌పై రయ్యిన సాగుతున్న వాహనాలు, లింకు రోడ్లు, నిత్యం వేలాదిమంది కార్మికులు పని చేస్తున్న అమరావతిని ఎడారి, శ్మశానం అని విమర్శించారు. 'అక్కడ ఒక ఇటుక కూడా పడలేదు' అని అచ్చేసిన అబద్ధాలు పదేపదే చెప్పారు. అమరావతిలో శాసనసభ, శాసనమండలి, సచివాలయం, హైకోర్టు భవనాలు అప్పటికే మొదలయ్యాయి. 29 గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు 5024 ఫ్లాట్లు నిర్మించారు. విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు వచ్చేశాయి. కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం పూర్తయింది. ప్రైవేటు, ప్రభుత్వ రంగంలోని అనేక సంస్థలు తమ నిర్మాణాలు ప్రారంభించాయి. అయినా సరే... కళ్లున్న గుడ్డివాళ్లలాగా 'గ్రాఫిక్స్' అని గోల చేశారు.

భూములపై ఆరోపణలు

అమరావతి రాజధానిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగినట్టు వైసీపీ నేతలు ఆరోపణలు చేశారు. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి అమరావతి రాజధాని ప్రకటన తేదీ వరకు ఆ ప్రాంతంలో 176 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ జరిగాయి. రాజధాని ప్రకటన తర్వాత నుంచి టీడీపీ హయాంలో మార్చి 2019 వరకు అన్ని పార్టీలకూ చెందిన వందలాది మంది 1190 ఎకరాలను అమ్మకాలు, కొనుగోలు చేశారు. మరి... ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఎక్కడ జరిగినట్లు?

అబద్ధాల 'ముంపు'లో మునక

రాజధాని అమరావతికి వరద ముంపు ప్రమాదం ఉందని వైసీపీ నాయకులు విష ప్రచారం చేశారు. నిజానికి అప్పటికే చంద్రబాబు ప్రభుత్వం కొండవీటి వాగు ఎత్తిపోతలను పూర్తి చేసింది. వాగుకు వచ్చే వరద వెనక్కి తన్నకుండా... కృష్ణా నదిలోకి ఎత్తిపోసే ఏర్పాటు చేసింది. అయినా సరే... వైసీపీ 'ముంపు'లో నుంచి బయటపడలేదు. అధికారంలోకి వచ్చాక కూడా కుట్రలు ఆగలేదు. వరదలు వచ్చినప్పుడు కృష్ణా బ్యారేజీ వద్ద గేట్లు ఎత్తకుండా చంద్రబాబు నివసిస్తున్న ఇంటిని ముంచేసి రాజధాని ముంపునకు గురవుతుందని ప్రచారం చేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. అయితే అమరావతికి ముంపు ప్రమాదం లేదని ఎన్జీటీ, సుప్రీం కోర్టు స్పష్టం చేశాయి. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ 2008లో ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా అమరావతి రాజధాని ఉందని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. కరకట్టలు, గట్లు ఏర్పాటు వల్ల రాజధాని ప్రాంతానికి ముప్పులేదని, ఈ ప్రాంతాన్ని వరద ముంపు ప్రాంతంగా పేర్కొనడానికి వీల్లేదంటూ... రాజధానికి వ్యతిరేకంగా వేసిన వ్యాజ్యాన్ని 2016 ఆగస్టు 12న సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2017 నవంబరు 17న ఎన్జీటీ కూడా రాజధాని ముంపు ప్రాంతం కాదని, ఆహారభద్రతకు ముప్పు లేదని తేల్చి చెప్పింది.

భూములు ఇచ్చిందెవరు?

రాజధానికి భూములిచ్చిన రైతులంతా భారీ భూస్వాములని జగన్ మరో అబద్ధపు ప్రచారం చేశారు. కానీ... అక్కడున్నది చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. మొత్తం 34వేల ఎకరాలు ఇచ్చిన రైతుల్లో ఒక ఎకరాలోపు ఇచ్చిన రైతులే 20,490 వేల మంది.



హైకోర్టు

కళ్లకు కనపడలేదా.. ఈ నిర్మాణాలు?



అసెంబ్లీ, మండలి భవనాలు

జగన్ గెలిచాక గ్రహణం

జగన్ ముఖ్యమంత్రి కాగానే... అమరావతి పనులు నిలిపివేయించారు. 2019 డిసెంబరు 17న సీఎం జగన్ అసెంబ్లీలో మూడు రాజధానులపై ప్రకటన చేశారు. మూడు రాజధానుల బిల్లును 2020 జనవరి 20న శాసనసభ ఆమోదించింది. కానీ... నాటి శాసనమండలి ఛైర్మన్ తన విశిష్ట అధికారాలను ఉపయోగిస్తూ ఈ బిల్లును విస్తృత పరిశీలన కోసం సెలెక్ట్ కమిటీలకు పంపించారు. అప్పట్లో ఆ కమిటీలు ఏర్పాటు కాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 197(1), (2) అధికరణల కింద ఈ బిల్లును 2020 జూలై నెలలో గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. అప్పటి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ జూలై 31న దీనిని ఆమోదించడంతో ఈ బిల్లు చట్టంగా మారింది. అలా అమరావతి రాజధానిని జగన్ సర్కారు అటకెక్కించింది. కానీ... రాజధాని రైతులతో చట్టబద్ధమైన ఒప్పందాలున్న నేపథ్యంలో రాజధాని తరలింపు కుదరలేదు. న్యాయస్థానాలే అమరావతికి అండగా నిలిచాయి.

రూపాయి ఖర్చు లేకున్నా...

రూపాయి భారం లేకుండా భూములు సమీకరించినా... మొత్తం నగరాన్ని 'సెల్ఫ్ ఫైనాన్స్' ప్రాజెక్టుగా రూపకల్పన చేసినా... జగన్ సర్కారు అమరావతిపై అడ్డగోలు అబద్ధాలు చెప్పింది. రాజధాని నిర్మాణానికి రూ.1.09 లక్షల కోట్ల వ్యయం అవుతుందని, ఒక్క చోటే ఇంత భారీ మొత్తం ఖర్చు చేస్తే రాష్ట్రాభివృద్ధి ఎలా జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేశారు. ఇన్ని కుట్రలు పన్ని మరీ రాష్ట్ర రాజధానిని, ఒక నవీన నగరాన్ని నాశనం చేశారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

(రేపటి సంచికలో.. అమరావతి: నాడు - నేడు)

గుసగుసలు

ఎంత ఖర్చుకు అంత స్వాగతం!



ఎంత చెట్టుకు అంత గాలి అనేది సామెత! ఎన్నికల సమయంలో స్వాగతాలకూ ఇదే వర్తిస్తుంది. ఎంత ఖర్చు పెడితే... అంత ఘనంగా స్వాగతం లభిస్తుంది. దీనిపై నెల్లూరు జిల్లాకు చెందిన ఒక నేత తన స్వానుభవాన్ని చెప్పారు. 'మాకు వేసే గజమాలలు, ఇచ్చే హారతులు, కురిసే పూల వర్షాలు అన్నీ మా ఖర్చుతో చేసేవే. ముందుగా డబ్బులు బాగా పంపిస్తే స్వాగతం పలకడానికి భారీగా వస్తున్నారు. కొద్దిగా పంపిస్తే కొద్ది మందే వస్తున్నారు' అని ఆయన అన్నారు.

సమ్ థింగ్ స్పెషల్

ఫ్రీ టికెట్‌తో 'పవర్'

మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన పార్టీలదే అన్నిచోట్లా గెలుపు!



కూటమి పార్టీలు(టీడీపీ-జనసేన-బీజేపీ) ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టోలో కీలకమైన హామీ 'మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం'. దీనిద్వారా రాష్ట్రంలో మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం లభిస్తుంది. ఇప్పుడు ఈ హామీ రాష్ట్ర వ్యాప్తంగా మహిళల మధ్య ఆసక్తికర చర్చకు తెరలేపింది. ఏ ఇద్దరు మహిళలు కలిసి మాట్లాడుకున్నా.. "చంద్రబాబు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు తెలుసా" అనే చర్చించుకుంటున్నారు. అంతేకాదు, "ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం దేశంలో ఎందరో నేతల్ని ముఖ్యమంత్రుల్ని చేసింది. మరో నెల రోజుల్లో చంద్రబాబును కూడా సీఎంను చేసేది మహిళలే" అనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మరో పది రోజుల్లో జరిగే పోలింగ్‌లో చంద్రబాబుకు గంపగుత్తగా పడే ఓట్లు మహిళలవేననే మాట బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ప్రయాణ ఖర్చులు భరించలేని స్థాయిలో ఉన్న నేపథ్యంలో ఈ హామీ పట్ల మహిళలు ఆకర్షితులవుతున్నారని తెలుస్తోంది. ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లో 'బస్ టికెట్ ఫ్రీ' హామీ ఇచ్చిన పార్టీలు బంపర్ మెజారిటీ సాధించిన విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబుకు కూడా ఇదే వరం కాబోతోందని బలంగా చెబుతుండడం గమనార్హం.

ఏయే రాష్ట్రాల్లో ఎలా?

- సామాన్యుడిగా రాజకీయాల్లోకి వచ్చి ఢిల్లీ పీఠాన్ని అధిరోహించిన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో మహిళలకు ఉచిత ప్రయాణ హామీ ప్రకటించారు. ఇది ఆయనకు భారీ మెజారిటీ దక్కేలా చేసింది. దేశంలోనే మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఢిల్లీ చరిత్రకెక్కింది.
- పంజాబ్‌లో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీపార్టీ కూడా మహిళలకు ఉచిత రవాణా సదుపాయం కల్పించింది.
- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీ ఇచ్చారు. ఆయనకూ మహిళలు బ్రహ్మరథం పట్టారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత 2021 మేలో 'జీరో టికెట్ బస్ ట్రావెల్(జడ్‌టీబీటీ) పేరుతో పథకాన్ని అమల్లోకి తెచ్చారు. తమిళనాడు పరిధిలోని అన్ని బస్సులలో 30 కిలోమీటర్ల వరకు మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు.
- గత ఏడాది కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన అధికార బీజేపీని తట్టుకోవడానికి కాంగ్రెస్ ప్రకటించిన పథకాల్లో మహిళలకు ఉచిత ప్రయాణమే ఓట్ల వర్షం కురిపించింది.
- గత ఏడాది తెలంగాణలో జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రకటించిన సంక్షేమ పథకాల్లో కీలకమైంది 'ఫ్రీ బస్ టికెట్'. కాంగ్రెస్ గెలిచాక సీఎం రేవంత్ రెడ్డి..తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అన్ని వర్గాల మహిళలకూ 'మహాలక్ష్మి' పేరుతో ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారు.
- కేరళలో కమ్యూనిస్టు ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ప్రభుత్వం కూడా తొలుత ఉచిత బస్సు ప్రయాణాన్ని కొంతమేర అమల్లోకి తీసుకొచ్చింది. తర్వాత 2023 నవంబరులో నిరుపేద మహిళలందరికీ ఉచిత ప్రయాణాన్ని అమల్లోకి తెచ్చింది.

–అమరావతి, ఆంధ్రజ్యోతి

ఉద్యోగుల ఓట్లకు ఎసరు!

- కాంట్రాక్టు ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌పై నీలినీడలు
- 1వ తేదీకి ముందే ఫారం 12 ఇచ్చినా.. బ్యాలెట్ ఇవ్వని వైనం
- అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న అధికారులు!

ఎన్నికల అధికారులు కమిషన్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారా? నిబంధనలకు పాతర వేస్తున్నారా? అంటే అవుననే సమాధానాలొస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ల జారీలో ఎన్నికల అధికారులు ఉద్యోగుల ఓట్లకు గండికొడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 1వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ల నమోదుకు అవకాశం ఉన్నా.. కాంట్రాక్టు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే పలు జిల్లాల్లో అధికారులు తిరస్కరించారని ఉద్యోగులు వాపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులకు ఓపీవోలుగా అంగన్వాడీ కార్యకర్తలు, కాంట్రాక్టు ఉద్యోగులను తీసుకోవాలని ఈ నెల 26న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. అదేవిధంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 దరఖాస్తు ఇవ్వడానికి మే 1వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు సీఈవో మీనా ఆదేశాలు ఇచ్చారు. ఈమేరకు కాంట్రాక్టు ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలను పోలింగ్ విధులకు కేటాయిస్తూ.. ఆ ఉత్తర్వుల కాపీని 28వ తేదీ మధ్యాహ్నం ఉద్యోగులకు అందజేశారు. ఆర్డర్ కాపీ చివరిలో నోట్ అని పెట్టి.. మే 1వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఫారం-12 సమర్పించి, పోస్టల్ బ్యాలెట్ పొందాలని తెలిపారు. దీని ప్రకారం ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి జిల్లాల్లోని ఎన్నికల అధికారుల వద్దకు వెళితే.. ఉద్యోగి విధులు నిర్వర్తించే జిల్లాలో ఓటు ఉంటేనే ఫారం-12 తీసుకుంటామని, పక్క జిల్లాలో ఉంటే స్వీకరించబోమని, ఆ గడువు 28కే ముగిసిందని చెప్పడం గమనార్హం..

నాకే ఓటు లేదు: ఒక ఉద్యోగి ఆవేదన

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఒక కాంట్రాక్టు ఉద్యోగిని ఎన్నికల విధుల్లో నియమిస్తూ ఈ నెల 28న ఆర్డర్ ఇచ్చారు. సదరు ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 దరఖాస్తు ఇవ్వడానికి సంబంధిత ఎన్నికల అధికారిని సంప్రదించారు. అతడి ఓటు వేరే జిల్లాలో ఉంది. అందువల్ల ఫారం-12 తీసుకునే గడువు ముగిసిపోయిందని, నీ ఓటు ఉన్న జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో.. ఆ ఉద్యోగి తన సొంత జిల్లాకు వెళ్లారు. అయితే ఉద్యోగి ఏ జిల్లాలో పనిచేస్తుంటే.. అక్కడే పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కమిషన్ కల్పించిందని, అందువల్ల మీరు పనిచేసే జిల్లాలోనే ఫారం-12 సమర్పించమని చెప్పారు. దీంతో ఆ ఉద్యోగి మళ్లీ గుంటూరు అధికారిని కలిసి ఓటు హక్కు కల్పించాలని గట్టిగా కోరడంతో ఆ ఉద్యోగి ఫారం12 స్వీకరించారు. అయితే 1వ తేదీన నీ పోస్టల్ బ్యాలెట్‌ను తిరస్కరిస్తున్నామంటూ ఎన్నికల అధికారి ఆ ఉద్యోగికి ఫోన్ చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న తనకే ఓటు లేకుండా చేస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆ ఉద్యోగి వాపోయారు. గ్రీవెన్స్ సెల్‌లో అడిగితే 'మిమ్మల్ని మధ్యాహ్నం వరకే ఎన్నికల విధుల్లో ఉంచుతారని, ఆతర్వాత సొంత జిల్లాకు వెళ్లి ఓటు వేసుకోవచ్చని' సలహా ఇచ్చారని వాపోయారు.



–అమరావతి, ఆంధ్రజ్యోతి


మంత్రి బొత్స సత్యనారాయణ

అబ్బ ఛా!

175 మావే!

175 అసెంబ్లీ సీట్లకు 175 గెలుపొంది చరిత్ర సృష్టిస్తాం. చరిత్రలో తన కోసం ఓ పేజీ ఉండాలన్నదే జగన్ ఆకాంక్ష. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్నాం. ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇస్తున్నాం. విదేశీ విద్యకు ఎక్కువ ఖర్చు చేస్తున్నదీ మా ప్రభుత్వమే. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు భూ యజమానులకు వరం. వీటన్నింటితో చరిత్రలో జగన్‌కు ఓ పేజీ ఉంటుంది.



అనకాపల్లి.. దక్కేదెవరికి?

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని కీలకమైన పార్లమెంటు నియోజకవర్గం అనకాపల్లి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బీజేపీ నేత సీఎం రమేశ్ బరిలో ఉన్నారు. అధికార పార్టీ వైసీపీ అభ్యర్థిగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పోటీ చేస్తున్నారు. ఇరువురూ గెలుపు కోసం తీవ్రస్థాయిలో శ్రమిస్తున్నారు.

లోక్‌సభ స్థానంలో రసవత్తర పోరు

ఓటర్లు
మొత్తం :15,96,916
పురుషులు : 7,79,913
మహిళలు : 8,16,970

అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 9, టీడీపీ ఐదు, వైసీపీ ఒకసారి గెలుపొందాయి. ఈ దఫా తొలిసారి బీజేపీ బరిలో నిలిచింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడడం, బీజేపీ తరఫున సీఎం రమేశ్ పోటీలో నిలవడంతో నియోజకవర్గంలో సమీకరణలు మారిపోయాయి. వైసీపీ సిట్టింగ్ ఎంపీ సత్యవతిని కాదని, ఉప ముఖ్యమంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాల నాయుడును పోటీకి దించింది. కాంగ్రెస్ నుంచి వేగి వెంకటేశ్ పోటీ చేస్తున్నారు. వీరు ముగ్గురూ లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి పోటీచేస్తున్నవారే.

అభివృద్ధి, సంక్షేమమే

కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ అనకాపల్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును ప్రధాన ఎజెండాగా తీసుకున్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. ప్రచారంలో దూసుకుపోతున్నారు. కేంద్రంలో బీజేపీ పెద్దలతో తనకున్న సత్సంబంధాలతో పరిశ్రమలు తెస్తానని చెబుతున్నారు. గ్రీన్‌ఎనర్జీ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తామని, ఇథనాల్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పుతామని హామీ ఇస్తున్నారు. కూటమి తరఫున టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రచారం చేశారు. మరోవైపు వైసీపీ నుంచి పోటీలో ఉన్న బూడి ముత్యాల నాయుడు తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తనకు ఓట్లు కురిపిస్తాయనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాను ఎంపీగా గెలిస్తేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయని చెబుతున్నారు. వైసీపీ అధినేత జగన్ ఈ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు.

తెరపైకి స్థానికత

ప్రజల్లో వైసీపీ పాలనపై నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను అధిగమించేందుకు అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా పక్కనపెట్టేసి కేవలం స్థానిక, స్థానికేతర అనే అంశాన్ని ఆ పార్టీ తెరపైకి తెచ్చింది. ఇదే ప్రధాన అస్త్రంగా ఎన్నికల ప్రచారం చేస్తోంది. కడప జిల్లా నుంచి వచ్చిన కూటమి అభ్యర్థి సీఎం రమేశ్‌ను గెలిపిస్తే, ఆయన ప్రజలకు అందుబాటులో ఉండరనే వాదనను వినిపిస్తోంది. దీనిని సీఎం రమేశ్ తిప్పికొడుతున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు స్థానికంగా ఉండాలని, ఎంపీ అభ్యర్థికి స్థానికుడా, స్థానికేతరుడా అనే అంశం సమస్యే కాదని అంటున్నారు. ఎంపీ అభ్యర్థికి సమర్థత, నిబద్ధత ముఖ్యమని, ఆ రెండూ తనకు మెండుగా ఉన్నాయని చెబుతున్నారు. ఇక, కాంగ్రెస్ నుంచి వేగి వెంకటేశ్ పోటీలో ఉన్నా.. ఆయన ప్రభావం పెద్దగా కనిపించడం లేదు.

- అనకాపల్లి, ఆంధ్రజ్యోతి

సీఎం రమేశ్ బలాబలాలు

- వైసీపీపై తీవ్ర వ్యతిరేకత.
- కూటమి పార్టీలకు బలమైన క్యాడర్
- రమేశ్ గెలిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజల నమ్మకం.
- రమేశ్‌కు గతంలో టీడీపీలో పనిచేసిన అనుభవం ఉండడం.
- స్థానిక టీడీపీ సీనియర్ నేతలు కలిసి రావడం.

బూడి బలాబలాలు

- ఇంటిపోరుతో తర్జన భర్జన.
- పెద్ద భార్య కుమారుడు 'మానాన్నను ఓడించండి' అని ప్రచారం చేయడం. మాడుగుల అసెంబ్లీకి ఇండిపెండెంట్‌గా పోటీ చేయడం.
- మూడు అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థుల నుంచి సరైన సహకారం అందకపోవడం.
- ఉప ముఖ్యమంత్రిగా ఉన్నా జిల్లాకు ఏమీ చేయలేదనే విమర్శలు.

అనకాపల్లి లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ స్థానాలు
అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి, పెందుర్తి, నర్సీపట్నం, మాడుగుల, పాయకరావుపేట



నోట్ దిస్ పాయింట్!



పోటీలో నేను సైతం!

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన జాతీయ పార్టీలైన బీజేపీ(173), కాంగ్రెస్(174) దాదాపు అన్ని సీట్లలోనూ పోటీ చేశాయి. కాకపోతే ఒక్కచోట కూడా డిపాజిట్ దక్కించుకోలేకపోయాయనుకోండి. ఇక గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీల విషయానికొస్తే.. జనసేన ఒక్కటే చెప్పుకోదగిన ఓట్లు సాధించింది. 137 చోట్ల పోటీ చేసి ఒక్కటంటే ఒక్క సీటు గెలుచుకుంది. కాకపోతే 5.53 శాతం ఓట్లు దక్కించుకోగలిగింది. భారీ సంఖ్యలో పోటీ పడిన మరో గుర్తింపులేని పార్టీ పీపీఓఐ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా). ఏకంగా 117 స్థానాల్లో అభ్యర్థులను బరిలో నిలిపింది. అన్నిచోట్లా డిపాజిట్లు గల్లంతేలెండి. 'నేను సైతం పోటీలో' అంటూ బరిలో దిగిన ఆ పార్టీకి వచ్చిన అత్యల్ప ఓట్లు 56 కాగా, గరిష్ఠ ఓట్లు 745. రాష్ట్రంలోని 63 నియోజకవర్గాల్లో దానికి ఎన్నో కొన్ని ఓట్లు పడటం విశేషం. మరి మిగతా 54 స్థానాల్లో దాని అభ్యర్థులు ఎవరికి ఓటేశారో!?

పీపీఓఐ ఎన్నికల గుర్తు: ఫ్లూట్
పోటీ: 117 స్థానాలు., వచ్చిన ఓట్లు: 21,643

సంఘం చెప్పిన మాట


కొదమల బెంజమిన్,
రాష్ట్ర కో కన్వీనరు, మాదిగ సేవా సంఘం

వర్గీకరణ కోసమే కూటమికి జై

మాదిగలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికపరంగా వెనుకబడి ఉన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరిస్తే మాదిగలు అన్ని రంగాల్లో ముందుకెళ్లే అవకాశం ఉంటుంది. వర్గీకరణకు ఎన్డీఏ కూటమి మద్దతు ఇచ్చింది. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో పేదరిక నిర్మూలనకు అవకాశం ఉంది. అందుకే ఎన్డీఏ కూటమికి మద్దతు ఇస్తున్నాం. కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నాం. అన్ని జిల్లాల్లో పర్యటించి కూటమికి మద్దతు ఇచ్చేలా మాదిగలను చైతన్యవంతం చేస్తున్నాం.

- విజయనగరం



హేమాహేమీల డోన్!

- హ్యాట్రిక్ కొట్టేందుకు బుగ్గన ఎత్తులు
- టీడీపీ జెండా ఎగరేయాలని కోట్ల వ్యూహాలు
- మంత్రిపై సొంత నేతల్లోనే అసంతృప్తి
- కోట్లకు కలిసొచ్చే కుటుంబ నేపథ్యం
- కలిసిరాని కేఈ, సుబ్బారెడ్డి వర్గాలు

డోన్.. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే కాక, రాష్ట్రంలోనే ఈ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిని గెలిపించిన నేల ఇది. ప్రస్తుత ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి 2014, 2019ల్లో ఇక్కడి నుంచే గెలిచారు. మరోసారి బరిలోకి దిగారు. హ్యాట్రిక్ కొట్టేందుకు రకరకాల ఎత్తులు వేస్తున్నారు. ఆయన్ను మాజీ ముఖ్యమంత్రి విజయభాస్కరరెడ్డి తనయుడు, మూడు సార్లు కర్నూలు ఎంపీగా గెలిచి యూపీఏ ప్రభుత్వ హయాంలో రైల్వే శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ఢీకొంటున్నారు. ఇక్కడ తన గెలుపుతో కుటుంబ ప్రతిష్ఠ ముడిపడి ఉండడంతో కోట్ల విజయం కోసం వ్యూహాలు రచిస్తున్నారు. దీంతో ఇక్కడ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.



- నంద్యాల, ఆంధ్రజ్యోతి

నియోజకవర్గ స్వరూపం..

మండలాలు: బేతంచర్ల, డోన్, ప్యాపిలి

మొత్తం ఓటర్లు	:	2,27,351
పురుషులు	:	1,11,883
మహిళలు	:	1,15,398
ట్రాన్స్‌జెండర్లు	:	70

కీలక సామాజిక వర్గాలు..
బోయలు-40 వేలు, తెలుగు వడ్డెర-30 వేలు, యాదవ-16,000, నాయీ బ్రాహ్మణులు-6,500, ఎస్సీలు-33 వేలు, ముస్లింలు-24 వేలు, రెడ్లు-12 వేలు, వైశ్యులు-12 వేలు, బలిజలు-8,500, ఎస్టీలు-6,700, కమ్మ-5 వేలు.

బీసీలే కీలకం?


సామాజిక వర్గాల లెక్కల ప్రకారం డోన్‌లో బీసీలు అధిక సంఖ్యలో ఉన్నారు. నియోజకవర్గంలో 2,27,351 మంది ఓటర్లు ఉండగా.. బీసీలు దాదాపు లక్షా 7 వేల మంది ఉన్నారు. వారు ఎటువైపు నిలిస్తే ఆ నేతకే విజయావకాశాలు ఎక్కువ. 1967 నుంచి 2009 వరకు బీసీ నాయకులు 9 సార్లు గెలిచారు. ఈసారి వైసీపీ, టీడీపీ నుంచి పోటీ పడుతున్న బుగ్గన, కోట్ల ఇద్దరూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే! వీరిలో ఎవరివైపు బీసీ, ఎస్సీలు మొగ్గు చూపుతారోనన్న చర్చ సాగుతోంది. బీసీలపై దాడులు, ఎస్సీలపై అత్యాచారాల ఘటనలతో ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. కేఈ కుటుంబం కోట్ల కుటుంబానికి మద్దతు తెలుపుతోంది. గత రెండు ఎన్నికల్లోనూ కేఈ ప్రతాప్‌పైనే బుగ్గన గెలిచారు. సూర్యప్రకాశ్ రెడ్డి ఎంపీగా తప్ప, ఏనాడూ అసెంబ్లీకి పోటీచేయలేదు. ఆయన భార్య సుజాతమ్మ 2004లో డోన్‌లోనే పోటీచేసి విజయం సాధించారు. ప్రభుత్వ వ్యతిరేకత, కూటమి బలం, సూపర్ సిక్స్ హామీలు, కేఈ కుటుంబం, ధర్మవరం సుబ్బారెడ్డి వర్గం తోడ్పాటు తన గెలుపునకు ఉపయోగపడతాయన్న ధీమాతో కోట్ల ఉన్నారు. మంత్రి బుగ్గనకు ఈసారి సొంత మండలం బేతంచర్లలో ఎదురుగాలి వీస్తోంది. ఆయన మంత్రి అయ్యాక నియోజకవర్గానికి పూర్తిగా దూరమయ్యారు. తన సొంత మనుషులు, అనుచరులను తప్ప నాయకులను, కార్యకర్తలను దగ్గరకు రానివ్వరనే విమర్శలున్నాయి. దీంతో చాలామంది ద్వితీయ శ్రేణి వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నారు. చెరువుల్లో నీరు నింపకపోవడంతో గ్రామీణ ప్రజలు ఆయనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. డోన్ నియోజకవర్గంలోనే కరువు మండలాలు అధికం. వలసలు, తాగునీటి కష్టాలు ఎక్కువ. ఆర్థిక మంత్రిగా ఉన్నా వీటి నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత ఉంది.




బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
వైసీపీ

బలాలు..
ఆర్థికంగా బలంగా ఉండడం.. టీడీపీలో వర్గపోరు

బలాలు..
కుటుంబ/వ్యక్తిగత ప్రతిష్ఠ
టీడీపీ పటిష్ఠంగా ఉండడం
ప్రజల్లో వైసీపీపై వ్యతిరేకత.


కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి
టీడీపీ

బలహీనతలు..
మంత్రిగా సాధారణ ప్రజానీకానికి దూరం కావడం.
హామీలను నెరవేర్చడంలో విఫలమవడం.
కార్యకర్తలను దగ్గరకు రానివ్వకపోవడం.
సొంతవారికే కాంట్రాక్టులు, పనులు అప్పగించడం.

బలహీనతలు
హఠాత్తుగా తెరపైకి రావడం..
కార్యకర్తలను ఏకం చేయలేకపోవడం.. కేఈ, సుబ్బారెడ్డి వర్గాల మధ్య సమన్వయలేమి.



అందరి చూపూ మంగళగిరి వైపే!

ఓడినచోటే నెగ్గాలని లోకేశ్ పట్టుదల


- ఐదేళ్లుగా నియోజకవర్గంలోనే మకాం
- సొంత డబ్బుతో సంక్షేమం, అభివృద్ధి
- అయినా ఓడిస్తామంటున్న వైసీపీ
- ఆళ్లను కాదని మురుగుడు లావణ్యకు సీటు
- వెంటాడుతున్న అమరావతి విధ్వంసం

అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం మరోసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. గత ఎన్నికల్లో అనూహ్యంగా ఓడిపోయిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మరోసారి బరిలో నిలిచారు. 2014, 19ల్లో వరుసగా రెండు సార్లు వైసీపీ తరఫున విజయం సాధించిన ఆళ్ల రామకృష్ణారెడ్డిని సీఎం జగన్ ఈసారి పక్కన పెట్టేశారు. లోకేశ్‌కు ప్రత్యర్థిగా వైసీపీ తరఫున చేనేత వర్గానికి చెందిన మురుగుడు లావణ్యకు టికెట్ ఇచ్చారు. ఈమె మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కోడలు.. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల కుమార్తె. అయినా లోకేశ్‌వైపే మొగ్గు కనిపిస్తోందని, పోరు ఏకపక్షమేనని వివిధ సర్వేలు చెబుతుండడంతో టీడీపీ వర్గాలు భారీ మెజారిటీ కోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నారు. కూటమి పక్షాలైన జనసేన, బీజేపీ శ్రేణులు కూడా మద్దతుగా నిలుస్తున్నాయి. ఇండియా కూటమి అభ్యర్థిగా సీపీఎం సీనియర్ నాయకుడు జొన్నా శివశంకరరావు, బీసీవైపీ పార్టీ నుంచి బోడె రామచంద్రయాదవ్, జైభీమ్ భారత్ పార్టీ తరఫున ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ ఇక్కడి నుంచే పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 40 మంది పోటీ చేస్తున్నారు.

నాడు కుట్రలు, కుయుక్తులతో..

గత 2019 ఎన్నికలలో లోకేశ్‌ను ఓడించడానికి వైసీపీ ఎన్నో కుట్రలు, కుయుక్తులు పన్నింది. పెద్దఎత్తున దుష్ప్రచారాలు సాగించింది. ఆయన గెలిస్తే కాలువ కట్టలపై ఉన్న నివాసాలను, ఇతర ప్రభుత్వ భూముల్లో ఉన్న ఇళ్లను కూల్చివేయిస్తారని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. ప్రజలు నమ్మారు. కానీ జగన్ వచ్చాక అంతా రివర్స్ అయింది. సీఎం నివాసానికి సమీపంలో పేదలు ఉండరాదంటూ బకింగ్‌హామ్ కాలువ కట్టపై వున్న వందలాది మంది పేదల నివాసాలను కూల్చివేయించారు. ఇప్పటం, కురగల్లు, పెదవడ్లపూడి, రేవేంద్రపాడు సహా అనేకచోట్ల కాలువ, చెరువు కట్టలు, ఇతర ప్రభుత్వ భూముల్లో ఉంటున్న పేదల నివాసాలను ఎమ్మెల్యే ఆళ్ల కూల్చి వేయించారు. మూడు రాజధానుల పేరిట రాజధాని అమరావతిని జగన్ బొందపెట్టడంతో మంగళగిరి నియోజకవర్గం, చుట్టుపక్కల గ్రామాల్లో భూముల ధరలు అమాంతం పడిపోయాయి. క్రయవిక్రయాలు స్తంభించాయి. భవన నిర్మాణ కార్యకలాపాలు అటకెక్కాయి. విధ్వంస పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఇంకోవైపు.. ఓడినచోటే గెలిచి తానేంటో నిరూపించుకోవాలని లోకేశ్ పట్టుదలతో పని చేశారు. ఐదేళ్లుగా నియోజకవర్గమంతా కలియదిరిగారు. ఊరూరా సమస్యలను తెలుసుకుంటూ ప్రజలతో మమేకమవుతూ వచ్చారు. పేదల సమస్యలను పరిష్కరించేందుకు సొంత నిధులు ఖర్చుచేస్తున్నారు. 29 రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. సుమారు 4 వేల మంది నిరుపేద నేతన్నల కుటుంబాలకు ఆధునిక రాట్నాల పంపిణీతోపాటు వీవర్స్‌షెడ్లను ఏర్పాటు చేయించి టాటా తవేరా సంస్థ ద్వారా ఆధునిక మగ్గాలపై శిక్షణ ఇప్పిస్తూ అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించారు. గత ఎన్నికల్లో నియోజకవర్గంలోని కాపులు, రెడ్లు టీడీపీకి వ్యతిరేకంగా ఓటేశారు. కానీ ఇప్పుడు వారిలోనూ మార్పు కనిపిస్తోంది. లోకేశ్‌పై బలమైన అభ్యర్థిని రంగంలో నిలపాలన్న టెన్షన్‌తో జగన్ రకరకాల ప్రయోగాలు చేశారు. తొలుత ఆళ్లనే కొనసాగించాలనుకున్నా.. చివరకు అభ్యర్థి మార్పుతోనే పార్టీకి లాభమన్న ఆలోచనతో టీడీపీ నుంచి తీసుకొచ్చిన గంజి చిరంజీవిని ఖరారు చేశారు. మళ్లీ నెల రోజులకే మనసు మార్చుకున్నారు. లోకేశ్‌ను ఎదుర్కొనే సత్తా ఆయనకు లేదని భావించి మురుగుడు లావణ్యకు టికెట్ ఇచ్చారు. ఈ గందరగోళం మధ్య ఆళ్ల రాజీనామా చేసి వెళ్లి.. రెండు నెలల్లోనే తిరిగొచ్చారు.

- మంగళగిరి



లోకేశ్ బలాలు..

2019లో ఓటమి తాలూకు సానుభూతి.. గత ఐదేళ్లుగా నియోజకవర్గాన్నే అంటిపెట్టుకుని ఉండడం.. చేనేతలు సహా ఆయా వర్గాలకు ఇస్తున్న హామీలపై సానుకూలత.. టీడీపీ గెలుపుతోనే రాజధాని అమరావతి నిలబడుతుందని ప్రజల్లో విశ్వాసం.. పటిష్ఠమైన కేడర్.. అటు జనసేన శ్రేణులూ చిత్తశుద్ధితో పనిచేస్తుండడం.

బలహీనతలు
ప్రచారాన్ని రచ్చబండల వరకే పరిమితం చేయడం.. ఇంటింటి ప్రచారం చేయకపోవడం.


మురుగుడు లావణ్య బలాలు..

పుట్టింటివారు, అత్తింటివారు రాజకీయ కుటుంబాలు కావడం.. ప్రస్తుత ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈమెపై పెద్దగా లేకపోవడం.. రాజకీయాలకు పూర్తిగా కొత్తకావడం.

బలహీనతలు
అమరావతిని జగన్ ధ్వంసం చేయడం.. వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత... బలమైన నాయకులు టీడీపీలో చేరడం.

మంగళగిరి నియోజకవర్గ స్వరూపం..
మండలాలు: తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల

మొత్తం ఓటర్లు: 2,94,432 పురుషులు: 1,40,660
మహిళలు: 1,51,759 ట్రాన్స్‌జెండర్లు: 13
సామాజిక వర్గాలవారీగా...: మాదిగలు: 40 వేలు, మాలలు: 38 వేలు, పద్మశాలి:37 వేలు, కాపులు: 27 వేలు, రెడ్లు: 23 వేలు, కమ్మ: 19 వేలు, యాదవ: 18 వేలు, ముస్లింలు: 18 వేలు. గౌడ: 17 వేలు, నాయీ బ్రాహ్మణులు: 9 వేలు , రజకులు: 9 వేలు.





హైటెక్ ప్రచారం

ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. చిత్తూరులో టీడీపీ కార్యకర్తలు సోలో వీల్స్‌తో కలియ తిరుగుతుంటే .. పట్టణాల్లోని వీధుల్లో టీడీపీ కార్యకర్తలు వీపులకు డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు తగిలించుకుని ప్రచారం చేస్తున్నారు. పగటిపూట మామూలుగా కనిపించే ఈ బోర్డులు.. రాత్రి సమయంలో వాటిలో అమర్చిన బ్యాటరీలతో వెలుగులు విరజిమ్ముతూ.. ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును మించిన హక్కు మరొకటి లేదు. అది లేకుంటే మరే హక్కూ సురక్షితం కాదు.


లారెన్స్ గోల్డ్‌స్టోన్

ఆ చట్టం రైతులకు ఉరితాడే!



ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలిలో జరిగిన ప్రజాగళం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న చంద్రబాబు



- దాని రద్దు పైనే రెండో సంతకం: బాబు
- ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఎందుకు ఇవ్వరు?
- వృద్ధులను ఇబ్బందిపెడుతున్నారు: చంద్రబాబు
- పొదిలి, నెల్లూరుల్లో భారీ సభలు

ఒంగోలు/నెల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతులకు ఎలాంటి రక్షణ ఉండదని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. దాని ద్వారాఈ సీఎం ప్రజల భూమిని ఇతరులకు తాకట్టు పెడతాడని.. అమ్మేస్తాడని ధ్వజమెత్తారు. ఈ చట్టం రైతుల మెడకు ఉరితాడు వంటిదని.. తక్షణం దానిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే రద్దుచేస్తామన్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీపైన, రెండో సంతకం టైటిలింగ్ చట్టం రద్దుపైనే పెడతానని స్పష్టం చేశారు. ప్రజాగళంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గం పొదిలిలో, జనసేనాని పవన్ కల్యాణ్‌తో కలిసి రాత్రికి నెల్లూరులో నిర్వహించిన జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. 'మనకు అమ్మానాన్నలు ఇచ్చిన ఆస్తుల మీద, మనం కష్టపడి సంపాదించుకున్న ఆస్తుల మీద ఈ జగన్ బొమ్మ వేసుకోవడం దేనికి సంకేతమో ప్రజలు ఆలోచించాలి. భవిష్యత్‌లో మన భూములు మనం అమ్ముకోవాలన్నా, కొనాలన్నా జగన్ అనుమతి తీసుకోవలసిన పరిస్థితి వస్తుంది. ఆ విధంగా జగన్ ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తయారు చేశాడు. భవిష్యత్‌లో 10(1), అడంగల్, పాసు పుస్తకాలు ఏమీ ఉండవు. వీటిని కొనాలన్నా, అమ్మాలన్నా జగన్ అనుమతి కావాలి' అని తెలిపారు. ఈ ఫొటోల పిచ్చోడు చివరకు జనం ముఖాలపై కూడా తన బొమ్మ వేయాలంటాడేమోనని ఎద్దేవా చేశారు. ప్రజలకు వారసత్వంగా వచ్చిన భూముల పాసు పుస్తకాలు, సర్వే రాళ్లపైనా ఈయన బొమ్మలు ఎందుకు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక పెన్షన్లు తీసుకునే వృద్ధులు మండుటెండల్లో అల్లాడుతుండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇచ్చే అవకాశం ఉన్నా ఈ సీఎస్, జగన్ ప్రభుత్వం అలా చేయడంలేదన్నారు. సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిప్పుతూ వారిని అవస్థలు పెడుతున్నారన్నారని ఆక్షేపించారు. అనేకమంది వృద్ధులు ఎండల్లో తిరగలేక చనిపోతున్నారని, అవన్నీ ప్రభుత్వ హత్యలేనని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతినెలా 1వ తేదీన ఇళ్లవద్దే రూ.4వేల పింఛన్ అందజేస్తామన్నారు. ఇంకా ఏమన్నారంటే..

కూటమి గెలుపును ఆపలేరు..

జగన్ పాలనలో భూములు, ఇసుక, మద్యం, ఖనిజ దోపిడీ అంతులేకుండా సాగింది. ఒంగోలు ఎంపీగా ప్రజాసేవలో 40 ఏళ్లుగా ఉన్న మాగుంట కుటుంబాన్ని కాదని ఎర్రచందనం స్మగ్లర్ చెవిరెడ్డిని తెచ్చిపెట్టారు. ఈ సీఎం అహంకారి, విధ్వంసకారుడు, ఇతరులను వేధించి వారు బాధపడుతుంటే ఆనందించే సైకో. రాష్ట్రం బాగుపడాలంటే ఈయన ఈ రాష్ట్రం నుంచి పారిపోయేలా తీర్పు ఇవ్వాలి. పోలింగ్ బూత్‌లు దద్దరిల్లేలా ఓట్లు వేసి టీడీపీ కూటమిని గెలిపించాలి. 13వ తేదీతో రాష్ట్ర ప్రజలు రాక్షస పాలనను అంతం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. 25కు 25 పార్లమెంట్, 160కి పైగా ఎమ్మెల్యే సీట్లను ఎన్డీయే గెలుచుకుంటుంది. ప్రధాని మోదీ కూడా ఆంధ్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు ద్వారా తెలుగుజాతి భవిష్యత్‌కు మద్దతు పలకాలి. ఎన్డీయే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి. డబుల్ ఇంజన్ సర్కార్‌తో మేలు జరుగుతుంది. జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు అన్యాయం చేసింది. సీపీఎస్ రద్దు చేస్తామని ప్రకటించి చేయలేదు, జీతాలు సక్రమంగా ఇవ్వలేదు. దీనికి గుణపాఠం చెప్పే అవకాశం వచ్చింది. శనివారం నుంచే పోస్టల్ బ్యాలెట్ ప్రారంభమవుతోంది. నెల్లూరు గడ్డ మీద నుంచి ఉద్యోగులను అభ్యర్థిస్తున్నాను. 95శాతం.. వీలుంటే 100శాతం టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించండి. ముస్లింల సంక్షేమానికి నాదీ పూచీ. వారికి 4%రిజర్వేషన్లు కాపాడతాం. మక్కాకు వెళ్లే వారికి లక్ష ఆర్థికసాయం అందిస్తాం. దుల్హన్, రంజాన్ తోఫాలు పునరుద్ధరిస్తాం. ఇమాంలకు గౌరవ వేతనం, మసీదుల నిర్వహణకు ఆర్థిక సాయం అందజేస్తాం.

మెరుగైన సంక్షేమం..

జగన్ రూ.10 ఇచ్చి వంద రూపాయలు లాగేసుకున్నాడు. వెయ్యి రూపాయలు దోచేసుకున్నాడు. రూ.13 లక్షల కోట్ల అప్పుల పాల్జేశాడు. మేం వచ్చాక రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూనే ఇప్పటికన్నా మంచి సంక్షేమాన్ని అందిస్తాం. ఆడబిడ్డ నిధి కింద 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 1,500 చొప్పున ఐదేళ్ల కాలానికి రూ.90 వేలిస్తాం. ఎంతమంది బిడ్డలుంటే అంత మందికి ఒక్కొక్కరికి 15వేల చొప్పున చదువుకోవడానికి ఇస్తాం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. యువతా మీ ఉద్యోగాల బాధ్యత మాది. రైతును రాజును చేస్తాం. చంద్రన్న బీమా సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.10లక్షలు ఇస్తాం. ఆరోగ్య బీమా 25లక్షలకు పెంచుతాం. బీసీ డిక్లరేషన్ ఇస్తాం.. వారికి ఐదేళ్లలో లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తాం. కాపు సంక్షేమానికి రూ.15 వేల కోట్లు, ప్రతి డ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేలు ఇస్తాం. వైసీపీ రహిత రాష్ట్రం కావాలన్నదే పవన్ కల్యాణ్ ధ్యేయం. జగన్ వ్యతిరేక ఓటు చీలకూడదనే కూటమి కట్టడానికి ముందుకొచ్చారు. రాష్ట్ర భవిష్యత్ కోసం, రాష్ట్ర ప్రజల కోసం అందరం కూటమిగా ఏర్పడ్డాం. పవన్ సూచన మేరకు యువతలో ఉన్న స్కిల్స్‌పై సెన్సస్ తీస్తాం. ఎవరిలో ఏ స్కిల్ ఉందో దాని ఆధారంగా ఉద్యోగావకాశాలు కల్పించే ప్రయత్నం చేస్తాం. నెల్లూరు, తిరుపతి, చెన్నైలను కలుపుతూ ట్రై సిటీగా అభివృద్ధి చేసి సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ హబ్‌గా తయారు చేస్తాం.

- సానుభూతి కోసం డ్రామాలాడడం జగన్‌కు అలవాటే. 2014లో తండ్రి మృతితో, 2019లో బాబాయిని హత్య చేసి సానుభూతి పొంది ఓట్లు దండుకున్నాడు. ఇప్పుడు కనిపంచని గులకరాయి డ్రామాలాడారు. నాటకాల జగన్ కావాలో.. మీ సమస్యలు పరిష్కరించే నాయకుడు కావాలో ప్రజలు ఆలోచించాలి.
- రాష్ట్రంలో ఎన్నికలు వన్‌సైడే. ఎన్డీయే గెలుపు అన్‌స్టాపబుల్. వైసీపీ డబ్బులతో, కుట్రలతో రాజకీయాలు చేయాలనుకుంటోంది. వందలు, వేల కోట్లు ఖర్చు పెట్టినా ప్రజలు ఆ పార్టీకి ఓట్లు వేయరు.
- ఇవి ఆంధ్ర భవిష్యత్ కోసం జరుగుతున్న ఎన్నికలు. ఒక బందిపోటుకు, ఐదుకోట్ల మంది ప్రజలకు మధ్య జరుగుతున్న ఎన్నికలని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

- చంద్రబాబు



గిద్దలూరులో జరిగిన సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న పవన్ కల్యాణ్



జగన్ మళ్లీ వస్తే..
మన భూములన్నీ దోపిడీ

- ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు అందుకే: పవన్
- వైసీపీకి ఓటేస్తే కొంప కొల్లేరే !
- కూటమికి ఓటేస్తే మీ కోసం రక్తం ధారబోస్తా
- కైకలూరు, గిద్దలూరు సభల్లో జనసేనాని ప్రకటన
- నెల్లూరులో బాబుతో కలిసి ఉమ్మడి సభ

ఏలూరు/ కైకలూరు/ఒంగోలు, మే 3(ఆంధ్రజ్యోతి): జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులన్నీ గాల్లోనే ఉంటాయని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో మన భూములు, ఆస్తులను ఈ సీఎం దోచుకుపోతారని హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఏలూరు జిల్లా కైకలూరు, ప్రకాశం జిల్లా గిద్దలూరుల్లో జరిగిన వారాహి విజయయాత్ర సభల్లో ప్రసంగించారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి రాత్రి నెల్లూరులో ఉమ్మడి బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సీఎం అబద్ధాలకోరని.. మద్యనిషేధం అంటూ మద్యం తానే అమ్మాడని ధ్వజమెత్తారు. వైసీపీ కోటలు బద్దలు కొడతామని పవన్ ఆయా సందర్భాల్లో తేల్చిచెప్పారు. అది ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కాదని.. జగన్ గ్రాబింగ్ యాక్టు అని.. దీనిద్వారా రాష్ట్రంలో సాగులో లేని భూములన్నీ ఆక్రమణలకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మన భూముల పట్టాదార్ పాసుపుస్తకాలపై జగన్ బొమ్మలు ఎలా వేసుకుంటారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మెగా డీఎస్సీని ప్రకటిస్తామన్నారు. వెలిగొండ సొరంగాలను ప్రారంభించకుండా మోసం చేసిన జగన్‌కు ప్రకాశం జిల్లా ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపిచ్చారు. నెల్లూరుతో ఉన్న తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నెల్లూరు తనకు చాలా ఇచ్చిందని అన్నారు. ఇంకా ఏమన్నారంటే..

అసెంబ్లీ ఉన్నదెందుకు?

ఆస్తి పత్రాలుగా జిరాక్స్ కాపీలు ఇస్తారా..? మన ఆస్తి పత్రాలు రెవెన్యూ ఆఫీసుల్లో ఉంటాయట! ఆ ఆస్తిని 90 రోజుల్లో మనం నిరూపించుకోలేకపోతే అవి కైకలూరు వైసీపీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు వంటివారు దోచేసుకుంటారు. దీనిపై పోలీసుస్టేషన్‌కు వెళ్లడానికి లేదు. కోర్టులకు వెళ్లడానికి లేదు. రెండెకరాల రైతు హైకోర్టుకు ఎలా వెళ్లగలడు..? ఇదెక్కడి న్యాయం ఇదెక్కడి చట్టం? మన ఆడపిల్లలకు పెళ్లి చేసి అత్తవారింటికి పంపేటప్పుడు ఆస్తి పత్రాలుగా జిరాక్స్ కాపీలు ఇస్తామా..? మనకు డబ్బు అవసరమై.. ఫైనాన్షియర్ దగ్గరకో, బ్యాంకుకో వెళ్లి ఈ జిరాక్స్ కాపీలు చూపిస్తే మనకు అప్పు పుడుతుందా..? ఈ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ద్వారా జగన్ మన భూములను దోచుకుపోతాడు. కూటమి రాగానే ఈ యాక్టును రద్దుచేస్తాం. యువత వైసీపీకి ఓటేస్తే భవిష్యత్ అంధకారమే. 2019లోనే నేను చెప్పా.. ఎవరూ వినలేదు.. వైసీపీకి ఓటు వేశారు.. ఇప్పుడేమైంది? మన భవిష్యత్ కోసం పవన్ కల్యాణ్ వచ్చాడు. అన్ని పార్టీలను కలిపాడు. తగ్గి మరీ కూటమిని ఏర్పాటు చేశాడు. ఆ భవిష్యత్ కోసం జాగ్రత్తగా ఓటెయ్యండి.

ఇదీ బాబు విజన్..

చంద్రబాబు విజన్-2020 అంటే అదెలా ఉంటుందోనని 2020 సంవత్సరం వరకు ఎదురుచూశాం. ఆ తర్వాత హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, మాదాపూర్ ప్రాంతాలకు వెళ్లిచూస్తే విజన్ అంటే ఇలా ఉంటుందని, విజన్ కలిగిన నాయకుడుంటే ఇట్లాంటి అద్భుతాలు జరుగుతాయని తెలిసింది. ముఖ్యమంత్రి రెండు చేతులతో నమస్కారం పెట్టి ఓట్లడగాలి. కానీ జగన్ మాత్రం వైసీపీ పోస్టర్లలో వేలు చూపిస్తూ బెదిరించి మరీ అడుగుతున్నారు..

గర్జించిన సింహపురి

టీడీపీ, జనసేన అధినేతలు ఉమ్మడిగా తొలిసారి ఎన్నికల ప్రచారానికి నెల్లూరుకు రావడంతో నెల్లూరు నగరం కిక్కిరిసిపోయింది. మూడు కిలోమీటర్ల మేర ఎటు చూసినా జనమే. కేవీఆర్ జంక్షన్ నుంచి నర్తకీ సెంటర్ వరకు రోడ్‌షో జరుగగా.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రజలకు అభివాదం చేస్తూ కదిలారు. ప్రజలు పూలవర్షం కురిపించారు.

- కులం కాని కులం.. మనమంతా కార్మికులం. భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రభుత్వం సెస్ వసూలు చేసి ఆ నిధి నుంచి రూ.450 కోట్లను జగన్ ప్రభుత్వం దోచేసింది. మేం అధికారంలోకి వచ్చాక నిర్మాణ కార్మికుల అండగా సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తాం.
- చంద్రబాబు రాష్ట్రానికి అవసరం. జనసైనికుల పోరాట పటిమ అవసరం. టీడీపీ తాలూకు నిర్మాణాత్మకత అవసరం. బీజేపీ నాయకుల శక్తి అవసరం.. ఇవన్నీ కలిపి కూటమిగా రాష్ట్ర ప్రజల కోసమే వచ్చాం. జనాన్ని భుజాల మీదకు ఎత్తుకుని ఊరేగించడానికే వచ్చాను. అది జరిగే వరకు విశ్రమించను.

-పవన్ కల్యాణ్

జగన్‌ది కడుపా.. కంభం చెరువా?

పేరొందిన కంభం చెరువు కంటే సీఎం జగన్ పొట్ట పెద్దది.. ఎంత తిన్నా నిండదు. ప్రతి చేతికీ పని కల్పించడం.. ప్రతిచేనుకూ నీళ్లు ఇవ్వడం ఎన్డీయే లక్ష్యం. గిద్దలూరు నియోజకవర్గంలో జనసేనకు ఒంటరిగా పోటీచేసే సత్తా ఉంది.. అయినా రాష్ట్ర శ్రేయస్సు కోసం టీడీపీ అభ్యర్థిని రంగంలోకి దించాం. ఇది అర్థం చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులు కూటమి అభ్యర్థుల విజయం కోసం పనిచేస్తున్నారు. వైసీపీ అభ్యర్థులు ఒక్కరు కూడా గెలవకుండా చూడాలి. గౌరవప్రదమైన కుటుంబం నుంచి వచ్చిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికే వైసీపీలో గౌరవం కరువైంది. మనసు చంపుకొని అక్కడ ఉండలేక టీడీపీలోకి వచ్చారు. జగన్ అహంకారానికి ఇదే నిదర్శనం.

మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేతపై
8లోగా నిర్ణయం వెల్లడించండి

- వివేకా హత్యపై మాట్లాడొద్దన్న కడప జిల్లా కోర్టుకు హైకోర్టు ఆదేశం
- షర్మిల, సునీత, బీటెక్ రవి వ్యాజ్యాలపై విచారణ మూసివేత

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సీఎం/వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని కడప జిల్లా కోర్టు ఇచ్చిన తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సాధ్యమైనంత త్వరగా విచారణ జరిపి ఈనెల 8లోగా నిర్ణయాన్ని వెల్లడించాలని కడప జిల్లా కోర్టును హైకోర్టు ఆదేశించింది. మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేయాలని కడప కోర్టులో పిటిషన్లు వేసి, హైకోర్టులో సివిల్ మిస్‌ఎలేనియస్ అప్లికేషన్లు(సీఎంఏ)లు ఎలా దాఖలు చేస్తారని పిటిషనర్లను ప్రశ్నించింది. స్టే వెకేట్ పిటిషన్లపై విచారణ జరపకుండా న్యాయాధికారి ఉద్దేశపూర్వకంగా తిరస్కరించిడం లేదా విస్మరించిన సందర్భాల్లో మాత్రమే అప్పీలు వేయగలరని వ్యాఖ్యానించింది. స్టే వెకేట్ పిటిషన్లపై ట్రయల్ కోర్టులో ఇప్పటికే వాదనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని అక్కడే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. వాటిపై విచారణను మూసివేసింది. ఈ మేరకు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ వి.గోపాలకృష్ణరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశాలిచ్చింది. వివేకా హత్య విషయంలో వైసీపీ అధ్యక్షుడు, ఆ పార్టీ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న ఏ కేసుల గురించీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడవద్దని కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పీసీసీ అధ్యక్షురాలు, కడప పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి, వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, పులివెందుల టీడీపీ అభ్యర్థి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు శుక్రవారం విచారణకు రాగా.. కడప కోర్టులో పిటిషనర్, కడప జిల్లా వైసీపీ అధ్యక్షుడు సురేశ్‌బాబు తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి స్పందించారు. ఈ పిటిషన్లకు విచారణార్హత లేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ట్రయల్ కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేయాలని కోరుతూ స్టే వెకేట్ అప్లికేషన్ వేసుకునేందుకు వెసులుబాటు ఉన్నప్పుడు, నేరుగా హైకోర్టుకు ఎలా వస్తారని పిటిషనర్లను ప్రశ్నించింది.

కడప కోర్టు పరిధి దాటింది..!

తమ పిటిషన్లకు విచారణార్హత ఉందని బీటెక్ రవి తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు తెలిపారు. అందుకు సంబంధించి పలు తీర్పులను ధర్మాసనం ముందు ఉంచారు. కడప కోర్టు తన న్యాయపరిధి దాటి ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'కోర్టులో కేసు విచారణలో ఉండగా దాని గురించి ఎలా మాట్లాడతారని అని సూచించింది. సీనియర్ న్యాయవాది బదులిస్తూ.. మరి కడప కోర్టు ఈ సమయంలో అంత అత్యవసరంగా ఎక్స్‌పార్టీ ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అన్నిపక్షాల వాదనలు పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం.. స్టే వెకేట్ పిటిషన్లపై ట్రయల్ కోర్టులో ఇప్పటికే వాదనలు కొనసాగుతున్న నేపథ్యంలో అక్కడే తేల్చుకోవాలని సూచించింది.

హంతకుల వెనుక
జగన్ ఎందుకున్నాడు

- కడప ప్రజలకు సీఎం సమాధానం చెప్పాలి
- అన్ని వేళ్లూ అవినాశ్ వైపే..
- హంతకులు చట్టసభలకు పోకూడదనే పోటీ: పీసీసీ చీఫ్ షర్మిల





మైదుకూరులో నిర్వహించిన సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న షర్మిల, పక్కన సునీత

కడప, మే 3(ఆంధ్రజ్యోతి): "సొంత బాబాయి వివేకానందరెడ్డిని చంపించింది అవినాశ్‌రెడ్డి అని సీబీఐ అన్ని ఆధారాలతో చెప్పింది. అన్ని వేళ్లు అవినాశ్‌రెడ్డి వైపు చూపిస్తున్నాయి. సొంత బాబాయిని దారుణంగా హత్య చేస్తే స్వయంగా సీఎం జగన్ తన పదవి అడ్డుపెట్టుకుని నిందితుడు అరెస్టు కాకుండా కాపాడుతున్నారు. కర్నూలులో అరెస్టు చేయడానికి వెళితే పోలీసులను అడ్డుపెట్టి కర్ఫ్యూ వాతావరణం సృష్టించారు. ఇది అన్యాయం, అక్రమం. సొంత చిన్నాన్నను హత్య చేస్తే ఎందుకు మీరు నిందితుల వెనుక ఉన్నారు. కడప ప్రజలకు సీఎం జగన్ సమాధానం చెప్పాలి" అని పీసీసీ చీఫ్, జగన్ సోదరి వైఎస్ షర్మిలారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆమె వివేకా కుమార్తె డాక్టర్ సునీతతో కలసి మైదుకూరు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా మైదుకూరులో జరిగిన బహిరంగసభలో షర్మిల మాట్లాడుతూ.. నేను పులిబిడ్డను.. అన్యాయాన్ని ఎదిరించేందుకే పోటీ చేస్తున్నా. ప్రజాకోర్టులో న్యాయం కోసం పోరాటం చేస్తున్నా. నేను కడప బిడ్డను.. ఇక్కడే పుట్టాను. హంతకులు చట్టసభలకు పోకూడదనే నేను పోటీ చేస్తున్నా. నన్ను ఆశీర్వదించండి.. అవినాశ్ రెడ్డి పదేళ్లు ఎంపీగా ఉన్నా ఢిల్లీలో కడప సమస్యలపై కొట్లాడలేదు. కడప స్టీలు ప్లాంటు కోసం ఏనాడైనా మాట్లాడారా?' అని ప్రశ్నించారు.

అవినీతి సొమ్ము ఎంతైనా పంచుతారు!

జగన్ సీఎం అయిన తరువాత రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు. కనీసం రాజధాని కూడా లేదు. ఈ ఎన్నికల్లో అవినీతి సొమ్ము ఎంతైనా పంచుతారు. పంచడానికి నా వద్ద ఏమీ లేదు. ప్రేమ ఆప్యాయత తప్ప. వైసీపీ ఎమ్మెల్యేలు బాగా ఇస్తారంట.. ఎంత ఇచ్చినా తీసుకోండి.. ఓటు మాత్రం కాంగ్రెస్‌కు వేయండి. జగన్ 2.35 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారు. మెగా డీఎస్సీ అని 6వేలతో దగా డీఎస్సీ వేశారు. వైఎస్సార్ కొడుకు అయి ఉండి ఐదేళ్లు నిద్రపోయాడు. ఇప్పుడు ఏదో ఉద్ధరించినట్లు సిద్ధం అంటూ బయల్దేరారు. దేనికి సిద్ధం సార్..?' అంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు.

వైఎస్ ఫొటో పెట్టుకునే హక్కు వైసీపీకి లేదు: సునీత

వివేకా కుమార్తె డాక్టర్ సునీత మాట్లాడుతూ.. 'వైసీపీకి వైఎస్సార్ ఫొటో పెట్టుకునే హక్కు లేదు. ఆ హక్కు షర్మిలాకు మాత్రమే ఉంది. రాజశేఖర్‌రెడ్డి వారసురాలు షర్మిలనే. రాజశేఖర్‌రెడ్డి ఉన్నది కాంగ్రెస్‌లోనే. షర్మిలను భారీ మెజార్టీతో గెలపించాలి. అప్పుడే వివేకాకు ఘననివాళి. చనిపోయే వరకు తన జీవితం ప్రజలకు అంకితం చేశారు. ఇప్పుడు ఎంపీ జనాలతో కలుస్తున్నాడా.? వైఎస్ వివేకాను దారుణంగా నరికి చంపారు. అలాంటి వారికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పి షర్మిలను ఎంపీగా గెలిపించి హత్యా రాజకీయాలకు స్వస్తి చెప్పాలి' అని కోరారు. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు మరచిపోవడమే కాకుండా వైసీపీ ప్రభుత్వం దాదాపు రూ.22వేల కోట్ల బకాయిలుపెట్టిందని, ఆఖరికి మెడికల్ బిల్లులు సైతం బకాయిలు పెట్టిన ఘనత వైసీపీదని షర్మిలారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం కడపలో ఆమె మీడియాతో మాట్లాడారు. అందరితో పాటు ఉద్యోగులకు కూడా అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు.

ఉద్యోగులకు ఏదీ గౌరవం?

- నవ సందేహాలతో జగన్‌కు షర్మిల మూడో లేఖ

అమరావతి, కడప, మే 3(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తానంటూ ప్రతిపక్షనేతగా ఇచ్చిన హామీని అమలు చేయకపోవడమే కాకుండా, ఐదేళ్ల పాలనలో ప్రభుత్వోద్యోగులకు తీరని అన్యాయం చేశారంటూ సీఎం జగన్‌పై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఐదేళ్ల జగన్ పాలనలో వివిధ వర్గాలకు జరిగిన అన్యాయాలపై ఆయనకు రాస్తున్న లేఖల పరంపరలో భాగంగా శుక్రవారం షర్మిల మూడో లేఖాస్త్రం సంధించారు. ఉద్యోగుల విషయంలో అడుగుతున్న నవ సందేహాలకు సమాధానం చెప్పి, ఆ తర్వాతే ప్రజలను ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ని గెలిపిస్తే రాష్ట్రంలో ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

నవ సందేహాలివే..

1)అధికారంలోకొచ్చిన వారంలోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామన్నారు. ఓపీఎస్ అమలు చేస్తామని చెప్పారు. ఎందుకు చేయలేదు?

2) ఒకటో తేదీన జీతాలు అందుకోవాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెల 15 నుంచి 25 దాకా ఆగాల్సి రావడం ఏమిటి? అసమర్థ పాలనకు ఇది నిదర్శనం కాదా?

3) 11వ పీఆర్‌సీ కమిషన్‌లో ప్రభుత్వం ప్రకటన చేసిన ఐఆర్ 27శాతం కంటే తక్కువ ఫిట్‌మెంట్ 23 శాతం ఇచ్చిన ఘనత జగన్‌ది కాదా?

4) 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన 12వ వేతన సవరణ సంఘం సిఫారసులు ఎందుకు అమలు చేయలేదు?

5) రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏను 30 శాతం నుంచి 24శాతానికి, జిల్లాస్థాయి ఉద్యోగులకు హెచ్‌ఆర్ఏ 20శాతం నుంచి 16శాతానికి ఎందుకు కుదించారు?

6) ఉద్యోగులకు చెల్లించాల్సిన 22వేల కోట్ల పాత బకాయిల సంగతి ఏమిటి?

7) 2022 నుంచి ఇవ్వాల్సిన టీఏ, డీఏలు రూ.270 కోట్లను 2027లో చెల్లిస్తామని చెప్పడం ఏమిటి ?

8) ఉద్యోగుల సరెండర్ లీవుల బకాయిలు రూ.2,500 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారు?

9) ఉద్యోగులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు రూ.118 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి సంగతేంటి?

పేర్ని కిట్టుపై హత్యాయత్నం కేసు

- మచిలీపట్నం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్ని నాని తనయుడు
- మరో ఐదుగురిపైనా ఇదే సెక్షన్ నమోదు
- కిట్టును తప్పించి మిగిలిన వారి అరెస్టు
- హత్యాయత్నం సెక్షన్‌ను తిరస్కరించిన జడ్జి
- నిందితులకు బెయిల్ మంజూరు



మచిలీపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి పేర్ని నాని తనయుడు పేర్ని కిట్టుపై హత్యాయత్నం కేసు నమోదైంది. మరో ఐదుగురు వైసీపీ కార్యకర్తలపైనా పోలీసులు ఇదే కేసు నమోదుచేశారు. మచిలీపట్నంలో జనసేన కార్యకర్త కర్రి మహేశ్ కుటుంబసభ్యులపై దాడిచేసి, ఆ ఇంట్లోని మహిళ పుస్తెలతాడు లాగేసి, కొట్టిన ఘటనలో పోలీసులు శుక్రవారం కేసు నమోదుచేశారు. ఘటన జరిగిన సమయంలో ప్రచార వాహనంలో ఉండి వైసీపీ కార్యకర్తలు దాడిచేసేలా ప్రోత్సహించారన్న బాధితుల ఫిర్యాదుపై పేర్ని కిట్టును ఈ కేసులో ఏ-1గా పేర్కొన్నారు. దాడి ఘటనలో పాల్గొన్న వైసీపీ కార్యకర్తలు చిలకలపూడి గాంధీ, చిలంకుర్తి వినయ్, శీనయ్య, ధనబాబు, లంకే రమేశ్‌ను నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదుచేశారు. ఈ కేసులో పేర్ని కిట్టు మినహా మిగిలిన ఐదుగురిని అరెస్ట్ చేసి మచిలీపట్నం 2వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఇరువర్గాలు ఘర్షణ పడుతున్న సమయంలో జనసేన కార్యకర్తలు కర్రి మహేశ్, మరో ముగ్గురు తనను కులం పేరుతో దూషించారని వైసీపీకి చెందిన నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేశారు. అయితే, నిందితులపై పెట్టిన హత్యాయత్నం సెక్షన్‌ను 2వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి తిరస్కరించారు. అనంతరం నిందితులకు బెయిల్ మంజూరు చేశారు. వైసీపీ కార్యకర్తలను కోర్టులో హాజరుపరిచే సమయంలో పేర్ని నాని కోర్టు వద్దకు వచ్చారు.

జనసేనలో చురుగ్గా ఉన్నారనే!

మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని విశ్వబ్రాహ్మణ కాలనీలో జనసేన కార్యకర్త కర్రి మహేశ్ నివసిస్తున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో జనసేన తరఫున కార్పొరేటర్‌గా పోటీచేసి ఓడిపోయారు. ప్రస్తుతం బ్యాంకు అప్రయిజర్‌గా పనిచేస్తూ జనసేనలో చురుగ్గా ఉన్నారు. వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు గురువారం 8వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో కర్రి మహేశ్ నివాసం వద్ద వైసీపీ కార్యకర్తలు బాణాసంచా కాలుస్తుండగా నిప్పురవ్వలు ఇంట్లో పడ్డాయి. తమ నివాసం ఎదుట బాణాసంచా కాల్చవద్దని మహేశ్ భార్య హేమలత, కుమారుడు సాయికృష్ణ రామబ్రహ్మం, తల్లి జ్ఞానప్రసూనాంబ, ఇతర కుటుంబ సభ్యులు గోకుల్, నాగబాబు వైసీపీ కార్యకర్తలను కోరారు. దీంతో రెచ్చిపోయిన కిట్టు అనుచరులు 'మాకే అడ్డుచెబుతారా' అంటూ వారిపై దాడికి తెగబడ్డారు. విచక్షణారహితంగా దాడి చేసి మెడలోని హేమలత మెడలోని మంగళసూత్రాలు లాగేశారు. వస్తువులను ధ్వంసం చేశారు. గొడవ జరుగుతున్న సమయంలో అక్కడకు చేరుకున్న మహేశ్‌పైనా దాడిచేశారు. దాడి ఘటనపై సత్వరం స్పందించాల్సిన పోలీసులు జాప్యం చేయడంతో పోలీసు స్టేషన్ వద్ద బాధితులపై కిట్టు అనుచరులు మరోసారి పోలీసుల సమక్షంలోనే దాడికి తెగబడ్డారు. పోలీసుల తీరుపై మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ జనసేనపార్టీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర గురువారం ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. దీంతో పోలీసులు స్పందించారు. శుక్రవారం హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



కళ తప్పిన సంగమం

కృష్ణా, గోదావరి నదుల సంగమ ప్రాంతమైన ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పవిత్ర సంగమం పేరుతో అభివృద్ధి చేసింది. నదీమ తల్లులకు నిత్యం పూజలందించాలనే తలంపుతో అక్కడ నదీహారతులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నదీ హారతులను పవిత్ర సంగమం నుంచి తొలగించి దుర్గమ్మ చెంతనున్న దుర్గాఘాట్‌లో ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల వరకు బాగానే ఉన్నా ఆ తరువాత ప్రభుత్వం పట్టించుకోవటం మానేసింది. దీంతో నిధులు లేక హారతులు జరగక ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారిపోయింది.







దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారి రాసలీలలు..!

వన్‌టౌన్, మే 3: రాష్ట్రంలోని రెండో అతిపెద్ద దేవాలయమైన దుర్గగుడిలో కొందరు ఉద్యోగులు మహిళా ఉద్యోగినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు జోరుగా వస్తున్నాయి. ఇలాంటి ఉద్యోగులపై ఉన్నతాధికారికి ఫిర్యాదులు వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో కీలక పదవిలో ఉన్న ఓ అధికారి, పలువురు ప్రైవేట్ సెక్యూరిటీ మహిళా ఉద్యోగినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న కారణంగా ప్రైవేట్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించినట్టు తెలిసింది.

ఇంజనీరింగ్ విభాగంలో ఓ ఉన్నతాధికారి రెండు మూడు రోజుల క్రితం దేవస్థానంలోని తన చాంబర్‌లో ఓ మహిళా సెక్యూరిటీతో రాసలీలలు నడిపినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరిద్దరూ ఏకాంతంగా ఉప్పుడు కొందరు ఉద్యోగులు వీడియో తీసినట్టు తెలిసింది. ఈ వీడియో శుక్రవారం బయటకు రావడంతో దేవస్థానంలో కలకలం మొదలైంది. ఈవో రామారావు స్పందించి విచారణ చేపట్టినట్లు సమాచారం. సెక్యూరిటీ గార్డు సిబ్బందిని, ఉద్యోగులను వేర్వేరుగా తన చాంబర్‌కు పిలుపించుకుని విచారించినట్టు తెలిసింది. తరువాత ఈవో ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ ప్రతినిధికి

● ప్రైవేట్ సెక్యూరిటీ ఆఫీసర్ తొలగింపు

ఫోన్ చేసి సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సాయిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించినట్టు తెలిసింది. ఆయన బాధ్యతలను ఏఈఈ రామకృష్ణకు అప్పగించినట్లు సమాచారం. పవిత్రమైన అమ్మవారి దేవస్థానంలో కొందరు ఉద్యోగుల తీరుతో దేవస్థానం పరువు, ప్రతిష్ట దిగజారుతుందని భక్తులతో పాటు ఉద్యోగులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరిపై ఈవో ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

విచారణ చేస్తున్నాం: ఈవో

ఇంజనీరింగ్ విభాగంలోని ఓ అధికారి రాసలీల వ్యవహారంపై ఈవో రామారావును ఆంధ్రజ్యోతి ప్రతినిధి వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిందని విచారణ చేపట్టినట్టు తెలిపారు. పూర్తిగా విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటానన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ సెక్యూరిటీలో పనిచేస్తున్న సెక్యూరిటీ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించాల్సిందిగా ఆ సంస్థ ప్రతినిధికి చెప్పానన్నారు. త్వరలో భద్రత నిమిత్తం ఓ సీనియర్ అధికారిని నియమించనున్నట్టు ఈవో చెప్పారు.

పింఛన్ కోసం వెళ్లిన వృద్ధురాలికి వడదెబ్బ

● స్థానికులు స్పందించడంతో వృద్ధురాలికి తప్పిన ప్రాణాపాయం

మొగల్రాజపురం, మే 3: పింఛన్ల విషయంలో ప్రభుత్వ వైఖరి వృద్ధుల ప్రాణాల మీదకు వస్తోంది. మూడో తారీఖు వచ్చినా బ్యాంకులో ఇచ్చే పింఛన్ కోసం వృద్ధులు క్యూ కడుతున్నారు. తీరా బ్యాంకుకు వెళ్లిన తరువాత ఏదో కారణం చెప్పి పంపేస్తున్నారు. మధురానగర్ పప్పుల మిల్లు ఏరియాలో ఉండే భారతి అనే వృద్ధురాలు మెయిన్ రోడ్డులోని బ్యాంకుకు రెండ్రోజుల నుంచి తిరుగుతోంది. శుక్రవారం కూడా 2 సార్లు వెళ్లింది. సాయంత్రం మరోసారి వెళ్లగా రేపు రమ్మనడంతో ఇంటికి నడుచుకుంటూ వస్తోంది. రాగం మస్తాన్‌రావు రోడ్డు జేకే ఆసుపత్రి వద్దకు రాగానే అప్పటికే ఎండదెబ్బకు గురైన వృద్ధురాలు సైడు కాల్వలో పడింది. ఘటనా స్థలం ఎదురుగా మెకానిక్ షాపు నిర్వహిస్తున్న జనసేన డివిజన్ అధ్యక్షుడు కెంబూరి కృష్ణ, మరో యువతి వెంటనే గమనించి వెళ్లి లేపి సపర్యలు చేసి నీడకు తీసుకొచ్చారు. అదేదారిలో వస్తున్న టీడీపీ బీసీ నేత అంగిరేకుల రాంబాబు వృద్ధురాలిని గుర్తు పట్టి ఆటో ఎక్కించి ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



వృద్ధురాలికి సపర్యలు చేస్తున్న కృష్ణ, యువతి

వృద్ధుల నుంచి చార్జీలు వసూలు అమానుషం: సీపీఎం

గవర్నర్‌పేట: వృద్ధులకు పెన్షన్ బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పి రకరకాల కారణాలతో చార్జీలు వసూలు చేయడం అమానుషమని శుక్రవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఆక్షేపించారు. వృద్ధుల వద్ద వసూలు చేసిన చార్జీలను తక్షణమే తిరిగి చెల్లించాలని, ఇంటి వద్దనే సామాజిక పెన్షన్లు పంపిణీ చేయాలని కోరారు. కదలలేని స్థితిలో మంచానికే పరిమితమైన వృద్ధులకు ఇంటి వద్దే పంపిణీ చేస్తామని చెప్పి బ్యాంకుల్లో జమచేసి నానా ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65.49 లక్షల మంది పింఛన్‌దారులుంటే వారిలో 48.92 లక్షల మందికి బ్యాంకు ఖాతాలున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం 3 రోజులైనా ఖాతాల్లో లావాదేవీలు జరగలేదన్నారు. మినిమం బ్యాలెన్స్ లేదన్న కారణంతో ఒక్కొక్కరి నుంచి రూ.300 నుంచి రూ.400 వరకు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అలసత్వంతోనే వృద్ధులు పడిగాపులు పడుతున్నారన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగంలో సూచన: కలెక్టర్

కృష్ణలంక: జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి తమ ఓటు వేరే జిల్లాలో ఉంటే ఆయా జిల్లాల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఎన్టీఆర్ జిల్లాకు తెప్పించి స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలోని కేంద్రీకృత ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. వేరే జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తాలూక ఓటు ఎన్టీఆర్ జిల్లాలో ఉంటే వారు పనిచేసే జిల్లా ఎన్నికల అధికారికి ఫారం-12 దరఖాస్తు చేసుకొన్నవారికి ఆయా జిల్లాలకు పోస్టల్ బ్యాలెట్ పంపనున్నామన్నారు. అక్కడ ఆర్‌వో స్థాయి లేదా కేంద్రీకృత ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో వారి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందని వివరించారు.

నేటి నుంచి కేబీఎన్‌లో ఫెసిలిటేషన్ సెంటర్

వన్‌టౌన్: ఎన్నికల్లో విధులకు హాజరయ్యే ఉద్యోగులు పీవో, ఏపీవో, ఎంవో, పోలీస్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, డ్రైవర్స్, సెక్టార్ ఆఫీసర్లు, ఇతరులకు మే 4 నుంచి మే 6 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కొత్తపేట కేబీఎన్ కాలేజీలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికా రి కిరణ్మయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు ఎలక్షన్ డ్యూటీ ఉద్యోగులందరూ పో స్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వైసీపీ స్టిక్కర్లు

● వైసీపీ కార్పొరేటర్, ఆమె భర్తపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లకు వైసీపీ స్టిక్కర్లు అంటించిన వైసీపీ కార్పొరేటర్, ఆమె భర్తపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. 59వ డివిజన్ లూనా సెంటర్ ప్రాంతంలో గురువారం స్థానిక వైసీపీ కార్పొరేటర్ షాహీనా సుల్తానా, ఆమె భర్త ఎండీ హఫీజుల్లా కార్యకర్తలతో కలిసి వైఎస్ జగన్‌ను గెలిపించాలంటూ ముద్రించిన స్టిక్కర్లను ఇంటింటికీ అంటించారు. దీనిపై తెలుగుదేశం పార్టీ ఎస్సీ నేత చల్లగాలి అనిల్ సీ విజల్ యాప్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎన్నికల అధికారులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు స్థానిక వైసీపీ కార్పొరేటర్ షాహీనా సుల్తానా, ఆమె భర్త, ఎమ్మెల్సీ సోదరుడు ఎండీ హఫీజుల్లాతో పాటుగా మరికొందరు పార్టీ కార్యకర్తలపై ఐపీసీ 447, 427, 171 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

6న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు: నగరంలో ఈ నెల 21 నుంచి స్టెల్లా కళాశాల ఆవరణలో జరిగే 7వ ఆంధ్రప్రదేశ్ యూత్ ఇంటర్ డిస్ట్రిక్టు బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారుల ఎంపికలను 6న ఐజీఎంసీ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్టు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రబోస్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్ నకలు, ఒరిజనల్ తీసుకుని రావాలన్నారు. 2008 జనవరి 1 తర్వాత జన్మించిన వారు పోటీలకు అర్హులన్నారు.

విశ్వబ్రాహ్మణులపై వైసీపీ గుండాల దాడి: సింహాద్రి

విద్యాధరపురం: రాష్ట్రంలో వైసీపీ గుండాలు బరితెగించి విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గంపై దాడికి పాల్పడుతున్నారని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి కనకాచారి అన్నారు. శుక్రవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నంలో వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు ప్రజలను కాకుండా గుండాయిజాన్ని, రౌడీయిజాన్ని నమ్ముకుని ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్నాడని విమర్శించారు. ఆయన వెంట తిరిగే వారంతా బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ వారేనన్నారు. జగన్‌రెడ్డి పాలనలో బీసీలపై దాడులు, హత్యలు ఎక్కువగా జరిగాయన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. విశ్వబ్రాహ్మణ సమాజానికి, విశ్వబ్రాహ్మణ వర్గానికి చెందిన వారిపై దాడి చేసినందుకు పేర్ని కిట్టు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని లేకుంటే వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 19 లక్షల మంది విశ్వబ్రాహ్మణులు జగన్‌రెడ్డి పార్టీని భూస్థాపితం చేయడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

10న దుర్గగుడిలో మహాలక్ష్మీయాగం

వన్‌టౌన్, మే 3: క్రోధినామ సంవత్సరం అక్షయ తృతీయ సందర్భంగా ఈ నెల 10న శుక్రవారం దుర్గగుడి ఆధ్వర్యంలో శ్రీ మహాలక్ష్మి యాగం నిర్వహించినట్టు దేవస్థానం ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి యాగాన్ని ఆర్జిత సేవగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాగంలో పాల్గొనేందుకు దంపతులు రూ.1000 రుసుం చెల్లించాలి. ప్రసాదంగా శేషవస్త్రం, రవిక, పెద్ద లడ్డు, చక్రపొంగలి, పులిహోర ఇవ్వనున్నారు.

12న ఆదిశంకరాచార్యుల జయంతి

ఈనెల 12న జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ప్రధాన ఆలయం ఎదురుగా ఉన్న రావిచెట్టు వద్ద వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు లోక కల్యాణార్థం హిందూ ధర్మ ప్రచార నిమిత్తం నగరోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నగరోత్సవం మల్లికార్జున మహామండపం నుంచి బయలుదేరి కనకదుర్గానగర్, రథం సెంటర్, కెనాల్ రోడ్డు, వినాయకుడి గుడి, తిరిగి కెనాల్ రోడ్డు, రథం సెంటర్, దుర్గాఘాట్ రోడ్డు మీదుగా కొండపైకి చేరుకుంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఈవో కోరారు.

స్మార్త వేదపాఠశాలలో ఈవో పరిశీలన

పోరంకిలోని దుర్గగుడికి చెందిన స్మార్త వేదపాఠశాలను ఈవో రామారావు శుక్రవారం పరిశీలించారు. వేద పాఠశాలలో విద్యార్థులకు వేద విద్య, వసతులు, మరమ్మతులు, శానిటేషన్ ఏర్పాట్ల గురించి ప్రధానోపాధ్యుడు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేసవి సందర్భంగా తరగతి గదులు, రూమ్‌లలో ఏర్పాటు చేసిన కూలర్లు, ఫ్యాన్‌లు, చలువపందిళ్లు, శానిటేషన్‌ను ఈవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోర్సు పూర్తి చేసుకోబోతున్న వేదవిద్యార్థులకు ఆలయ పురాణ పండిట్ సీహెచ్ వెంకటేశ్వరశాస్త్రి క్రియా తరగతులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఈవో వేద విద్యార్థులతో ముచ్చటించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.



స్మార్త వేద పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఈవో రామారావు

అమ్మవారి ఆలయ స్వర్ణతాపడానికి విరాళం

దుర్గగుడిలోని దుర్గమ్మ ఆలయానికి స్వర్ణతాపడం పనుల నిమిత్తం హైదరాబాద్ ఓయూ కాలనీ షేక్ పేటలోని హనుమాన్ యూనైటెడ్ ప్రైవేటెడ్ లిమిటెడ్ సంస్థకు చెందిన కట్ట శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళంగా అధికారులకు చెక్కు రూపంలో అందజేశారు. ఏఈవో ఎన్ రమేష్ వారికి అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఐఏఎస్ అధికారులు

దుర్గమ్మ దర్శనార్థం శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణలు ఆలయానికి విచ్చేశారు. అధికారులు వారికి మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేయగా అధికారులు ప్రసాదం, శేషవస్త్రం, అమ్మ చిత్రపటం అందజేశారు.



ధర్మపథం వేదికపై నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన

వన్‌టౌన్, మే 3: దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై శుక్రవారం ఉమామహేశ్వర కళాక్షేత్రం వారు కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. కళాక్షేత్రం నాట్యాచార్యుడు కందికట్టు వాసుదేవరావు ఆధ్వర్యంలో ఆయన శిష్యులు హర్షిణి, తేజశ్విని, హరిప్రియ, పర్ణిక, బిందుశ్రీ, ఆకాంక్ష, శ్రీఖ, మోక్షిత, చంద్రిక, నిత్యశ్రీ, యామిని, హాసిని, చైత్ర, పళని, తులసీ, గాయత్రి, సాహితి, హర్షిణి, ప్రవల్లిక, అక్షయ, ఆశ్రిత, వీణ తదితరులు వినాయకోత్తం, నవదుర్గ స్వరూపిణీ, బ్రహ్మాంజలి, శివాష్టకం, ఆనంద తాండవం, భో శంభో, అదివో అల్లదివో తదితర గానాలకు వీనుల విందుగా కూచిపూడి నృత్యప్రదర్శనను ఇచ్చి ఆహుతులను ఆకట్టుకున్నారు.



ప్రయాణికుల వద్ద టికెట్లను తనిఖీ చేస్తున్న టికెట్ కలెక్టర్లు

టికెట్లు లేని ప్రయాణికులపై కేసులు

● రూ.7.96 కోట్లు వసూలు

రైల్వేస్టేషన్, మే 3: డివిజన్ పరిధిలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్‌లో టికెట్లు లేకుండా ప్రయాణించిన వారి నుంచి రూ.7.96కోట్లు వసూలు చేసినట్టు డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్‌లో 44,249 మందిపై టికెట్ రహిత ప్రయాణం కేసు నమోదైందన్నారు. డివిజన్ చరిత్రలో ఒక్క నెలలో నమోదైన అత్యధిక ఆదాయం ఇదేనన్నారు. టికెట్ లేని ప్రయాణాన్ని అరికట్టడానికి బోనాఫైడ్ ప్రయాణికులను సులభతరం చేయడానికి రైల్వే వాణిజ్య శాఖ అనేక టికెట్ చెకింగ్ డ్రైవ్‌లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించిందన్నారు గతంలో లేని విధంగా ఏప్రిల్‌లో ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చినందుకు డివిజనల్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు వావిలపల్లిని డీఆర్ఎం అభినందించారు. ప్రయాణికులు టికెట్లు కొని గమ్యస్థానాలకు వెళ్లాలని కోరారు. నిరంతరం తనిఖీలు, స్పెషల్ డ్రైవ్‌లుంటాయన్నారు.

నిరుద్యోగ యువత భవిష్యత్తు కోసం
చంద్రబాబు అధికారంలోకి రావాలి

● పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని ● శివనాథ్‌ను కలిసిన ఏపీ నిరుద్యోగ జేఏసీ
● అనంతపురం నుంచి ఇచ్ఛాపురం వరకు నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర



బస్సు యాత్రకు సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, మే 3: నిరుద్యోగ యువత భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి రావాలని పార్లమెంటు టీడీపీ అభ్యర్థి కేసినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు బంగారు భవిష్యత్తు అందించేందుకు తొలి సంతకం మెగా డీఎస్సీపైన చేస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులకు జగన్ చేసిన అన్యాయాలు వివరిస్తూ ఎన్డీయే కూటమి గెలుపు కోసం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అనంతపురం నుంచి ఇచ్ఛాపురం వరకు నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ యాత్రలో భాగంగా పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్ధిఖ్ శుక్రవారం కేశినేని శివనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ యాత్ర చేపట్టిన నిరుద్యోగ జేఏసీ నేతలను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ సిద్ధిఖ్ మాట్లాడుతూ లక్షల మంది నిరుద్యోగులకి జగన్ మాట ఇచ్చి మోసం చేశాడని మండిపడ్డారు. నిరుద్యోగులకి ఉద్యోగావకాశాలు కల్పించబోయే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు ఎన్డీయే అభ్యర్థుల్ని గెలిపించటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్‌ను గద్దె దింపి చంద్రబాబును ముఖ్యమంత్రిగా అసెంబ్లీకి పంపే వరకు విశ్రమించేది లేదన్నారు. జిల్లా పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు నాగుర్, టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు రాజ పాల్గొన్నారు.

నలంద విద్యార్థినికి డీజీ అప్రిసియేషన్ అవార్డు



లబ్బీపేట, మే 3: ప్రతి ఏడాది ఎన్‌సీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కేడెట్లకు అందించే డీజీ అప్రిసియేషన్ అవార్డు తమ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ 4 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కాడెట్ బుగత సంధ్యకు లభించినట్టు నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ తెలిపారు. ఇటీవల ఆగ్రాలో జరిగిన పారాజంప్ కోర్స్‌లో ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ నుంచి ముగ్గురు కేడెట్లు పాల్గొన్నారని, వారిలో సంధ్యను డీజీ అప్రిసియేషన్ అవార్డుకు ఎంపిక చేసి సికింద్రాబాద్‌లోని ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీడీజీ సికింద్రాబాద్ డైరెక్టర్ ఎయిర్ కమాండ్ వి.ఎం.రెడ్డి సమక్షంలో ఎన్‌సీసీ డీజీ లెఫ్టినెంట్ కల్నల్ గుర్బీర్పల్ సింగ్ చేతుల మీదుగా సంధ్యకు అవార్డు అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సంధ్యను గ్రూప్ కమాండర్ కల్నల్ ఎ.కె.రిషి, ఈ ఆంధ్రగర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్, ఏవో మేజర్ స్వాతిపాండే అభినందించారు. అలాగే నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

జగన్‌కు అన్నం పెడితే సున్నం రాశారు..!

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మే 3: గత ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పాదయాత్ర చేసినన్ని రోజులూ భోజనాల ఖర్చు దాదాపు రూ.6 కోట్ల వరకు ఖర్చు పెట్టానని, కానీ ఆయన తనకు సున్నం రాశారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు విమర్శించారు. వైసీపీ తనను ఫైనాన్సియర్‌గా వాడుకుని వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. యార్లగడ్డ వెంకట్రావు ఎన్నికల ప్రచారం మండలంలోని తెంపల్లి, బల్లిపర్రు గ్రామాల్లో శుక్రవారం జోరుగా సాగింది. మహిళలు అడుగడుగునా హారతులు పట్టారు. ట్రాక్టర్లు, జేసీబీలు, బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వైసీపీలో ఉన్నప్పుడు తాను ఎన్నో అవమానాలు పడ్డానని టీడీపీలో చేరాక భావోద్వేగానికి గురవుతున్నానన్నారు. తనకోసం గుండెలపై 40మంది తన ఫొటోను పచ్చబొట్టుగా వేయించుకున్నారని వాళ్లతో పాటు తనను అభిమానించే ఎంతోమంది కోసం టీడీపీలో చేరి పోటీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని జగన్ విధ్వంసం చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి జరుగుతాయన్నారు. మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీకి వెళితేనే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏమీ చేయలేదన్నారు. అవినీతి మచ్చలేని యార్లగడ్డను, ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాశౌరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ సర్పంచ్ నిమ్మకూరి విజయ్‌కుమార్‌ను పరామర్శించారు. బాలశౌరి తనయుడు వల్లభనేని అరుణ్ శౌరి, టీడీపీ మండలాధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు కార్యదర్శి బోడపాటి రవి, ఎంపీటీసీ సభ్యురాలు జొన్నలగడ్డ రంగమ్మ, నిమ్మకూరి మధు, జొన్నలగడ్డ సుధాకర్, చిట్టూరి, గోపి, వీర్ల రాంబాబు, వాసా మార్కు, నిమ్మకూరి లెనిన్, మందపాటి వెంకటేష్, అశోక్, రవి, చిట్టూరి చిన్ని, షేక్ మస్తాన్‌వలి, కొలుసు దేవరబాబు, ఆంజనేయులు, నడ్డి శివనాగరాజు, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.



తెంపల్లిలో ప్రచారం చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

టీడీపీకి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మద్దతు



బొండాకు మద్దతు ప్రకటించిన కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు

గవర్నర్‌పేట, మే 3: వైద్యరంగానికి కేంద్రంగా ఉన్న సూర్యారావుపేటలోని రిటైల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ టీడీపీకి మద్దతు ప్రకటించింది. 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో శనివారం అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు డీవీఆర్ సాయికుమార్‌తో పాటు సంఘ సభ్యులు జనసేన, బీజేపీ బలపర్చిన టీ డీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావును కలిసి మద్దతు తెలిపారు. 400 మందికి పైగా సభ్యులను కలిగి ఉన్న అసోసియేషన్ టీడీపీకి మద్దతు ప్రకటించడంతో శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. బొండా ఉమాను కలిసిన అసోసియేషన్ నేతలు అయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. బొండా విజయానికి కృషి చేస్తామన్నారు. జనరల్ సెక్రటరీ ఎం.సుధాకర్, సభ్యులు పవన్, పేర్ల రవి, శివరాజ్, వెంకటేశ్వరరావు, హరికృష్ణ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ప్రసాద్, పిచ్చయ్య ఉన్నారు.

రోహిత్ వేముల కేసులో నిందితులకు క్లీన్‌చిట్

▸ రోహిత్ దళితుడు కాదని పోలీసుల నివేదిక

హైదరాబాద్, రాయదుర్గం, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని.. పోలీసులు హైకోర్టుకు మార్చి 21న ఇచ్చిన ఈ కేసు క్లోజర్ రిపోర్టులో పేర్కొన్నారు. రోహిత్ ఎస్సీ కాదని.. అతడు, అతడి కుటుంబసభ్యులు బీసీ-ఏ (వడ్డెర) కులానికి చెందినవారని.. వారు మోసపూరిత విధానాల్లో ఎస్సీ సర్టిఫికెట్లు పొందారని.. జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ తేల్చినట్లు అందులో వెల్లడించారు. తన కులధ్రువీకరణ పత్రం సరైనది కాదనే విషయం బయటకు తెలిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే భావనతోనే అతడు ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న బీజేపీ, ఏబీవీపీ నేతలకు, హెచ్‌సీయూ నాటి వీసీ అప్పారావుకు అతడి ఆత్మహత్యతో సంబంధం లేదని క్లీన్‌చిట్ ఇచ్చారు. హెచ్‌సీయూలో 2015లో.. ఏబీవీపీ, అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో.. ఆ వర్సిటీ కుల రాజకీయాలకు, జాతివ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందంటూ నాటి కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీకి లేఖ రాశారు. ఆ ఏడాది నవంబరులో వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సిఫారసుతో.. ఐదుగురు విద్యార్థులపై వీసీ అప్పారావు బహిష్కరణ వేటు వేశారు. దరిమిలా 2016 జనవరి 17న రోహిత్ వేముల.. న్యూరిసెర్చ్ స్కాలర్ హాస్టల్ రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించాడు. దీంతో.. వీసీ అప్పారావు, బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, ఏబీవీపీ నాయకుల వేధింపుల వల్లే రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడని విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. వారి ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు వీసీ అప్పారావు, ఎన్ రామచంద్రరావు, ఏబీవీపీ నాయకులు, తదితరులపై ఐపీసీ 306, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధకచట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే, రోహిత్ ఆత్మహత్య వ్యవహారంతో తమకు ఏ సంబంధమూ లేదని.. ఈ కేసులు కొట్టేయాలని విజ్ఞప్తి చేస్తూ వారంతా హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పోలీసుల క్లోజర్ రిపోర్టు ప్రకారం.. రోహిత్ ఆత్మహత్యతో వారికి సంబంధం లేదని పేర్కొంటూ విచారణను ముగిస్తున్నట్లు వెల్లడించింది.

రాష్ట్రంలో 6, 8 తేదీల్లో మోదీ పర్యటన

▸ మూడు సభలు... బెజవాడలో ర్యాలీ: ఎన్డీఏ నేతలు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 6, 8 తేదీల్లో రాష్ట్రానికి వస్తున్నారని ఎన్డీఏ నేతలు తెలిపారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అశోక్ బాబు(టీడీపీ), లంకా దినకర్(బీజేపీ), గౌతమ్(జనసేన) విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆరో తేదీన మోదీ రాజమహేంద్రవరం చేరుకుని ఎన్డీఏ సభలో చంద్రబాబు, పవన్, పురందేశ్వరితో కలసి ప్రసంగిస్తారు. అదే రోజు సాయంత్రం అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని కశింకోటలో జరిగే సభలో బాబు, పవన్, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌తో కలసి పాల్గొంటారు. ఈ నెల 8న మధ్యాహ్నం తిరుపతికి చేరుకుని పీలేరు అసెంబ్లీ పరిధిలోని కలికిరి సభలో టీడీపీ, జనసేన అధ్యక్షులతోపాటు మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డితో కలసి ఓటర్లను ఎన్డీఏ అభ్యర్థుల్ని గెలిపించాల్సిందిగా అభ్యర్థిస్తారు. అదే రోజు సాయంత్రం ఐదింటికి కూటమి నేతలతో కలసి విజయవాడ ఐజీఎం స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకూ ర్యాలీలో పాల్గొంటారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

▸ అన్ని ప్రాంతాల రైతులను ఆదుకుంటాం: కూటమి నేతలు

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. కేంద్రం సహకారంతో పోలవరాన్ని పూర్తి చేసి, ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తాం. అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించి, రైతుల్ని ఆదుకుంటాం' అని కూటమి నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు(టీడీపీ), బీజేపీ నేత పాకా సత్యనారాయణ, జనసేన పార్టీ నేత గౌతమ్ మీడియాతో మాట్లాడారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలోకి మరో ఇద్దరు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కమిటీలో మరో ఇద్దరికి స్థానం లభించింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వీఆర్ శ్రీలక్ష్మి రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. పర్చూరు నియోజకవర్గానికి చెందిన కారుమంచి వెంకట కృష్ణారావును రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదు: కనకమేడల

న్యూఢిల్లీ, మే 3(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం రూపొందించిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదు' అని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం, ఇక్కడ తన అధికారిక నివాసంలో విలేకరుల సమావేశంలో కనకమేడల మాట్లాడుతూ.. 'వైసీపీ నేతలు కబ్జా చేసిన ఎన్‌ఆర్‌ఐ ఆస్తులను అధికారికంగా సొంతం చేసుకోవడానికి ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తేవాలని చూస్తోంది. ప్రజలు గమనించాలి' అన్నారు.

158 ట్యూటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో కొత్తగా ప్రారంభించిన ఐదు మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 158 ట్యూటర్ పోస్టుల భర్తీకి ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆమోదించింది. దీంతో ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ నెల 4 నుంచి 15లోగా దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని, మరిన్ని వివరాల కోసం డీఎంఈ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రక్తహీనత పరీక్షలు వేగవంతం

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత పరీక్షలను వేగవంతం చేయాలని ఆరోగ్యశాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనం నుంచి జిల్లా వైద్యాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వడగాలుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్ పద్మావతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమాంతం పెరిగిన విద్యుత్తు డిమాండ్

▸ గతేడాది 183.185.. ఇప్పుడు 256.677 ఎంయూ

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు డిమాండ్ అమాంతం ఎగబాకింది. ఇప్పటిదాకా 253 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా, గురువారం ఏకంగా 256.677 మిలియన్ యూనిట్లను తాకింది. తగ ఏడాది మే రెండో తేదీన విద్యుత్తు డిమాండ్ 183.185 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉంది. థర్మల్ విద్యుత్తు సంస్థలలో సగటున మూడు రోజులకు సరిపడా బొగ్గు నిల్వలున్నాయి.

జస్టిస్ రామలింగేశ్వరరావుకు హైకోర్టు ఘన నివాళి

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావుకు శుక్రవారం హైకోర్టు ఘన నివాళులర్పించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో ఇతర న్యాయమూర్తులు మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. జస్టిస్ రామలింగేశ్వరరావు అందించిన న్యాయసేవలను అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం వివరించారు. జస్టిస్ రామలింగేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు.

'గృహ హింస' సెక్షన్లలో మార్పులు

▸ శాసనవ్యవస్థకు, పోలీసులకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ, మే 3: భారత శిక్షా స్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ 498 ఏ (గృహహింస) దుర్వినియోగం అవుతున్న తీరుపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసుల్లో యాంత్రికంగా వ్యవహరించవద్దని పోలీసులకు.. ఐపీసీ స్థానంలో కొత్తగా తీసుకొస్తున్న భారతీయ న్యాయసంహితలో గృహహింసకు సంబంధించిన సెక్షన్ 85, 86లో తగిన మార్పులు చేయాలని శాసనవ్యవస్థ (లెజిస్లేచర్)కు సూచించింది. అలాగే.. దృఢమైన దాంపత్య బంధానికి సహనమే పునాది అని, గోరంత విషయాలను కొండంతలుగా చేసి చూడొద్దని, కాపురాలను కూల్చుకోవద్దని సూచిస్తూ.. తమ ముందుకు వచ్చిన ఓ వరకట్న వేధింపుల కేసును జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం కొట్టేసింది.



ఆకాశంలో డేగ కన్ను..

తొలి స్వదేశీ బాంబర్ యూఏవీ ఆవిష్కరణ

బెంగళూరు, మే 3: భారత్‌కు చెందిన రక్షణ, ఏరోస్పేస్ కంపెనీ ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ టెక్నాలజీస్.. కీలక మైలురాయిని సాధించింది. భారత్‌లో తొలిసారిగా రూపొందించిన స్వదేశీ బాంబర్ మానవరహిత వైమానిక వాహనం (యూఏవీ) ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్-200బీని బెంగళూరు వేదికగా శుక్రవారం ఆవిష్కరించింది. 'భారతదేశ డేగ కన్ను'గా భావిస్తున్న ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ (ఎఫ్‌డబ్ల్యూడీ)-200బీ అనేది 'మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (మేల్) మానవ రహిత యుద్ధ విమానం. 100 కిలోల పేలోడ్ సామర్థ్యం కలిగిన యూఏవీ... ఆప్టికల్ సర్వేలెన్స్ పేలోడ్లతోపాటు వైమానిక ఆయుధాలను కూడా మోసుకెళ్లగలదని ఆ సంస్థ తెలిపింది. బెంగళూరులో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ వ్యవస్థాపకుడు సుహాస్ తేజస్కంద మాట్లాడుతూ.. డీఆర్‌డీవో వంటి సంస్థలు ఈ తరహా యూఏవీని తయారు చేయాలని ప్రయత్నం చేసి విఫలమయ్యాయని చెప్పారు. దేశీయంగా యూఏవీని తయారు చేయాలనే భారత చిరకాల స్వప్నాన్ని ఎఫ్‌డబ్ల్యూడీ-200బీ సాకారం చేసిందని అన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న యూఎస్ ప్రిడేటర్ డ్రోన్ ఖరీదు రూ.250 కోట్లు కాగా, ఎఫ్‌డబ్ల్యూడీ-200బీ కేవలం రూ.25 కోట్లకే లభిస్తుందని తెలిపారు. ఈ యూఏవీ గరిష్ఠ వేగం గంటకు 370 కిలోమీటర్లు. ఇది ఒకసారి గాల్లోకి ఎగిరితే 12 నుంచి 20 గంటల వరకు ప్రయాణించగలదు.



విరిగిన చేతిని చూపుతున్న షేక్‌నసీమా, మీర్జావలి చేతికి అయిన గాయం

టీడీపీ మైనారిటీ నేత ఇంటిపై వంశీ అనుచరుల దాడి

▸ ఆయన కుమారుడు, మనుమరాలికి తీవ్ర గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్, మే 3: కృష్ణాజిల్లాలో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. టీడీపీ మైనారిటీ నేత ఇంటిపై దాడిచేసి ఆయన కుమారుడు, 16ఏళ్ల మనవరాలిని తీవ్రంగా గాయపరిచారు. బాపులపాడు మండలం కొత్త మల్లవల్లిలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. కొత్త మల్లవల్లికి చెందిన షేక్‌జాన్ బాషా, ఆయన కుమారుడు మీర్జావలి టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. కొత్త మల్లవల్లి చెంతనే ఉన్న మీర్జాపురానికి గురువారం నూజివీడు టీడీపీ అభ్యర్థి పార్థసారథి వచ్చారు. ఆయన్ను కలిసేందుకు మీర్జావలి వెళ్లారు. అక్కడే అలీ అనే వైసీపీ కార్యకర్త ఉండటంతో.. అలీ గన్నవరంలో వైసీపీకి, నూజివీడులో టీడీపీకి పనిచేస్తున్నారని సారథికి మీర్జావలి ఫిర్యాదు చేశారు. ఇది మనసులో పెట్టుకుని గురువారం రాత్రి కొత్తమల్లవల్లిలో గన్నవరం వైసీపీ అభ్యర్థి వంశీతోపాటు ప్రచారానికి వచ్చిన అలీ, వైసీపీ కార్యకర్తలు మీర్జావలి కుటుంబంతో ఘర్షణకు దిగారు. మీర్జావలి, ఆయన తండ్రి షేక్ జాన్ బాషా, ఇతర కుటుంబసభ్యులపై కర్రలతో దాడి చేశారు. మీర్జావలిపై బీరు సీసాతో దాడి చేయగా చేతికి గాయమై నరం కోసుకుపోయింది. ఈ గొడవను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న షేక్ జాన్ బాషా మనవరాలు నసీమాపైనా కర్రతో దాడి చేయడం తో ఆమె చెయ్యి విరిగింది. పోలీసులు రాకతో అల్లరిమూకలు చెల్లాచెదురయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గోవాపై బీజేపీ, కాంగ్రెస్ ధీమా!

▸ ప్రధాని మోదీ కరిష్మాపైనే బీజేపీ ఆశలు

▸ ప్రభుత్వ వ్యతిరేకతే కూటమి ప్రచారాస్త్రం

పనాజీ, మే 3: మూడో విడతలో భాగంగా గోవాలోని రెండు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి ఇక్కడ ప్రధాని మోదీ కరిష్మాతో గెలుపొందాలని బీజేపీ భావిస్తుండగా.. ఉపాధి కల్పన, అవినీతి రహిత పాలన అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ తన ప్రచారాస్త్రాలుగా ఎంచుకుంది. ఉత్తర, దక్షిణ గోవా ఎంపీ స్థానాలకు ఈ నెల 7న ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తర గోవా నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఐదుసార్లు ఎంపీ, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్.. కాంగ్రెస్ అభ్యర్థి రమాకాంత్ ఖలాప్‌తో పోటీపడుతున్నారు. ఇక దక్షిణ గోవాలో బీజేపీ మహిళా అభ్యర్థి, వ్యాపారవేత్త పల్లవి డెంపో, కాంగ్రెస్ అభ్యర్థి విరియాతో ఫెర్నాండెజ్‌తో తలపడనున్నారు. ఈ ఎన్నికలపై బీజేపీ గోవా అధికార ప్రతినిధి యతీశ్ నాయక్ మాట్లాడుతూ.. "ప్రజలు స్థిరత్వం కోరుకుంటున్నారు. వారికి కిచిడీ (బహుళ పార్టీల) ప్రభుత్వం అక్కర్లేదు' అని అన్నారు. వచ్చే ఐదేళ్ల పాటు దేశాన్ని ఎవరు పాలించాలనేది ప్రజలు ఓటేసే ముందు ఆలోచించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి బలమైన నాయకత్వాన్ని అందించారని, ప్రపంచ నాయకుడిగా ఎదిగారని అన్నారు. బీజేపీ పాలనలో జనం అభివృద్ధిని చూశారని నాయక్ అన్నారు. గోవాలోని రెండు స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకుంటుందని, దేశవ్యాప్తంగా 400 ఎంపీ స్థానాల మార్కుని దాటుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాగా, ప్రస్తుత అధికార పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఇండియా కూటమిలో భాగమైన గోవా ఫార్వర్డ్ పార్టీ (జీఎఫ్‌పీ) ప్రధాన కార్యదర్శి దుర్గాదాస్ కామత్ అన్నారు. 'రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది.. అలాగే మైనింగ్ సమస్యను పరిష్కరించడంలోనూ, గోవా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది' అని కామత్ విమర్శించారు. ఈ ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోవాల్సిన బాధ్యత ఇండియా కూటమిపై ఉందన్నారు. ఈ నెల 7న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి చెందిన ఇద్దరు అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థుల ప్రచారానికి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సభలకు హాజరవుతున్నారని కామత్ చెప్పారు. 2019 ఎన్నికల్లో ఉత్తర గోవాలో సిట్టింగ్ ఎంపీ నాయక్ 2.44 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందగా.. దక్షిణ గోవాలో బీజేపీ అభ్యర్థి నరేంద్ర సవైకర్ 9,755 ఓట్ల స్వల్ప మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి ఫ్రాన్సిస్కోపై విజయం సాధించారు.



బొగ్గు తరలింపునకు అవరోధాలు వద్దు

▸ గంగవరం నిర్వాసిత కార్మికులకు హైకోర్టు సూచన

▸ సమస్య పరిష్కారానికి చర్చలు కొనసాగించండి

▸ పోర్టు యాజమాన్యానికి ఆదేశాలు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): నిర్వాసిత కార్మికులతో చర్చల ప్రక్రియను కొనసాగించాలని అదానీ గంగవరం పోర్టు యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. పోర్టులోని బొగ్గు, ఇనుప ఖనిజం, లైమ్‌స్టోన్, ఇతర సరుకులను బయటకు తరలించేందుకు ఎలాంటి అవరోధాలూ కల్పించవద్దని నిర్వాసిత కార్మికులకు సూచించింది. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా రక్షణ కల్పించాలని విశాఖ పోలీసుకమిషనర్‌ను ఆదేశించింది. నిర్వాసిత కార్మికులతో చర్చల పురోగతి పై అఫిడవిట్ సమర్పించాలని పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించింది. విచారణను జూన్ 24కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. నిర్వాసిత కార్మికుల సమ్మె నేపథ్యంలో అదానీ గంగవరం పోర్టు నుంచి విశాఖస్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరాలో ఎలాంటి అవరోధాలు లేకుండా చర్యలు తీసుకొనేలా విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని కోరుతూ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.వెంకట దుర్గాప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం వివాద పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం, పోలీసు కమిషనర్ సమక్షంలో నిర్వాసిత కార్మికులతో చర్చలు జరపాలని గంగవరం అదానీ పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా అదానీ గంగవరం పోర్టు తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. శాంతి భద్రతల సమస్య కారణంగా చూపి రాష్ట్ర ప్రభుత్వం సమస్య నుంచి దూరంగా జరగడానికి వీల్లేదన్నారు. సమ్మె సమయంలో కార్మికులు పోర్టు ఆవరణలో నిరసనకు దిగడానికి వీల్లేదని పేర్కొన్నారు. అందుకు సంబంధించి పలుతీర్పులను కోర్టు ముందు ఉంచారు. నిర్వాసిత కార్మికుల డిమాండ్ల పై చర్చించే ముందు వారు సమ్మెను విరమించాలని, పోర్టులో కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) సిసుమన్ వాదనలు వినిపిస్తూ.. లేబర్ కమిషనర్ వద్ద నిర్వాసిత కార్మికులతో చర్చల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అయితే నిర్వాసిత కార్మికుల తరఫున పోర్టు కార్యకలాపాలతో సంబంధంలేని వ్యక్తి చర్చలకు హాజరుకావడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోర్టు యాజమాన్యం గురువారం చర్చల ప్రక్రియలో పాల్గొనలేదని తెలిపారు. పోర్టులో సాధారణ పరిస్థితులు ఏర్పడిన తరువాత మాత్రమే నిర్వాసిత కార్మికుల డిమాండ్ల పై చర్చిస్తామని యాజమాన్యం లేబర్ కమిషనర్ ముందు చెప్పిందన్నారు. ఆర్ఐఎన్ఎల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. స్టీల్ ప్లాంట్ అవసరాల కోసం ప్రతి రోజూ 12వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరమని తెలిపారు. సుమారు రూ.500కోట్ల విలువ చేసే 2.32 లక్షల మెట్రిక్ టన్నుల ఆర్ఐఎన్ఎల్‌కు చెందిన బొగ్గు అదానీ గంగవరం పోర్టు స్టాక్ యార్డ్‌లో ఉండిపోయిందని పేర్కొన్నారు. పోర్టు నుంచి స్టీల్ ప్లాంట్‌కు కన్వేయర్ బెల్ట్ ఉందని, దీని ద్వారా బొగ్గు సరఫరా కాకుంటే స్టీల్ ప్లాంట్ మూతపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి.. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని అభిప్రాయపడ్డారు. చర్చల ప్రక్రియను కొనసాగించాలని అదానీ గంగవరం పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించారు.

ఆస్ట్రాజెనెకా, సీరమ్‌పై కేసు వేస్తాం

▸ టీకా మరణాలకు కారణమైన అందరిపైనా న్యాయపోరాటం చేస్తాం

▸ కొవిషీల్డ్ టీకా కారణంగా కుమార్తెను కోల్పోయిన ఓ తండ్రి ఆవేదన



న్యూఢిల్లీ, మే 3: కొవిషీల్డ్ టీకా వేయించుకున్న కొంత కాలానికే తన కుమార్తెను పోగొట్టుకున్న ఓ తండ్రి.. ఆ టీకాతో దుష్ప్రభావాలున్నాయంటూ ఆస్ట్రాజెనెకా అంగీకరించిన నేపథ్యంలో ఆ కంపెనీపైన, సీరం సంస్థపైన కోర్టులో కేసు వేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన పేరు వేణుగోపాలన్ గోవిందన్. ఆయన కుమార్తె కారుణ్య వేణుగోపాల్ డేటా సైన్స్ విద్యార్థి. 2021 జూన్‌లో ఆమె కొవిషీల్డ్ టీకా తీసుకుంది. టీకా తీసుకున్న ఎనిమిది రోజులకు ఆమె అనారోగ్యం బారిన పడింది. శరీరంలోని పలు అవయవాలు ఇన్‌ఫ్లమేషన్ (వాపునకు) గురయ్యాయి. దాదాపు నెలరోజుల తర్వాత 2021 జూలైలో ఆమె మరణించింది. చనిపోయేనాటికి ఆమె వయసు కేవలం 20 ఏళ్లు. ఉన్న ఆమె తమ మొదటి వివాహ వార్షికోత్సవం సందర్భంగా దేవుడు తమకు కానుకగా అందించిన కారుణ్యను అల్లారుముద్దుగా పెంచుకున్నామని.. టీకా తీసుకోకముందు ఆమెకు ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేవని, పూర్తి ఆరోగ్యంతో ఉండేదని.. కేవలం వ్యాక్సిన్ కారణంగా ఆమెను కోల్పోయామని వేణుగోపాలన్ గోవిందన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన టీకా కార్యక్రమాల విభాగం కారుణ్య మరణంపై విచారణ జరిపి 2021 నవంబరులో ఒక నివేదిక ఇచ్చింది. దాంట్లో ఆమె కారుణ్య మరణాన్ని 'బీ1' కేటగిరీలో చేర్చింది. అంటే.. ఆమె మరణానికి టీకానే కారణమన డానికి తగిన ఆధారాలు లేవని అర్థం. దీంతో గోవిందన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తె మరణానికి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని.. టీకా దుష్ప్రభావాలను ముందుగానే గుర్తించి, తక్షణం చికిత్స చేసేలా ఒక ప్రొటోకాల్ రూపొందించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంను కోరారు. ఈ కేసు విచారణలో భాగంగా 2022 నవంబరులో కేంద్ర ప్రభుత్వం.. కొవిడ్ టీకా కారణంగా సంభవించే మరణాలకు పరిహారం ఇచ్చే బాధ్యత తమది కాదని సుప్రీం కోర్టుకు తేల్చిచెప్పింది. తాజాగా.. ఈ టీకా దుష్ప్రభావాలపై ఆస్ట్రాజెనెకా ప్రకటన నేపథ్యంలో కారుణ్య తల్లిదండ్రులు మళ్లీ కోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నారు. దీనిపై గోవిందన్ 'ఎకనమిక్ టైమ్స్ వార్తా సంస్థ'కు ఒక వ్యాసం రాశారు. కొవిషీల్డ్ టీకాను మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చిన రెండునెలల్లోపే.. అంటే, 2021 మార్చిలోనే యూరప్‌లోని 15 దేశాలు ఈ టీకా వల్ల కలిగే దుష్ప్రభావాలను గుర్తించి.. ప్రజలకు ఇవ్వడం నిలిపివేశాయని గుర్తుచేశారు. యూరప్ దేశాల్లో ఈ టీకా వేయడాన్ని ఆపేసిన విషయం తెలిసీ దాన్ని మనదేశంలో ఎందుకు నిలిపివేయలేదని ప్రభుత్వాన్ని, సీరమ్ సంస్థను ప్రశ్నించారు. న్యాయం కోసం.. ప్రజారోగ్యం పేరిట ఇలాంటి దారుణాలు మళ్లీ చేయకుండా ఉండడం కోసం.. ఎంతోమంది మరణాలకు కారణమైనవారందరిపైనా తమలాగానే ఈ టీకా కారణంగా పిల్లలను కోల్పోయిన మరో ఏడు కుటుంబాలతో కలిసి ఈ పోరాటం సాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ప్రాణం తీసిన 'నాటకం'

▸ రాక్షస పాత్రధారుడి గొంతు కోసిన కాళీమాత పాత్రధారి

▸ 11 ఏళ్ల బాలుడి మృతి.. 14 ఏళ్ల బాలుడి అరెస్ట్.. యూపీలో ఘటన

కాన్పూర్, మే 3: ఓ నాటకంలో కాళీమాత పాత్రలో నటించిన ఓ బాలుడు(14), రాక్షసుడి పాత్రలో నటించిన మరో బాలుడి(11) గొంతును కత్తితో కోశాడు. దీంతో 11 ఏళ్ల బాలుడు ప్రాణాలను కోల్పోయాడు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగింది. బంభియాన్‌పూర్ గ్రామానికి చెందిన సుభాశ్ సైనీ నివాసంలో బుధవారం 'భగవత్ కథ' నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో కొంతమంది పిల్లలు వివిధ పాత్రలను పోషించారు. ఈ క్రమంలోనే కాళీమాత పాత్రలో నటించిన బాలుడు, రాక్షస పాత్రలో నటించిన మరో బాలుడి మెడను కత్తితో కోశాడు. తీవ్ర గాయమైన సదరు బాలుణ్ని(11) స్థానిక ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు అతడు మృతిచెందినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మరో ఆస్పత్రికి తరలించారు. నిందితుడైన 14 ఏళ్ల బాలుణ్ని అదుపులోకి తీసుకున్నారు. అతణ్ని జువెనైల్ కోర్టులో హాజరు పరిచి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. కాగా కాళీమాత వేషం వేసిన బాలుడు త్రిశూలంతో నటించాల్సి ఉండగా.. ఆ సమయంలో అది దొరక్కపోవడంతో పదునైన కత్తిని తీసుకున్నట్లు స్థానికులు వెల్లడించారు.

హేమంత్ సోరెన్‌కు హైకోర్టులో నిరాశ

▸ ఈడీ కేసు కొట్టివేతకు నిరాకరణ



రాంచీ, మే 3: ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు శుక్రవారం హైకోర్టులో నిరాశ ఎదురయింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఈడీ తనపై పెట్టిన కేసును కొట్టివేయాలంటూ ఆయన చేసిన వినతిని తిరస్కరించింది. ఏడు గంటల పాటు విచారించిన అనంతరం ఈడీ ఆయనను జనవరి 31న అరెస్టు చేసింది. ఈ కేసును కొట్టివేయాలంటూ తాను చేసిన వినతిపై హైకోర్టు తీర్పు ఇవ్వడం లేదంటూ ఆయన గత నెలలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించడం గమనార్హం. తాజాగా హైకోర్టు నిర్ణయాన్ని వెలువరిస్తూ కేసు కొట్టివేతకు నిరాకరించింది

'గులకరాయి'ని రాజకీయ లబ్ధికి వాడుకుంటున్నారు

▸ విజయవాడ కోర్టులో పిటిషన్ దాఖలు

▸ జగన్, సజ్జల, కొడాలి, పేర్నికి నోటీసుల జారీకి ఆదేశాలు

విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి ఘటనను వైసీపీ నేతలు రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన న్యాయవాది నాగేశ్వరరావు విజయవాడలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రచారంలో ఈ ఘటన గురించి మాట్లాడకుండా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నానిని ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై కోర్టు స్పందించింది. ఈ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అన్న దానిపై వాదనలు జరిగిన అనంతరం, ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ.. విచారణను జూన్ 28వ తేదీకి వాయిదా వేసింది. కాగా, సీఎం జగన్‌పై గడచిన నెల 13వ తేదీన రాయి దాడి జరిగిన విషయం తెలిసిందే.

వరదాపురం సూరికి పాస్‌పోర్టు ఇవ్వండి

▸ ఆదేశాలిచ్చిన ప్రత్యేక కోర్టు

విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూరి అలియాస్ వరదాపురం సూరికి పాస్‌పోర్టు జారీ చేయాలని విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు శుక్రవారం ఆదేశాలు ఇచ్చింది. గత నెల 4వ తేదీన సూరి పాస్‌పోర్టు పోయిందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే సమయంలో తనకు డూప్లికేట్ పాస్‌పోర్టు ఇప్పించాలని పాస్‌పోర్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాప్రతినిధుల కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నందున తాము పాస్‌పోర్టు ఇవ్వలేమని అధికారులు సమాధానం ఇచ్చారు. దీనిపై సూరి తరఫున న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సూరి కుమారుడికి విదేశాల్లోని విద్యాసంస్థల్లో అడ్మిషన్ ఉందని, అందుకోసం ఆయన అక్కడికి వెళ్లాల్సి ఉన్నందున పాస్‌పోర్టు ఇప్పించాలని వాదించారు. దీంతో ఏకీభవించిన కోర్టు వరదాపురం సూరికి పాస్‌పోర్టు జారీ చేయాలని పాస్‌పోర్టు అధికారులను ఆదేశించింది.



విశాఖ తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఇంటి వద్ద ఎన్నికల నిఘా బృందాలు, పోలీసులు

ఎంపీ ఎంవీవీ ఇంటిపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మిక దాడి

▸ కొనసాగుతున్న సోదాలు

పెదవాల్తేర్ (విశాఖపట్నం), మే 3: విశాఖపట్నం ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఇంటిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఫ్లయింగ్ బృందాలు శుక్రవారం రాత్రి దాడి చేశాయి. రాత్రి 7.40 గంటలకు ఒక బృందం లాసన్స్ బే కాలనీలోని ఎంవీవీ ఇంటికి వచ్చింది. మరో బృందం ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎంపీ ఎంవీవీ వద్దకు వెళ్లి తొమ్మిది గంటల సమయంలో ఇంటికి తీసుకొని వచ్చింది. ఆ తరువాత 9.40 గంటలకు ఇంకో బృందం అక్కడికి చేరుకుంది. మొత్తం మూడు బృందాలు, పోలీసులతో కలసి సుమారు 25 మంది సోదాలు చేస్తున్నారు. ఎంవీవీ ఇంట్లోకి బయటవారిని ఎవరినీ అనుమతించకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సోదాలు చేస్తున్న సమయంలో ఎంవీవీ సన్నిహితుడు, వైసీపీ నేత జీవీ కూడా ఉన్నట్టు చెబుతున్నారు. ఎంవీవీ భవనం నాలుగు అంతస్థుల్లో ఉంది. ఇందులో రెండు అంతస్థుల్లో ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న బృందాలు, అక్కడ ఉన్న వ్యక్తులను ప్రశ్నించినట్టు తెలిసింది. అర్ధరాత్రి దాటిన తరువాత కూడా సోదాలు కొనసాగుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఏపీలోని ఆ ఐదు గ్రామాలు రాష్ట్రంలోకి

▸ ఐటీఐఆర్ పునఃప్రారంభం

▸ విభజన హామీల అమలు... తెలంగాణకు కాంగ్రెస్ ప్రత్యేక మేనిఫెస్టో

హైదరాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఏపీలో భాగమైన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయడం, ఐటీఐఆర్ ప్రాజెక్టు పునఃప్రారంభం, ఐదు ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటు, విభజన హామీల అమలు, విద్యా సంస్థల ప్రారంభం, మేడారం జాతరకు జాతీయ హోదా తదితర 23 హామీలతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమైంది. ఐదు న్యాయాలు, తెలంగాణకు ప్రత్యేక హామీల పేరిట పార్లమెంట్ ఎన్నికలకు రాష్ట్రం కోసం ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోను శుక్రవారం విడుదల చేసింది. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారు.

తెలంగాణకు ఇచ్చిన ప్రత్యేక హామీలు ఇవే

1) హైదరాబాద్ మహా నగరానికి కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్మెంట్ రీజియన్ (ఐటీఐఆర్) ప్రాజెక్ట్ పునఃప్రారంభం

2) ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారం, హైదరాబాద్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం), హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి పక్క నుంచి రాపిడ్ (వేగవంతమైన) రైల్వే వ్యవస్థ, మైనింగ్ వర్సిటీల ఏర్పాటు

3) హైదరాబాద్- బెంగళూరు ఐటీ మరియు ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్ - నాగపూర్, హైదరాబాద్ వరంగల్, హైదరాబాద్ - నల్గొండ - మిర్యాలగూడ, సింగరేణి ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటు

4) ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం- 2014 ప్రకారం ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామాలు.. ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నెగూడెం, పిచుకలపాడును తిరిగి తెలంగాణలో విలీనం చేయడం. భద్రాచలం ఆలయ అభివృద్ధి కోసమే ఈ విలీనం.

5) పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా

6) హైదరాబాద్‌లో నీతి ఆయోగ్ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 4 మే 2024



రెస్ట్రిక్షన్ ఫీచర్!

వాట్సాప్‌లో తాత్కాలికంగా ఉపయోగపడేందుకు వీలుగా రెస్ట్రిక్షన్ ఫీచర్‌పై పనిచేస్తున్నట్టు సమాచారం. సెండర్స్ పంపే మెసేజ్‌లపై పరిమితి విధిస్తుంది. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న ఈ ఫీచర్ ఉనికిలోకి వస్తేనే దాని అసలు ప్రయోజనం వెల్లడి అవుతుంది. డబ్ల్యుఏబేటా ఇన్ఫో ప్రకారం కొత్త సంభాషణలను మొదలుపెట్టడం, మెసేజ్‌లు పంపడంపై ఆంక్షలు ఉంటాయి. ఇది అమలులోకి వస్తే కొన్ని ఉల్లంఘనలకు శిక్ష కింద నిర్దేశిత సమయం చాట్ చేయకుండా నిరోధిస్తుంది. కొందరు యూజర్లు దుర్భాషలు ఆడటం, ప్రదర్శించే అనుచిత ధోరణి కట్టడికి ఇది పనికొస్తుందని సమాచారం. సాధారణ వినియోగానికి విరుద్ధంగా ఉంటే ఈ ఆంక్షలను విధిస్తుంది. ఇందుకోసం ఆటోమేటిక్ డిటెక్షన్‌ను చేపడుతుంది. అనుచితంగా ప్రవర్తించే యూజర్ల అకౌంట్లపై నిషేధానికి ప్రత్యామ్నాయంగా ఈ ఫీచర్‌ను తీసుకువచ్చే యత్నంలో వాట్సాప్ ఉంది.



వీడియో షేరింగ్‌కు బగ్‌తో ఆటంకం

వాట్సాప్ ఆండ్రాయిడ్ వెర్షన్‌లో ఇటీవల ఏర్పడిన బగ్‌తో వీడియో ఫైల్స్‌ను పంపడం కుదరటం లేదు. రెడిట్‌లో ఫిర్యాదులతో ఈ బగ్ వెలుగుచూసింది. ఒక్క వీడియోల విషయంలో ఈ ఇబ్బంది తలెత్తుతోందని, ఫొటోలు వంటి ఇతర ఫైల్స్ బాగానే ఉన్నాయని '9టు5 గూగుల్' పేర్కొంది. వాట్సాప్ మెసెంజర్‌లో అప్‌లోడ్ ప్రక్రియలో ఈ ఇబ్బంది కనిపించింది.

ఐఫోన్‌లో ఉండే వాట్సాప్‌లో మాత్రం ఈ సమస్య ఎదురుకావడం లేదు. అలాగే గెలాక్సీ సిరీస్‌లోనూ లేదు. వాట్సాప్ అప్డేట్‌లో వచ్చిన సమస్య కావచ్చని కూడా భావిస్తున్నారు. దీనిని పరిష్కరించేందుకు తాత్కాలిక ఏర్పాటు ఒకటి చేశారు. ఇంతకుముందు వెర్షన్ అంటే 2.24.8.85కి రివర్ట్ కావాలని చెబుతున్నారు. అయితే ఈ సమస్య రెగ్యులర్ అప్డేట్ అవసరాన్ని మాత్రం చెబుతోంది.

ఒకేసారి రెండు యాప్స్ డౌన్‌లోడ్



గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఇకపై ఒకే సారి రెండు యాప్‌లను ఆండ్రాయిడ్ యూజర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అందుకు అనుగుణంగా గూగుల్ ప్లే స్టోర్ అప్డేట్ చేసింది. ఈ ఫీచర్ కొన్ని డివైజుల్లోకి ఇప్పటికే అందుబాటులోకి వచ్చిందని '9టు5 గూగుల్' పేర్కొంది. 40.6.31 వెర్షన్ పై రన్ అయ్యే పిక్సెల్ ఫోన్లకు కూడా ఇది అందుబాటులోకి వచ్చిందని 'ఆండ్రాయిడ్ పోలీస్' తెలిపింది. అయితే ఈ అప్డేట్‌కు కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. ఇప్పటికిప్పుడు రెంటిని ఒకేసారి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా కావాలంటే మాత్రం క్యూలో అదీ స్పేస్ అందుబాటులోకి వచ్చే వరకు వేచి ఉండాలి. మొదట్లో వచ్చిన లీకుల ప్రకారమైతే అయిదు యాప్‌లు ఒకేసారి డౌన్‌లోడ్ కావాలి. ఇప్పుడు వచ్చిన అప్డేట్ కూడా సరిపోదు. ఇంకా మెరుగుపర్చాల్సి ఉంది. యాప్ అప్డేట్స్‌కు మల్టీ డౌన్‌లోడ్ ఫీచర్‌కు వర్తించదు. గూగుల్ ప్లే స్టోర్ ఒకేసారి పలు అప్డేట్‌లను ప్రాసెస్‌లో పెడుతుంది. దాంతో చాలా మంది యూజర్లు అప్డేట్ కోసం వేచి చూడాల్సి వస్తుంది.

కిడ్స్‌కు బెస్ట్ యాపిల్ వాచీ

పిల్లల చేతికి వాచీ ఈ రోజుల్లో వింత విషయం ఏమీ కాదు. అయితే ఎలాంటి వాచీ ఇస్తే పిల్లలకు మంచిదన్నది ప్రశ్న. అందుకు యాపిల్ వాచీ అనుకూలంగా ఉంటుందన్నది ఒక సమాధానం. అదెలాగంటే...

- పేరెంట్స్‌తో టచ్, లొకేషన్ షేరింగ్, బాధ్యతలను అందుకునే విధంగా ఉంటుంది. వెబ్, సోషల్ మీడియా యాప్స్‌తో యాక్సెస్ కూడా పరిమితం. ఒకరకంగా పిల్లకు ముందే సాంకేతికను పరిచయం చేసేందుకు ఉపయోగపడుతుంది. అలాగని అతికి ఆస్కారం ఉండదు.
- కొద్ది పాటి ఫీజు చెల్లించి ఫ్యామిలీ సెటప్ ఫీచర్‌తో పిల్లల్ని కంట్రోల్ చేసుకోవచ్చు.



- ఫ్యామిలీ సెటప్‌లో స్పెషల్ సెటప్ 'స్కూల్‌టైమ్'. స్కూల్ పనిచేస్తున్న వేళల్లో దీంతో యాపిల్ వాచీ వినియోగాన్ని పరిమితం చేయవచ్చు. పేరెంట్స్ ఐఫోన్‌తో ఈ పని చేయవచ్చు.
- పిల్లల చేతులు సన్నగా ఉంటాయి. అందుకని వారికి అనుకూలమైన బ్యాండ్స్ ఉండాలి. అలా చూసుకున్నప్పుడు బకెల్ ఉన్న నైక్ స్పోర్ట్ స్టయిల్ బ్యాండ్ బాగా సూటవుతుంది.
- కొత్తగా వస్తున్న సెల్యులర్‌తో యాపిల్ వాచ్ ఎస్ఈ 2 అలాగే సెకండ్ హ్యాండ్ యాపిల్ వాచీలు వంటివి పిల్లలకు ఇవ్వడం మంచిది. ఇవైతే బడ్జెట్ ధరలో అందుబాటులో ఉంటాయి.
- ఫ్యామిలీ సెటప్ కోసం జీపీఎస్‌కు తోడు సెల్యులర్ వాచీలు మంచివి. ముఖ్యంగా 40ఎంఎం నుంచి 41 ఎంఎం, 44ఎంఎం, 45 ఎంఎం ఫోన్లు బాగుంటాయి. అలాగే ఐఫోన్ లేకుండా అంటే మాత్రం యాపిల్ వాచీ సిరీస్ 3ని తీసుకోరాదు. అలాగే గత సెప్టెంబర్‌లో సపోర్ట్ యాపిల్ వాచీలకు వాచ్‌ఓఎస్10ని ఉచిత సాఫ్ట్‌వేర్ అప్డేట్‌గా విడుదల చేసింది. ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి.



ఆండ్రాయిడ్ ఉత్పత్తులకు

'ఫైండ్ మై డివైజ్ నెట్‌వర్క్'

ఆండ్రాయిడ్ డివైజ్‌లకు 'ఫైండ్ మై డివైజ్ నెట్‌వర్క్' విడుదల అవుతోంది. వచ్చే నెలకల్లా ఈ పని పూర్తవుతుంది. ఎయిర్‌ట్యాగ్ లాంటి ట్రాకర్స్ సైతం అందుబాటులోకి వస్తాయి. స్మార్ట్‌ఫోన్, ఇయర్‌బడ్స్‌కు జతచేసి ట్రాకర్ల సహాయంతో అవి ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవచ్చు. గూగుల్ అకౌంట్‌తో యూజర్ సంతకం చేస్తే చాలు, స్మార్ట్‌ఫోన్లకు ఆటోమేటిక్‌గా మిగిలిన వాటికి మాన్యువల్‌గా ఈ ఫీచర్ వచ్చి చేరడమే కాదు, పని ప్రారంభమవుతుంది. కార్డుపై ఉన్న బటన్‌ని రెండుసార్లు ప్రెస్ చేస్తే, ఫాస్ట్ పెయిర్‌తో సెటప్ ప్రక్రియ జరుగుతుంది. ఆటోమేటిక్‌గా సంబంధిత ప్రాంప్ట్ ప్రత్యక్షమవుతుంది. యావత్తు ప్రక్రియకు పట్టే సమయం నిమిషానికి లోపే ఉంటుంది. ఇది ఒకసారి జత అయితే చాలు, మ్యాప్‌పై కరెంట్ లొకేషన్‌ను గుర్తిస్తుంది. సౌండ్‌కు అనుమతిస్తుంది. మరొక యూజర్‌తో సదరు లొకేషన్‌ను షేర్ చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్ సానుకూలత ఉన్న డివైజుల్లో ఒకే రకంగా దీని పనితీరు ఉంటుంది.

మెమరీ నుంచి ఫేస్ తొలగింపు



మీ పిల్లలు అనగానే సెల్ ఓపెన్ చేసి ఫొటోలు చూపిస్తారు చాలా మంది. అలాగే పలు ఫొటోలను పదేపదే చూసుకుని మురిసిపోతుంటారు ఇంకొందరు. ఈ నేపథ్యంలో గూగుల్ ఫొటోస్ కొత్త వెసులుబాటును తీసుకువచ్చింది. పదేపదే చూసుకునే ఫొటోల్లో మళ్ళీ కొందరి మొహాలు చూస్తే చిరాకు ఎత్తుతుంది. అలాంటివారిని ఇకపై తొలగించవచ్చు. అందుకోసం యాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్ళాలి. ప్రిఫరెన్సెస్ - మెమరీస్ - హైడ్ పీపుల్ అండ్ పెట్స్ దగ్గరకు వెళ్ళాలి. అక్కడ వద్దనుకున్న మొహాన్ని తొలగించే వెసులుబాటు ఉంటుంది. గూగుల్ ఫొటోస్ లేటెస్ట్ వెర్షన్‌లో ఈ సదుపాయం ఉంది. హైడ్ ఫేస్ ఫ్రమ్ మెమరీస్‌ని మొదట '9టు5 గూగుల్' గుర్తించింది. ఓవర్‌ఫ్లో మెనూలో ఈ కొత్త ఆప్షన్ కనిపిస్తుంది. ఫేస్ హైడింగ్‌లో కూడా రెండు ఆప్షన్లు ఉంటాయి. మొదటిది ఫేస్‌ని బ్లాక్ చేయడం కాగా రెండోది 'షో లెస్'. రెండోదాని ప్రకారం తొలగిద్దామనుకున్న వ్యక్తి ఫేస్‌ను గుర్తించవచ్చు. ఎలాగంటే, గ్రూపులో ఉన్న ఇతరులకు మాత్రం ఆ ఫేస్ కనిపిస్తుంది. అంటే మెమరీలో అసలు ఫొటో ఉంటుంది. కావాలనుకున్న వ్యక్తికి మాత్రం ఆ ఫేస్ కనిపించదు.



శాంసంగ్ గుడ్ లాక్ యాప్

శాంసంగ్ గెలాక్సీ ఫోన్లను ఉద్దేశించి రూపొందించిన కస్టమైజేషన్ యాప్ 'గుడ్ లాక్' గూగుల్ ప్లే స్టోర్‌లోనూ లభ్యమవుతోంది. ఇంతవరకు దీన్ని గెలాక్సీ స్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకునే వీలు ఉండేది. ఇది శాంసంగ్ గెలాక్సీ ఫోన్లకు ఉద్దేశించిన టూల్‌కిట్. లాక్ స్క్రీన్, నోటిఫికేషన్స్, యాప్ లాంచర్ వరకు సర్దుబాటు చేసుకునేందుకు అవసరమైన మాడ్యూల్స్ ఇందులో ఉంటాయి. చాలా పర్సనల్, కస్టమైజబుల్ యాప్ ఇది. ఆండ్రాయిడ్ ఫోన్లకు ఇది ఉపయోగపడదు. హార్డ్‌వేర్ సపోర్ట్ చేయకుంటే వార్నింగ్ బ్యానర్ ప్రత్యక్షమవుతుంది.

యాపిల్ యాప్స్ నుంచి ఏఐ ఇమేజ్ జనరేటర్ తొలగింపు



యాపిల్ ఇంతవరకు మూడు ఏఐ న్యూడ్ ఇమేజ్ జనరేటర్ యాప్స్‌ను తొలగించింది. నిజానికి ఇమేజ్‌ల్లోని వ్యక్తులు ధరించిన దుస్తులు తొలగించేందుకు ఈ యాప్‌లు ఉపయోగపడతాయి. ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్ విషయంలో ఇది బాగా ఉపయోగపడుతోంది. అయితే 404 మీడియా ఫిర్యాదుపై యాపిల్ ఈ చర్య తీసుకుంది. తమకు చెందిన ఏ యాప్ కూడా పోర్నోగ్రఫీ ప్రమోషన్‌ను అనుమతించవని యాపిల్ తన రెవ్యూ గైడ్‌లైన్స్‌లో స్పష్టం చేసింది. తద్వారా జరిగే బెదిరింపులు సహా ఏ పరిణామాలను సహించదని కూడా తెలిపింది. తాము సొంతంగా చేసిన పరిశోధన, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ టెక్నాలజీ మంత్రి - డీప్ ఫేక్‌పై వ్యక్తం చేసిన ఆందోళన తదితరాలన్నీ యాపిల్ ఈ చర్య తీసుకునేందుకు దోహదపడ్డాయని సమాచారం.

టెలిగ్రామ్ అప్డేట్స్



టెలిగ్రామ్ ఈసారి గుర్తించదగ్గ అప్డేట్‌ను విడుదల చేసింది. ప్రొఫైల్ వీక్షణ నుంచి ఎన్‌హ్యాన్స్‌డ్ లొకేషన్ షేరింగ్ వంటివి చాలా సదుపాయాలను ఈ అప్డేట్‌తో రిలీజ్ చేసింది. ఆండ్రాయిడ్, ఓఎస్ యూజర్ల కోసం సంబంధిత అప్‌డేట్ అంటే వెర్షన్ 10.11 అందుబాటులో ఉంది.

ప్రొఫైల్‌కు సంబంధించి ఇంతకుమునుపు యాప్ పరిధిలోనే ప్రొఫైల్‌ను చూడటానికి తోడు ఎడిట్ చేసుకునే వీలు ఉండేది. పర్సనలైజేషన్, కంట్రోల్‌కు సంబంధించి అదనపు లేయర్ ప్రస్తుత అప్డేట్‌తో కల్పించినట్లయిందని '9టు5 గూగుల్' నివేదించింది. మూడు స్టోరీలను పిన్ చేసుకోవచ్చు. ఫెస్టివ్ ప్రొఫైల్‌ను పెట్టుకుని గ్రీటింగ్స్ అందుకోవచ్చు. లొకేషన్ షేరింగ్‌ను కూడా స్ట్రీమ్‌లైన్‌లో పెట్టింది. యూజర్ తను ఎక్కడ ఉన్నాను అన్న విషయాన్ని కొంతకాలానికి లేదా శాశ్వతంగా తెలియజేసే ఆప్షన్ కలుగజేసింది. అలాగే మరొకరు తన లొకేషన్‌కు వస్తున్నప్పుడు అలెర్ట్ వచ్చేలా యూజర్ ఏర్పాటు చేసుకోవచ్చు. కస్టమైజ్ నోటిఫికేషన్ సెట్టింగ్స్ వీలు కల్పించింది. స్పందనలు, స్టోరీలకు ఇది అనువుగా ఉంటుంది. అంటే యూజర్ తన అవసరాలకు తగినవిధంగా నోటిఫికేషన్ ప్రిఫెరెన్స్‌లు పెట్టుకోవచ్చు. గ్రూప్ అడ్మినిస్ట్రేటర్లకు కూడా ఇకపై మరింత సమర్థంగా పనిచేసుకునే వీలు కల్పించింది. మల్టిపుల్ మోడరేషన్ చర్యలకు అవకాశం ఇచ్చింది.

ప్రీమియం యూజర్ల కోసం మరికొన్ని ప్రత్యేక ఫీచర్లను తెచ్చింది. వివిధ పోల్స్ విషయంలో యానిమేటెడ్, కస్టమ్ ఎమోజీలు; ప్రకటనలకు తావులేని విధానం తదితరాలు ఇందులో ఉన్నాయి. తమకు మెసేజ్‌లను ఫార్వార్డ్ చేసిన వ్యక్తి ప్రొఫైల్ ఫొటో కనిపిస్తుంది. డెస్క్‌టాప్ యాప్‌లో వెబ్‌సైట్స్‌కు సంబంధించి వ్యూ సపోర్ట్ ఇచ్చింది. అలాగే వివిధ చానల్స్ యజమానులకు ప్రకటనల ఆదాయాన్ని పంచుకునే వీలూ కల్పించింది.

యాపిల్ నుంచి బీట్స్ సోలో బడ్స్

యాపిల్ నుంచి బీట్స్ సోలో బడ్స్ విడుదలయ్యాయి. బీట్స్ సోలో బడ్స్, బీట్స్ సోలో 4 పేరిట రెండు కొత్త వైర్‌లెస్ ఆడియో ఉత్పత్తులు మార్కెట్లోకి వచ్చాయి. యాపిల్, ఆండ్రాయిడ్ డివైజ్‌లు రెంటినీ ఇవి సపోర్ట్ చేస్తాయి. యూఎస్‌బీ టైప్ - సి చార్జింగ్ సపోర్ట్ ఉంది. మొత్తం ప్లేబ్యాక్ టైమ్ 18 గంటలు. పర్సనలైజ్డ్ స్పేషియల్ ఆడియో ఫీచర్‌కు తోడు హెడ్ ట్రాకింగ్, 50 గంటల సేపు బ్యాటరీ లైఫ్ వీటి సొంతం. పది నిమిషాల సేపు చార్జింగ్‌తో అయిదు గంటల మేర ప్లేబ్యాక్‌కు అవకాశం ఉంటుంది. బీట్స్ సోలో 4లో 40ఎంఎం డ్రైవర్స్ ఉన్నాయి. హెడ్‌ఫోన్‌లోని బి బటన్ మ్యూజిక్ ప్లేబ్యాక్, వాల్యూమ్, కాల్స్, యాక్టివ్ వాయిస్ అసిస్టెంట్స్‌ను కంట్రోల్ చేస్తుంది. బీట్స్ సోలో బడ్స్ రమారమి రూ.6,700కి లభిస్తాయి. ప్రస్తుతం అమెరికా మార్కెట్లో ఉన్నాయి. ఆర్కిటిక్ పర్పుల్, మట్టే బ్లాక్, స్టార్మ్ గ్రే, ట్రాన్స్‌పరెంట్ రెడ్ రంగుల్లో లభిస్తున్నాయి. బీట్స్ సోలో 4ని యాపిల్ వెబ్‌సైట్‌నుంచి ఎవరైనా అమెరికా నుంచి తెప్పించుకోవచ్చు. దీని ధర రమారమి రూ.16,700 కాగా క్లౌడ్ పింక్, మట్టే బ్లాక్, స్లేట్ బ్లూ షేడ్స్ రంగుల్లో లభిస్తోంది.





ఫోన్‌ఎరీనా నుంచి 'ఫోన్ చరిత్ర'

దైనందిన జీవితంపై మొబైల్ టెక్నాలజీ చూపిన ప్రభావం ఇంతా అంతా కాదు. చేతిలో సెల్ లేకుండా కాలు కూడా కదపలేని పరిస్థితి వచ్చిందంటే అతిశయోక్తి కూడా కాదు. ఆర్థిక వ్యవస్థలు, పరిశ్రమలు సహా వ్యక్తిగత జీవితం వరకు అంతటా దాని ప్రభావం ఉంది. అటూ ఇటూగా ఇదంతా రెండు దశాబ్దాలకు పైబడిన చరిత్ర. మొబైల్ టెక్నాలజీకి సంబంధించిన సమస్త వివరాలతో 'ఫోన్ ఎరీనా' తాజాగా ఒక దాచుకోదగ్గ పుస్తకాన్ని(కలెక్టర్స్ ఇష్యూ)ని తీసుకువచ్చింది. సెల్ ఫోన్ హిస్టరీని అందులో నిక్షిప్తం చేసింది. 'ఐకానిక్ ఫోన్స్: రివల్యూషన్ ఎట్ యువర్ ఫింగర్‌టిప్స్' పేరిట ఇది విడుదలైంది. సెల్ ఫోన్ వివరాలను తెలుసుకోవాలని భావించే ఆసక్తిపరులకు ఇదో మంచి కలెక్టర్స్ బుక్.

మొబైల్ టెక్నాలజీ చరిత్రలోని ప్రతి అడుగును దీన్లో పొందుపరిచింది. రెండు దశాబ్దాల క్రితంతో పోల్చుకుంటే ఫోన్ ఇండస్ట్రీ స్వరూప స్వభావాలే మారిపోయాయి. ఈ రంగంలో అత్యుత్తమ సాంకేతికతతో వివిధ ఉత్పత్తులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఉన్నతీకరణ చోటుచేసుకుంటోంది. సరికొత్త ఫీచరతో వచ్చే ఉత్పత్తులు పాతవాటికి గుడ్‌బై చెప్పిస్తున్నాయి. డయల్-అప్ ఇంటర్నెట్ రోజుల నుంచి మొదలుపెడితే సీడీల యుగం ఒక వరసైతే అలాంటివన్నింటినీ తలదన్నేలా మరికొన్ని వచ్చాయి. దాంతో అవన్నీ మూలనపడ్డాయి అనే కంటే మ్యూజియానికి పరిమితమయ్యాయని చెప్పడం వాస్తవ వ్యాఖ్యానమవుతుంది. ఈ క్రమంలో మొదటి ఐఫోన్ కూడా ప్రస్తావనార్హం. అదిప్పుడు షార్ట్ ఫిల్మ్‌ను తీసే స్థాయికి చేరుకుంది. మోటోరోలాకు చెందిన ప్రాజెక్ట్ సలిక్వా కూడా చర్చనీయాంశమే. చైనీస్ ఎంట్రప్రెన్యూర్లు కార్ల్ పీ, పెటె లవ్ కలిసి 2014లో సృష్టించిన వన్ ప్లస్ వన్ ఏకంగా ఆండ్రాయిడ్ యూజర్ల అవసరాలను తీర్చే శక్తిమంతమైన ఫోన్‌గా సెల్ చరిత్రకెక్కింది. ఈ ఐకానిక్ ఫోన్లే కాకుండా సమస్త చరిత్రను ఈ పుస్తకంలో ఫోన్ ఎరీనా పొందుపర్చింది.



సరికొత్త హంగులతో నోకియా!



నోకియా మోడ్రన్ వెర్షన్‌పై హెచ్ఎండీఏ(హ్యూమన్ మొబైల్ డివైజెస్) పని చేస్తోందని సమాచారం. 'నోకియా 3210' పేరిట రాబోతున్న ఈ మొబైల్ ప్రపంచంలోనే మొదటిసారి ఇంటర్నల్ ఎంటెన్నాతో ఉండనుంది. మూడు గేమ్స్ ఉండనున్నాయి. నిజానికి ఈ బ్రాండ్ ఫోన్ 1999లో వచ్చింది. బల్కీ ఫీచర్ ఫోన్‌గా ఇంటర్నల్ ఎంటెన్నా, టీ9 ప్రిడిక్టివ్ టెక్స్ట్‌తో ఉండేది. ప్రస్తుతం వస్తున్న దానిలో 40 వరకు మోనోఫోనిక్ రింగ్‌టోన్స్ ఉంటాయి. బ్లాక్ అండ్ గ్రీన్ 1-5 ఇంచీల బ్లాకిట్ మోనోక్రోమాటిక్ ఎల్‌సీడీ స్క్రీన్ ఉంటుంది. బరువు 150 గ్రాములు కాగా ఇప్పుడు వస్తున్న స్మార్ట్ ఫోన్లతో పోల్చుకుంటే తక్కువే. ఇందులో స్నేక్, మెమరీ, రొటేషన్ అనే గేమ్స్ ముందే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి. కొన్ని వెర్షన్లలో అజ్ఞాతంగా మరికొన్ని గేమ్స్ ఉంటాయి. స్పెషల్ సాఫ్ట్‌వేర్‌కు తోడు డేటా కేబుల్ ఉపయోగించి వాటిని యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. 'నోకియోమొబ్' ఇటీవలి రిపోర్ట్ ప్రకారం ఫినిష్ ఔట్‌లెట్ 'జిజాంట్టి' అనుకోకుండా నోకియా కొత్త వెర్షన్ పేరును బైటపెట్టింది. కొత్త ఫోన్ సియాన్, ఎల్లో రంగుల్లో మే 8నుంచి అందుబాటులోకి రానుంది. దీని ధర 89 యూరోలు(రమారమి రూ.7,980) ఉంటుందని ఆ నివేదికలో పేర్కొంది. అయితే ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో ఇది అందుబాటులో ఉంటుందా అన్నది తెలియలేదు. మైక్రో ఎస్‌డీ కార్డ్, బ్లూటూత్, 4జీ కనెక్టివిటీ 1450 ఎంఏహెచ్ బ్యాటరీ, యూఎస్‌బీ-సీ చార్జింగ్ సౌలభ్యం ఉండనున్నాయి.

మార్కెట్‌లోకి


యాపిల్ ఐపాడ్ ప్రో

యాపిల్ ఐపాడ్ ప్రో ఈ నెల 7న జరిగే 'లెట్ లూజ్' ఈవెంట్‌లో విడుదల కానుదని భావిస్తున్నారు. హార్డ్‌వేర్ అప్‌గ్రెడేషన్స్‌కు తోడు సరికొత్త ఓలెడ్ స్క్రీన్, చిప్ ఉండనున్నాయి. ఏఐ ఎక్స్‌పీరియెన్స్‌కు అనుగుణంగా డిజైన్ చేశారని అంటున్నారు. రెండు సైజులు - 11 ఇంచీలు, 12.9 ఇంచీలతో ఐపాడ్ ప్రో మోడల్స్ వస్తున్నాయి. ఒక అనలిస్టుకు తోడు 'బ్లూమ్‌బర్గ్' రిపోర్ట్ ప్రకారం ఓలెడ్ ప్యానల్స్ కోసం శాంసంగ్, ఎల్‌జీ కంపెనీలతో యాపిల్ చర్చలు జరిపింది. మునుపు విడుదల చేసిన వాటితో పోల్చుకుంటే కొత్త దాని మందం 20 శాతం ఎక్కువగా ఉంటుందని '9టు5మాక్' తెలిపింది. రాబోయే క్వాల్కామ్ పవర్డ్ విండోస్ లాప్‌టాప్‌లను తట్టుకునేందుకు వీలుగా ఎం4 చిప్ దీనికి ఉండనుందని కూడా బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఏఐ సామర్థ్యం ఉండే టాబ్లెట్‌గా కూడా అభివర్ణించింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శనివారం 4 మే 2024

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్
జూన్ ఎగ్జామినేషన్

సైన్స్ విభాగాల్లో బోధన, పరిశోధనలకు అవకాశం కల్పించే జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఎగ్జామినేషన్ 2024 జూన్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నిర్వహిస్తోంది. ఇందులో జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని రీసెర్చ్ సెంటర్లు, యూనివర్సిటీల్లో పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి ఫెలోషిప్ కింద రెండేళ్లపాటు నెలకు రూ.37,000లు; కంటింజెన్సీ గ్రాంట్ కింద రూ.20,000 ఇస్తారు. తరవాత సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ కింద నెలకు రూ.42,000 చెల్లిస్తారు. లెక్చరర్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు ప్రముఖ యూనివర్సిటీలు/డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ప్రయత్నించవచ్చు.



సబ్జెక్టులు
- కెమికల్ సైన్సెస్
- ఎర్త్-అట్మాస్ఫిరిక్-ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్
- మేథమెటికల్ సైన్సెస్
- ఫిజికల్ సైన్సెస్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ ఉత్తీర్ణులు; కనీసం 75 శాతం మార్కులతో నాలుగేళ్ల బీఎస్/బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్/బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు పీజీలో 50 శాతం మార్కులు చాలు. బీఈ/బీటెక్/బీఎస్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థులు/ఫలితాల కోసం చూస్తున్నవారు ఫెలోషిప్‌నకు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. వీరు లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌నకు అనర్హులు. ● ఫెలోషిప్‌నకు అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. మహిళలు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు అయిదేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ ఎగ్జామ్ వివరాలు: దీనిని సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్ అందరికీ కామన్‌గా ఉంటుంది. దీనిలో జనరల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్‌లో అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్ట్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మూడో పార్ట్‌లో సైంటిఫిక్ కాన్సెప్ట్‌లు, సైంటిఫిక్ నాలెడ్జ్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. మొదటి రెండు పార్ట్‌లలోని ప్రశ్నలకు ఒక్కోదానికి రెండు మార్కులు; మూడో పార్ట్‌లోని ప్రశ్నలకు ఒక్కోదానికి నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే సబ్జెక్ట్‌కు నిర్దేశించిన మేరకు మార్కులు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 200. పరీక్ష సమయం మూడు గంటలు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1150; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.325
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 21
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 25 నుంచి 27 వరకు
- **పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నర్సరావుపేట, నెల్లూరు, ఒంగోలు, ప్రొద్దుటూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, సూరంపాలెం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్.
- **జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఎగ్జామినేషన్ 2024 తేదీలు:** జూన్ 25, 26, 27
- **వెబ్‌సైట్:** csirnet.nta.nic.in

సంప్రదాయ కలంకారీ కళలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాల - సంప్రదాయ కలంకారీ కళకు సంబంధించి డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోంది. డిప్లొమా వ్యవధి నాలుగేళ్లు. సర్టిఫికెట్ కోర్సు వ్యవధి రెండేళ్లు. పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో చేరిన అభ్యర్థులకు ఒక్కొక్కరి పేరు మీద రూ.లక్ష బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసిన వారికి ఆ మొత్తాన్ని అందిస్తారు.

- డిప్లొమా ప్రోగ్రామ్‌లో టెంపుల్ ఆర్కిటెక్చర్, స్టోన్ స్కల్ప్చర్, సుధా స్కల్ప్చర్, మెటల్ స్కల్ప్చర్, వుడ్ స్కల్ప్చర్, ట్రెడిషనల్ పెయింటింగ్ విభాగాలు ఉన్నాయి. ఒక్కో విభాగంలో 10 సీట్లు ఉన్నాయి.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 17
- ఫోన్. నెం. 0877-2264637, మొబైల్ నెం.9866997290
- **వెబ్‌సైట్:** www.tirumala.org

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)' 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన యూనివర్సిటీల అనుబంధ కళాశాలలతోపాటు తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలోనూ అడ్మిషన్స్ ఇస్తారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం, బీసీఏ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు, తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే పాలిటెక్నిక్ డిప్లొమా ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారు, కంపార్ట్‌మెంటల్ ద్వారా పాసైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మూడు విడతల్లో ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తారు.

తెలంగాణ 'దోస్త్' నోటిఫికేషన్



దోస్త్ 2024 షెడ్యూల్

ఫేజ్-1
- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **రిజిస్ట్రేషన్:** మే 6 నుంచి 25 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** మే 15 నుంచి 27 వరకు
- **స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్:** మే 24, 25
- **సీట్ అలాట్‌మెంట్:** జూన్ 3
- **ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్:** జూన్ 4 నుంచి 10

ఫేజ్-2
- **దరఖాస్తు ఫీజు:** రూ.400
- **రిజిస్ట్రేషన్:** జూన్ 4 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూన్ 4 నుంచి 14 వరకు
- **స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్:** జూన్ 13
- **సీట్ అలాట్‌మెంట్:** జూన్ 18
- **ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్:** జూన్ 19 నుంచి 24

ఫేజ్-3
- **దరఖాస్తు ఫీజు:** రూ.400
- **రిజిస్ట్రేషన్:** జూన్ 19 నుంచి 25 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూన్ 19 నుంచి 26 వరకు
- **స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్:** జూన్ 25
- **సీట్ అలాట్‌మెంట్:** జూన్ 29
- **ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్:** జూన్ 29 నుంచి జూలై 3 వరకు

అదనపు సమాచారం
- **కళాశాలల్లో అభ్యర్థుల రిపోర్టింగ్:** జూన్ 29 నుంచి జూలై 5 వరకు
- **స్టూడెంట్స్ ఓరియంటేషన్:** జూలై 1 నుంచి 6 వరకు
- **మొదటి సెమిస్టర్ ప్రారంభం:** జూలై 8 నుంచి
- **వెబ్‌సైట్:** dost.cgg.gov.in

ఎన్‌పీటీఐలో ఎంబీఏ పవర్ మేనేజ్‌మెంట్

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- ఎంబీఏ పవర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది ప్రోగ్రామ్‌లో హ్యూమన్ రిసోర్సెస్ ఆపరేషన్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సులు ఉంటాయి. రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో కోర్ కోర్సులు, స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఎలక్టివ్ కోర్సులు, ఇండస్ట్రియల్ విజిట్స్, మేజర్ ప్రాజెక్ట్ వర్క్, ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ప్రాజెక్ట్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఇందులో మొత్తం 120 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 41, ఎస్సీ అభ్యర్థులకు 16, ఎస్టీ అభ్యర్థులకు 8, ఓబీసీ అభ్యర్థులకు 28, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 12, స్పాన్సర్డ్ అభ్యర్థులకు 15 సీట్లు ప్రత్యేకించారు.

స్పెషలైజేషన్‌లు: సస్టయినబిలిటీ, డేటా సైన్స్ అండ్ డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ క్లౌడ్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. స్పాన్సర్డ్ అభ్యర్థులు మినహా అందరికీ క్యాట్/మ్యాట్/ఎక్స్ఏటీ/సీమ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.

అడ్మిషన్ టెస్ట్: పరీక్ష సమయం గంటన్నర. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాలకు సంబంధించి మొత్తం 90 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్/అడ్మిషన్ టెస్ట్‌నకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పాన్సర్డ్ అభ్యర్థులకు మాత్రం అకడమిక్ మెరిట్‌కు 60 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం, అనుభవానికి 10 శాతం వెయిటేజీ ఇస్తారు.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 14
- **ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఏటీ) 2024 తేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.npti.gov.in



ఐఏఆర్ఐలో వివిధ ఖాళీలు

న్యూఢిల్లీలోని ఐకార్ - ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, డివిజన్ ఆఫ్ ప్లాంట్ ఫిజియాలజీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 8

పోస్టుల వివరాలు:
1. రీసెర్చ్ అసోసియేట్: 1 పోస్టు
2. సీనియర్ రీసెర్చ్ ఫెలో: 4 పోస్టులు
3. యంగ్ ప్రొఫెషనల్-2: 3 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 12
వెబ్‌సైట్: iari.res.in/bms/announcements/jobs.php

ఐకార్‌లో ఎస్ఆర్ఎఫ్

హైదరాబాద్‌లోని ఐకార్ - అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టు: సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్) **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
గరిష్ఠ వయోపరిమితి: పురుషులు 35 ఏళ్లు, మహిళలు 40 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రూ.31,000 **ఇంటర్వ్యూ తేదీ:** మే 16
ప్రదేశం: ఐకార్ - అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.
వెబ్‌సైట్: atarihyderabad.icar.gov.in/

టీహెచ్ఎస్టీఐలో పోస్టులు

హరియాణా రాష్ట్రం ఫరిదాబాద్‌లోని ప్రభుత్వరంగ సంస్థకు చెందిన ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్టీఐ) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్: 1
2. మేనేజ్‌మెంట్ అసిస్టెంట్: 1

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంటెక్, లైఫ్/మెడికల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి.
వయసు: జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు 30 ఏళ్లు మించరాదు.
జీతం: జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు రూ.85,000. మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.60,000
దరఖాస్తు ఫీజు: రూ.590. ఎస్సీ/ఎస్టీ/మహిళలు, దివ్యాంగ అభ్యర్థులకు రూ.118.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా అప్లయ్ చేసుకోవాలి.
దరఖాస్తుకు చివరితేదీ: మే 15
వెబ్‌సైట్: https://thsti.res.in/

తపాలా శాఖలో డ్రైవర్లు

బెంగళూరులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్, కర్ణాటక సర్కిల్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: స్టాఫ్ కార్ డ్రైవర్ **ఖాళీలు: 27**
అర్హత: 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్(హెచ్ఎంవీ)తో పాటు మూడేళ్ల పని అనుభవం, మోటార్ మెకానిజంపై పరిజ్ఞానం కలిగి ఉండాలి.
వయోపరిమితి: 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.
పే స్కేల్: నెలకు రూ.19,900 - రూ.63,200
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, డ్రైవింగ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను మేనేజర్, మెయిల్ మోటార్ సర్వీస్, బెంగళూరు చిరునామాకు పంపించాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 14
వెబ్‌సైట్: https://www.indiapost.gov.in/

ఇర్కాన్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, న్యూఢిల్లీ.. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 6**
అర్హత: డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 30 సంవత్సరాలు మించరాదు.
వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000
దరఖాస్తుకు చివరి తేదీ: మే 10
వెబ్‌సైట్: https://www.ircon.org/

లిటిల్స్



మీకు తెలుసా?

- ఎలుకలా ఉండే ఈ జంతువును 'రాక్ హైరాక్స్' అని పిలుస్తారు. ఈ జంతువును స్టోన్ బాడ్జర్, రాక్ రాబిట్ అంటూ పిలుస్తారు కొన్ని చోట్ల. రాళ్లలో ఉంటాయి కాబట్టి రాక్ హైరాక్స్ అని పిలుస్తారు. రాళ్ల తొర్రల్లో నివసిస్తాయి.
- 54 సెం.మీ. పొడవు ఉంటాయి. రెండు కేజీల బరువు నుంచి ఐదు కేజీల వరకు ఉంటాయి. మగ జంతువులు పెద్దగా కనిపిస్తాయి.
- గంటకు 30 కిమీ వేగంతో పరిగెత్తుతాయి.
- ఆఫ్రికా, పశ్చిమ ఆసియాలో ఎక్కువగా ఈ జాతి కనపడుతుంది. ఒకచోట నుంచి మరో ప్రాంతానికి వెళ్లటానికి ఇష్టపడదు.
- ఒకేసారి ఒకటి నుంచి ఆరు పిల్లలను కంటాయి. మూడు నెలల తర్వాత స్వతంత్రంగా జీవిస్తాయి.
- ఆఫ్రికాలోని దక్షిణ దేశాలు, ఈజిప్టు ప్రాంతాల్లోని కొందరు ఈ జంతువును వేటాడి తింటారు. అందుకే ఆ ప్రాంతాల్లో వీటి సంఖ్య తగ్గిపోతోంది.



- ఇవి ఎక్కువగా మధ్యాహ్నం వరకూ ఎండలో ఉండటానికి ఇష్టపడతాయి.
- వీటి కడుపులో మూడు గదులు ఉంటాయి. వాటి పిల్లలు జీర్ణం చేసుకోలేకవని పచ్చికను నమిలి లోపల పెట్టుకుంటాయి. ఆ తిండి వాటి పిల్లలకు తినిపిస్తాయి.
- 12 సంవత్సరాల వరకూ జీవిస్తాయి.



7 తేడాలు గుర్తించండి

దారి కనుక్కోండి





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 298

5							2	
	2	1	9					3
					2	8		1
			3	7		4		
	4	8	1		9	3	5	
		7		8	5			
9		4	8					
8					1	9	4	
	6							8

సుడోకు - 297 సమాధానం

1	2	9	6	3	7	4	5	8
4	3	8	1	2	5	7	9	6
5	7	6	9	8	4	3	2	1
9	5	1	7	6	3	8	4	2
8	6	2	4	5	9	1	3	7
3	4	7	8	1	2	5	6	9
7	1	5	2	4	6	9	8	3
6	8	3	5	9	1	2	7	4
2	9	4	3	7	8	6	1	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.